# శ్రావణ పున్నమి వేళ సంప్రదాయాల సందడి



నేటిపర్వం

**సోదర సోదరీ బంధానికి ప్రతీకగా మన దేశంలో శ్రావణ పౌర్ణమి నాడు రక్షాబంధనం పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. సోదరి తన సోదరుని చేతి మణికట్టుకు పవిత్రమైన రాఖీని కట్టి అతని శ్రేయస్సును కాంక్షించడం ఈ పండుగ విశిష్టత. అయితే భారతదేశంతోపాటు నేపాల్‌లో శ్రావణ పౌర్ణమిని వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వివిధ రాష్ట్రాలలో ఈ పండుగ రోజును భిన్న రూపాలలో జరుపుకోవడం విశేషం.**

దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళతోపాటు మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలవారు శ్రావణ పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా కూడా జరుపుకుంటారు. ఆ రోజున తమ శరీరంపైని పాత జంధ్యాన్ని విసర్జించి కొత్త యజ్ఞోపవీత ధారణ చేస్తారు. ఉత్తరాది రాష్ట్రాలలో శ్రావణ పౌర్ణమి రోజును శ్రీకృష్ణుని సోదరుడు బలరాముని జయంతిగా జరుపుకుంటారు.

## ఒరిస్సాలో గోపూజ

ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమిని 'గంహ పౌర్ణమి'గా జరుపుకుంటారు. ఆ రోజు గోవులు, ఎడ్లను అలంకరించి వాటికి పూజలు చేస్తారు. పాలతో చేసిన మిఠాయిలను తమ బంధుమిత్రులకు పంచిపెడతారు. అలాగే పూరీ జగన్నాథ స్వామికి కూడా శ్రావణ పౌర్ణమి ఒక విశేషమైన రోజుగా వేడుక జరుపుతారు. శ్రావణ పౌర్ణమికి నాలుగు రోజుల ముందు శుక్ల పాఢ్య ఏకాదశి నాడు రాధాకృష్ణులు వర్ష రుతు ఆగమనాన్ని పురస్కరించుకుని సంబరాలు జరుపుకుంటారు. ఆ సందర్భంగా పూరీ జగన్నాథస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి నాడు 'జూలన్ యాత్ర'(ఊంజల్ సేవ) జరుపుతారు. ముగ్ధమనోహరంగా అలంకృతులైన రాధాకృష్ణులు ఉయ్యాలలో ఊగుతూ దర్శనమిస్తారు.

## సముద్రుడికి పూజలు

పశ్చిమ భారతదేశంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, గోవాలోని కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమిని నారలి పూర్ణిమగా జరుపుకుంటారు. మరాఠీలో నారలి అంటే కొబ్బరికాయ. సముద్ర దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు జాలరులు కొబ్బరి కాయలతో పూజలు చేస్తారు. వరుణ దేవుడు కరుణ చూపాలని ప్రార్థిస్తారు. శ్రావణ పౌర్ణమి నాటి నుంచి వారి చేపల వేట మొదలవుతుంది.

## కజారి ఉత్సవం

మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ తదితర మధ్య భారతదేశంలోని రాష్ట్రాలలో శ్రావణ పౌర్ణమిని కజారి ఉత్సవంగా జరుపుకుంటారు. ఇది రైతులకు ముఖ్యమైన పండుగ. అలాగే పుత్రసంతానం కలిగి ఉండడాన్ని సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తూ ఈ పండుగను జరుపుకుంటారు. శ్రావణ అమావాస్య తర్వాత తొమ్మిదవ రోజున కజారి ఉత్సవాలకు సన్నాహాలు మొదలవుతాయి. తొమ్మిదవ రోజును కజారి నవమిగా వ్యవహరిస్తారు. కజారి పూర్ణిమ(శ్రావణ పౌర్ణమి) వరకు ఈ వేడుకలు జరుగుతాయి.

## మహాశివునికి పూజలు

గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమిని 'పవిత్రోపన'గా జరుపుకుంటారు. ఆ రోజు పరమశివునికి ప్రీతిపాత్రమైన రోజుగా విశ్వసిస్తూ వేడుకగా పూజలు నిర్వహిస్తారు. శ్రావణ పౌర్ణమిని నేపాల్ ప్రజలు వేడుకగా జరుపుకుంటారు. బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందిన వారు ఆ రోజును 'జనై పూర్ణిమ'గా పిలుస్తారు. 'జనై' అంటే యజ్ఞోపవీతమని అర్థం. ఆయా కుటుంబాలకు చెందిన పెద్దలు తమ పిల్లల మణికట్టుకు పవిత్రాన్ని కట్టి ఆశీర్వదించడం అక్కడ సంప్రదాయం. ఏడు రకాల మొలకెత్తిన గింజలతో తయారుచేసిన 'క్వాతి' అనే పాయసాన్ని నేపాలీలు ఆ రోజు ఎంతో ఇష్టంగా వండుకుని సేవిస్తారు.

# సంగీతం-ఆధ్యాత్మికత

చింతన

భారతదేశంలో పుట్టిన వారికి తాము పుట్టింది మొదలు ఈ జనన మరణ చక్రాల నుంచి బయటపడడమే పరమార్థంగా భావిస్తారు. ఒక సారి మానవ జన్మ ఎత్తిన తర్వాత ముక్తిని చేరుకోవడమే సర్వోత్కృష్టంగా నమ్ముతారు. కుటుంబం, వృత్తి, వ్యాపారం ఇలా మిగతా అన్ని అంశాలు జీవితంలో ఒక భాగం మాత్రమే, అసలు లక్ష్యం మాత్రం ముక్తే. ఇక్కడి సంస్కృతిలో సంగీతం, నాట్యం లాంటి కళలు వినోదం కోసమే కాదు ఆధ్యాత్మిక సాధనలో కూడా ఇవి భాగం. శాస్త్రీయ సంగీతంలోని శబ్దాలు, స్వరాలు, రాగాలు వీటిలో మీరు మమేకం అయితే అవే మిమ్మల్ని ధ్యానావస్థలోకి తీసుకువెళతాయి. నాట్యం కూడా వినోదానికి కాదు. భంగిమ ముద్ర సరిగా ఉంటే అవి కూడా ధ్యానావస్థలోకి తీసుకువెళతాయి. శాస్త్రీయ సంగీతంలో పూర్తిగా మునిగిపోయిన వారిని చూస్తే వారు ఒక సాధువులా కనిపిస్తారు. సంగీతం అతనిని ధ్యానావస్థలోకి తీసుకువెళుతుంది కాబట్టే ఆయన ఒక యోగిలా అవుతాడు. సంగీతం అంటే కేవలం వినోదం కోసం కనిపెట్టినది కాదు. మనిషి చేసే ప్రతి పని అతనిని ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేర్చే ప్రక్రియ. నిలబడడం, కూర్చోవడం, తినడం అన్నీ ఒక సాధనే. మీరు వినగలిగితే మొత్తం సృష్టి అంతా సంగీతమే. మీ శరీరం కూడా ఒక సంగీతమే. అంతా సంగీతమే, ఎందుకంటే ఈ జగత్తు అంతా ఒక స్పందనే. స్పందన ఎక్కడ ఉంటే అక్కడ ధ్వని ఉండి తీరుతుంది. మొత్తం సృష్టి అంతా ఈ శబ్దాల సమ్మేళనం. ఈ ధ్వనులను మామూలుగా వింటే కర్ణ కఠోరంగా ఉంటాయి. ఇవే ధ్వనులను వినాల్సిన విధంగా వింటే అద్భుతమైన సంగీతంగా, శ్రవణానందంగా ఉంటాయి. ధ్వని సంపూర్ణత తెలియని వారికి ఇది ఒక శబ్దం. ఎందుకంటే అతను వినేది ముక్కలుగానే కాబట్టి. సృష్టి సంపూర్ణత తెలిసిన వారికి సంగీతం కానిది ఏదీ లేదు. మీరు వినగలిగితే, ఈ శరీరమే మధుర సంగీతంగా స్పందిస్తున్నది.

**ధ్వని అంటే ?**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం ధ్వనిని కొలిచే పరికరంలోకి ధ్వనిని ప్రవేశపెడితే పౌనఃపున్యం, కంపన పరిమితిని బట్టి ఒక రూపం ఏర్పడుతుంది. అంటే ప్రతి ధ్వనికి ఒక రూపం, అలాగే ప్రతి రూపానికి ఒక ధ్వని ఉంటుంది. ఈ విశ్వం అంతా శక్తి యొక్క ప్రకంపనలే అని నేటి సాంకేతిక



శాస్త్రం నిరూపిస్తున్నది. అరవై, డెబ్బై సంవత్సరాల క్రితం వరకూ సృష్టిని ఒక పదార్థంగా పరిగణించారు, కాని ఇప్పుడు కాదు. ఆధునిక శాస్త్ర రీత్యా పదార్థం అనేది లేదు. అది కేవలం 'ఉన్నట్లు అనిపిస్తుంది' అంటున్నది. చివరకు యదార్థమేమిటంటే సృష్టి అంటే ఒక ప్రకంపన. ప్రకంపన ఎక్కడ ఉంటే అక్కడ ధ్వని ఉంటుంది. అందుకే యోగాలో మనం సృష్టి అంతా శబ్దమే అంటాము. దాన్నే మనము నాదబ్రహ్మ అంటాము. అంటే సృష్టి, సృష్టికర్త అంతా శబ్దమే అని అర్థం.

**శబ్ద తరంగాలు వినలేమా?**

అంతా ధ్వని రూపంలో సంక్షిప్తమై ఉంటే మరి నేను ఎందుకు వినలేకపోతున్నాను అన్నదే కదా మీ ప్రశ్న? మీరు వినలేరు. ఎందుకంటే మీ చెవులకు ఉన్న శబ్దగ్రహణ శక్తి చాలా పరిమితమైనది. మీ గ్రహణ శక్తికి తక్కువ లేదా ఎక్కువ పౌనఃపున్యంతో ఉన్న శబ్దాలను మీరు వినలేరు. ఉదాహరణకు రేడియో ప్రసారాలకు సంబంధించిన శబ్ద తరంగాలు అంతటా ఉంటాయి. కాని మీరు వాటిని నేరుగా గ్రహించలేరు. ఈ విశ్వమంతా ధ్వని స్వరూపమే. అయితే మీ గ్రహణశక్తి చాలా పరిమితంగా ఉండడంతో ఆ శబ్దాలను వినలేకపోతున్నారు. మీరు యోగాలో పట్టుసాధించి ''రితంబర ప్రజ్ఞ'' స్థాయికి చేరుకున్నప్పుడు ఏ వస్తువును చూసినా, ఆ రూపంలో నిక్షిప్తమై ఉన్న శబ్దాన్ని వినగలుగుతారు.

**అంశీభూతాలే సప్తస్వరాలు**

ఏ ఏడు ప్రాథమిక అంశీభూతాలతో మానవ శరీరం నిర్మితమైందో వాటికి సంబంధించిన ధ్వనులే సప్తస్వరాలుగా నేడు ప్రపంచంలో సంగీతానికి మూలాలయ్యాయి. అయితే సంగీతాన్ని రూపొందించే వారికి ఈ అనుభూతి కలగకపోవచ్చు. కాని సంగీతంలో మీరు నిమగ్నమైనప్పుడు, సప్త స్వరాలు మానవ శరీరంలోని ఏడ అంశీభూతాల పరిధిలోకి వస్తాయని తెలుసుకుంటారు. ఇక మానవ శరీరంలోని ఏడు చక్రాలు సృష్టిలోని ప్రాథమిక అంశీభూతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. చక్రాలంటే శక్తి ప్రసరణ వ్యవస్థలో ఒక రకమైన కూడలి ప్రదేశాలని అర్థం. అంటే ట్రాఫిక్ సిగ్నల్ లాంటివి అన్నమాట. ఒక్కో చక్రాన్ని ఓ పెద్ద కూడలిగా భావించవచ్చు. సాధకుడు తనలో తాను పరిపూర్ణంగా శాంత చిత్తుడైనపుడు తన శరీరాన్నే ధ్వనిగా అనుభూతి చెందవచ్చు. సంగీతానికి మూలమైన సప్తస్వరాలు ఇలాంటి దశలోనే రూపొందించబడ్డాయి. యోగలో సృష్టి అంతా ఈ సప్తస్వరాల సమ్మేళనమే అంటాము. అందుకే యోగ, సంగీతమూ రెంటికీ సంబంధమూ ఉన్నదని అంటాము.

• సద్గురు

# ఒరిజినల్స్ పోతే... భూమి అమ్మలేమా?

లీగల్

నాలుగేళ్ల క్రితం ఘట్‌కేసర్ మండలం, గ్రామ పంచాయితి లే అవుట్‌లోని ప్లాట్లు కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాను. అందులోనే ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాను కూడా. అయితే 8 మాసాల క్రితం రిజిస్ట్రేషన్ ఒరిజినల్ పేపర్స్ ఎక్కడో పోయాయి. ప్రస్తుతం వాటి జిరాక్స్ పేపర్స్ మాత్రమే మా వద్ద ఉన్నాయి. ఈ మధ్యే అంటే 15 రోజుల క్రితం ఇ.సి తీసుకున్నాను. అది నా పేరు మీదే ఉంది. ఇప్పుడు ఆ ప్లాట్లను నా భార్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చా? అలా చేయిస్తే బ్యాంక్ లోన్ దొరుకుతుందా? ఒకవేళ అలా దొరకకపోతే, మరే ఇతర మార్గంలో లోన్ దొరికే అవకాశం ఉంటుది? ఏదైనా అవసరం వచ్చి ఎప్పుడైనా నా ఇల్లు అమ్ముకోవచ్చా? ఈ వివరాలు తెలియచేయండి.

– ఎన్ కిరణ్ కుమార్, ఘట్‌కేసర్

వొడ్నాల శ్రీహరి
న్యాయవాది, హైదరాబాద్



మీరు కొన్న ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్ 8 మాసాల క్రితం ఎక్కడో పోయినట్లుగా రాశారు. ఒరిజినల్ సేల్ డీడ్ పోయినందువల్ల, మీరు మీ వద్ద ఉన్న జిరాక్స్ కాపీ ఆధారంగా, ఏ సబ్–రిజిస్ట్రార్ గారి కార్యాలయంలో మీ దస్తావేజు రిజిస్టర్ అయ్యిందో ఆ కార్యాలయానికి వెళ్లి, ఒక సర్టిఫైడ్ కాపీ తీసుకోండి. ఆ సర్టిఫైడ్ కాపీ పొందిన తరువాత గానీ, అంతకు ముందు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీ ఒరిజినల్ దస్తావేజులు పోయాయని, వాటికోసం అన్వేషించి, తిరిగి మీకు అప్పగించమని కోరుతూ ఒక దరఖాస్తు పెట్టుకోండి. పోలీసు వారు మీ దరఖాస్తును స్వీకరించిన తరువాత, ఒరిజినల్ సేల్ డీడ్ పోయిన విషయానికి సంబంధించి మీరు ఒక సర్టిఫికెట్ అడిగినట్లయితే, దానికి ఇ–సేవ ద్వారా కొంత రుసుమును కట్టించుకుని మీకు ఒక సర్టిఫికేటు ఇస్తారు ఆ తరువాత స్థానిక వార్తాపత్రికలో మీ భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఒరిజినల్ పేపర్స్ పోయినట్లుగా, అవి ఎవరికైనా దొరికినట్లయితే, వాటిని మీకు అప్పగించవలసిందిగా ఒక ప్రకటన ఇవ్వండి. . అలాగే, మరే వ్యక్తి అయినా, ఆ ఒరిజినల్ సేల్ డీడ్ ఆధారంగా, మీరు కొన్న భూమిపై లావాదేవీలు జరిపితే, అవి చెల్లవని కూడా ఆ ప్రకటనలో పేర్కొనండి. ఇకపోతే కేవలం మీ సేల్ డీడ్ ఒరిజినల్ పేపర్స్ పోయాయన్న కారణంగా, మీ భార్య పేరిట గిఫ్ట్ డీడ్ గానీ, సేల్ డీడ్ గానీ, చేసినా, చాలా మంది బ్యాంకు అధికారులు మీకు లోన్ ఇచ్చే సందర్భంలో, అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉంటారు. అలాంటి సమయాల్లో మీరు మీ దస్తావేజు నిజంగానే పోయినట్లుగా, ఆ భూమికి సంబంధించిన మిగతా దస్తావేజులు మీ వద్ద ఉన్నట్లుగా వారికి తెలియచేయండి. మీ వద్ద ఉన్న సర్టిఫైడ్ కాపీని, అలాగే మీరు ఈ విషయమై, పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు కాపీ, మీరు ఇచ్చిన పత్రికా ప్రకటన కాపీ, ఇవన్నీ వారికి అందచేయండి. అప్పుడు వారు మీ ఒరిజినల్ పేపర్స్‌ను పోగొట్టుకున్నది వాస్తవమని గుర్తించి, లోన్ కోసమైన మీ కోరిక సహేతుకంగా భావించి, మీకు లోన్ మంజూరు చేసే అవకాశం ఉంది. కేవలం ఒరిజినల్ దస్తావేజు లేదన్న భయంతో , మీరు అనవసరమైన ఖర్చు చేస్తూ, మీరు మీ భార్య పేర మీద గిఫ్ట్ డీడ్‌గానీ, సేల్‌డీడ్ గానీ చేయవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. ఒక వేళ మీరు మీ భార్య పేరు మీద అలా చేసినా, మీ భార్య పేరిట లింకు డాక్యుమెంట్ ఏదీ లేనందువల్ల, ప్రస్తుతం ఎవరైతే అనుమానాలు వ్యక్తపరుస్తుంటారో, మీ భార్య ఒరిజినల్ సేల్ డీడ్ తీసుకునిపోయినప్పుడు కూడా అదే తరహా అనుమానాల్ని వ్యక్తం చేసే ఆస్కారం ఉంది. ఇకపోతే, మీ ఒరిజినల్ సేల్‌డీడ్ పోయినంతమాత్రాన మీరు సేల్‌డీడ్ ద్వారా కొన్న ఆస్తికి సంబంధించిన మీ యాజమాన్యపు హక్కులకు ఏ విధమైన భంగమూ కలగదు. మీ వద్ద ఒరిజినల్ పేపర్స్ లేకపోవడం, మీరు మీ భూమి అమ్ముకోవడానికి అదేమీ ఆటంకం కాదు. మీ భూమి కొన్నవారికి ఆ భూమి తాలూకు సంపూర్ణ యాజమాన్యపు హక్కులూ సంక్రమిస్తాయి. ఒరిజినల్ సేల్‌డీడ్ లేనంత మాత్రాన మీరు మీ భూమిని అమ్మకూడదనే రూల్ ఏదీ లేదు. మీ భూమిని కొనుగోలు చేసేవారు, మీ మాటల్ని నమ్మాల్సి ఉంటుంది.



# ఆంధ్రజ్యోతి చిత్రజ్యోతి



అమలాపాల్, నాని, దాసరి

## 'జెండాపై కపిరాజు ప్రారంభం'

నాని, అమలాపాల్ జంటగా బుధవారం మొదలైన చిత్రం 'జండాపై కపిరాజు'. వాసన్స్ విజువల్ వెంచర్స్ సమర్పిస్తోంది. కె.ఎస్.శ్రీనివాసన్ నిర్మాత. పి. సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి దాసరి నారాయణరావు క్లాప్‌నిచ్చారు. తమ్మారెడ్డి భరద్వాజ స్విచ్చాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ ''ఇది తెలుగులో నా రెండో సినిమా. జండాపై కపిరాజు అనేది విజయసూచిక. కృష్ణవంశీ మాకోసం ఈ టైటిల్‌ని ఇచ్చారు. ఇందులో వ్యక్తిగతమైన యుద్ధాన్ని చర్చిస్తున్నాం. మనం మారితే సమాజం దానంతట అదే మారుతుంది అని చెప్పే సినిమా'' అన్నారు. నాని మాట్లాడుతూ ''నాకిష్టమైన దర్శకుడు సముద్రఖని. ఛాలెంజింగ్ పాత్రలో నటిస్తున్నాను. మనలో ఉన్న చెడును గురించి ఈ చిత్రం ప్రస్తావిస్తుంది'' అని చెప్పారు. మంచి పాత్రలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని అమలాపాల్ తెలిపారు. ''ఇంతవరకు నేను సంగీతం చేసిన సినిమాలకు భిన్నంగా ఉంటుందీ చిత్రం. ఒక పాటను రికార్డింగ్ చేశాం. నేను, అనంతశ్రీరామ్ కలిస్తే ఆ పాటలు పెద్ద హిట్టవుతాయి'' అని జీవీ ప్రకాష్ చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ ''తెలుగులో ఇంత మంచి సినిమాతో ప్రవేశిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఆగస్టు 5 నుంచి చాలకుడి, గోవాలో పాటలు తెరకెక్కిస్తాం. హైదరాబాద్, వైజాగ్‌లో టాకీ చేస్తాం. యంగ్ టీమ్ చేస్తున్న బాధ్యత గల చిత్రమిది'' అని అన్నారు. టైటిల్‌కి పాజిటివ్ స్పందన వస్తోందని శశాంక్ వెన్నెలకంటి చెప్పారు.

ఈ చిత్రానికి మాటలు: శశాంక్ వెన్నెలకంటి, పాటలు: అనంతశ్రీరామ్, కెమెరా: ఎన్.సుకుమార్, సంగీతం: జి.వి.ప్రకాష్, కళ: జాకీ, కూర్పు: ఎస్.ఎన్.ఫాజిల్, ఫైట్స్: దిలీప్ సుబ్బరాయన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పి.సముద్రఖని.

## చివరి షెడ్యూల్‌లో 'ఇష్టసఖి'

వరుణ్, భాస్కర్, శ్రీరామ్, అనుస్మృతి హీరోహీరోయిన్లుగా భరత్ పారేపల్లి దర్శకత్వంలో ది డ్రీమ్స్ కంపెనీ నిర్మిస్తున్న 'ఇష్టసఖి' చిత్రం చివరి షెడ్యూల్ జరుగుతోంది. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'ముగ్గురు యువకులు, ఓ యువతి చుట్టూ తిరిగే ప్రేమకథ ఇది. ట్రయాంగిల్ లవ్ స్టోరీల్లో ఇంతవరకూ తెర మీద చూడని కొత్త అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. చిత్రంలో ఆరు పాటలు, నాలుగు ఫైట్లు ఉన్నాయి. సెప్టెంబర్ 15న ఆడియోను, అక్టోబర్ 5న చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు. వేణుమాధవ్, చలపతిరావు, గిరిబాబు, రఘుబాబు, తనికెళ్ల భరణి, ఎం.ఎస్.నారాయణ, ఎల్.బి.శ్రీరామ్, కొండవలస, కృష్ణభగవాన్, జయలలిత, గీతాసింగ్, సురేఖావాణి, తెలంగాణ శకుంతల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: పెద్దాడ మూర్తి, సంగీతం: లలిత్‌సురేష్, మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: శంకర్, కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకుడు: భరత్ పారేపల్లి.



## మలయాళ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న 'శ్రీరామరాజ్యం'

నందమూరి బాలకృష్ణ శ్రీరామునిగా, నయనతార సీతగా బాపు దర్శకత్వంలో యలమంచి సాయిబాబు నిర్మించిన 'శ్రీరామరాజ్యం' చిత్రాన్ని మలయాళంలోకి అనువదించి ఈ నెల 27న అక్కడ విడుదల చేశారు. ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోందని నిర్మాత సాయిబాబు చెబుతూ 'మా సినిమాను మొదట తమిళంలోకి అనువదించాం. తమిళ సోదరులు ఆ సినిమాను బాగా ఆదరించారు. ఆ ఉత్సాహంతో మలయాళంలోకి అనువదించి విడుదల చేశాం. నటీనటుల సామర్థ్యానికి, బాపు దర్శకత్వ ప్రతిభకు జనం ప్రశంసలు కురిపిస్తున్నారు. త్వరలో ఈ చిత్రాన్ని హిందీలోకి కూడా అనువదించి విడుదల చేయబోతున్నాం' అన్నారు.



## పాటల చిత్రీకరణలో 'స్వాతి ఐ లవ్ యు'

సంతోష్ పార్లవార్, దిలీప్‌కుమార్ హీరోలుగా, వర్షిణి హీరోయిన్‌గా రూపొందుతున్న చిత్రం 'స్వాతి ఐ లవ్ యు'. సంతోష్ పార్లవార్ దర్శకత్వంలో ఎస్.ఆర్.పి. క్రియేషన్స్ పతాకంపై శ్యామలా సంతోష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సంగతిని నిర్మాత శ్యామల తెలియజేస్తూ ''హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్క్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లలో పాటని తీస్తున్నాం. వారం రోజుల పాటు జరిపే షూటింగ్‌లో మరో పాటను కూడా తీస్తాం. ఈ నెలాఖరులోగా షూటింగ్ పూర్తవుతుంది. ఈ నెల మూడో వారంలో ఆడియో సీడీలను విడుదల చేస్తాం'' అని చెప్పారు. ''ఇదొక ట్రయాంగిల్ లవ్‌స్టోరీ. అందమైన లొకేషన్‌లలో ప్రస్తుతం రెండు పాటలు తీస్తున్నాం. సంగీత దర్శకుడు ఘన్‌శ్యామ్ మంచి సంగీతం అందించారు'' అని తెలిపారు సంతోష్. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వెంకట్, కూర్పు: వినయ్‌రామ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంతోష్ పార్లవార్.



## 'హాయిహాయిగా' పాటల విడుదల

సత్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హాయిహాయిగా'. పనోరమ పెంగ్విన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. కె.ఇ.రాజు ప్రముఖ్, జయకృష్ణ నిర్మాతలు. ఈ చిత్రంలోని పాటలు మంగళవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. టి. ప్రసన్నకుమార్, వి.సాగర్ సంయుక్తంగా పాటల సీడీలను ఆవిష్కరించారు. సత్య మాట్లాడుతూ ''ఈ చిత్రం ద్వారా అన్ని తరగతుల ప్రేక్షకులకు చేరువవుతాం. కామెడీ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ ''పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సినిమా చూసిన ప్రేక్షకులు హాయిహాయిగా నవ్వుకుంటూ ఇంటికెళ్తారు'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజా వన్నెంరెడ్డి, స్వరకర్త మహర్షి, సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌నెట్‌లో సినిమా వార్తలకు
www.andhra-jyothy.com

## 27 మంది కొత్త ఆర్టిస్టులతో '3జి లవ్'

స్కైయిర్ ఇండియా స్టూడియోస్ ప్రై.లి పతాకంపై వెంకటపతి దర్శకత్వంలో ప్రతాప్ కోలగట్ల నిర్మించే '3జి లవ్' చిత్రం షూటింగ్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. ఈ సినిమాతో 27 మంది కొత్త నటీనటులను పరిచయం చేస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి విజయనగరంకు చెందిన వ్యాపారవేత్త ఆనంద్ క్లాప్‌నివ్వగా, దర్శకుడు నీలకంఠ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా నీలకంఠ మాట్లాడుతూ 'ఈ చిత్ర దర్శకుడు నాకు బాగా తెలుసు. తనలో మంచి సృజనాత్మకత ఉంది. కొత్త స్టయిల్‌లో ఉండే సినిమాని చూడబోతున్నాం' అన్నారు.



చిత్ర నిర్మాత ప్రతాప్ మాట్లాడుతూ 'మాకు ఇదే తొలి సినిమా. దాదాపు 11 వేల మందిని ఆడిషన్ చేసి, 15 మంది యువకులను, 12 మంది యువతులను ఎంపిక చేసి నాలుగు నెలల పాటు ట్రైనింగ్ ఇచ్చాం. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తాం' అన్నారు. 'కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. అందుకే 18 నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతీయువకుల్ని ఎంపిక చేశాం' అని తెలిపారు దర్శకుడు వెంకటపతి. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్.

## 'ఆ రోజు' ఏం జరిగింది?

సదా, స్నేహావుల్లాల్, రియాసేన్, దేశ్‌ముఖ్ కీలక పాత్రల్లో నటించిన ఓ తమిళ చిత్రం 'ఆ రోజు' పేరుతో తెలుగులోకి అనువదమవుతోంది. 'ఏం జరిగింది?' అనేది ఉపశీర్షిక. గ్లామర్ ప్రధానమైన హారర్ చిత్రమిది. సంతోష్‌శివన్ సోదరుడు సంగీత్ శివన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నివేద స్టూడియో ఫిలిమ్ కంపెనీ సమర్పిస్తోంది. అడ్డాల వెంకట్రావు, ఎ.సెల్వం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డబ్బింగ్, రికార్డింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ ''వినూత్నమైన కథాంశంతో తెరకెక్కిన సినిమా ఇది. తమిళ ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంది. తెలుగులోనూ విశేషంగా అలరిస్తుందనే నమ్మకం ఉంది. సదా, స్నేహావుల్లాల్, రియాసేన్ గ్లామర్, కథలోని నవ్యత, ముఖ్యంగా హారర్, సంగీత్ శివన్ ఫొటోగ్రఫీ, దర్శకత్వం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలు. డబ్బింగ్ జరుగుతోంది. త్వరలోనే తొలి కాపీ సిద్ధమవుతుంది'' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శర్మ, పాటలు: పొందూరి, యం.రామారావు, మాటలు: అడ్డాల వెంకట్రావు, కూర్పు: ఎల్.రామారావు, సహ నిర్మాత: అరుణ్; నిర్మాతలు: అడ్డాల వెంకట్రావు, ఎ.సెల్వం, కెమెరా–చిత్రానువాదం–దర్శకత్వం: సంగీత్ శివన్.



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

మా ఊరు

"మా ఊరుని బాగుచేయాలంటే నాలాంటి వాడి వల్లయ్యే పని కాదు. మరోసారి ఇంగ్లీషువాళ్లు మన దేశం రావాలి. ముందు మా గ్రామానికి రావాలి. సర్పంచ్ మొదలు ఎమ్మెల్యే వరకూ అవినీతికి పాల్పడే ప్రతి ఒక్కరికి ఆ తెల్లదొరలైతేనే బాగా బుద్ధి చెప్పగలరు" మీ సొంతూరు గురించి చెప్పమని అడిగితే... ఇలా ఆవేశపడ్డారు డాక్టర్ మోహన్‌బాబు. మామూలుగా ఊరనగానే జ్ఞాపకాలు, ప్రత్యేకతలు, అనుబంధాలు... గురించి మాత్రమే చెబుతారు. కాని మోహన్‌బాబు మాత్రం అలా ముగించలేదు. 'మనసులో ఒకటి పెట్టుకుని పైకి మరోలా చెప్పడం నాకు అలవాటు లేదు. అది ఊరైనా, ఏదైనా' అని మొదలుపెట్టి ఆయన చెప్పిన ఊరు విశేషాలే ఈ వారం 'మా ఊరు'



# సహకరిస్తారా.. సాయపడతాను

"నాన్నా, నేను పొద్దునే ఏడుగంటలకల్లా ఇంటి నుండి బయలుదేరేవాళ్లం. మాఊరికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పుత్తూరు నడుచుకుంటూ వెళ్లాలి. ఆయన చదువు చెప్పడానికి, నేను చదువుకోడానికి. ఆయన ఏ స్కూల్లో పనిచేస్తే నేను ఆ స్కూల్లో చదువుకోవాలి. వెళ్లేటప్పుడు త్వరగా వెళ్లాలి కాబట్టి మాట్లాడకుండా స్పీడుగా నడుచుకుంటూ వెళ్లిపోయేవాళ్లం. సాయంత్రం వచ్చేటపుడు మాత్రం ప్రతి రోజూ పెళ్లే నాకు. ఆ రాయి ఈ రాయి తన్నుకుంటూ ఆయన వెనక నడుస్తుంటే సడెన్‌గా 'పదిహేను పదిహేనులెంతరా....' అని అడిగేవారు నాన్న. అడిగిన వెంటనే టక్కున సమాధానం చెప్పకపోతే ఆయన చేతిలో ఉన్న గొడుగుతో వీపుమీద రెండు దెబ్బలు కొట్టేవారు. అలా కొట్టీ కొట్టీ ఒకసారి గొడుగు విరిగిపోయింది. అప్పటి నుంచి దారి మధ్యలో ఉన్న చెట్ల కర్రలు విరుచుకుని కొట్టేవారు. ఆరు కిలోమీటర్లలో రెండు కిలోమీటర్లు అచ్చంగా ఇసుక ఉండేది. అడుగు వేస్తే అరికాలు మొత్తం ఇసుకలో మునిగిపోయేది. దాంతో సైకిల్ ఉన్నా వేసికెళ్లే పరిస్థితి ఉండేది కాదు. నాకు లెక్కలంటే భయం. ఆ భయం పోగొట్టడానికి నాన్న నాకు దెబ్బల భయం చూపించేవారు. అలా.. రోజూ నాన్న వెనక ఏడ్చుకుంటూ వచ్చేవాడ్ని. ఊళ్లోకి రాగానే ఎవరో ఒకరు 'అయ్యోరు.. బాబు ఎందుకు ఏడుస్తున్నాడు...' అని జాలిగా అడిగేవారు. 'ఓ చిన్న లెక్క అడిగితే తెలియదంటున్నాడు....' అని చెప్పేవారు నాన్న. 'అదేంటి బాబు..అయ్యోరు కొడుకయ్యుండి మీకే రాకపోతే ఎలా...' అనేవారు వాళ్లు. దాంతో నాన్నకు ఇంకాస్త కోపం ఎక్కువై మరో రెండు అంటించేవారు. ఊరు పేరు చెప్పగానే ఆ ఇసుకలో నడక, నాన్న కొట్టిన దెబ్బలే ముందు గుర్తుకువస్తాయి. చిత్తూరు జిల్లా 'మోదుగులపాళెం' గ్రామం మాది. స్వర్ణముఖి నది దాటాక మా ఊరొస్తుంది. ద్వీపంలా ఉండే మా ఊరు చుట్టూ రెండు కిలోమీటర్ల వరకూ ఇసుకే ఉండేది. ఎలాంటి వాహనం వాడే అవకాశం ఉండేది కాదు. అప్పట్లో ఊరు చాలా చిన్నది. యాభై ఇళ్లే ఉండేవి.

## కైకాలవాళ్ల ఊరు...

మా ఊర్లో చాలామంది కైకాలవాళ్లే. మగ్గం నేస్తారు వాళ్లు. ఉన్న యాభై ఇళ్లలో నలభై ఇళ్లు వారివే. మా నాన్న(నారాయణస్వామి నాయుడు)టీచర్. మా ఊరికి దగ్గర గ్రామాల్లోనే పనిచేసేవారు. ఎన్ని కిలోమీటర్లయినా నన్ను వెంటబెట్టుకుని నడుచుకుంటూ వెళ్లేవారు. మా తాతయ్య(రంగస్వామి నాయుడు) రైతు. ఆయనిచ్చిన ఐదెకరాల పొలం ఉండేది. పెంకుటిల్లు కూడా తాతయ్య కట్టించిందే. నాన్న వ్యవసాయం చేసుకుంటూనే ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. ఎక్కువగా వరి, వేరుశెనగ, చెరుకు పండించేవారు. పెద్దవాడ్ని కావడంతో పాఠశాలకైనా, పొలానికైనా నాన్న వెంట వెళ్లేవాడ్ని. ఏ రకంగా చూసినా మా ఊరు చాలా వెనకబడి ఉండేది. పెద్దగా భూస్వాములున్న ఊరు కాదు. అందరూ మధ్యతరగతివారే కావడంతో ఏ విషయంలోనూ పోటీ ఉండేది కాదు. అమ్మ(లక్ష్మమ్మ)కి చెవుడు. చిన్నప్పటి నుంచి వినిపించేవి కావట. నాన్నకు ఆ విషయం తెలిసే చేసుకున్నారు. గుణం మంచిదై ఉండాలని ఆయన చెప్పడమే కాదు అమ్మ విషయంలో చేసి చూపించారు. మేమంతా అమ్మతో మాట్లాడాలంటే సైగలే.

## గ్రామ దేవతల కొలువులో...

నా చిన్నప్పుడు మా ఊరంతా గ్రామ దేవతలతో కళకళలాడుతూ ఉండేది. తాళమ్మ, కనికలమ్మ, అంకాలమ్మ, నాగమ్మ...మా ఊరి దేవతలు. వీరితో పాటు నాగూరువీరాస్వామి గుడి కూడా ఉండేది. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా ఏదో ఒక దేవతకు వేటను బలివ్వడమో కోడిని కొయ్యడమో తప్పనిసరి. ఈ దేవతలందరికీ పంటలు ఇంటికొచ్చినప్పుడల్లా ఘనంగా పూజలు చేసేవారు. ఇవి కాకుండా ఏటా గంగమ్మ జాతర చాలా గొప్పగా జరుపుకునేవాళ్లం. ఊరి మధ్యలో ఒక రాయి ఉంటుంది. అదే గంగమ్మతల్లి. మూడు రోజులుండేది జాతర. పీర్ల పండగ కూడా బాగా చేసుకునేవాళ్లం. ఆరోజు నిప్పులమీద నడిచే వేడుక చాలా ఆసక్తిగా ఉండేది. పెద్దవాళ్లమధ్యన దూరి భయం భయంగా చూసేవాళ్లం.

## బోగి మంట...తారా జువ్వ

సంక్రాంతి పండగరోజు వచ్చే బోగి పండుగ రోజు ఊళ్లో నా హడావిడే ఎక్కువగా ఉండేది. రెండు రోజుల ముందు గొడ్డళ్లు పట్టుకుని ఊరవతల ఉన్న కంప కొట్టుకొచ్చేవాళ్లం. అందరికంటే నేనే ఎక్కువగా కంప కొట్టేవాడ్ని. ఎవరి ఇంటిముందు బోగిమంట పెద్దగా వేస్తే వాళ్లే గొప్పన్నమాట. ఎంత పోటీ పడినా దాదాపుగా అందరిదీ ఒకేలా వస్తుంది. దానికోసం నేనేం చేసేవాడ్నంటే...తెల్లవారుజామునే లేచి చుట్టుపక్కల ఇళ్ల చూరుల్లో పెట్టిన చాటలు, గంపలు, కర్రలు ఎత్తుకొచ్చి బోగిమంటలో వేసేవాడ్ని. 'చూడంయ్యోరు...మీ అబ్బాయి ఎలా చేశాడో....' అంటూ అందరూ నాన్న దగ్గరికి వచ్చేవారు. ఏముంది? తర్వాత సీన్ రొటీనే. ఆయన స్కూలుకి పట్టికెళ్లే బెత్తాలన్నీ విరిగిపోయేవి(నవ్వుతూ...). దీపావళి పండగొస్తే పిల్లలంతా పెద్దాళ్లను కాకాపట్టే పనిలో పడేవారు. మా నాన్న రెండు రూపాయలు చేతిలో పెట్టేవారు. నాకేమో బోలెడు టపాసులు కాల్చాలని ఉండేది. నాకు బాగా గుర్తు...దీపావళి పదిరోజులుందనగా ఒకసారి నాన్న దగ్గరికి వెళ్లి ఊళ్లో టపాసుల కొట్టు పెడతాను, ఇరవై రూపాయలిమ్మని అడిగాను. దానికి నాన్నకి ఎంత కోపం వచ్చిందంటే... ఇలాంటి ఐడియాలు చదువులో ఎందుకు రావని చితక్కొట్టేశారు. తప్పుచేస్తే ఎంత కొట్టేవారో... బుద్ధిగా ఉంటే అంత చేరదీసేవారు. చేపలు తినాలనుకున్నప్పుడల్లా నాన్నా నేను చెరువుకి వెళ్లిపోయేవాళ్లం. మేమే చేపల్ని పట్టుకుని తెచ్చుకునేవాళ్లం. అలాగే పొలానికెళ్లినపుడు కూడా ఆయన పార పట్టుకుంటే నేను గేదెల్ని చూసుకునేవాడిని. నాన్నా, నేను ఆరోజు ఎలా ఉన్నామో...ఈరోజు కూడా అలాగే ఉన్నాం.

## భక్తినయ్యస్వామి దయతో...

మా ఊరికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో కొండమీద ఉంటుంది భక్తినయ్యస్వామి గుడి. దారి ఉండేది కాదు...అయినా సరే రాళ్లు రప్పలు, కొండలు, గుంటలు దాటుకుంటూ ఆ స్వామి దర్శనానికి వెళ్లేవారు. పిల్లలు పుట్టనివారు ఆ గుడిలో ఉన్న ఈశ్వరుడ్ని దర్శించుకుంటే పిల్లలు తప్పకుండా పుడతారనేది భక్తుల నమ్మకం. మా అమ్మానాన్నలకు కూడా చాలాకాలం వరకూ పిల్లలు పుట్టకపోతే ఆ గుడికి వెళ్లి మొక్కుకున్నాకే నేను పుట్టానట. అందుకే నా పేరు భక్తవత్సలనాయుడు అని పెట్టారు. సినిమాల్లోకి వెళ్లాక దాసరిగారు నా పేరు మార్చేశారు. ప్రస్తుతం ఆ గుడికి మెట్లు కట్టించేపనిలో ఉన్నాను. నేను ఎంపీ అయ్యాన వెంటనే ముందు మా సొంతూరికేమైనా చేయాలని అనుకున్నాను.

## మోడల్ విలేజ్ చేద్దామని...

ముందుగా ఊళ్లో బడి కట్టించడానికి స్థలం ఇచ్చాను. నా సొంతడబ్బుతో రామాలయం కట్టించాను. ఊళ్లో సిమెంటురోడ్లు, వాటర్ ట్యాంక్, బస్సు వేయించడం అన్నీ నా ఎంపీ ఫండ్‌తో చేశాను. ఏర్పేడు నుంచి మోదుగులపాళానికి 9 కిలోమీటర్ల రోడ్డు వేయించి బస్సు సౌకర్యం కూడా కల్పించాను. ఇది కాకుండా స్వర్ణముఖి నదిమీద నుంచి ఒక వంతెన కట్టించాను. దానికి అరవై లక్షలవరకూ ఖర్చయింది. నా ఎంపీఫండ్ సరిపోకపోతే సెంట్రల్‌గవర్నమెంటు దగ్గర మరికొంత డబ్బు తీసుకుని ఆ వంతెన పూర్తిచేశాను. మా ఊరికి ఇవన్నీ కనీస అవసరాలు మాత్రమే. అభివృద్ధి అంటే ఇంకా చాలా చేయాలి. దానికి నేనొక్కడ్నే ప్రయత్నిస్తే సరిపోదు. ఊరివాళ్ల సహకారం ఉండాలి. ఊరు బాగుపడాలనే కాంక్ష వారిలో ఉండాలి. అవేమీ నాకు వారిలో కనిపించలేదు. కొన్ని రోజుల తర్వాత ఊరి నుంచి వచ్చిన కొన్ని వార్తలు నన్ను చాలా బాధపెట్టాయి.

## ఇప్పటికైనా నేను సిద్ధమే...

మా పొలం, ఇల్లు అలాగే ఉన్నాయి. ఆ ఇంట్లో మా తమ్ముడు ఉంటున్నాడు. నాన్న తిరుపతి స్కూల్లో ఉంటారు. ఆయనకు ఇప్పుడు 96 సంవత్సరాలు. ఇప్పటికీ మా విద్యానికేతన్‌లో తెలుగు పాఠాలు చెబుతున్నారు. మా ఊరికి అప్పుడప్పుడు వెళ్లివస్తుంటారు. 'చూడరా...బాబు మన ఊరు' అని ఆయన నిట్టూరుస్తుంటే నాకు చాలా కోపం వస్తుంటుంది. ఇప్పటికైనా సరే మా ఊరివారంతా ఒక్కమాటపై ఉండి స్వార్థాలకు పోకుండా ఊరిని బాగుచేసుకోవాలంటే నేను ఏం చేయడానికైనా సిద్ధమే.

• భువనేశ్వరి
ఫోటోలు: శ్రీను, శ్రీరాములు



## అపాత్రదానం అనవసరం...

ఒకరోజు నాన్న ఫోన్ చేసి ఒక విషయం చెప్పారు. నేను కట్టించిన వంతెన కింద నుండి ఎవరో ఇసుక తోడుకెళ్లి పోతున్నారని ముందు ఊరి పెద్దలకు చెప్పమని చెప్పాను. ఈ విషయం వారందరికీ తెలుసన్నారు. నేను జిల్లా కలెక్టర్‌కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాను. ఒకసారి కాదు మూడుసార్లు చేశాను. ఎలాంటి స్పందనా లేదు. నేను ఊళ్లో లేను...అయినా ఊరివారి తరపున ఉత్తరం రాశాను. ఎవరు పట్టించుకుంటారు....అదే ఊరివారంతా ఎదురుతిరిగితే ఎలాంటివాడైనా సరే దిగివస్తాడు. ఆ విషయంలో మా ఊరి ప్రజలు తమకు పట్టనట్టు ప్రవర్తిస్తున్న తీరుకి నాకు చాలా కోపం వచ్చింది. నాన్నే రెండు మూడు సార్లు ఇసుకతవ్వకాల దగ్గరికి వెళ్లి అడిగితే 'నీకెందుకని...' అడిగారట. 'ఊరి సర్పంచ్‌కి, మండల అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, ఆ నియోజక వర్గం ఎమ్మెల్యేలకు...ఎవరికీ ఏ అభ్యంతరం లేనపుడు నీకెందుకు పెద్దాయనా...' అని ఇసుక తవ్వుకునే కూలీలడిగిన ప్రశ్నకు నాన్న దగ్గర సమాధానం లేక వెనక్కి వచ్చారు. ఇంకొన్నాళ్లపాటు అలాగే ఇసుక తవ్వేస్తే వంతెన కూలిపోవడం ఖాయం. ఎంతో కష్టపడి కట్టించిన వంతెన నేలకొరిగితే నష్టపోయేదెవరు? నా ఊరివాళ్లే కదా!



స్కూల్ అరుగుపై వడ్ల బస్తాలు

## స్కూలే గోదాము...

గుడికన్నా...బడి పదిలం అనేది నా కాన్సెప్ట్. అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పది. అందుకే ముందు స్కూలు నిర్మాణం చేయించాను. కాని ఇప్పుడు స్కూలుని చూస్తే నా రక్తం సలసలా కాగిపోతుంది. ఉన్నవే మూడు గదులు..అందులో ఒక మూల యూరియా బస్తాలు, మరో మూల వడ్లబస్తాలు, దాణాసంచులు కనిపిస్తాయి. టీచర్లు రెండు మూడు రోజులకొకసారి వస్తారు. మొత్తానికి స్కూల్‌ని గ్రామస్తులంతా గోదాములా వాడుకుంటున్నారు. నాలుగు డబ్బులున్నవారు పిల్లల్ని చుట్టుపక్కలున్న ప్రైవేటు స్కూళ్లకు పంపుకుంటున్నారు. గవర్నమెంటు స్కూల్లో చదువుకునే పిల్లలంతా గాలికి తిరుగుతున్నారు. నాన్నకు, నాకు చదువంటే ప్రాణం. అయితే ఏం లాభం...ఊళ్లో స్కూలుని చూశాక అక్కడ ఏం చేసినా ప్రయోజనం ఉండదని అనుకుని తిరుపతిలో పెద్దఎత్తున విద్యానికేతను స్థాపించాను. అందులో ఇప్పటివరకూ లక్షమంది విద్యార్థులు చదువుకున్నారు. వారిలో పాతికవేలమంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పించాను. అంత చేస్తున్నవాడ్ని ఊరిని బాగుచేసుకోలేనా? కాని చేసినవాటికే గతిలేదు. వాళ్లు ఏదీ కావాలని కోరుకోరు. ఉన్నవాటిని రక్షించుకోరు. అందుకే నాకు అప్పడప్పుడు అనిపిస్తుంది మా ఊరిని బాగుచేయాలంటే హిట్లర్ అయినా ఇంగ్లీషువాళ్లైనా రావాలని. ఎక్కడ అన్యాయం కనిపిస్తే అక్కడే వారికి తగిన బుద్ధి చెబుతారు.

## స్నేహానికి గుర్తుగా...



ఈ రోజు 'ఫ్రెండ్‌షిప్ డే'. మిత్రుల చేతికి బ్యాండ్ కట్టి తమ స్నేహాన్ని చాటుకునే రోజు.







ఒకప్పుడు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ అంటే రకరకాల రంగుల్లో ఉండే రిబ్బన్స్ బ్యాండ్స్ మాత్రమే. ఇప్పుడవి కూడా సరికొత్తగా వస్తున్నాయి. అలాంటివి కొన్ని ఇక్కడ ఇచ్చాం చూడండి.

## చైనాలో.. మ్యారేజ్ డేటాబేస్



చైనా ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం అక్కడ సంచలనం సృష్టించింది. రెండో భార్యల వల్లనే ఎక్కువ అవినీతి జరుగుతోందని ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రకటనతో సరిపెట్టలేదు. బహుభార్యత్వము, మోసపూరితమైన వివాహాల నిరోధానికి నడుంబిగించింది. అక్కడ రాజకీయ ప్రముఖులు, అధికారులు, వ్యాపారవేత్తలు వారి రెండవ భార్యల పేరిట లైసెన్సులు తీసుకుని అక్రమంగా వ్యాపారాలు చేస్తున్నారన్నది చైనా ప్రభుత్వ వాదన. అంతేకాదు ఇతర దేశస్తులు కూడా వారి వ్యాపార ప్రయోజనాల కోసం చైనా మహిళల్ని వివాహం చేసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆరా తీయడం కష్టం కాబట్టి వివాహాలకి సంబంధించి ఒక జాతీయ డేటాబేస్‌ని తయారుచేయబోతోంది చైనా. ఈ ఏడాది ముగిసేలోపే బీజింగ్, షాంఘై నగరాలు మ్యారుజ్ డేటాబేస్‌లోకి చేరబోతున్నాయి. 2015 సంవత్సరానికల్లా దేశంలోని మిగతా నగరాలనూ ఈ డేటాబేస్‌లోకి చేర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ తర్వాత చైనా ప్రభుత్వం చైనీయులందరికీ మ్యారేజ్ గుర్తింపుకార్డులను జారీ చేస్తుందట.

నవ్యపై మీ అభిప్రాయాలు, సూచనలు navyaa.aj@gmail.-com కు పంపండి

## బంగారం వెండి

04-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,120 (----) | 29,420 (29,520) | 53,300 (----) |
| విజయవాడ | 30,250 (30,250) | 27,900 (27,900) | 52,900 (52,900) |
| ప్రొద్దుటూరు | 30,220 (30,220) | 27,760 (27,760) | 53,200 (53,200) |
| రాజమండ్రి | ==== (====) | ==== (====) | ==== (====) |
| విశాఖపట్నం | 30,130 (30,140) | 27,720 (27,730) | 53,200 (53,200) |
| ముంబయి | 29,700 (29,700) | 29,840 (29,840) | 53,605 (53,605) |
| చెన్నయ్ | 30,065 (30,065) | 28,110 (28,110) | 53,665 (53,665) |

• బ్రాకెట్లలో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు

లోపలి పేజీలో...



వెన్ను నొప్పికి మైక్రోడిస్కెక్టమీ సర్జరీ వరం

బైపాస్ సర్జరీ తర్వాత మళ్లీ బ్లాక్స్ ఏర్పడతాయా?



**ఏదో చర్మ సమస్యలే అనుకుని ఊరుకుండిపోతే ఎలా? అది సోరియాసిసేమో మరి! అయినా, లక్షణాలు తెలిస్తే వ్యాధిని ముందే గుర్తించి వెంటనే వైద్యచికిత్సలకు వెళ్లవచ్చు. కాకపోతే ఇక్కడ మరో విషయం కూడా ఉంది. వచ్చిన చర్మ వ్యాధి, సోరియాసిస్ కాకపోవచ్చు. కానీ, దీర్ఘకాలికంగా ఉన్న ఏ చర్మవ్యాధి అయినా ఏదో ఒక దశలో సోరియాసిస్‌గా మారే ప్రమాదమే ఎక్కువ. అందుకే ''ఈ రోజు చర్మవ్యాధి రేపటి సోరియాసిస్'' అనుకుని వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం ఎంతో అవసరం అంటున్నారు, ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ పూజారి రవికుమార్...**



# లక్షణాలు తెలిస్తే సోరియాసిస్‌పై గెలుపు

గమనించాలే గానీ, సోరియాసిస్‌ను ముందే గుర్తించడం ఏమంత కష్టం కాదు. నిజానికి, సోరియాసిస్ పూర్తి స్థాయిలో ఒక వ్యాధిగా రూపొందడానికి ముందు నుంచే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వీటిని పూర్వరూపాలు అంటారు. శరీరం అతిగా చెమట పట్టడం గానీ, అసలే చెమట పట్టకపోవడం కానీ కనిపిస్తుంది. చర్మం నూనెగానో లేదా పొడిగానో కనిపిస్తుంది. వెంట్రుకలు నిలబడటం, చర్మం తన సహజ వర్ణాన్ని కోల్పోవడం వంటి కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చర్మం ఏ కారణంగానైనా గాయమైనప్పుడు ఎక్కువ రోజుల దాకా మానకపోవడం కూడా గమనించవచ్చు. మౌలికంగా శరీరంలోని వాత, పిత్త, కఫాల్లో ఏర్పడే లోపాలే (ప్రకోపాలు) సోరియాసిస్‌కు కారణమవుతాయి.

## ప్రకోపాలే మూలం

ఒకవేళ వాతప్రకోపంతోనే సోరియాసిస్ వస్తున్నప్పుడు శరీరమంతా నల్లగా మారుతుంది. దద్దుర్లు వచ్చి బాగా దురదగా ఉంటాయి. చర్మం పొట్టులా రాలుతుంది. ఒక వేళ వ్యాధి పిత్త ప్రకోపం వల్ల వచ్చి ఉంటే, చర్మం మేడిపండు రంగులోకి మారుతుంది. దురద, మంట ఉంటాయి. అతిగా చెమట రావడం, చెమట వాసన వేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒకవేళ కఫం ప్రకోపం చెందడం వల్ల సోరియాసిస్ వచ్చి ఉంటే, చర్మం పొడిబారిగానీ, నూనెగా గానీ కనిపిస్తుంది. చర్మమంతా ఏనుగు చర్మంలా మారి, దురదగా ఉంటుంది. వ్యాధి తీవ్రమైనప్పుడు ఆ ప్రభావం శరీరంలోని సప్తధాతువుల మీద కూడా పడి, దాతు క్షయం జరుగుతున్నప్పుడు ఆ ధాతు సంబంధితమైన లక్షణాలు సైతం కనిపిస్తాయి. రసధాతువు దెబ్బ తిన్నప్పుడు చర్మం తన సహజ వర్ణాన్ని కోల్పోతుంది. చర్మం పొడిగా మారడం, కొందరిలో చెమట అతిగా రావడం కనిపిస్తుంది. కొందరిలో స్పర్శజ్ఞానం తగ్గిపోతుంది. అలాగే రక్తధాతువు దెబ్బతిన్నప్పుడు ఒళ్లంతా మచ్చలు ఏర్పడి దురదతో పాటు వాటిలో చీము ఏర్పడి, చెడు వాసన వేస్తుంది. మాంసధాతువు దెబ్బ తిన్నప్పుడు చాలా మందంగా మచ్చలు ఏర్పడతాయి. మేధో ధాతువు ప్రభావితమైతే విపరీతంగా చెమట రావడంతో పాటు, మచ్చలు తయారై అందులో చీము ఏర్పడి, బాగా చెడు వాసన వేస్తుంది. వాటిలోంచి బాగా క్రిములు కూడా పుట్టుకొస్తాయి. అస్థిధాతువు ప్రభావితమైనప్పుడు కీళ్లలో నొప్పులు మొదలవుతాయి. ముక్కుదూలం వంకరపోవడం, కళ్లు ఎర్రబారడం, శుక్రధాతువు ప్రభావితమైనప్పుడు, జననాంగాల మీద మచ్చలు ఏర్పడటం, అంగంలో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## స్కాల్ప్ (కపాలం) సోరియాసిస్

అత్యధికుల్లో అంటే 90 శాతం మందిలో సోరియాసిస్ తల మీదే మొదలవుతుంది. ఆ తరువాత క్రమంగా శరీరంలోని ఇతర భాగాలకు పాకుతుంది. రెండు మూడు రోజులు తలస్నానం చేయకుండా అలాగే ఉండిపోయి, ఆ తరువాత దువ్వితే, తల నుంచి సన్నని పొడి రాలిపడితేఅది చుండ్రు. పొడిలా కాకుండా చిన్న చిన్న పెచ్చుల్లా, పెళుసుల్లా రాలిపడితే అది సోరియాసిస్. సాధారణంగా చుండ్రు తల భాగమంతా ఆవరించి ఉంటుంది. సోరియాసిస్ మాత్రం తల మీద అక్కడక్కడ బిల్లలు బిల్లలుగా ఏర్పడి పెచ్చుల్లా లేస్తుంది. పైగా ఈ స్కాల్ప్ సోరియాసిస్, తల భాగానికే పరిమితం కాకుండా, నుదురు, చెవుల వెనుక, మెడ కింది భాగానికి కూడా పాకుతుంది.

## నేల్ (గోళ్లు) సోరియాసిస్

ముందు కపాలంలో మొదలైనసోరియాసిస్ అత్యధికుల్లో ఒళ్లంతా పాకి ఆ తరువాత గోళ్లలోకి పాకుతుంది. కొందరిలో ఒంటిమీదికి పాకకుండానే తల నుంచి నేరుగా గోళ్లమీదికి రావచ్చు. ఈ స్థితిలో గోళ్లు తమ సహజ వర్ణాన్ని కోల్పోతాయి. ఎక్కువ మందిలో లేత పసుపు రంగులోకి మారతాయి. గోళ్లు పెలుసుగానూ, నిర్జీవంగానూ మారతాయి.

## ప్లేక్ సోరియాసిస్

ఇది చాలా ఎక్కువమందిలో కనిపించే సోరియాసిస్. చర్మం మీద ఎక్కడో ఒక చోట చిన్న కురుపులా తయారవుతుంది. అది ఎండిపోయిన పొట్టులా ఉంటుంది. జీవంలేని చర్మకణాలు ఉత్పన్నమై చర్మం మీద ఒక మచ్చల్లా ఏర్పడతాయి. ఈ మచ్చలు బాగా దురదగా ఉంటాయి. దురద కారణంగా ఆ కురుపును గోకడం ద్వారా పొట్టు రాలుతుంది కానీ, ఆ మచ్చ పెద్దదవుతుంది.

## గట్టేట్ సోరియాసిస్

ఈ వ్యాధి చిన్నపిల్లల్లో, మధ్య వయస్కుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది చిన్న చిన్న మచ్చలుగా ఎరుపు రంగులో ఉండి, మచ్చలు ఒకదానితో ఒకటి కలవకుండా శరీరమంతా వ్యాపించి ఉంటాయి. ఇవి ఎక్కువగా ఛాతీ, వీపు భాగంలోనే వస్తాయి. ఇందులో చాలా దళసరి మచ్చలు ఏర్పడతాయి.

## ఇన్‌వర్స్ సోరియాసిస్

ఈ సోరియాసిస్ ఎక్కువగా చంకల్లో, గజ్జల్లో, చర్మం మడతల్లో వస్తూ ఉంటుంది. అలాగే జననాంగాల్లోనూ వస్తుంది. మచ్చలు మెరుస్తూ, ఎరుపు రంగులో ఉంటాయి. ఈ మచ్చలు గరుకుగా కాకుండా నునుపుగా ఉంటాయి. స్థూలకాయుల్లో ఈ సోరియాసిస్ ఎక్కువగా కనిపిస్తుంది.

## ఆస్పిడ్జ్ సైన్

సోరియాసిస్‌లో కొందరి చర్మం మీద పొక్కులు ఏర్పడి, పొలుసులు ఏర్పడినప్పుడు తీవ్రమైన దురద మొదలవుతుంది. గోటితో గోకి ఆ పొలుసుల్ని తీసివేసినప్పుడు ఆ భాగంలో రక్తపు చుక్కల్లా కనిపిస్తాయి. వీటినే ఆస్పిడ్జ్ సైన్స్ అంటారు.

## కోఫినార్ ఫినామినా

గాయం మానిన తరువాత గానీ, సర్జరీ జరిగిన తరువాత గాటు మీద గానీ కొందరిలో సోరియాసిస్ మొదలయ్యే వీలుంది. అలా వచ్చే వాటిని కోఫినార్ ఫినామినా అంటారు.

## పస్టులార్ సోరియాసిస్

ఈ సోరియాసిస్ మచ్చలు చీముతో ఉంటాయి. ఈ చీము రక్తంలో కలిసి శరీరమంతా వ్యాపించినప్పుడు ఇతర అవయవాలు కూడా ఇన్‌ఫెక్షన్స్‌కు గురై, రోగి, శరీరమంతా విషతుల్యమవుతుంది. ఒక్కోసారి ఇది సెప్సిస్ వ్యాధికి గురికావచ్చు. శరీరంలోని కీలక అవయవాలన్నీ ఒకేసారి దెబ్బతినే మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్ దాకా వెళ్లవచ్చు. అంతిమంగా ఇది ప్రాణాపాయానికి కూడా దారి తీయవచ్చు.

## ఎరిత్రో డెర్మిక్ సోరియాసిస్

ఈ సోరియాసిస్‌లో వచ్చే మచ్చలన్నీ వాపుతోనే ఉంటాయి. ఇవి ఎరుపు రంగులో ఉబ్బెత్తుగానూ, వేడిగానూ ఉంటాయి. రోగి శరీర ఉష్ణోగ్రత కూడా ఎప్పుడూ నిలకడగా ఉండదు. పైగా అతి తక్కువ వ్యవధిలోనే ఎక్కువ సార్లు పెరుగుతూ తగ్గుతూ ఉంటుంది. ఈ మచ్చలు చాలా పెద్దవిగా, దాదాపు చర్మం మొత్తాన్ని వ్యాపించి ఉంటాయి. ఇందులో తీవ్రమైన దురద, నొప్పి ఉంటాయి. ఈ మచ్చలు చిన్న చిన్న పెళుసులుగా కాకుండా పెద్దపెద్ద పొరలుగా ఊడిపడుతూ ఉంటుంది. ఈ సోరియాసిస్ చర్మం మొత్తాన్ని ఆవరించి ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి గుండె వేగం పెరుగుతుంది. మరే సోరియాసిస్‌లోనూ కనిపించని ప్రత్యేక లక్షణమిది.

## వామ్ జంబుశ్చ్ సోరియాసిస్

ఇది పస్టులార్ సోరియాసిస్, ఎరిత్రో డెర్మిక్ సోరియాసిస్ ఈ రెండూ కలగలసినప్పుడు వచ్చే సోరియాసిస్. అందుకే ఇందులో ఈ రెండింటి లక్షణాలూ కనిపిస్తాయి. చీముతో పాటు, అతి పెద్ద మచ్చలు వాపు రావడం వల్ల ఇది సెప్సిస్‌గానూ మారుతుంది. శరీరంలోని ప్రొటీన్ అంతా వెళ్లిపోయి, శరీరం నిర్జీవంగా మారిన స్థితిలో శరీరమంతా చీము నిండిపోవడంతో వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోతుంది. అంతిమంగా ఇది ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారి తీయవచ్చు. కాకపోతే, ఈ ప్రమాదం వయసు పైబడిన వారిలోనే ఎక్కువగా ఉంటుంది.సోరియాసిస్ వ్యాధి బాగా ముదిరే దాకా పట్టించుకోకపోతే దాని వల్ల వచ్చే దుష్ప్రభావాలు ఎక్కువే. ఒకవేళ నిజంగానే అది మరేదో చర్మ వ్యాధే అయినా, దీర్ఘకాలికంగా ఆ వ్యాధి అలాగే ఉంటే చివరికి అది సోరియాసిస్‌గా మారే ప్రమాదమూ ఉంది. అందుకే ఆ వ్యాధిని ముందే గుర్తించడం చాలా ముఖ్యం. ఈ లక్షణాల గురించి తెలిసి ఉంటే ముందే గుర్తించి, ఆయుర్వేద వైద్య చికిత్సలతో ముందే బయటపడవచ్చు. ఎక్కడ సోరియాసిస్ అని బయటపడుతుందోనని, వైద్యుల్ని కలవకుండా ఉండిపోతే ఏమవుతుంది?వ్యాధి ముదిరి ఒక్కోసారి సోరియాటిక్ ఆర్థరైటిస్ వచ్చి కాళ్లూ చేతులూ వంకర్లు పోయి అంగవైకల్యమే మిగిలిపోవచ్చు. అందుకే లక్షణాలు కనిపించగానే వైద్య చికిత్సలకు వెళితే, సోరియాసిస్ యాతనలేవీ లేకుండా జీవితం హాయిగా సాగిపోతుంది.




**డాక్టర్ పూజారి రవికుమార్**
**ఆర్ కె ఆయుర్వేదిక్ అండ్ సోరియాసిస్ సెంటర్**
క్లినిక్స్: హైదరాబాద్,విజయవాడ, వైజాగ్, హన్మకొండ,కర్నూలు, తిరుపతి
ఫోన్స్:98492 54587, 040-23057483


---

**శరీరంలో థైరాయిడ్ గ్రంథి నిర్వర్తించే పాత్ర ఎంతో కీలకమైంది. దైనందిన జీవితానికి తగిన శక్తిని జీవక్రియ సమతుల్యత ద్వారా సమకూర్చడమే కాదు శరీర కణాల పురోభివృద్ధికి తోడ్పడుతుంది. హార్మోన్‌ల పనితీరును మెరుగుపర్చడంతోపాటు ఎముకలకు కావాల్సిన కాల్షియంను క్యాల్సిటోనిన్ హార్మోన్ ద్వారా అందిస్తుంది. రక్తంలో హార్మోన్‌ల శాతం పెరగటం లేదా తగ్గటం వల్ల వివిధ రకాల అనారోగ్య లక్షణాలు ఏర్పడతాయి. హైపర్ లేదా హైపో థైరాయిడ్ సమస్యలకు హోమియో వైద్యం మేలంటున్నారు డాక్టర్ శ్రీకర్ మను.**

# థైరాయిడ్‌తో ఆర్థో సమస్యలు హోమియోతో పరిష్కారం

థైరాయిడ్ గ్రంథి మానసిక, శారీరక ఒడిదుడుకుల్లో తన వంతు భాగస్వామ్యం చూపిస్తుంది. ఈ గ్రంథి విడుదల చేస్తున్న టీ3, టీ4, క్యాల్సిటోనిన్ హార్మోన్‌ల అసమతుల్యతకు కారణాలు శారీరకమే కాకుండా మానసిక, జన్యుపరంగా గుర్తించటం వల్ల మెరుగైన ఆరోగ్యం వైపు తొలిమెట్టుగా చెప్పుకోవచ్చు. రక్తంలో హార్మోన్‌ల శాతం పెరగటం వల్ల పలు దుష్పరిణామాలు ఎదురవుతుంటాయి. చాలామందిలో పైకి ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా కాల్షియం సమతుల్యత దెబ్బతిని శరీర రోగ నిరోధక వ్యవస్థ నుంచి శరీరంలో ప్రతీ కదలికకు తోడ్పడే ఎముకలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఆస్టియోఫోరోసిస్ అంటే ఎముకల గట్టిదనం పోగొట్టడం వల్ల చిన్న చిన్న ప్రేరేపకాలను కూడా ఎముకలు విరుగుతుండటంతోపాటు అనారోగ్య పరిస్థితులకు దారితీస్తుంది.

**ముఖ్యకారణాలు :** జన్యువులోపాలు లేదా పనితీరును మార్చే ప్రేరేపకాలకు మానసిక, శారీరక కారణాలు తోడవడం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరుపై ప్రభావం పడుతుంది. దీనివల్ల శరీరంలోని అవయవాలు, హార్మోన్‌లు తగిన విధంగా ప్రతిస్పందించవు. ఇలాంటపుడు తాత్కాలికంగా ఒకే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని చికిత్స తీసుకోవడం వల్ల అసలైన కారణాలు చాపకింద నీరులాగా మిగిలిన జీవక్రియలపై ప్రభావం చూపిస్తూ దీర్ఘకాలిక



అనారోగ్యానికి దారితీస్తాయి. శరీరంలో ఉత్పత్తి అయ్యే లక్షణాల్లోని ఆంతర్యాన్ని అర్థం చేసుకొని సంపూర్ణ పరిష్కారం పొందటం అవసరం.

**ప్రేరేపకాలు :** మానసిక ఆందోళన, భయం, బాధ, అవమానాలు వంటి సామాన్య ప్రేరేపకాలకు జీవకణాలు తగిన విధంగా ప్రతిస్పందించటం మామూలుగా జరుగుతుంది. కాని ప్రతిస్పందన అవసరమైన రీతిలో లేకపోవడం అంటే కొన్ని శారీరక ప్రేరేపకాలు తోడవటం వల్ల అసమతుల్యత మొదలవుతుంది. ఒత్తిడి, తగిన వ్యాయామం, పౌష్టికాహారం, నిద్ర లేకపోవడం, సమయానుసారం భోజనం చేయకపోవటం లేదా భోజన సమయంలో రకరకాల కృత్రిమ ఆహారాలకు అలవాటు పడటం లాంటివి కొంతమందిలో ప్రేరేపక అంశాలుగా నిలుస్తున్నాయి.

**లక్షణాలు :** థైరాయిడ్ సమస్యల వల్ల బరువు పెరగడం లేదా తగ్గడం, జుట్టు రాలటం, తెల్లబడటం, కళ్ల కింద నల్లని చారలు రావటం, గొంతుపైన వాపు రావడం, గ్యాస్ట్రిక్ సమస్యలు మొదలవుతాయి. తిన్న ఆహారం వంటబట్టక పోవడం మలబద్ధకం లేదా విరోచనాలు అవటం, కీళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, మైగ్రేన్ తలనొప్పి రావటం వంటివి సాధారణ లక్షణాలు. ఆస్టియో ఫోరోసిస్ లేదా కాల్సియం అసమతుల్యత వల్ల ఎముకల సాంద్రతపై ప్రభావం పడి ఆర్థరైటిస్ మొదలవుతుంది. లివర్, కిడ్నీలపై ప్రభావం వల్ల వైఫల్యానికి దారితీసే అవకాశం ఉంటుంది. హార్మోన్‌ల అసమతుల్యత వల్ల ఒబెసిటీ, స్పాండిలైటిస్, డయాబెటీస్‌లతోపాటు రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతిన తరచూ అలర్జీ, సైనసైటిస్, సోరియాసిస్, చర్మ సమస్యలు, పిగ్మెంటేషన్ సమస్యలకు దారితీయవచ్చు. పురుషుల్లో వీర్యకణాలు, సెక్సు సమస్యలు, స్త్రీలలో పిసిఒడి, ఫైబ్రాయిడ్స్, నెలసరి సమస్యలతో సంతానలేమికి కారణభూతంగా పరిగణించవచ్చు.

**నిర్ధారణ పరీక్షలు :** టీ3, టీ4, టీఎస్ 4, క్యాల్సిటోనిన్ మొదలగు ముఖ్య హార్మోన్‌ల పరీక్షలు ప్రాథమికంగా అవసరం. అలాగే బోన్ డెన్సిటీ పరీక్ష, రక్త కాల్షియం పరీక్షల ద్వారా జరగబోయే ప్రమాదాన్ని అంచనా వేయవచ్చు. లక్షణాలను బట్టి అవసరమైన హార్మోనల్ పరీక్షలు అల్ట్రాసౌండ్ స్కానింగ్, సీటీ, ఎంఆర్ఐ, సీబీపీ, హిమగ్లోబిన్ శాతం వంటి పరీక్షలు సూచించడం వైద్యుల సమయస్ఫూర్తిని బట్టి ఉంటుంది. థైరాయిడ్ యాంటీబాడీస్ వంటివి దీర్ఘకాలిక అనారోగ్యంలో తప్పనిసరి కావచ్చు.

**జాగ్రత్తలు :** సొంతవైద్యం, అపోహలు కట్టిపెట్టి సరైన చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. తాత్కాలిక ఉపశమనం లేదా ఒక్కో లక్షణానికి ఒక్కొక్క రకమైన చికిత్స తీసుకోవడం వల్ల దుష్పరిణామాలు తప్పవు. వయస్సును బట్టి తప్పకుండా వ్యాయామం చేయడం, శరీర కాల్షియం నిల్వలను పెంచే సూర్యరశ్మిలో కొంత సమయం గడపటం, ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఆకుకూరలు, తాజా పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలి. పాలు, గుడ్లు వయస్సుని బట్టి సరైన పద్ధతిలో తీసుకోవటం ఉత్తమం.

**హోమియో వైద్యం:** సమస్య మూలాలను పారదోలే హోమియో వైద్యం వల్ల హార్మోనల్ సమతుల్యత ఏర్పడటమే కాకుండా, రక్తంలో కాల్షియం నిల్వలు సమృద్ధిగా నిలబడతాయి. ఈ మందులు జీవితాంతం వాడాల్సిన అవసరం లేకపోవటం, దీర్ఘకాలికంగా వాడుతున్న మందులను ఒక క్రమపద్ధతిలో తగ్గించుకోవటం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు. సరైన హోమియో చికిత్స వల్ల జన్యువుల లోపాలు చక్కబడి జీవక్రియ సమతుల్యత ఏర్పడి, థైరాయిడ్ గ్రంథిపై పడుతున్న దుష్ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది.




**డా. శ్రీకర్ మను**
ఫౌండర్ ఆఫ్ డా. మనూస్ హోమియోపతి,
ఫోన్ : 9032108108
9030 339 999


---

# బట్టతల బాధితులకు హెచ్.టి. సర్జరీ ఓ వరం

**బట్టతల వచ్చేసిందని బాధపడాల్సిన పనిలేదు. నలుగురిలో తిరగలేక ఇంట్లోనే కూర్చోవాల్సిన అవసరం అసలే లేదు. హెచ్.టి.సర్జరీతో బట్టతలకు శాశ్వత పరిష్కారం చూపించవచ్చని అంటున్నారు ప్రముఖ హెయిర్‌ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా. ఎ. రవిచందర్‌రావు.**



బట్టతల కనిపించకుండా చేయాలంటే ఒక్కో వెంట్రుకను తీస్తూ అతికించాలి. అదీ అతి జాగ్రత్తగా గంటల తరబడి కొన్ని వేల వెంట్రుకలను బట్టతల ఉన్న ప్రాంతంలో నాటాల్సి ఉంటుంది. ఇంతటి క్లిష్టమైన హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీని నిపుణులైన సర్జన్‌లు మాత్రమే చేయగలుగుతారు. చాలా జాగ్రత్తగా, ఓపికతో చేయాల్సిన ఆపరేషన్ ఇది. ఈ రోజుల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్‌లో చాలా పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్కరికి ఒక్కోరకమైన హెయిర్ స్టయిల్ ఉంటుంది. దానికనుగుణంగా డాక్టర్లు కొత్త పద్ధతులు అభివృద్ధి పరుస్తున్నారు.

## ముందుగా ఏంచేయాలి?

హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలనుకుంటున్న వ్యక్తి ముందుగా మంచి పేరున్న నిపుణులైన డాక్టర్‌ను, క్లినిక్‌ను కలవాలి. డాక్టర్‌ను కలిసినపుడు హెయిర్‌లాస్ ఏ మేరకు ఉంది? శిరోజాలు రాలకుండా ఉండాలంటే ఏం చేయాలి? హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎంత భాగం చేయాలి? తదితర అంశాలను పరిశీలించి సూచనలు చేస్తారు. డాక్టర్‌ను కలిసినపుడు ఇప్పటి వరకు ఎన్ని సర్జరీలు చేశారు? వారి ఫోటోలు చూపించగలరా? సర్జరీకి ముందు సర్జరీ తరువాత వారి శిరోజాలు ఎలా ఉన్నాయి? తదితర అంశాలను ఫోటోలు చూసి తెలుసుకుంటే మంచిది. వీలుంటే సర్జరీ చేయించుకున్న క్లయింట్స్‌తో ఒకసారి మాట్లాడించమని అడగవచ్చు. సర్జరీ చేయించుకుంటే మీ హెయిర్ స్టయిల్ ఎలావస్తుందో స్కెచ్ గీసి చూపించమని కోరవచ్చు. ఎన్ని సెషన్లు రావాల్సి ఉంటుందో తెలుసుకోజ్చు మొత్తం సర్జరీకి ఎంత ఖర్చవుతుందో ముందుగా తెలుసుకోవడం చాలా అవసరం. డాక్టర్‌ను కలిసినపుడు ఈ విషయాలు గుర్తుపెట్టుకుని సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

## సర్జరీలో ఏం చేస్తారు?

హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవాలనుకుంటున్న వ్యక్తి తలలో నుంచే శిరోజాలను తీసుకోవడం జరుగుతుంది. అందుకే పూర్తి సహజసిద్ధంగా, ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఉంటుంది. హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్‌లో రెండు ముఖ్యమైన పద్ధతులు ఉన్నాయి. స్ట్రిప్ లేదా ఎఫ్‌యూఈ(ఫోలిక్యులర్ యూనిట్ ఎక్స్‌ట్రాక్షన్). సర్జరీ కోసం ఒకరోజంతా క్లినిక్‌లోనే ఉండాల్సి ఉంటుంది. కొన్ని గంటల పాటు సర్జరీ జరుగుతుంది. ఈ సర్జరీకి లోకల్ అనస్థీషియా సరిపోతుంది. అంటే క్లయింట్ సర్జరీ జరుగుతున్నంత సేపు మెలకువగానే ఉంటాడు. ఎఫ్‌యూఈ పద్ధతిలో ఒక్కో వెంట్రుకను తీసుకుంటూ బట్టతల ప్రాంతంలో అతికించడం జరుగుతుంది. హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ తరువాత ఎర్రగా మారడం, వాపు ఉంటాయి. కొన్ని వారాల తరువాత ఇవి తగ్గిపోతాయి. ట్రాన్స్‌ప్లాంట్ చేసిన తరువాత శిరోజాలు రాలిపోతాయి. కానీ అక్కడి నుంచే కొత్త జుట్టు పెరగడం మొదలవుతుంది. ఏడాది తరువాత జుట్టు పూర్తిగా పెరిగిపోతుంది. శిరోజాలు తీసే స్థలంలో, అతికించే స్థలంలో అనస్థీషియా ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల నొప్పి ఏ మాత్రం తెలియదు. ఒక సెషన్‌లో 1500 నుంచి 3 వేల వరకు శిరోజాలను తీసి అతికించవచ్చు. రోజంతా సర్జరీ చేసినపుడు ఇది సాధ్యమవుతుంది. చాలా వరకు పేషెంట్స్ ఉదయం క్లినిక్‌కు వస్తే సాయంత్రంకల్లా ఇంటికి వెళ్లిపోవచ్చు.

## సైడ్‌ఎఫెక్ట్స్

పొగతాగడం, ఆల్కహాల్ తీసుకోవడం, ఇతర మందులు వాడే అలవాటు ఉంటే సర్జరీకి కొన్ని వారాల ముందు నుంచి ఆపేయాలి. దీనివల్ల ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్‌రాకుండా ఉంటాయి. అధికంగా మద్యం సేవించడం, ఇతర వ్యాధులకు వాడే మందుల వల్ల సర్జరీ సమయంలో లేదా తరువాత బ్లీడింగ్ కావడానికి అవకాశం ఉంటుంది. అందుకే సర్జరీ చేయించుకోవాలని అనుకుంటున్న వారు తప్పనిసరిగా ఈ అలవాట్లను మానుకోవాలి.

## జుట్టు పెరగడానికి ఎన్ని రోజులు?

హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోగానే నిండైన జుట్టుతో అందంగా కనిపించాలని కోరుకుంటారు. కానీ దానికి సమయం పడుతుందని గుర్తుంచుకోవాలి. ట్రాన్స్‌ప్లాంట్ చేసిన శిరోజాలు నెమ్మదిగా పెరుగుతాయి. సర్జరీ చేసిన కొన్ని వారాల తరువాత ట్రాన్స్‌ప్లాంట్ హెయిర్స్ రాలిపోతాయి. ఆ తరువాత నెమ్మదిగా పెరగటం మొదలవుతంది. మూడు నెలల్లో మెల్లగా శిరోజాలు పెరుగుతుండటం గమనించవచ్చు. ఆరు నుంచి ఏడాదిలోపల జుట్టు పూర్తిగా పెరుగుతుంది. సర్జరీకి ముందు, సర్జరీ తరువాత తేడాను స్పష్టంగా గమనించవచ్చు. ఈ జుట్టు పూర్తిగా సాధారణ జుట్టు మాదిరిగానే ఉంటుంది. మామూలుగా దువ్వుకోవడం చేయవచ్చు. ఈ జుట్టు ఊడిపోవడం మళ్లీ బట్టతల రావడం అంటూ జరగదు. ట్రాన్స్‌ప్లాంట్ చేసిన జుట్టు జీవితాంతం నిగనిగలాడుతూ ఉంటుంది. బట్టతలతో బాధపడుతున్నవారికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు ఒకవరంగా చెప్పవచ్చు.




**డా. ఎ. రవిచందర్‌రావు**
ఎమ్.బి.బి.ఎస్, ఎమ్ఎస్, ఎమ్‌సిహెచ్(ప్లాస్టిక్‌సర్జరీ)
కాస్మెటిక్ అండ్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
**హెయిర్‌ష్యూర్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్**
హబ్సీగూడ, హైదరాబాద్
ఫోన్ : 040- 42020202, 9494020202


---

**ఆరోగ్యం జీవితానికి గొప్ప వరమైతే, వెన్ను నొప్పి ఓ పెద్ద శాపం. వెన్నునొప్పి తీవ్రమైనప్పుడు అడ్రినలిన్ గ్రంథి అదే పనిగా స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేయడం వల్ల అంతిమంగా అది అధికరక్తపోటుకు, మధుమేహానికీ దారి తీస్తుంది. పైగా హార్మోన్ వ్యవస్థ అంతా దెబ్బతింటుంది. అందుకే వెన్నునొప్పి సమస్య మొదలైన వెంటనే వైద్య చికిత్సలకు వెళ్లడానికి మించిన వివేకం మరొకటి లేదంటున్నారు ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ వర్థన్, డాక్టర్ మాధురీ వర్థన్.**

# వేయి సమస్యలకు వెన్నునొప్పే మూలం

వెన్ను స్థిరంగా నిలబడలేకపోతే, వారి జీవితమూ స్థిరంగా నిలవదు. వెన్నునొప్పి తీవ్రమైతే, ఏళ్ల పర్యంతం మంచాన పడి మూల్గే స్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాల నుంచి పూర్తిగా వైదొలగిపోయే స్థితి కల్పిస్తుంది. జీవితంలో ఎంతో చేయాలనుకున్న మనిషి చివరికి ఏమీ చేయలేని అసహాయ స్థితిలో పడిపోతాడు. వెన్నునొప్పిని ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే అది క్రానిక్‌గా మారిపోయి మనిషిని నానా యాతనల పాలు చేస్తుంది. ఈ నొప్పి శారీరకంగా, మానసికంగా దెబ్బతీయడమే కాకుండా, సామాజికంగా కూడా వెనుకబడేలా చేస్తుంది.

వెన్ను నొప్పి, కేవలం వెన్ను భాగానికే పరిమితమై ఉంటే అక్యూట్ పెయిన్ అంటారు. ఒకవేళ వెన్ను వ్యవస్థను దాటి నరాలను, మొత్తం నాడీవ్యవస్థను దెబ్బతీస్తే దాన్ని క్రానిక్ పెయిన్ అంటారు. మరో రకంగా చూస్తే, వెన్నునొప్పి తగిలిన దెబ్బ తాలూకు ఒక లక్షణంగా మాత్రమే ఉంటే అది అక్యూట్ పెయిన్. ఒకవేళ ఆ నొప్పే ఒక వ్యాధిగా మారితే అది క్రానిక్ పెయిన్. వ్యాధిగా మారడం అంటే అది వెన్ను వ్యవస్థను దాటి, మొత్తం నాడీ వ్యవస్థనూ, ఆ క్రమంలో శరీరంలోని కీలక భాగాలన్నింటి మీదా దుష్ప్రభావం కలిగించడం. నిజానికి, నొప్పి ఒక లక్షణంగా ఉన్నప్పుడే సరియైన వైద్యచికిత్సలు తీసుకుంటే, అది వ్యాధిగా మారే అవకాశమే ఉండదు. ఒకవేళ ఏ కారణంగానో అప్పటికే వ్యాధి మారిపోతే, అప్పుడింక నొప్పి ఒక లక్షణంగా ఉన్నప్పుడు చేసే సాధారణ చికిత్సలు కాదు. కొన్ని ప్రత్యేక చికిత్సలు అవసరమవుతాయి.



## క్రానిక్‌గా మారితే?

ఎవరిలోనైనా వెన్నునొప్పి క్రానిక్‌గా మారి, నాడీవ్యవస్థ దెబ్బతిన్నప్పుడు మెదడులోని భావోద్వేగాలకు సంబంధించిన లింబిక్ సిస్టమ్, శరీర పోషణ, నిద్ర, లైంగిక విభాగాలకు చెందిన హైపోథలమస్ దెబ్బ తింటాయి. హైపోథలమస్ ముందు పిట్యూటరీ గ్రంథికి సంకేతాలు పంపిస్తే, పిట్యూటరీ గ్రంథి అడ్రినలిన్ గ్రంథికి సంకేతాలు పంపిస్తుంది. ఈ ప్రభావాలు, వెన్నుకు దగ్గరలో, కిడ్నీల పైన ఉండే అండ్రినలిన్ గ్రంథి మీద పడి, స్ట్రెస్ హార్మోన్స్ విడుదల అవుతాయి. నిజానికి, నరాలు, రక్తనాళాలన్నీ ఈ గ్రంథి నియంత్రణలోనే ఉంటాయి. గుండె వేగం, శ్వాసకోశాల వేగం, మూత్రాశయ క్రియలు, ఎలక్ట్రొలైట్స్ సమతుల్యత, లవణాల మెటబాలిజం ఇవన్నీ ఈ గ్రంథి అదుపాజ్ఞల్లోనే ఉంటాయి. ఏకారణంగానైనా, ఈ అడ్రినల్ గ్రంథి సక్రమంగా పనిచేయనప్పుడు , అధిక రక్తపోటు, మధుమేహ సమస్యలు మొదలవుతాయి.

## పోషకాలు అందక...

అవసరమైన పోషకాలు అందక వెన్ను కండరాలతో పాటు, లిగమెంట్లు, టెండాన్లు బిగుసుకుపోతాయి, దీంతో వెన్నునొప్పి మరింత తీవ్రమవుతుంది. ఒక దశలో రక్తనాళాలూ బిగుసుకుపోతాయి. ఫలితంగా, వివిధ అవయవాలకు రక్తప్రసరణ జరగడంలో ఒత్తిడి పెరిగిపోతుంది. అంతిమంగా ఇది అధిక రక్తపోటు మధుమేహం సమస్యలు తలెత్తడంతో పాటు, జననాంగాలకు వెళ్లే రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడుతుంది. ఇది పురుషుల్లో అయితే, అంగస్తంభన, శీఘ్రస్ఖలన సమస్యలు మొదలవుతాయి. టెస్టోస్టెరాన్ హార్మోన్ కూడా తగ్గిపోయి, అంతిమంగా ఇది ఆండ్రోపాజ్‌కు దారి తీయవచ్చు. స్త్రీలలో అయితే, అండాశయం మీద కూడా ఈ దుష్ప్రభావం పడుతుంది. దీనివల్ల వైట్ డిస్చార్జ్ (తెల్లబట్ట) నుంచి మొదలుకుని, రతీ సమయంలో నొప్పి, పిసిఒడి, ఫైబ్రాయిడ్స్, సంతానలేమి, ఇలా సమస్త స్త్రీ-లైంగిక సమస్యలూ మొదలవుతాయి. అప్పటికే కండరాల వ్యవస్థ అంతా దెబ్బతిని అది వెన్ను నొప్పికి కారణమై బాధపడుతున్న సమయంలో, అడ్రినలిన్ గ్రంధి కూడా స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తే, అది కండరాలతో పాటు లిగమెంట్లు, టెండాన్లకు కూడా పోషకాలు అందకుండా పోయే పరిస్థితి నెలకొంటుంది. దీని వల్ల శరీరంలోని సప్తధాతువులూ దెబ్బతిని శరీర స్థితి మరింత వేగంగా క్షీణిస్తూ వెళుతుంది. ఇదంతా ఒక విషవలయంలా మనిషి జీవితాన్ని ముంచేస్తుంది

## ఆలస్యం ప్రాణాంతకం

నిజానికి సమస్య అంతా కేవలం అడ్రినల్ గ్రంధి విడుదల చేసే హార్మోన్లకే పరిమితమై లేదు. ఈ పరిణామాలు శరీరంలోని మొత్తం హార్మోన్ వ్యవస్థలన్నిటినీ దెబ్బతీస్తూ వెళతాయి. అంతిమంగా ఇవన్నీ కలసి, మనిషి ప్రాణాన్ని నిలబెట్టే ఓజస్సును దెబ్బ తీస్తాయి. ఆ స్థితే వస్తే మనిషి ఇక నిర్జీవమే. అందుకే కేవలం వెన్నునొప్పికే పరిమితం కాకుండా, ఆ కారణంగా దెబ్బతినే మొత్తం వ్యవస్థల్ని తిరిగి సాధారణ స్థితికి తేవడమే లక్ష్యంగా ఆయుర్వేదం పనిచేస్తుంది. మేరు చికిత్సలు, మర్మ చికిత్సలు, రసాయన చికిత్సలు ఈ విషయంలో అద్భుతంగా పనిచేస్తాయి. లైంగిక సమస్యలే ఉంటే వాజీకరణ చికిత్సలూ తీసుకోవచ్చు. వెన్నునొప్పి పట్ల నిర్లక్ష్యం నిజంగా మనిషిని నిర్జీవుణ్నే చేస్తుంది. సమగ్రమైన ఆయుర్వేద చికిత్సలే ఇక్కడ మనిషిని సంపూర్ణుడిగా నిలబెడతాయి.


**డాక్టర్ వర్థన్, డాక్టర్ మాధురీ వర్థన్**
**ది కేరళ ఆయుర్వేదిక్ కేర్,**
స్పెషాలిటీ, పంచకర్మ సెంటర్
స్కైలేన్ థియేటర్ లేన్, బషీర్‌బాగ్ హైదరాబాద్
**బ్రాంచ్: దానవాయి పేట, రాజమండ్రి**
ఫోన్: 9866666055, 8686848383

టెక్‌బిట్స్

## అవుట్‌లుక్ డాట్‌కాం ప్రివ్యూ వెర్షన్




మైక్రోసాఫ్ట్ తాజాగా అవుట్ లుక్ డాట్‌కాం పేరిట సరికొత్త ప్రివ్యూ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ వెబ్‌బేస్‌డ్ పర్సనల్ ఈమెయిల్ సర్వీసు మెరుగైన సేవలందిస్తుందని మైక్రోసాఫ్ట్ వైస్‌ప్రెసిడెంట్ క్రిస్ జోన్స్ చెప్పారు. ఈ కొత్త మెయిల్ సర్వీసు ఫేస్‌బుక్, ట్విట్టర్, లింకెడిన్ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లను నేరుగా కనెక్టు అయ్యేలా చేయటంతోపాటు నేరుగా స్నేహితులతో ఛాటింగ్, వీడియో కాలింగ్ చేయవచ్చని కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 324 మిలియన్‌లమంది హాట్‌మెయిల్‌ను వినియోగిస్తున్నారని, దాని బదులు ఈ సరికొత్త అవుట్‌లుక్ డాట్‌కాంను తీసుకురానున్నట్లు టెక్నో నిపుణులు భావిస్తున్నారు.

## డిజైర్ వీసీ స్మార్ట్‌ఫోన్



హెచ్‌టీసీ డిజైర్ వీసీ డ్యుయల్ సిమ్ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను తాజాగా విడుదల చేసింది. ఈ డివైజ్ జీఎస్ఎం, సీడీఎంఏ సిమ్‌కార్డులకు సపోర్టు చేస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 4.0 బోర్డు ఆండ్రాయిడ్‌తోపాటు 4 ఇంచుల డబ్ల్యువీజీఏ ఎల్ఈడీ డిస్‌ప్లే ఉంది. ఆండ్రాయిడ్ 4.0 ఐస్‌క్రీమ్ శాండ్‌విచ్ ఆపరేటింగ్ సిస్టమ్, 1 జీహెచ్‌జడ్ కోర్‌టెక్స్-ఎ5 ప్రాసెసర్, 5 ఎంపీ ప్రైమరీ కెమెరా, 4 జీబీ ఇంటర్నల్ అండ్ ఎక్స్‌పాండబుల్ 32 జీబీ మెమోరీ, 512 ఎంబీ ర్యామ్, 1650 ఎంఏహెచ్ లీలాన్ బ్యాటరీ డిజైర్ వీసీ సొంతం. వినూత్న ఫీచర్స్‌తో కూడిన ఈ స్మార్ట్‌ఫోన్ కొత్త టెక్నాలజీతో పనిచేస్తుందని కంపెనీ నిపుణులు చెపుతున్నారు.

## హువేయి వైఫై డాటాకార్డు



గ్లోబల్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన హువేయి ఈ 355 వైఫై డాటాకార్డును తాజాగా విడుదల చేసింది. ఈ డాటాకార్డు మొబైల్ వైఫై హాట్‌స్పాట్‌గా ఒకే సారి ఎక్కడైనా, ఎప్పుడైనా అయిదు డివైజ్‌లకు ఇంటర్‌నెట్ కనెక్టివిటీ అందిస్తుంది. ఈ డాటాకార్డు చిన్న వ్యాపారవేత్తలకు వేగంగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

## ఐసీహెచ్ టాబ్లెట్



ఢిల్లీకి చెందిన ఛాంపియన్ కంప్యూటర్స్ ఐస్‌క్రీమ్ శాండ్‌విచ్ టాబ్లెట్‌ను మార్కెట్‌లోకి తాజాగా విడుదల చేసింది. డబ్ల్యూ ట్యాబ్ 7.2 రన్స్‌తోపాటు 1.5 జీహెచ్‌జడ్ ప్రాసెసర్, 512 ఎంబీ ర్యామ్‌తో 7 ఇంచుల డిస్‌ప్లేతో ఆకట్టుకుంటుంది. 4 జీబీల ఇంటర్నల్ స్టోరేజితోపాటు ఫ్రంట్ కెమెరాతో 3జీ వయా యూఎస్‌బీ, వైఫై కనెక్టివిటీ ఫీచర్‌లు ఈ టాబ్లెట్‌లో ఉన్నాయి. అందుబాటు ధరల్లో అధునాతన ఫీచర్స్‌తో టాబ్లెట్‌ను ప్రజలకు అందించాలని తాము ఈ టాబ్లెట్‌ను విడుదల చేశామని కంపెనీ ప్రకటించింది. యూఎస్‌బీ పోర్ట్‌తోపాటు మైక్రోఎస్‌డి కార్డు స్లాట్‌తో కూడిన ఈ టాబ్లెట్ 320 గ్రాముల బరువు ఉంది.

## ఫైన్ పిక్స్ ఎస్ 4500 ఆప్టికల్ జూమ్



ఫ్యుజీఫిలిం ఫైన్ పిక్స్ ఎస్ 4500 పేరిట సరికొత్త ఆప్టికల్ జ్యూమ్‌ను తాజాగా విడుదల చేసింది. ఈ సూపర్ జ్యూమ్ కెమెరా 14 మెగా పిక్సెల్ సీసీడీ సెన్సార్‌తో పాటు షిఫ్ట్ ఇమేజ్ స్టెబిలైజేషన్, 30 ఆప్టికల్ జ్యూమ్ లెన్స్, 3 ఇంచుల సీసీడీ సెన్సార్ ఫీచర్‌లతో ఈ కెమెరా ఫొటోల ప్రేమికులను ఆకట్టుకుంటుంది. మల్టీలేయర్ సూపర్ ఎలక్ట్రాన్ బీమ్ కోటింగ్‌తో కెమెరా అందుబాటులోకి వచ్చింది. 4,288 రెజిల్యూషన్స్‌తో ఐఎస్‌వో ఆటో, 24-720 ఫోకల్ లెన్త్‌తో ఆప్టికల్ జ్యూమ్, 3 ఇంచుల స్క్రీన్‌తో బిల్ట్ ఇన్ ఫ్లాష్ సౌకర్యం ఈ కెమెరా ప్రత్యేకతలు.

---

టెక్నాలజీ

# శబ్దసౌందర్యం మీ సొంతం

ట్రాఫిక్ రణగొణధ్వనుల మధ్య ఫోన్‌లో మాట్లాడాలంటే... బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సంగీతసాగరంలో మునిగితేలాలంటే... మీ చెవుల్లో ఇయర్‌ఫోన్స్ ఉండాల్సిందే. బస్సుల్లో ప్రయాణిస్తున్నా, ఫోర్ వీలర్‌లో వెళుతున్నా, ట్రెడ్‌మిల్‌పై పరుగెడుతున్నా చెవుల్లో ఇయర్ ఫోన్స్ ఉండి తీరాల్సిందేనంటోంది నేటి యువతరం. ఈ నేపథ్యంలోనే మార్కెట్లోకి కొత్త కొత్త హెడ్‌ఫోన్ మోడల్స్ వస్తున్నాయి.



హెడ్‌సెట్స్ వాడే ఉద్యోగుల్లో మెడ, భుజం నొప్పి, కండరాల నొప్పులు చాలా తక్కువగా ఉంటున్నాయి. శాంతా క్లారా వ్యాలీ మెడికల్ సెంటర్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడయిన విషయమిది. దూర ప్రయాణాల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని మ్యూజిక్ వినేవారిలో ప్రయాణ బడలికె ఉండటం లేదు. నిపుణులు చెబుతున్న అంశమిది. అందుకే కస్టమర్ కేర్ సెంటర్స్, రిసెప్షనిస్టులు, వ్యాపారవేత్తలు, ఇతర ఉద్యోగులు...ఇలా వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు హెడ్‌ఫోన్స్ ఉపయోగించడం పట్ల ఆసక్తి చూపుతున్నారు.

### బ్లూటూత్ హెడ్‌సెట్స్

మొదటిసారి చూసిన వారికి తమలో తామే మాట్లాడుకుంటున్నాడేమోనని భ్రమపడతారు. టెక్నాలజీ తెచ్చిన ఫలితం ఇది. చెవిలో ఇమిడిపోయే బ్లూటూత్ హెడ్‌సెట్ ద్వారా ఫోన్‌లో మాట్లాడుతున్నారనే విషయం తెలియదు. మాట్లాడుతూ కంప్యూటర్‌పై పనిచేసే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. వెహికిల్స్‌పై ప్రయాణం చేసే సందర్భంలోనూ ఉపయోగపడుతుంది. ఇందులో అనేక మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. అభిరుచిని బట్టి ఎంచుకోవచ్చు. నాయిస్ రిడక్షన్, సౌండ్ క్వాలిటీ ఉన్న హెడ్‌సెట్స్ ఆఫీస్ ఎన్విరాన్‌మెంట్‌కు బాగా పనిచేస్తాయి. యాక్టివ్ నాయిస్ రిడక్షన్ టెక్నాలజీ(ఏఎన్ఆర్) చెవులకు చేరే సౌండ్‌వేవ్స్‌ను ఎలిమినేట్ చేసి బయటి సౌండ్ వినపడకుండా చేస్తుంది. ఉన్నాయి. మరి మాట్లాడేదెలా? అంటే మీ కంప్యూటర్‌కు హెడ్‌సెట్స్ కనెక్ట్ చేసుకోవాల్సిందే. హెడ్‌సెట్స్ పెట్టుకుంటే విదేశాల్లో ఉన్న స్నేహితులతో సైతం ముచ్చటించుకోవచ్చు.

### సెల్‌ఫోన్‌కు ఎందుకు?

టూ వీలర్‌లో, కారులో డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడే వారిని మనం చూస్తూనే ఉంటాం. దీనివల్ల ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. ఒక చేత్తో ఫోన్ పట్టుకుని మాట్లాడుతూ మరో చేత్తో గేర్లు మార్చుతూ, స్టీరింగ్ తిప్పుతూ, ఎఫ్ఎం సౌండ్ తగ్గిస్తూ, వైపర్ ఆన్ చేస్తూ డ్రైవింగ్ చేయడం ఎంత ప్రమాదమో ఊహించండి. అదే బ్లూటూత్ హెడ్‌సెట్ ఉంటే ప్రయాణం సుఖమయమవుతుంది. ఏ కాల్‌నయినా లిఫ్ట్ చేసి నింపాదిగా మాట్లాడవచ్చు. హెడ్‌సెట్ వల్ల సేఫ్టీ ఉంటుందనడంలో సందేహం లేదు. హెడ్‌సెట్స్ వాడటం వల్ల రేడియేషన్ ప్రభావం ఉండదని నిపుణులు అంటున్నారు. లాంగ్‌టూర్ వెళుతుంటే మీకు కావలసిన ఉల్లాసాన్ని అందించేది సంగీతమే. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుంటే సమయమే తెలియకుండా పోతుంది. ఇష్టమైన పాటలు వింటూ ఎంజాయ్ చేయవచ్చు.

అన్ని హెడ్‌సెట్స్‌లోనూ ఈ టెక్నాలజీ అందుబాటులో ఉంది. ఇందులో ఉండే మరో అద్భుతమైన ఫీచర్ డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ టెక్నాలజీ(డీఎస్‌పీ). ఇది ఆటోమెటిక్‌గా లిజనింగ్ వాల్యూమ్‌లెవెల్స్ పెరిగేలా చేయడంలో తోడ్పడుతుంది. బూమ్ మైక్రోఫోన్ ఎంచుకుంటే మైక్రోఫోన్ నోటి దగ్గరకు వస్తుంది. అయితే ఆపరేటర్‌లా కనిపించడం మీకిష్టం లేదనుకుంటే బూమ్‌లెస్ మైక్రోఫోన్ ఉన్న హెడ్‌సెట్ ఎంచుకోవచ్చు. ఇందులో చెవి దగ్గరే మైక్రోఫోన్స్ ఉంటాయి. హెడ్‌సెట్‌లోనే వాల్యూమ్ కంట్రోల్స్, ఆన్సర్, ఎండ్ బటన్స్ ఉంటాయి. కొన్ని హెడ్‌సెట్లలో కాలర్‌ఐడీ, ఫోన్ బుక్ చూసే సౌలభ్యం ఉంది. బ్యాటరీ ఐదు గంటల పాటు ఉంటుంది. బ్యాటరీ సామర్థ్యం మోడళ్లను బట్టి మారుతూ ఉంటుంది.

### టాక్ విత్ హెడ్‌సెట్



కంప్యూటర్లకు, ల్యాప్‌టాప్‌లకు స్పీకర్లు ఉంటాయి. కానీ అందులో క్వాలిటీ ఉండదు. ఇతరులకు ఆటంకం కలగకుండా మూవీస్ చూడాలన్నా, మ్యూజిక్ వినాలన్నా హెడ్‌సెట్స్ ఉండాల్సిందే. స్పీచ్ రికగ్నేషన్ ప్రోగ్రామ్స్‌కి మైక్రోఫోన్ పనిచేస్తుంది. ఇంట్లో కంప్యూటర్‌కు నెట్ సౌలభ్యం ఉంది. అందులో ఉచితంగా మాట్లాడుకోవడానికి స్కైపీ లాంటి బోలెడు అప్లికేషన్లు

### గేమ్స్ కోసం ప్రత్యేకం

ఈ మధ్యకాలంలో పిల్లలు కంప్యూటర్ ముందు కూర్చున్నారంటే చాలు గేమ్స్ ఓపెన్ చేస్తున్నారు. చెవుల్లో హెడ్‌సెట్స్ పెట్టేస్తున్నారు. గేమ్స్‌కు సౌండ్స్ తోడైతే ఇక చెప్పనక్కర్లేదు. ఒక పట్టాన గేమ్స్ క్లోజ్ చేయాలనిపించదు. గేమ్స్ కోసం ప్రత్యేకమైన ఫీచర్స్‌తో రూపొందించిన హెడ్‌సెట్స్ కూడా ఉన్నాయి. ఇందులో సీఎమ్ స్టార్మ్ సిరస్ 5.1ఒకటి. హైక్వాలిటీ మెటీరియల్‌తో తయారయిన ఈ హెడ్‌ఫోన్స్‌లో ఉండే క్లాత్ కుషనింగ్ చెవికి వేడి తగలకుండా కాపాడుతుంది. గేమింగ్‌లో రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుంది.

నాయిస్ కాన్సిలేషన్, కంఫర్ట్, సౌండ్ క్వాలిటీ, పోర్టబులిటీ (సైజ్), ధర... ఇవి హెడ్‌సెట్, ఇయర్‌ఫోన్స్ కొనేముందు గుర్తుంచుకోవాల్సిన అంశాలు. ఈ ఐదు అంశాలు బాగుంటే మీ హెడ్‌సెట్‌కు తిరుగుండదు.

### కొత్త టెక్నాలజీ

అన్ని గాడ్జెట్స్‌లో మాదిరిగానే ఇయర్ ఫోన్స్‌లో సైతం కొత్త టెక్నాలజీ అనేక మార్పులు తీసుకువచ్చింది. ఇప్పుడంతా వైర్‌లెస్ హెడ్‌సెట్ హవా నడుస్తోంది. ట్రాఫిక్‌లో ఎంత సౌండ్ ఉన్నా హెడ్‌సెట్ పెట్టుకున్నారంటే బయటి చప్పుడు కొంచెం కూడా మీకు వినబడదు. నాయిస్ కాన్సిలేషన్ టెక్నాలజీ సహాయంతో ఇది సాధ్యమవుతోంది. బయట చప్పుళ్లను పూర్తిగా తగ్గించేసి మీరు వింటున్న పాటలు, మాటలను పూర్తి క్లారిటీతో వినపడేలా చేస్తుంది.

### వైర్‌లెస్ హెడ్‌సెట్స్

క్రియేటివ్ డీఇ300. వైర్‌లెస్ టెక్నాలజీ సహాయంతో పనిచేసే హెడ్‌ఫోన్స్ ఇవి. పది మీటర్ల రేంజ్‌లో ఇది పనిచేస్తుంది. వాల్యూమ్ కంట్రోల్ చేసుకునేందుకు వీలుగా కంట్రోల్స్ ఉంటాయి. క్రియేటివ్ టెక్నాలజీ సంస్థ వీటిని విడుదల చేసింది. ఈ సంస్థ డీఇ450, డీఇ350, డీఇ250 పేరుతోనూ వైర్‌లెస్ హెడ్‌సెట్స్‌ను విడుదల చేసింది. ఏపీటీ-ఎక్స్ టెక్నాలజీ, స్పీచ్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రాసెసింగ్, నాయిస్ సప్రెషన్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. క్రియేటివ్ ఈపీ 660 పేరుతో విడుదల చేసిన ఇయర్ ఫోన్స్ రన్నర్స్, సైక్లిస్ట్‌లకి బాగా నప్పుతాయి. ఇవి చెవుల్లో బాగా సెట్ అయి పడిపోకుండా ఉంటాయి. ఇందులో ఉండే మూడు సిలికాన్ టిప్స్ పర్‌ఫెక్ట్‌గా ఫిట్ అయ్యేలా చేస్తాయి.



---

# మృత్యుదేవా! మానవుడు నిన్ను జయించి తీరతాడు

చింతన

మృత్యువు సావిత్రితో ఎన్నో విధాల వాదిస్తున్నది. జీవితానికి ఈ ప్రపంచంలో ఎన్నోరకాల నిర్వచనాలు, వాదనలూ ఉన్నాయి. హేతువాదం, శూన్యవాదం, మాయావాదం, కర్మ సిద్ధాంతం వంటి వాదనలెన్నో తమదైన పద్ధతిలో జీవితం పట్ల అనేక దృక్పథాలు వెల్లడిస్తున్నాయి. మృత్యువు అన్నిరకాల వాదనలతో సావిత్రితో తలపడుతున్నది. వాటన్నింటినీ సావిత్రి తన సంకల్పబలంతో, సత్యనిష్ఠతో ఎగరగొట్టి వేస్తున్నది. అయినా, మృత్యువు తన పంతం వీడడం లేదు. సావిత్రి కూడా తన పట్టు సడలించడం లేదు. ''కాలపురుషా! ఈ లోకంలో పేరుకుపోయిన దైన్యాన్ని, విషాదాన్ని ఆధారం చేసుకుని వాదిస్తున్నావు. సత్యాన్ని మాయ ముసుగులో కప్పివేసి, ప్రకృతిలోని సౌందర్యాన్ని వికృతం చేసి మాట్లాడుతున్నావు. మానవ మేధస్సుపై చీకటి తెరలు కప్పి మనస్సుకు మనిషిని బానిసను చేసి వితండవాదం చేస్తున్నావు. నా భావాలకు భ్రమ అనే వక్రభాష్యం చెబుతున్నావు. ఈ లోకంలో ఉన్న విషాదమే నీకు ఆహారం. ఆనందం. నీ పరుషవాక్కులతో కాంతిని కమ్మివేసి, అసత్యానికి సత్యాన్ని బదిలీ చేయాలని వృధాప్రయాస పడుతున్నావు.''


శ్రీఅరవిందుల సావిత్రి

'' ఓ మృత్యుదేవా! నీ వాదనలు వినాశకారులు. విధ్వంసం నీ జన్మహక్కు... కానీ, నేను నమ్ముతున్న 'సత్యం' విశ్వకళ్యాణానికి దోహదకారి. తనను తాను తెలుసుకుని పురోగమించాల్సిన మానవుడు, ఈ లోకంనుంచే బయలు దేరతాడు. ఈ చీకటి ద్వారానే తేజోమయ లోకాలను అందుకుంటాడు. నిన్ను జయించి అమరత్వాన్ని చేరుకుని తీరతాడు. ఈ కనిపించే భౌతిక ప్రపంచమంతా పరమాత్మకు మరోరూపం. ఈ జగతి లోతుల్లో చైతన్యం దాగి ఉంది. విశ్వం ద్వారా సంపాదించిన జ్ఞానం, తనను తాను అధిగమించి మహాజ్ఞానాన్ని పొందుతుంది. అనంతంగా మారిపోతుంది. ఆనాడు ఈ మానవుడు అతీంద్రియ జ్ఞానంతో పరమానందానుభూతి చెందుతాడు. ఈ కనిపించే అశాశ్వ తత్వం, శాశ్వతంగా రూపాంతరం చెందుతుంది.

### సృష్టిక్రమం

మృత్యుదేవా! ఒక్కసారి వెనుదిరిగి సృష్టిక్రమం వైపు చూడు. కాలాతీత భావం ఎదిగి ఎదిగి శూన్యాన్ని చేరుతుంది. ఆ శూన్యంలోనే ఈ విశ్వానికి రూపకల్పన జరుగుతుంది. నన్ను శూన్యంలోకి మరలిపొమ్మంటున్నావు. ఈ జీవాత్మ సాహసించి 'కాలం'లో అడుగుపెట్టి విధితో కలసి పోరాటం చేస్తుంది. ఈ ఆత్మ విశ్వాంతరాళంలో యాత్రకు బయలు దేరి, అనాది నిర్గుణం, ఓ భావాన్ని ఏర్పరుస్తుంది. అప్పుడు ఈ శూన్యరూపంలోని పరమాత్మలో ఆత్మ కదలాడి, అది ఒకనాటికి మహాగ్నిగా మారి తేజస్సును ప్రసరిస్తుంది. ఈ నిరాకారంలో చలనం బయలుదేరి ఆకారాలను ఏర్పరుస్తుంది. ఇంతవరకూ ఒక రూపంలేని పదార్థం రూపం తీసుకుంటుంది. అదే ఈ సృష్టిక్రమం.

### నిరంతర వికాసం

మానవుడు క్రమంగా వికసించి, మేధస్సులో జాగరూకుడై, తానూ పశువులో ఒకడైనా, వివేకాన్నీ, ప్రజ్ఞనూ సంపాదించుకుని, సకల జీవకోటిలో తానే అధికుడయ్యాడు. ఇప్పటికీ మానవుడే అత్యున్నత జీవి. అతని మేధస్సు అంతకంతకూ వికసించింది. తనను తాను అధిగమించడం కోసం, విధిని దిక్కరించాడు. ప్రకృతిలోని అగోచర శక్తులతో పోరాటం సాగించాడు. శూన్యంలో పయనించి, ఇతర గోళాలను చేరే ప్రయత్నంలో ఉన్నాడు. తన చుట్టూ ఉన్న పరిసరాలపై ఆధిపత్యం సంపాదించాడు. తనకు కావలసిందంతా రాబట్టుకుంటున్నాడు. మనస్సు పరిమితులను అధిగమించి మహత్తర శక్తుల్ని గుర్తించాడు. అలా అగోచరాన్ని దర్శిస్తున్నాడు. బ్రహ్మవర్చస్సు నుంచి బయలుదేరిన కాంతికిరణం, మనిషిని తాకింది. నిశ్చలంగా, అగాధమైన అంతరాంతరాలలో ప్రవేశించి, భౌతికానికి అతీతమైన తేజస్సుతో చైతన్యవంతుడయ్యాడు. మానవుడు తనలోకి తాను చూసుకుని తనను తాను అధిగమించి, పరప్రజ్ఞను పొంది తాను ఆదిగా మారాలనుకుంటున్నాడు. అదీ ఎక్కడో కాదు. ఇక్కడే.

### ఇది అసంపూర్ణ విశ్వం

'' మృత్యుదేవా! నీకు కనిపిస్తున్నది అసంపూర్ణ విశ్వం. ఇంకా చాలా మార్పులు జరగాల్సి ఉంది. అది మార్గమధ్యంలో ఉంది. తాను అనుకొన్నది జరిగే వరకే నీ ప్రతాపం. నీ ఉనికి. అసంపూర్ణ మానవుడు, అసమగ్ర మేధతోనే అజ్ఞానంలోనే ఉన్నాడు కనుక దేనినీ విశ్వసించలేదు. అందుకే హేతువాదంలో కూరుకుపోయి, తన కంటికి కనిపించని దైవాన్ని విశ్వసించలేకపోతున్నాడు. ఈ నాటి ఈ పసివాడు ఎప్పటికీ ఇలాగే ఉంటాడనుకుంటున్నావు. ఇప్పుడు అజ్ఞానంలో ఉన్నవాడు పూర్వజ్ఞాని కాలేడంటావా? అది నీ భ్రమ. నీవు భ్రమలో ఉండి, మేము భ్రమల్లో ఉన్నామంటున్నావు. నీకు తెలిసిందే పూర్ణజ్ఞానం కాదు. అసలు నీ ఉనికే ఒకనాటికి లేకుండా పోతుంది. ఇంక నీ హేతువాదం కట్టిపెట్టు. నేను వెనుదిరిగి వెళ్లడం జరగదు. ఆ ఆశలు వదులుకో.''

సావిత్రి మృత్యువుతో భవిష్యత్తులో జరగబోయే విశేషాలు చెప్పబోతున్నది. మనమూ విందాం.

• కొంగర భాస్కరరావు
శ్రీఅరవిందాశ్రమం, తెనాలి



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
9-8-2012 గురువారం

# ఊచకోతలకు అసలు కారణం

ఇటీవల అమెరికాలోని కొలరాడో థియేటర్‌లో పన్నెండుమందిని చంపి, పదుల సంఖ్యలో జనాలను క్షతగాత్రులుగా మార్చిన జేమ్స్ హోల్మేన్స్ గురించి రోజులు గడిచేకొద్దీ ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. అంతే కాదు గతేడాది నార్వేలో బాంబులు వేసి విచ్చలవిడిగా కాల్పులు జరిపి 77 మంది మరణానికి కారణమైన ఆండర్స్ బెహింగ్ బ్రివెక్‌కూ, ఈ హోల్మేన్స్‌కూ ఒకే రకమైన అభిరుచి ఉందట. అదేమిటంటే –ఎల్లవేళలా హింసాత్మకమైన వీడియో



గేమ్స్‌ను చూడటం. వారు చూసిన ఈ డేంజర్ గేమ్స్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశమయ్యాయి.

1980ల నేపథ్యంలో వచ్చిన 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో' అనే ఆట అంటే విపరీతమైన ఇష్టమని హోల్మేన్స్ వెల్లడించాడు. దాన్ని రోజుకు కనీసం పది సార్లు చూసేవాడట. ఎనభై దశకంలో అమెరికా మాఫియా తన ప్రత్యర్థులను ఎంత భయంకరంగా మట్టుపెట్టేదో తెలియజేస్తూ రూపొందించిన వీడియోగేమ్ అది. ఆ ఆటలో హింస మరీ ఎక్కువగా ఉండటంతో అప్పట్లోనే దానిపై విమర్శలు వెల్లువెత్తాయట. అయితే ఇప్పుడది ఆన్‌లైన్‌లో లభ్యమవుతుండటంతో ఎక్కువమంది చూడగలుగుతున్నారు. విశేషమేమిటంటే ఆ వీడియో గేమ్ బ్రివెక్‌కు కూడా ఫేవరెట్ ఆట కావడం. చేసే హింసకు పాయింట్లు ఇచ్చే సంస్కృతి రావడంతో వీడియో గేమ్స్ వికృతి విశ్వరూపం దాల్చింది. హోల్మేన్స్‌కు ప్రాణమైన మరో ఆట పేరు 'బుల్లెట్ స్ట్రామ్'. దీంట్లో విలనే ప్రధాన పాత్రధారి. ఎంతమంది ప్రత్యర్థులను చంపితే అతను అంత పైకి ఎదుగుతాడు. ఈ ఆటలో ఒకేసారి వందలమందిని చంపగలిగితే బోనస్ పాయింట్లు లభిస్తాయి. పైగా ప్రత్యర్థి చనిపోతే మాత్రమే పాయింట్లు వస్తాయి. గాయాల పాలైతే రావు. కాబట్టి కచ్చితంగా ప్రత్యర్థులను చంపాల్సిందే. ఈ ఆట ప్రభావం వల్లనే హోల్మేన్స్ ఒక సారి కాల్చిన వారిని మళ్లీ మళ్లీ కాల్చాడని చెబుతున్నారు. ఈ రెండు గేమ్స్ కంటే 'గాడ్ ఆఫ్ వార్' ఆట ఇంకా ప్రమాదకరమంటున్నారు. ఇది కూడా పైన చెప్పిన ఇద్దరు నిందితులకు ఇష్టమట. ఇందులో హింస పరాకాష్టకు చేరుతుంది. ఈ ఆటలో ప్రత్యర్థిని కచ్చితంగా తలపైనే షూట్ చేయాలి. అవతలి వ్యక్తి సున్నితమైన అవయవాలను ఎంత దారుణంగా హింసించి చంపితే అన్ని పాయింట్లు అదనంగా వచ్చి చేరుతాయి. చనిపోయేటపుడు ప్రత్యర్థులు కేకలు వేస్తూ ప్రాణాలు వదిలితే పాయింట్లు పెరుగుతాయి. ఇలాంటి ఆటలే వారిద్దరి మనస్తత్వం పంకిల మవడానికి కారణంగా చెబుతున్నారు.

## డేంజర్‌కు దూరంగా...

హోల్మేన్స్ బయటపెడుతున్న డేంజర్ గేమ్ సంగతులు సంచలనం సృష్టిస్తున్నాయి. అలాంటి హింసాత్మక ఆటలను నిషేధించాలని ప్రజలు వీధులకెక్కుతున్నారు. బాలలను, యుక్త వయస్సులోకి ప్రవేశించే వారిని హింసాత్మక వీడియో గేమ్స్ తప్పుదారి పట్టిస్తాయని చాలా కాలం నుంచి చాలామంది మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పిల్లలు ఎటువంటి వీడియో గేమ్స్ ఇష్టపడుతున్నారో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని వారు అంటున్నారు. ఒక వేళ పిల్లలు హింసాత్మక ఆటలను కోరుకుంటుంటే వారి మనసు మార్చి మంచి ఆటలను పరిచయం చేయాలని సూచిస్తున్నారు. నిజమే, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండదు కదా!.

## బంగారం వెండి

08-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,080 (----) | 29,580 (29,480) | 53,300 (----) |
| విజయవాడ | 30,100 (30,200) | 27,800 (28,000) | 53,000 (53,000) |
| ప్రొద్దుటూరు | 30,160 (30,160) | 27,200 (27,200) | 53,200 (53,200) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 30,060 (30,060) | 27,660 (27,660) | 53,150 (53,150) |
| ముంబయి | ---- (----) | ---- (----) | ---- (----) |
| చెన్నయ్ | 29,825 (29,815) | 27,890 (27,880) | 53,325 (53,410) |

• బ్రాకెట్లలో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు

నవ్య గురించి సలహాలు, సూచనలు navyaa.aj@gmail.com కు పంపగలరు.



'పేదల గురించి ఎవరూ ఆలోచించరనేది అబద్ధం. ప్రభుత్వమూ, కార్పొరేట్ సంస్థలూ నిత్యం వారి గురించే ఆలోచిస్తుంటాయి. ఎంత ఆలోచించకపోతే పేదలకు చెందాల్సిన సమస్త సంపదనూ వారు ఎప్పటికప్పుడు తమ గుప్పిట్లోకి తెచ్చుకోగలుగుతారు?' అంటారు సుప్రసిద్ధ మేధావి, కలం కార్యకర్త అరుంధతీ రాయ్. తెలుగులోకి అనువాదమైన ఆమె తాజా పుస్తకం 'పెట్టుబడిదారీ విధానం ఒక ప్రేతాత్మ కథ' నుంచి కొన్ని భాగాలు మీ కోసం.

# ఒక ప్రేతాత్మ కథ

భారత ప్రణాళికాకారులు ఆశిస్తున్న స్థాయిలో సామాజిక పునర్నిర్మాణం జరగాలంటే బలప్రయోగం ఒక్కటే చాలదని భారత సైన్యపు అనుభవం చెపుతోంది. పేద ప్రజలపై యుద్ధం చేయడం సరే. మిగిలిన మధ్యతరగతి, మేధో సంబంధ ఉద్యోగస్తులు, మేధావులు,'ప్రజాభిప్రాయాన్ని మలిచే' మనబోటి వాళ్ల విషయంలో (రాజ్యం) 'అవగాహనలను నియంత్రించటానికి' పూనుకోవాల్సిందే. దీని గురించి తెలుసుకోవాలంటే కార్పొరేట్ ధర్మకర్తృత్వం అనే అద్భుత కళవైపు మన దృష్టిని మళ్లించాల్సి ఉంటుంది.



ఇటీవల కాలంలో కొన్ని పెద్ద పెద్ద గనుల కంపెనీలు కళాపోషకులుగా మారాయి. 1990లలో అందాల పోటీలు తప్పించి వేరే కళలు ఉండేవి కాదు. కాని ఇప్పుడు వాటి స్థానంలో సినిమా, చిత్రకళ, సాహిత్య ఉత్సవాలు చోటుచేసుకుంటున్నాయి. బాక్సైట్ కోసం పురాతన డోంగ్రియా ఖోండ్ జాతి నివాస ప్రాంతాలను తవ్వి పారేస్తున్న వేదాంత కంపెనీ యువత కోసం సుస్థిర అభివృద్ధిపై సినిమాల పోటీ నిర్వహిస్తోంది. వేదాంత కంపెనీ ఉపశీర్షిక 'ఆనందాన్ని తవ్వి తీయడం'. జిందాల్ సంస్థ ఒక సమకాలీన కళా పత్రికను ప్రచురిస్తోంది. భారతదేశంలోని ప్రముఖ కళాకారులకు మద్దతునిస్తోంది (వీళ్లు సహజంగానే స్టెయిన్‌లెస్ స్టీల్‌తో పనిచేస్తారు.) తెహెల్కా న్యూస్‌వీక్ నిర్వహించిన 'థింక్ ఫెస్ట్'కి ముఖ్య పోషకురాలయిన ఎస్సార్ కంపెనీ – ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ రచయితలు, సామాజిక కార్యకర్తలు, వాస్తు శిల్పి ఫ్రాంక్ గెహ్రీ వంటి వారితో ఉద్విగ్న, ఉత్తేజిత చర్చలు ఉంటాయని ప్రచారం చేసింది. (గోవాలో పెద్ద ఎత్తున జరుగుతున్న గనుల కుంభకోణాలను కార్యకర్తలు, పాత్రికేయులు వెలికితీస్తున్న సమయంలోనే ఈ పండగ గోవాలో జరిగింది. బస్తర్‌లో మొదలవుతున్న యుద్ధంలో ఎస్సార్ పాత్ర వెల్లడవుతున్న సమయం కూడా అదే.) టాటాస్టీల్, రియోటింటో (1873లో ఏర్పాటైన బ్రిటిష్ – ఆస్ట్రేలియన్ గనుల కార్పొరేషన్ – దీనికీ తనదైన ఘోరచరిత్ర ఉంది.) ముఖ్య పోషకులుగా ఉన్న జైపూర్ సాహిత్య ఉత్సవాలను (దీని పూర్తి శాస్త్రీయ నామం దర్శన్ సింగ్ కన్‌స్ట్రక్షన్ జైపూర్ సాహిత్య ఉత్సవం) కళాభినివేశకులు 'ప్రపంచంలోకెల్లా అతిపెద్ద సాహిత్య ప్రదర్శన'గా పేర్కొన్నారు. టాటాలకు 'వ్యూహాత్మక బ్రాండ్ నిర్వాహకు'లైన కౌన్సెలేజ్ అన్న కంపెనీ ఈ ఉత్సవంలోని ప్రెస్ ప్రాంగణాన్ని స్పాన్సర్ చేసింది.

* * *

1957లో రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఆసియాలోని ప్రజానాయకులకు రామన్ మెగసెసే బహుమతిని ఏర్పాటు చేసింది. ఆగ్నేయాసియాలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో అమెరికాకి ముఖ్య భాగస్వామిగా నిలిచిన ఫిలిప్పైన్స్ అధ్యక్షుడి పేరుమీద దీనిని నెలకొల్పారు. 2000లో ఫోర్డ్ ఫౌండేషన్ రామన్ మెగసెసే పేరు మీద మరొకటి – నవ నాయకత్వ అవార్డుని ఏర్పాటు చేసింది. మెగసెసే బహుమతి చాలా ప్రతిష్ఠాత్మకమైనదిగా భారతదేశంలోని కళాకారులు, సామాజిక కార్యకర్తలు, ప్రజల కోసం పనిచేసేవాళ్లు భావిస్తారు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మికి, సత్యజిత్‌రేకి అది వచ్చింది. జయప్రకాశ్ నారాయణ్‌కీ వచ్చింది: భారతదేశంలోని అత్యుత్తమ జర్నలిస్టులలో ఒకరైన పి. సాయినాథ్‌కీ వచ్చింది. అయితే ఆ బహుమతి వల్ల వీరికంటే, వీరివల్లే ఆ బహుమతికి ఖ్యాతి వచ్చింది. ఏ రకమైన కార్యకలాపాలు 'ఆమోదనీయమో', ఏవి కావో ఈ బహుమతి సూచిస్తూ ఉంటుంది.

గత సంవత్సరం అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి ముగ్గురు మెగసెసే బహుమతి గ్రహీతలు నాయకత్వం వహించడం ఆసక్తికరమైన విషయం. వారు అన్నా హజారే, అరవింద్ కేజ్రివాల్, కిరణ్ బేడీలు. అరవింద్ కేజ్రివాల్‌కి ఉన్న అనేక స్వచ్ఛంద సంస్థలలో ఒక దానికి ఫోర్డ్ ఫౌండేషన్ ధారాళంగా నిధులు ఇస్తుంది. కిరణ్ బేడి నడిపే స్వచ్ఛంద సంస్థకి కోకా కోలా, లేమన్ బ్రదర్స్ నిధులను ఇస్తున్నాయి.

అన్నా హజారే గాంధేయవాదినని చెప్పుకుంటాడు. కానీ అతను ప్రతిపాదిస్తున్న జన్ లోక్‌పాల్ బిల్లు గాంధేయవాదానికి వ్యతిరేకమైనది, ప్రమాదకరమైనది. అయినా రేయింబవళ్లూ సాగిన కార్పొరేట్ మీడియా ప్రచారం అతడిని 'ప్రజల గొంతుక'గా పేర్కొంది. అమెరికాలో 'వాల్ స్ట్రీట్ ముట్టడి' ఉద్యమంలా కాకుండా హజారే నడుపుతున్న ఉద్యమం ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తి, ఆర్థిక 'సంస్కరణలకు' వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా అనలేదు. హజారేకు మద్దతు తెలిపిన కార్పొరేట్ మీడియా అతిపెద్ద కార్పొరేట్ అవినీతి కుంభకోణాలు బయటపడినపుడు (పెద్ద పెద్ద విలేఖరుల గుట్టు కూడా రట్టు అయ్యింది.) వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ప్రయత్నించింది. రాజకీయ నాయకుల పట్ల ప్రజాగ్రహాన్ని సాకుగా చేసుకుని ప్రభుత్వ అధికారాలను మరింత నీరు కార్చాలని, మరిన్ని సంస్కరణలు చేపట్టాలని, ప్రైవేటీకరణను వేగవంతం చెయ్యాలని ప్రచారం సాగించింది. (2008లో అన్నా హజారేకి విశిష్ట ప్రజాసేవకి గాను ప్రపంచ బ్యాంకు అవార్డు లభించింది.) ఆయన చేస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమం తమ విధానానికి సరిగ్గా సరిపోయిందని వాషింగ్టన్ నుంచి ప్రపంచ బ్యాంకు ఒక ప్రకటన కూడా ఇచ్చింది.

* * *

తాము పాలిస్తున్న ప్రజలను నియంత్రించటానికి వారి గురించిన సమాచార సేకరణ ఏ పాలక శక్తులకైనా ప్రాథమిక అంశమవుతుంది. మధ్య భారతంలో యుద్ధ నేపథ్యంలో (రాజ్యానికి – మావోయిస్టులకు మధ్య) భూసేకరణ పట్ల, నూతన ఆర్థిక విధానాల పట్ల వ్యతిరేకత దేశమంతా విస్తరిస్తున్నపుడు ప్రభుత్వం పెద్దఎత్తున బయోమెట్రిక్స్ కార్యక్రమం చేపట్టింది. అంటే ప్రతి మనిషికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యు.ఐ.డి. – ఆధార్). ప్రపంచం మొత్తం మీద అత్యంత ఖరీదైన సమాచార సేకరణ పథకం ఇదేనేమో! ప్రజలకి శుభ్రమైన తాగునీళ్లు లేవు, మరుగుదొడ్లు లేవు, ఆహారం లేదు, డబ్బు లేదు. కానీ వాళ్లకి ఓటరు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు ఉంటాయి. 'పేదలకు సేవనందించడం' అన్న పేరుతో నడుస్తున్న ఆధార్ ప్రాజెక్టుకి ఇన్ఫోసిస్ మాజీ సిఇఓ నందన్ నీలేకని ఆధిపత్యం వహించడం, సమస్యల్లో ఉన్న ఐటి పరిశ్రమకు ఈ పథకం ద్వారా పెద్దఎత్తున నిధులు సమకూరడం యాదృచ్ఛికమేనా? (ఆధార్‌కి అయ్యే ఖర్చు అధమంగా లెక్కేసినా భారత ప్రభుత్వం ఒక సంవత్సరంలో విద్యపై ఖర్చు పెట్టేదానికంటే ఎక్కువ.) భారతదేశం వంటి అధిక జనాభా దేశంలో – అధిక శాతం నిరక్షరాస్యులుగా, ప్రభుత్వ లెక్కల్లో లేని వారిగా, మురికివాడల వాసులుగా, రోడ్ల వెంట సరుకులు అమ్మేవాళ్లుగా, ఎటువంటి భూమి రికార్డులు లేని ఆదివాసులుగా ఉండగా – డిజిటలైజ్ చెయ్యటానికి పూనుకోవడమంటే వారిని నేరస్తులుగా చెయ్యటమే. వాళ్లను చట్టేతరుల స్థాయి నుంచి చట్ట వ్యతిరేకుల స్థాయికి మార్చడమే. ఉమ్మడి వనరుల చుట్టూ కంచె వేసి సొంతం చేసుకున్నట్టు, రాను రాను మరింత పోలీసు రాజ్యంగా మారుతున్న ప్రభుత్వం చేతిలో ఈ సమాచారం ఉండడం దానికి మరింత అధికారాన్ని కట్టబెట్టినట్లవుతుంది. డిజిటల్ డేటాబేస్‌లు, 'అంకెలతో కూడుకున్న లక్ష్యాలు', 'ప్రగతికి మార్కుల సూచికలు' వంటి వాటి పట్ల బిల్ గేట్స్‌కు ఎంత పిచ్చి ఉండేదో నీలెకనికి కూడా అంతే. ఆయన్ని గణాంకాల సేకరణ పూనింది. వలసవాదం, అప్పులు, కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు సమకూర్చే విధానాల వల్ల కాక సమాచార లేమి వల్లనే ప్రపంచంలో ఆకలి సమస్య ఉన్నట్లు.

* * *

అంబానీలు తమ భవనానికి అంటిల్లా అన్న పేరు ఎందుకు ఎంచుకున్నారు? 8వ శతాబ్దపు ఐబీరియన్ గాథ ప్రకారం అంటిల్లా ఒక కల్పిత దీవుల సమూహం పేరు. హిస్పానియా దేశాన్ని ముస్లింలు జయించినప్పుడు ఆరుగురు క్రిస్టియన్ విసిగోథిక్ బిషప్పులు, వారి అనుచరులు ఓడలెక్కి పారిపోయారు. సముద్రం మీద కొన్ని రోజుల పాటు, బహుశా కొన్ని వారాల పాటు ప్రయాణం చేసి అంటిల్లా దీవులను చేరుకున్నారు. అక్కడ ఒక కొత్త నాగరికతను నిర్మించాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. బర్బరీకుల స్వాధీనంలో ఉన్న తమ మాతృభూమితో శాశ్వతంగా సంబంధాలు తెంచేసుకోటానికి వాళ్లు తాము వచ్చిన ఓడలను తగలబెట్టేశారు.

తమ బహుళ అంతస్తుల భవనానికి అంటిల్లా అని పేరు పెట్టడం ద్వారా అంబానీలు పేదరికం, మురికివాడలతో నిండిన తమ మాతృభూమితో తెగతెంపులు చేసుకుని ఒక కొత్త నాగరికతను నిర్మించాలనుకుంటున్నారా? భారతదేశంలో అత్యంత విజయవంతమైన విభజన – మధ్య, ఎగువ తరగతులు అంతరిక్షంలోకి విడిపోయే – ఉద్యమంలో ఇది చరమాంకమా?

ముంబయిను చీకట్లు కమ్ముకుంటూ ఉండగా ఎత్తయిన అంటిల్లా గేట్ల ముందుకి గంజిపెట్టిన చొక్కాలతో, వాకీటాకీలతో గార్డులు వచ్చారు. బహుశా దెయ్యాలను పారదోలటానికేమో కళ్లు మిరుమిట్లుగొలిపే లైట్లు వెలిగాయి. అంటిల్లాలో వెలిగే కాంతివంతమైన లైట్లు తమకు రేయిని లేకుండా చేస్తున్నాయని ఇరుగుపొరుగు వాళ్లు ఫిర్యాదు చేస్తున్నారు.

మన రేయిని మనం తిరిగి స్వాధీనం చేసుకోటానికి సమయం ఆసన్నమైనట్లు ఉంది. ■

**ఈ పుస్తకావిష్కరణ ఈ నెల 12 న హైదరాబాద్‌లో జరగనుంది.**



పెట్టుబడిదారీ విధానం ఒక ప్రేతాత్మ కథ
అరుంధతీ రాయ్
అనువాదం: కె. సురేష్
పేజీలు: 44, వెల: రూ 25/-
ప్రతులకు: మలుపు బుక్స్ 98665 59868






# ఆంధ్రజ్యోతి నవ్య

కుటుంబ కదంబం

10-8-2012 • శుక్రవారం

అష్టమి రోహిణి ప్రొద్దున
అష్టమగర్భమున బుట్టి యాదేవకికిన్
దుష్టుని కంసు వధింపవె
సృష్టిప్రతిపాలనంబు సేయగ కృష్ణా!



# నలభైల్లో నెరవేరిన కల

**'నేనో సామాన్య గృహిణిని... నిరుపేద కుటుంబం మాది. నలభై అయిదేళ్ల వయస్సులో అనుకోకుండా పరుగుతీశా... ఆ పరుగు పతకాలు తెచ్చిపెట్టింది. ఒక్కసారిగా నన్ను క్రీడాకారిణిగా మార్చేసింది. నన్ను నేను నమ్మలేకపోయా... అప్పటినుంచి పరుగు ఆపలేదు. ప్రాణమున్నంతవరకు ఆపను కూడా' అంటున్నారు నెల్లూరుకి చెందిన యాభై ఏళ్ల వెటరన్ క్రీడాకారిణి పాశం కోటేశ్వరమ్మ. కుటుంబ పరంగా ఎన్నెన్నో కష్టాలు పడి... జీవితం చివరంకంలో క్రీడాకారిణిగా రాణిస్తున్న ఆమె..నవ్యతో తన అనుభవాల్ని పంచుకున్నారు.**

స్ఫూర్తి





ప్రకాశం జిల్లా కరేడు మా సొంతూరు. ఊహ తెలిసినప్పటి నుంచి నాకు అన్నీ కష్టాలే. మా నాన్న పోతిరెడ్డి నిరుపేద. నాతో పాటు ముగ్గురు తమ్ముళ్లు. కుటుంబం గడవాలంటే మేమంతా కష్టపడాల్సిన పరిస్థితి. నాల్గవ తరగతి వరకే చదువుకున్నా. ఆ తరువాత మా నాన్నతో కలిసి గొర్రెలు, పశువులు మేపేందుకు వెళ్లేదాన్ని. చిన్నప్పుడు ఆటలు, పాటలు అస్సలు తెలియవు. పండుగ రోజుల్లో కూడా గొర్రెలు తోలుకుని బీడుకి పోయేవాళ్లం. మండుటెండలో మలమలమాడుతూ గొర్రెల్ని, పశువుల్ని మేపుకు రావడమే జీవితమైంది. వివాహమైతే హాయిగా ఉండొచ్చనుకున్నా... ఆ ఆశ కూడా నెరవేరలేదు. 1983లో నెల్లూరుకు చెందిన మల్లయ్యకి ఇచ్చి వివాహం జరిపించారు. కష్టాలు మరింత పెరిగాయి. ఆయనకి మద్యం అలవాటు ఉండేది. ఏ పనీ చేసేవాడు కాదు. ఉన్న కొద్ది ఆస్తులు అతికొద్దికాలంలోనే కరిగిపోయాయి. ఇంతలోనే ఇద్దరు కుమారులు పుట్టారు. మల్లయ్య తీరులో ఏమాత్రం మార్పురాలేదు. ఒకానొకదశలో పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు కుట్టుమిషన్ నేర్చుకున్నా. తెల్లవారుజామున నాలుగు గంటలకి నిద్రలేచి ఆరు గంటలలోపు వంటపని పూర్తిచేసి అప్పట్నించి రాత్రి పన్నెండు, ఒంటిగంట వరకు కూడా కుడుతూనే ఉండేదాన్ని. అలా వచ్చిన డబ్బుతో మా పెద్దబ్బాయి మహేంద్రని ఇంజనీరింగ్ వరకు చదివించా. ఉద్యోగాల వేటలో ఉన్నాడు. రెండో అబ్బాయి మహేశ్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆటోనడుపుతూ కుటుంబానికి తన వంతు సహకరిస్తున్నాడు.

నా జీవితంలో స్నేహితురాలు వెంకటరత్నంని జీవితంలో మరిచిపోలేను. ఆమె వెటరన్ క్రీడాకారిణి. సికింద్రాబాదులో రాష్ట్ర స్థాయి పోటీలకి వెళుతూ నన్నూ రమ్మంది. సరదాగా ఆమెతో కలిసి వెళ్లా. అక్కడ వారితో పాటు కలిసి పరుగులు తీశా... 200, 400 మీటర్ల రిలే పరుగులో ద్వితీయస్థానం వచ్చింది. వెంకటరత్నంతో పాటు మాతోపాటు అక్కడికి వచ్చిన వారంతా నన్ను పొగడ్తలతో ముంచెత్తారు. ఆ వెంటనే సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా... అక్కడైతే ఏకంగా మూడు బంగారు పతకాలే వచ్చాయి. అస్సాం జాతీయ పోటీలకు అవకాశం వచ్చింది. అయితే నా దగ్గర ఎనిమిది వందల రూపాయలు లేక వెళ్లలేకపోయా.. కానీ నాలో పతకాలు సాధించాలనే తపన తగ్గలేదు. నెల్లూరులో జరిగిన రాష్ట్ర పోటీల్లో నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. లక్నో, ఇరోడ్, బెంగుళూరు, పాండిచ్చేరిలలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఎనిమిది బంగారు పతకాలు కైవసం చేసుకున్నా. పూనాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించా... బంగారు పతకం వచ్చింది. ఇటీవల శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నా. ప్రతి రోజు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ప్రాక్టీస్ చేస్తున్నా. పోటీల సమయంలో లక్ష్యం వైపే నా గురి ఉంటుంది. వేరే ఏ ఆలోచన రాదు. అదే నా గెలుపుకు కారణం. ఏడాది కిందట గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాంగోపాల్ చేతుల మీదుగా నా కుటుంబసభ్యుల చూస్తుండగా అవార్డును అందుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

చిన్నతనం నుంచి క్రీడలంటే తెలియని నేను... అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటానని కలలో కూడా ఊహించలేదు.

అనుక్షణం కష్టపడి నా బిడ్డలిద్దర్నీ ప్రయోజకుల్ని చేయాలన్నదే నా లక్ష్యం. ఆ లక్ష్యం నెరవేరింది. క్రీడల్లో రాణిస్తున్న తరుణంలో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పదుల సంఖ్యలో మన దేశానికి పతకాలు తెచ్చిపెట్టాలన్నదే ఇప్పుడు నా ముందున్న కొత్త లక్ష్యం. నేను బాగుండాలి.. అందరిలో గొప్పగా ఉండాలనీ ప్రతిక్షణం ప్రాకులాడిన మా నాన్న ఇప్పుడు లేరు. ఆయనే ఉంటే క్రీడాకారిణిగా ఎదిగిన నన్ను చూసి ఎంతో ఆనందపడేవారు. నాన్న బతికున్నప్పుడే క్రీడాకారిణిని అయి ఉంటే ఎంత బాగుండేదని.. ఇప్పుడనిపిస్తుంది.

గ్రామీణప్రాంతాల్లో నాలా ఎంతో మంది పేద, నిరుపేద వర్గాల వారు క్రీడల్లో అమితంగా రాణించగల సత్తా ఉన్నా.. ప్రోత్సాహం, డబ్బులేక సాధారణ వ్యక్తుల్లానే మిగిలిపోతున్నారు. నాలో క్రీడల్లో రాణించే శక్తి, పట్టుదల ఉన్నాయన్న విషయం నలభై అయిదేళ్ల వయస్సులో గాని తెలుసుకోలేకపోయాను. ప్రభుత్వం క్రీడల కోసం వెచ్చించే కోటాను కోట్ల రూపాయల్లో చాలా వరకు అక్కరకు రావడం లేదనేది నా అభిప్రాయం. సరైన రీతిలో క్రీడాకారులకి అవకాశాలు కల్పిస్తే ఒలింపిక్ లో బంగారు పతకాలు సాధించడం కష్టమేమీ కాదు.

**నేను సైతం...**

చిన్నప్పటి నుంచి కష్టాల్లో పుట్టి కష్టాల్లో పెరిగిన నాకు తోటి వారి కష్టసుఖాలు బాగా తెలుసు. చాలా మంది రేషన్‌కార్డులు, పింఛన్లు వంటి వాటి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం చూసి నా మనస్సు చలించిపోయేది. వారి వెంట వెళ్లి అర్హులైన వారిని ఎందుకు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటారంటూ అధికారులను నిలదీసేదాన్ని. వారి పనులు చేయించి పెట్టేదానిని. అలా కొన్నాళ్ల కిందట రాజకీయాల్లో అడుగుపెట్టా. బి.జె.పి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వరిస్తున్నా. నాతోటివారితో కలిసి పలుమార్లు ప్రజాపోరాటాల్లో పాలుపంచుకున్నా. అయిదవ నగర పోలీసుస్టేషన్‌లో మైత్రీ సభ్యురాలి బాధ్యత కూడా తీసుకున్నా. ఖాళీ సమయంలో పోలీసులకి సహకరిస్తుంటా. ఎవరైనా రక్తం కావాలంటే రక్తం దానం చేస్తుంటా. ఇప్పటి వరకు మూడుసార్లు రక్తం దానమిచ్చా. రక్తదానంపై మహిళల్లో అవగాహన కూడా కల్పిస్తున్నా.

చాలా మంది డబ్బులేకపోవడం వల్లే క్రీడల్లో రాణించలేకపోతున్నారు. ఇప్పుడు దేశంలో ఎక్కడకైనా వెళ్లే స్థోమత నాకుంది. కాని విదేశాలకి వెళ్లాలంటే వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అప్పుచేసి వెళ్లాల్సిందే. గ్రామీణప్రాంతాల్లో చాలామంది పిల్లలు చదువులు మధ్యలోనే మానేసి పనులకి వెళుతున్నారు. కాస్తంత డబ్బు ఖర్చుచేసి క్రీడా వస్తువులు కొనుగోలు చేసే స్థోమత చాలా మందికి ఉండదు. నాలా ఇబ్బందులు పడుతున్న పిల్లలంతా క్రీడాకారులవ్వాలని.. వారంతా పతకాలు సాధించాలని నా కోరిక. ఒలింపిక్ గేమ్స్ చూస్తుంటే చాలా బాధేస్తుంది. ఇంత మంది జనమున్న మన దేశం పతకాలు సాధించలేకపోవడం ఆవేదన కలిగిస్తుంది.

• **కంచర్ల మహేశ్ బాబు,**
ఎ.బి.ఎన్ ప్రతినిధి, నెల్లూరు.
**ఫోటోలు: సయ్యద్ జకీర్**

## బంగారం వెండి

09-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | ---- (----) | ---- (----) | ---- (----) |
| విజయవాడ | 30,150 (30,100) | 27,850 (28,800) | 53,400 (53,000) |
| ప్రొద్దుటూరు | 30,250 (30,250) | ---- (----) | 53,200 (53,200) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 30,150 (30,080) | 27,730 (27,760) | 53,600 (53,600) |
| ముంబయి | ---- (----) | ---- (----) | ---- (----) |
| చెన్నయ్ | 29,985 (29,965) | 27,040 (27,020) | 53,810 (53,720) |

• బ్రాకెట్లలో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు

# విధి విలాసం కాకపోతే...

మనసున మనసై



కొందరిని మనవాళ్లనుకుంటాం. ఇంకొందరిని పరాయివాళ్ల జాబితాలో చేరుస్తాం. దీనికి తర్కముండదు. కాని ఒక్కొక్కసారి ఆ పరాయివాళ్లే మనకు ప్రాణదాతలవుతారు. ఒకప్పుడు నాకు నా రెండో కూతురంటే విపరీతమైన ద్వేషం. ఇప్పుడు కృతజ్ఞత.

ఇది దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి సంగతి. మాకు కొత్తగా పెళ్లైంది. పిల్లలు వద్దనుకుంటుండగానే ఒక కూతురు పుట్టింది. అప్పటికి నాది చిన్న ఉద్యోగం. చాలీ చాలని సంపాదన. రెండో బిడ్డ పుడితే ఆర్థికంగా తట్టుకోలేని పరిస్థితి. అందుకే వద్దనుకున్నాం. కాని నా భార్య గర్భవతి అయింది. సంపాదన అరకొరగా ఉంది. ఒక పిల్లను పెద్ద చేయటమే కష్టమనుకుంటున్న సమయంలో రెండో పిల్ల పుడితే?– ఈ ఆలోచనే భయంకరంగా ఉండేది. అందుకే అబార్షన్‌కు మా ఆవిడను ఒప్పించా. అప్పట్లో వైద్య రంగం ఇంత అభివృద్ధి చెందలేదు. మాత్రలు వేసుకుంటే అబార్షన్లు అయ్యే రోజులు కావవి. డాక్టర్లు కూడా గర్భస్రావం చేయటానికి ఒప్పుకొనేవారు కాదు. అతి కష్టం మీద ఒక డాక్టర్‌ను ఒప్పించి ఆసుపత్రిలో చేర్చా. ఆ డాక్టర్ అబార్షన్ చేయటానికి ప్రయత్నించింది. కాని ఆ ప్రయత్నం విఫలమయింది. ఇంకోసారి ప్రయత్నిస్తే ప్రాణానికే ముప్పు అని డాక్టర్ హెచ్చరించింది.

రెండో సారి కూడా ఆడపిల్లే పుట్టింది. దాన్ని చూస్తే ఎందుకో తెలియని కోపం వచ్చేది. నా కష్టాలన్నీ దాని వల్లే వచ్చాయనుకొనేవాడిని. చాలా సార్లు కోపం– కాలంతో పాటు కరిగిపోతుందంటారు. కాని మా చిన్న పిల్ల మీద ఎందుకో గాని తెలియని ద్వేషం పేరుకుపోయింది. చిన్న పిల్ల పుట్టిన కొద్ది రోజులకు ఉద్యోగం మానేసి కాంట్రాక్టులు చేయటం మొదలుపెట్టా. ఆర్థికంగా నిలదొక్కుకున్నా. అయినా ఎందుకో నా మనసులో రెండో పిల్ల అంటే ఉన్న ద్వేషభావం పోలేదు. కాని ఈ విషయాన్ని మా ఆవిడ గ్రహించింది.

పిల్లలు పెద్దవాళ్లయ్యారు. పెద్ద పిల్లకు బాగా డబ్బున్న బిజినెస్‌మ్యాన్‌కు ఇచ్చి పెళ్లి చేసా. నిజం చెబితే పాపం ప్రక్షాళన అవుతుందంటారు– చిన్న పిల్ల చదువు గురించి గాని దానికి ఒక మంచి సంబంధం తెచ్చి పెళ్లి చేయాలని గాని నేను ఎప్పుడూ అనుకోలేదు. అదే బాగా చదువుకుంది. ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. మా దగ్గర నుంచి దూరంగా వెళ్లిపోయింది. దాని యోగక్షేమాలు తెలుసుకోవటానికి నేను ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఇదంతా చదువుతూ– ఏ తండ్రైనా ఇంత కఠినంగా ఉంటాడా? అని మీరు అనుకోవచ్చు. ద్వేషం మన విజ్ఞతను పనిచేయనివ్వదు. నా విషయంలోను అదే జరిగింది. మేము సంబంధాలు చూడాల్సిన అవసరం లేకుండానే– అది తన కొలీగ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెద్దమ్మాయికి చేసినంత ఘనంగా దాని పెళ్లి చేయలేదు. పెళ్లి జరిగిన వారం రోజులకు నేను కళ్లు తిరిగి పడిపోయా. లివర్ పాడైపోయిందని చెప్పారు. నేను ఎక్కువ ఆల్కహాల్ తీసుకోను. ఇతర దుర అలవాట్లు కూడా ఏం లేవు. కొందరికి లివర్ పాడైపోవటానికి కారణాలు ఉండక్కరలేదేమో. అలాంటి కేసుల్లో నాది ఒకటి.

లివర్ పాడైపోయిందని.. దానిని వెంటనే ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని డాక్టర్లు చెప్పిన దగ్గర నుంచి అందరిలో ఆందోళన మొదలయింది. నాకు లివర్ ఇవ్వటానికి మా ఆవిడ ముందుకు వచ్చింది. కాని సరిపోలేదు. మా పెద్దకూతురు ముందుకు వచ్చింది. దాని లివర్ కూడా నాకు సరిపడలేదు. ఈ విషయం తెలిసేసరికి నేను మరణం అంచున ఉన్నాను. ఆశ్చర్యమేమిటంటే– ఆ సమయంలో కూడా నాకు మా చిన్న కూతురు గుర్తుకు రాలేదు. మనం ఒకటి అనుకుంటే– విధి ఒకటి తలుస్తుంది. చివరికి నా చిన్న కూతురు లివరే నాకు సరిపోయింది. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఇన్నాళ్లు నేను ద్వేషభావం ప్రదర్శించిన పిల్ల దగ్గర నుంచి లివర్ స్వీకరించి బతకాలా? లేక నా అహాన్ని చంపుకోలేక నన్నే చంపేసుకోవాలా? అసలు నాకు అదంటే ద్వేషభావం ఎందుకుండాలి? అది చేసిన తప్పేంటి? నా ద్వేషానికి మూల కారణం ఏమిటి? ఇలా రకరకాలుగా ఆలోచించటం మొదలుపెట్టా. భర్తల విషయంలో ఆడవాళ్లకు ఒక సిక్త్ సెన్స్ ఉంటుందనుకుంటా. నా ఆలోచనలను చెప్పకుండానే మా ఆవిడ కనిపెట్టింది. "మీరు ఏమనుకున్నా.. ఎలా ఆలోచించినా– అది మీ కూతురు. మీరు దాని తండ్రి. దీనినెవరూ కాదనలేరు. అటువంటప్పుడు పిచ్చి ఆలోచనలు పెట్టుకోకండి. మీరు ఆరోగ్యంగా ఉండాలనేదే మా కోరిక" అంది. నాకు కళ్లంట నీళ్లొచ్చాయి.

నా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ పూర్తయింది. చిత్రమేమిటంటే– ఆ ఆపరేషన్ జరుగుతున్నంతసేపు నేను మా రెండో పిల్ల గురించే ఆలోచిస్తున్నా. దానికి ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడుతూనే ఉన్నా. ఎంత ఎనస్థిషియా ఇచ్చినా అవే ఆలోచనలు. ఇప్పుడు నేను ఆరోగ్యంగానే ఉన్నా. మా కూతురు కూడా కోలుకుంది. మా రెండో కూతురిని చూసినప్పుడల్లా– తనని ద్వేషించి నేనెంత పాపం చేసానా అనిపిస్తుంది. దానితో చెప్పి క్షమాపణ కోరే ధైర్యమూ నాకు. నా పాపానికి నిష్కృతి లేదేమో.

సేకరణ: **సి.వి.ఎల్.ఎన్ ప్రసాద్**









11-8-2012

శనివారం

ఆంధ్రజ్యోతి

# నవ్య

కుటుంబ కదంబం

ఒంట్లో రక్తం తగ్గిందని చెప్పగానే రోజూ బీట్‌రూట్ తినమని సలహా ఇచేస్తారందరూ. ఆరోగ్యం పట్ల బాగా శ్రద్ధున్నవారు రెండు ముక్కలు తినడానికి సిద్ధమవుతారు. కాని ఎక్కువమంది దాన్ని చూడగానే మూతి మూడు వంకర్లు తిప్పుతారు. నిజానికి బీట్‌రూట్‌ను జ్యూస్, సలాడ్, వేపుడు రూపంలోనే కాకుండా బోలెడు వెరైటీలుగా వండుకుని తొనొచ్చు. పూరీలు మొదలు వడలు వరకూ రకరకాల వంటలు చేసుకోవచ్చు.

వంటిల్లు



## హల్వా

**కావలసిన పదార్థాలు:** బీట్‌రూట్ దుంపలు – రెండు, పంచదార – రెండు కప్పులు, యాలకుల పొడి – ఒక టీ స్పూను, నెయ్యి – అర కప్పు, కిస్‌మిస్‌లు – సరిపడా, జీడి పప్పులు –పది.

**తయారుచేయు విధానం:** ముందుగా పొయ్యి మీద గిన్నె పెట్టి ఒక టేబుల్ స్పూను నెయ్యి వేసి కిస్‌మిస్‌లు, జీడి పప్పు వేగించుకుని పక్కన పెట్టుకోవాలి. తర్వాత పొయ్యిమీద మందపాటి గిన్నె పెట్టి సరిపడా నెయ్యి వేసి బీట్‌రూట్ తురుము వేసి వేగించాలి. పచ్చి మొత్తం పోయేవరకూ వేగాక అందులో యాలకుల పొడి, పంచదార వేసి మరికొద్దిసేపు వేగించి దించేయాలి. ఒక పళ్లెంలో నెయ్యి రాసి అందులో వేగించిన బీట్‌రూట్ ముద్దని వేసి చేతితో సమానంగా ఒత్తి పైన కిస్‌మిస్‌లు, జీడిపప్పులు గుచ్చాలి. చల్లారిన తర్వాత మనకు నచ్చిన ఆకారంలో కట్ చేసుకోవాలి. అంతే బీట్‌రూట్ హల్వా తయారయినట్టే.

# బీట్ రూటే వేరు

## వడలు



**కావలసిన పదార్థాలు:** బీట్‌రూట్ – ఒకటి, శెనగపప్పు – రెండు కప్పులు, పచ్చిమిరపకాయలు – ఆరు, అల్లం తురుము – రెండు టీ స్పూన్లు, కొత్తిమీర – రెండు కట్టలు, కరివేపాకు – ఒక రెబ్బ, ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు, జీలకర్ర – ఒక టీ స్పూను, ఉప్పు – తగినంత, నూనె – సరిపడా.

**తయారుచేయు విధానం:** శెనగపప్పుని ముందురోజు నానబెట్టుకోవాలి. తెల్లారాక పప్పుని శుభ్రంగా కడిగి అందులో పచ్చిమిరపకాయలు వేసి కచ్చాపచ్చాగ రుబ్బుకోవాలి. ఇందులో అల్లం తురుము, కరివేపాకు, కొత్తిమీర తురుము, బీట్‌రూట్ తురుము, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, ఉప్పు వేసి బాగా కలిపి వడలుగా చేసుకుని నూనెలో వేగించుకోవాలి. రెండువైపులా వేగేలా చూసుకుని ఎరుపురంగు వచ్చాక తీసేయాలి.



## పులావ్

**కావలిసిన పదార్థాలు:** బీట్‌రూట్‌లు – రెండు, బాస్మతి బియ్యం – రెండు కప్పులు, అల్లంవెల్లుల్లి ముద్ద – రెండు టీ స్పూన్లు, పచ్చిమిరపకాయలు – ఐదు, ఎండు మిరపకాయలు – నాలుగు, కరివేపాకు – ఒక రెబ్బ, లవంగాలు – ఆరు, దాల్చిన చెక్కలు(చిన్నవి)– ఐదు, గరం మసాలా – ఒక టీ స్పూను, ఉల్లిపాయ – ఒకటి, పుదీన – నాలుగు రెమ్మలు, కొత్తిమీర – ఒక కట్ట, ఉప్పు – తగినంత, నూనె – సరిపడా.

**తయారుచేయు విధానం:** ముందుగా బియ్యాన్ని కడిగి చిల్లుల గిన్నెలో వేసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యిమీద దళసరి గిన్నె పెట్టుకుని సరిపడా నూనె పోసి బాగా కాగాక లవంగాలు, దాల్చిన చెక్క, అల్లంవెల్లుల్లి ముద్ద, కరివేపాకు, పుదీన ఆకులు వేసి వేగించాలి. తర్వాత పచ్చిమిరపకాయ ముక్కలు, ఎండు మిరపకాయలు, ఉల్లిపాయ ముక్కలు, బీట్‌రూట్ ముక్కలు కూడా వేసి బాగా వేగించాలి. ఆ తర్వాత బియ్యం, గరం మసాలా పొడి, ఉప్పు, కొత్తిమీర తురుము వేసి మరో ఐదు నిమిషాలపాటు వేగించాలి. తర్వాత మూడు కప్పుల నీళ్లు పోసి సన్నని మంటపై ఉడికించి దించేయాలి.



## పూరీలు

**కావలసిన పదార్థాలు:** బీట్‌రూట్ దుంప – ఒకటి, గోధుమ పిండి –పావుకిలో, ఉప్పు – తగినంత, నూనె – సరిపడా.

**తయారుచేయు విధారం:** ముందుగా బీట్‌రూట్‌ని శుభ్రంగా కడిగి తొక్కతీసి ముక్కలు కోసుకోవాలి. ఒక విజిల్ వచ్చేవరకూ ఉడికించి దించేయాలి. చల్లారాక వీటిని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అరగ్లాసు నీళ్లు కలిపి చిక్కంతో వడకట్టుకోవాలి. గోధుమ పిండిలో తగినంత ఉప్పు, ఒక టేబుల్ స్పూను నూనె, సరిపడా బీట్‌రూట్‌నీళ్లు పోసి కలుపుకుని పూరీలు చేసుకుని నూనెలో కాల్చుకోవాలి. కెంపు రంగులో భలేగా ఉంటాయి పూరీలు.



## పకోడా

**కావలసిన పదార్థాలు:** బీట్‌రూట్ దుంపలు – రెండు, స్వీట్‌కార్న్ – అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు, శెనగపిండి – రెండు కప్పులు, పచ్చిమిరపకాయలు – ఆరు, ధనియాల పొడి – ఒక టీ స్పూను, ఉప్పు – తగినంత, వంట సోడా – చిటికెడు, నూనె – సరిపడా.

**తయారుచేయు విధానం:** బీట్‌రూట్‌ని చిన్న చిన్న ముక్కలు గా కట్ చేసుకోవాలి. అందులో స్వీట్‌కార్న్, ఉల్లిపాయ ముక్కలు, శెనగపిండి, ధనియాల పొడి, పచ్చిమిరపకాయ ముక్కలు, సోడా, ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి పకోడీల పిండిలా కలుపుకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి కాగాక ఈ పిండితో పకోడీలు వేసుకోవాలి.

## బంగారం వెండి

10-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,220 (----) | 29,620 (29,520) | 53,600 (----) |
| విజయవాడ | 30,200 (30,150) | 27,900 (28,850) | 53,400 (53,400) |
| ప్రొద్దుటూరు | 30,250 (30,250) | 27,800 (27,800) | 53,200 (53,200) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 30,170 (30,800) | 27,800 (27,800) | 53,200 (53,200) |
| ముంబయి | ---- (----) | ---- (----) | ---- (----) |
| చెన్నయ్ | 29,975 (30,065) | 27,030 (27,110) | 53,500 (53,690) |

• బ్రాకెట్లలో ఇవ్వనవి ఓపెనింగ్ ధరలు










ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
13-8-2012 ● సోమవారం

# పక్షులకో ఆన్‌లైన్ గూడు



ఈ లోకంపై మానవుడొక్కడే మనుగడ సాగిస్తానంటే కొన్ని గంటల్లోనే అతనికి పరమ బోర్ కొట్టేయొచ్చు. ప్రకృతిలో మానవునితోపాటు ఇతర జీవరాశులు ఉంటేనే జీవితం పరిపూర్ణంగా ఉంటుంది. ముఖ్యంగా మనిషికి దగ్గరగా ఉండే జంతువుల, పక్షుల సహచర్యం అతనికెంతో అవసరం. దానివలన అధికంగా లాభపడేది కూడా మానవుడే. అయినప్పటికీ మనిషి తన చుట్టూ మెసలే జీవరాశుల పట్ల పెద్దగా శ్రద్ధ చూపడు. దీనిని గమనించిన ముంబైకు చెందిన ఎన్‌ఆర్‌ఎస్(నేచర్ ఫరెవర్ సొసైటీ) అనే సంస్థ మానవ సమాజం కోసం ఒక వినూత్న కార్యక్రమం చేపట్టింది. మన చుట్టూ ఉండే పక్షులను కాపాడుకోలేకపోయినా కనీసం వాటి వివరాలైనా సేకరించిపెట్టడానికి ఒక ఆన్‌లైన్ గూడును ఏర్పరచింది.

ప్రతీ సంవత్సరం చేపట్టే పక్షుల గణంకాల ప్రకారం ...ఒక ఏడాది కాలంలోనే పదుల సంఖ్యలో పక్షి జాతులు అంతరించిపోతున్నాయి. మానవుని ఆధునిక జీవనశైలి, పెరిగిన సాంకేతికత వలన కొన్ని పక్షులు లుప్త దశకు చేరుకుంటున్నాయి. అయితే మానవునితో స్నేహంగా మసలే కొన్ని రకాల పావురాలకు కూడా ఇదే గతి పడుతుండటంతో ఎన్‌ఆర్‌ఎస్ సంస్థ ఆందోళన చెంది ఒక కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా మానవుని చుట్టూ మసలుతున్న పక్షుల వివరాలను ఒక చోట చేర్చే కార్యక్రమం మొదలుపెట్టింది. దీంట్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చు. మన చుట్టూ కనిపిస్తున్న పక్షుల వివరాలను వాటిలో పొందుపరచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

ఎన్‌ఆర్‌ఎస్ సంస్థ తన వెబ్‌సైట్‌లో పక్షుల కోసం ఒక ప్రత్యేకమైన విభాగాన్ని కేటాయించింది. అందులోకి లాగిన్ అయి దాంట్లోని సమాచారాన్ని సేకరించవచ్చు. అదే విధంగా తమకు తెలిసిన పక్షుల సమాచారాన్ని పొందుపరచవచ్చు. అయితే ఆ పక్షులు కచ్చితంగా ఆ వ్యక్తి పరిసర ప్రాంతాలకు చెంది ఉండాలి. అంతేకాని వేరే దేశానికో, రాష్ట్రానికో సంబంధించినవి కాకూడదు. మన దగ్గరకు వచ్చే వలస పక్షుల వివరాలను కూడా అందులో పెట్టవచ్చు. వాటి ఫోటోలను కూడా అప్‌డేట్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు ఇందులో. ప్రతీ సంవత్సరం వచ్చే పక్షులు ఆ ఏడాది రాకపోయినా ఆ వివరాలను కూడా ఎన్‌ఆర్‌ఎస్‌కు అందజేయవచ్చు.

ఎన్‌ఆర్‌ఎస్ ఆరంభించిన ఈ కార్యక్రమానికి కొద్ది కాలంలోనే మంచి స్పందన లభించింది. ఇప్పటివరకు 18 జాతులకు చెందిన వేలాది పక్షుల వివరాలు ఎన్‌ఆర్‌ఎస్‌కు అందాయి. వీటిలో కాకుల నుంచి పిచ్చుకల వరకు మానవ మిత్రులుగా ఉండే పక్షులన్నీ ఉన్నాయి. దీని వలన కొత్త సంగతులు వెలుగులోకి వచ్చాయని ఎన్‌ఆర్‌ఎస్ సంస్థ ప్రతినిధులు అంటున్నారు.

ఒకే జాతిలో వేలాది పక్షులు ఉన్నాయనీ, వాటిలో కొన్ని ఒక ప్రాంతంలో లుప్త దశకు చేరుకున్నా మరొక ప్రాంతంలో అవి విస్తృతి చెందడం వంటివి తెలుస్తున్నాయట. అంతేకాదు పక్షులను వేటాడే వాళ్ల వివరాలు కూడా ఎన్‌ఆర్‌ఎస్‌కు అందుతున్నాయి. అలా చేరుతున్న సమాచారంతో అక్రమ వేటపై చట్ట బద్ధ పోరాటం చేయడానికి ఎన్‌ఆర్‌ఎస్ సిద్ధపడుతోంది.



లోపలి పేజీలో...
కలిసి సాగితేనే కమనీయ రాగం
చక్రి 'అనుభవం'






చంద్రకాంత కోర్ట్నీ టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో ఉంటారు. భర్త డేవిడ్ కోర్ట్నీతో కలిసి హిందుస్తానీ సంగీత కచేరీలు చేస్తుంటారు. ఆవిడ పాడితే ఆయన తబలా వాయిస్తారు. ఇంకా.. భారతీయ సంగీతంపై వర్క్‌షాపులు, లెక్చర్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వాళ్ల పేరు మీదే ఒక సంగీత పాఠశాల కూడా నడుపుతున్నారు. బందరు నుంచి హ్యూస్టన్ వెళ్లి దేశ విదేశాల్లో గాయనిగా ఎంతో పేరు తెచ్చుకున్న మన తెలుగింటి ఆడపడుచు చంద్రకాంతే నేటి 'మన పరదేశీ'

మన పరదేశీ



భర్త డేవిడ్‌తో చంద్రకాంత

# హ్యూస్టన్‌లో సరిగమల 'చంద్రకాంతు'లు

"టెక్సాస్‌లో మా జీవితం చాలా సింపుల్‌గా ఉంటుంది. మా ఇంట్లో ఖరీదైన ఫర్నిచరుండదు. కింద కూర్చునే సంగీత పాఠాలు చెపుతాం. ఆరేళ్ల నుండి అరవయ్యేళ్ల దాకా ఎవరికైనా వాళ్ల వాళ్ల ఆసక్తులను బట్టి సంగీతాన్ని నేర్పుతాం" తనను తాను పరిచయం చేసుకుంటూ చంద్రకాంత కోర్ట్నీ చెప్పిన మొదటి మాటలివి.

చంద్రకాంత అచ్చ తెలుగు పేరు కదా. మరి కోర్ట్నీ ఏమిటి? ఆ ప్రశ్న వినగానే ఆమె మొహం చిరునవ్వుతో విప్పారింది. "అదో పెద్ద కథ. కాని మూడు ముక్కల్లో ముగిస్తాలెండి" అంటూ ఇలా చెప్పారు. 'డేవిడ్ కోర్ట్నీకి వింజమూరి సీతగారు తెలుసు. ఆయన ఇండియా వచ్చి తబలా నేర్చుకుంటున్న రోజుల్లో తనకు ఎవరైనా ఇండియన్ అమ్మాయిని చూస్తే పెళ్లి చేసుకుంటానని ఆమెతో చెప్పారట. సీతగారు డేవిడ్‌ను మా ఇంటికి తీసుకొచ్చారు. ఫలానా పని మీద వస్తున్నట్టు మాకేం చెప్పలేదు. మా ఇంట్లో తబలా కనబడగానే ఆయన బాసింపట్టు వేసుకుని కూర్చుని వాయించడం మొదలుపెట్టారు. అందరం ఆశ్చర్యపోయాం. తిరిగి వెళ్లిపోయేటపుడు వింజమూరి సీతగారు మా అమ్మ దగ్గరికి వచ్చి డేవిడ్‌కు నేను నచ్చానని చెప్పారు. ఎవరూ ఊహించని సంఘటన ఇది. మా నాన్న, అన్నయ్య కూడా ఓకె అన్నారు. కాని నేనే మొదట తటపటాయించాను. గాయనిగా నా కెరీర్ అప్పుడప్పుడే మొదలైంది. ఇప్పుడు పెళ్లి చేసుకుని అమెరికా వెళితే ఎలా అనుకున్నాను. వద్దని కూడా చెప్పేశాను. ఇంతలో నేను పాటలు పాడే కూచిపూడి డాన్సర్, నా ఫ్రెండ్ ఉమా భారతి వచ్చి తనకు పెళ్లి కుదిరిందని, కాబోయే భర్త టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో ఉంటాడని చెప్పింది. దాంతో మా అమ్మ స్నేహితులిద్దరూ ఒక చోటే ఉండొచ్చు ఒప్పుకోమంటూ బతిమిలాడింది. అలా 1978లో నాకూ, డేవిడ్‌కు పెళ్లయి నేను చంద్రకాంత కోర్ట్నీగా మారాను'



కుటుంబ సభ్యులతో...

## సంగీత కుటుంబం...

క్రిస్టియన్ కుటుంబం అయినప్పటికీ చంద్రకాంత తండ్రి శామ్యూల్ సుందరానికి భారతీయ సంప్రదాయమంటే చాలా గౌరవం. కళలంటే ప్రాణం. హిందుస్తానీ సంగీతం పాడేవారు. తల్లి దైవ కృపావరం కూడా గాయనే. వీణ వాయించేవారు. వాళ్లింట్లో హార్మోనియం, ఫ్లూట్, తబల, వీణ ఉండేది. పిల్లలందరికీ ఆ వాయిద్యాలు వాయించడం వచ్చు. ఆ వాతావరణంలో పెరగడం వల్ల కాబోలు "పాట నోట్లో ఉంటే ఎండలో కాళ్లు కాలుతున్నా... ఆ సంగతే తెలిసేది కాదు. హరిదాసుల పాట వినిపిస్తే ఆ రాగంలో సొంతంగా పదాలు పెట్టి పాడుకునేదాన్ని. అలా ఏది విన్నా చిన్నప్పట్నించీ వాటిని మళ్లీ మళ్లీ పాడుకుంటూ ఉండేదాన్ని. నేనిలా పాడడాన్ని మా నాన్నగారు గుర్తించారు. దాంతో ఆయనకి నన్ను గాయనిగా చూడాలనే ఆలోచన వచ్చింది. ఆయన ప్రోత్సాహం, ఆశీర్వాదబలాలే నన్ను గాయనిగా నిలిపాయి" అని చెప్పారు చంద్రకాంత.

విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో చంద్రకాంత పిల్లల కార్యక్రమాలలో పాడి బాగా పేరు తెచ్చుకున్నారు. "రేడియో అన్నయ్య, అక్కయ్య నన్ను బాగా ప్రోత్సహించారు. నా ఉచ్చారణ బాగోలేకపోతే సరిచేసేవారు. వాళ్ల సలహాలతో సాధనచేసి శ్లోకాలు పాడడం నేర్చుకున్నాను. వాళ్లకి నేనెప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటాను" అని ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారామె.

ఛాయాదేవితో కలిసి ఆమె పాడిన పాటతోనే హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ప్రారంభమైందట. ఇప్పుడు ప్రభుత్వ సంగీత కళాశాలగా పిలవబడుతున్న ఘంటసాల కాలేజీలో సంగీతం నేర్చుకుని ఎన్నో ప్రోగ్రాంలు ఇచ్చారామె. ఒక ట్రూప్‌తో కలిసి 1976లో ప్రపంచ పర్యటన కూడా చేశారు. "ఆ పర్యటన నా జీవితంలో ఒక మధురమైన అనుభవం. ఆఫ్రికాకి వెళ్లిన మొదటి కల్చరల్ ట్రూప్ మాదే. మేము జోహానస్‌బర్గ్‌లో దిగి మరో ఫ్లయిట్ పట్టుకుని డర్బన్ వెళ్లాం. అప్పుడు ఎయిర్‌పోర్టులో జెండాలతో, పెద్ద పెద్ద పూల బొకేలతో చీరలు కట్టుకున్న ఆడవాళ్లు ఘనస్వాగతం పలికారు. మైకుల్లో మమ్మల్ని పేరుపేరునా పరిచయం చేశారు. మాతో పాటు నేరెళ్ల వేణుమాధవ్, వేదాంతం జగన్నాథశర్మ, కూచిపూడి నృత్యకారిణి ఉమా భారతి వంటి పెద్ద పెద్ద ఆర్టిస్టులు వచ్చారు. రేడియో, టీవీ వాళ్లు ఇంటర్వ్యూలు తీసుకున్నారు. ఫోటోలు, వీడియోలు తీసి ప్రతిరోజు వార్తాపత్రికల్లో వేసేవాళ్లు. మేము ఎక్కడికి వెళ్లాం, ఏం చేస్తున్నాం, ఎటువంటి బట్టలు కట్టుకున్నాం, ఏం తిన్నాం, ఏయే ప్రదేశాలు తిరిగాం వంటివన్నీ పెద్ద పెద్ద సెలబ్రిటీలకు రాసినట్టు రాసేవారు. నా పాట విన్న డర్బన్ మేయర్, ఆయన భార్య నన్ను కలుసుకోవడానికి స్వయంగా రావడం ఆశ్చర్యం కలిగించింది. దక్షిణాఫ్రికా తరువాత మలేషియా, సింగపూర్, మారిషస్‌లకు కూడా వెళ్లాం" అని చెప్పారామె.

పెళ్లి చేసుకుని అమెరికాకి వచ్చినా ఆరునెలలు ఇండియాలో, ఆరునెలలు అమెరికాలో ఉండేవారట మొదట్లో. దూరదర్శన్‌లో లలిత గీతాలు, 'మన మహాత్ముడు' సినిమాలో కొన్ని పాటలు, ఒక సినిమాకు సంగీత దర్శకత్వం కూడా చేశారు.

అమెరికాలో శ్రీశ్రీ గీతాలు పాడి ఎందరినో మెప్పించారు. వాటిని 'కవితా ఓ కవితా' అనే సి.డి.గా విడుదల చేశారు కూడా. శ్రీశ్రీ పాటలు పాడాలనే ఆలోచన గురించి చెప్తూ "నేను హ్యూస్టన్‌కి వచ్చాక మా ఇంటి దగ్గర ఉండే దువ్వూరి నారాయణరావు గారితో పరిచయం అయ్యింది. ఆయన నన్ను కూతురిలా చూసుకునేవారు. ప్రతి ఏడాది ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి నాతో పాడించేవారు. వారింటికి ఒకసారి శ్రీశ్రీ వచ్చారు. ఆయనతో కూర్చొని మాట్లాడడం, కలిసి భోజనం చేయడం నా అదృష్టం. ఆయన తన కవితలు చదువుతుంటే, నేను పాటలు పాడుతూ ఆయన అక్కడ ఉన్నన్ని రోజులూ సరదాగా గడిపేశాం. శ్రీశ్రీ మరణం తరువాత కూడా నారాయణరావు గారు ఒక కార్యక్రమం నిర్వహించారు. అందులోనూ పాడాను. శ్రీశ్రీ కవితలు ఇష్టపడని వారు ఎవరుంటారు చెప్పండి. అలాగే నాక్కూడా ఆయన కవితలంటే విపరీతమైన అభిమానం" అని చెప్పారు చంద్రకాంత.

భారతీయ సంగీతానికే పరిమితం కాకుండా 'వాణి' అనే బ్యాండ్‌లో గాయనిగా ఉన్నారు. ఈ బ్యాండ్ 'రాగా రాక్' అనే ఫ్యూజన్ మ్యూజిక్‌లో స్పెషలైజ్ చేస్తుంది. ఈ మధ్య వీళ్లు చేసిన ప్రాజెక్టు 'ది రిథమ్ ఆఫ్ రాగా రాక్'. ఇదేకాక 2005లో 'డ్యాన్సింగ్ ఇన్ ట్విలైట్' అనే సినిమాలో కూడా పాడారు కూడా. ఇండియన్ కల్చరల్ సెంటర్ ఆఫ్ హ్యూస్టన్ వాళ్లు 'కల్చరల్ జ్యుయల్ ఆఫ్ ఇండియా(భారతీయ సాంస్కృతిక మణి) అనే అవార్డు ఇచ్చి సత్కరించారు.

" సంగీతం ఓ సముద్రం లాంటిది. కొద్దిగా నేర్చుకుని పూర్తిగా వచ్చేసింది అనుకోకూడదు. నేను నేర్చుకోవలసింది ఇంకా ఎంతో ఉంది. చెవులకి ఇంపుగా, మధురంగా ఉండే ఏ సంగీతమైనా నాకిష్టమే. మతాలు, గొడవలు వదిలేసి సంగీతాన్నే ఒక మతంలా స్వీకరించి అందరూ గొంతు కలిపి పాడితే ప్రపంచం వసుధైక కుటుంబంలా ఒక్కటయిపోదా అనిపిస్తుంది. సంగీతమే ప్రజలందరినీ కలుపుతుందని నేను నమ్ముతున్నాను. ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నాను. డేవిడ్, నేను సంగీత భాషే మాట్లాడతాం. ఆయనకి మ్యూజిక్ వీడియోలు తీయడం అంటే చాలా ఇష్టం. మేము చేసిన 'గాయత్రీ మంత్ర'ని 2011లో రెమి వరల్డ్ ఫెస్టివల్‌కి పంపితే కాంస్య పతకం వచ్చింది. ఈ ఏడాది అదే ఫెస్టివల్‌లో 'జయజయవంతి తరానా'కి బంగారు పతకం వచ్చింది. అక్కడికెళ్లి చూసేవరకు ఆ ఉత్సవాల్లో ఎన్ని దేశాల వాళ్లు పాల్గొంటారు? ఎన్ని రకాల వీడియోలు వస్తాయి? అనే వివరాలేవీ మాకు తెలియదు. అందరు టాలెంట్ ఉన్న వాళ్ల మధ్య మాకు బంగారు పతకం రావడం గర్వంగా అనిపించింది" అని ముగించారామె.

మాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి శ్యామ్‌సుందర్, అమ్మాయి వీణాకృప. ఇద్దరికీ సంగీతం నేర్పించేందుకు ప్రయత్నించాం. చిన్నప్పుడు నేర్చుకున్నారు కాని పెద్దయ్యాక ఆసక్తి తగ్గిపోయింది. అయినప్పటికీ ఇద్దరూ ఏదో ఒక వాయిద్యం వాయిస్తారు, కాస్త పాడతారు కూడా.

● కనకదుర్గ (అమెరికా నుంచి)
durga.dingari@gmail.com















మనసు మర్మం తెలుసుకోవటం అంత సులభం కాదు. మనసుకు గాయమైతే అది మానిపోయిందా? లేదా? అని గ్రహించటం చాలా కష్టం. మనసుకు అయిన గాయం ఎప్పుడో ఒకసారి మళ్లీ తిరగబెడుతుంది. ముందుగా ప్రమాదాన్ని గ్రహించి వైద్య సాయం తీసుకోకపోతే జీవితమే కుప్పకూలిపోతుంది. కొత్తగా పెళ్లయిన ఓ యువతి జీవితంలో అదే జరిగింది. ఎప్పుడో మనసుకు తగిలిన గాయం చాలా కాలం తరువాత పెనుతుపాను రేపింది. అలా ఎందుకు జరిగింది? ఆ గాయం మాని, ఆమె జీవితం కుదుట పడిందా? లేదా?

# ఆమెకు ఆ పెళ్లి ఇష్టం లేదా?

ప్రణీత వయసు 28. ఆరు మాసాల క్రితమే ఎంసిఏ పూర్తి చేసింది. జాబ్ గురించిన ప్రయత్నాలు అలా మొదలయ్యాయో లేదో పెళ్లి ప్రయత్నాలు కూడా అప్పుడే మొదలయ్యాయి. వెంటనే ఆ ప్రయత్నాలు ఫలించి, పెళ్లి కూడా అయిపోయింది. ఎందుకోగానీ, పెళ్లి ఘడియల్లో సహజంగా ఉండే ఆనందమేదీ ఆమెలో కనిపించలేదు. పైగా ఏదో ముభావంగా ఉన్నట్లే అనిపించింది. పెళ్లి కొడుక్కి కూడా కొంత మేరకు అలాంటి ఫీలింగే కలిగింది. అంతా కొత్తవాళ్లే ఎక్కువగా ఉండడం వల్ల పెళ్లి సమయాల్లో ఈ కాస్త బెరుకుతనం సహజమే అనుకున్నారు. కాకపోతే ఆ ముభావ ధోరణి ఆమెలో ఇంకా అలా కొనసాగుతూనే ఉంది. కొత్తగా పెళ్లయిన వారిలో ఉండే ఆ ఆనందాతిశయం గానీ, ఉత్సాహం గానీ ఆమెలో పెద్దగా కనిపించడంలేదు. హనీమూన్‌కు వెళ్లిరావడమూ అయ్యింది. శృంగారపరమైన విషయాల్లోనూ సఖ్యంగా, సానుకూలంగానే ఉంది. కానీ, సహజంగా ఉండవలసిన ఆ ఉత్సాహం గానీ, ఉల్లాసం గానీ ఆమెలో కనిపించడం లేదు. పైగా తాను తన గదిలో, ఒంటరిగా ఉన్నప్పుడు ఏవో బాధాకరమైన ఏవో ఆలోచనల్లో కొట్టుకుపోతున్నట్లు ఉంటుంది. ఒక్కోసారి పక్కనే ఉండికూడా , రెండు మూడు సార్లు పిలిచినా పలక్కుండా ఉండిపోతుంది. ఏమిటి అలా ఉన్నావు? అంటే ఏమీ లేదు, ఏమీ లేదు అంటూ సైలెంట్ అయిపోతుంది. కాకపోతే ఇవేవీ ఒక పెద్ద సమస్యగా ఏమీ కనిపించ లేదు.అందుకే వారంతా కొంత కాలం దాకా పట్టీపట్టనట్లుగానే ఉండిపోయారు.

## కన్నీళ్ల వెనుక కథేంటి?

భర్త, తాను ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన వేళల్లో, ఆమె కన్నీళ్లు కార్చడం ఒకటి రెండు సార్లు గమనించాడు. ఆశ్చర్యపోయి ఏమిటీ, ఏమయ్యింది అంటూ ఎంత సేపు అడిగినా, ఏమీ లేదని చెబుతూ ఉండిపోయింది. ఆమె పుట్టింట్లో ఏమైనా సమస్యలు ఉన్నాయేమోనని ఆరాతీస్తే అలాంటిదేమీ లేదు. ఏమైనా, రోజులు అలా గడిచిపోతుంటే, మెల్లమెల్లగా భర్తలోనూ, ఇతర కుటుంబ సభ్యుల్లోనూ ఆమె వ్యక్తిత్వం గురించిన కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా పెళ్లికి ముందు ఆమె ఎవరినైనా ప్రేమించిందేమో! పెద్దల బలవంతం మీద, ఈ పెళ్లికి ఒప్పుకుందేమోననే అనుమానం వారిలో మొదలయింది. అందుకే, పెళ్లికి ముందు ఆమె నడవడి గురించి ఆరా తీసే ప్రయత్నాల్లో పడ్డారు. కానీ, ప్రతికూలంగా ఎక్కడా, ఎవరూ ఏమీ చెప్పలేదు. అయినా, అమ్మాయి కచ్చితంగా ఈ పెళ్లికి ఏదో బలవంతం మీదే ఒప్పుకుందనే ఒక అభిప్రాయం వారిలో బలపడుతూ వచ్చింది. అందుకే ఆమె మనసుకు కష్టం కలిగే మాటలేవో కొన్ని మాటలు తరుచూ వారి నోట వస్తున్నాయి.

## పెళ్లికి ముందు ఏమైందంటే?

ఓ మూడు మాసాలు గడిచిన తరువాత పెద్దమనుషుల సమక్షంలో ఇదేదో తేల్చేయాల్సిందేనన్న అభిప్రాయానికి కూడా వచ్చారు. ఆ మేరకే అమ్మాయి తరపు కొంత మందిని పిలిచి, విషయమంతా చెప్పారు.. అత్తగారు వాళ్లంతా, అంత మందిలో అమ్మాయిని నిలదీయడం మొదలెట్టారు. చివరికి ఆ ప్రశ్నలు తట్టుకోలేక బావురుమని ఏడ్చేసింది. చివరికి అమ్మాయి తండ్రి కలగచేసుకుని, ''ఇంతకాలం ఒక విషయాన్ని మీకు చెప్పకుండా దాచి ఉంచినందుకు క్షమించమని ముందుగా మిమ్మల్ని కోరుతున్నాను. ఆ దాచి ఉంచిన విషయం ఏమిటో ఇప్పుడు మీకు చెబుతాను.'' అన్నాడు. ''ఓ ఆరేళ్ల క్రితం ఎంసెట్ రాలేదన్న కారణంగా కొద్ది రోజులు డిప్రెషన్‌లో ఉండిపోయింది. తెలిసిన వారి సలహా మేరకు సైకియాట్రిస్టును సంప్రదించాము. ఆయన రాసిన మందుల్ని ఆరు మాసాల పాటు వాడటంతో పూర్తిగా తగ్గిపోయింది. ఆ తరువాత డిగ్రీ చేసినప్పుడు గానీ, పిజి చేస్తున్నప్పుడు గానీ, ఏ సమస్యా లేదు. అయితే, సరిగ్గా పెళ్లికి ఓ 15 రోజుల ముందు మళ్లీ ఏదో ముభావంగా ఉండడం కనిపించింది. జాబ్‌లో సెటిల్ అయ్యాకే పెళ్లి చేసుకుంటానని చెప్పిన ఆమె మాటను మేము పట్టించుకోకపోవడమే అందుకు కారణమేమో అనుకున్నాం. ఒకదశలో మనసులో ఏదో ఒక మూలన మళ్లీ ఆ డిప్రెషన్ సమస్య మొదలయ్యిందేమో అన్న అనుమానమైతే వచ్చింది. కానీ, పెళ్లికి సంబంధించి అన్ని ఏర్పాట్లు అయిపోయాక అప్పుడు ఆ ప్రస్థావన తేవడానికి మాకు నోరు రాలేదు. ఒకవేళ నిజంగానే మళ్లీ ఆ డిప్రెషన్ సమస్యే వచ్చినా, కొద్ది రోజులు మందులు వాడితే, అది పూర్తిగా తగ్గిపోతుందన్న ధైర్యం కూడా మీకు చెప్పకపోవడానికి కారణం కావచ్చు.'' అంటూ ముగించాడు. అదే సమయంలో ఆరేళ్ల క్రితం వాడిన మందుల తాలూకు ప్రిస్క్రిప్షన్ పేపర్స్ కూడా వారి ముందు ఉంచాడు. ఇదంతా విని, అబ్బాయి వారి కుంటుంబ సభ్యులు తాత్కాలికంగా కొంత నిస్పృహకు గురైనా, ''ఆ విషయాన్ని ఇప్పటికైనా చెప్పారు. సంతోషం.'' అన్నారు. ఆ వెంటనే సైకియాట్రిస్టును సంప్రదించడం బెటర్ అంటూ ఆ వైపు అడుగులు వేశారు. సైకియాట్రిస్టు ఇచ్చిన మందులు వాడటం మొదలైన నెల రోజులకే ఆమెలో చాలా మార్పు కనిపించింది. రెండు నెలల్లో పూర్తిగా నార్మల్ అయిపోయింది.

## కారణమేదైనా.. చికిత్స ఉంది

డా.ఎం.ఎస్. రెడ్డి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్
ఆశా హాస్పిటల్, హైదరాబాద్



గతంలో కూడా ఒకసారి డిప్రెషన్ వచ్చినందువల్ల దీన్ని రికరెంట్ డిప్రెషన్ అంటాం.అనుకున్న దానికి ఏదైనా విరుద్ధంగా జరిగినప్పుడో, ఊహించని రీతిలో ఎవరైనా మన మనసును గాయం చేసినప్పుడో ఏర్పడే మానసిక స్థితిని కూడా డిప్రెషనే అంటాం. అయితే ఇది మానసికమైన ఒక దశ మాత్రమే. అంతే తప్ప అది వ్యాధి మాత్ర కాదు. అయితే కొందరిలో ఈ డిప్రెషన్ ఒక వ్యాధి రూపంలో వస్తుంది. ఇది మెదడులోని కొన్ని రసాయనాల మార్పుల వల్ల వచ్చే డిప్రెషన్. అన్నిసార్లూ దీనికి ఒక కారణం ఉంటుందని చెప్పలేం. ఏ కారణమూ లేకుండానే రావచ్చు. కాకపోతే ఈ సమస్య రావడానికి జన్యుపరమైన కారణాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఇకపోతే వరుస పరంపరగా కళ్లముందు జరిగే లేదా మనసులో మెదిలే కొన్ని ప్రతికూల విషయాలు కూడా ఇందుకు కారణం కావచ్చు. అవి కారణం కాకపోనూ వచ్చు. అయినా, కారణం ఏదైనా, వైద్య చికిత్సలతో ఈ వ్యాధి పూర్తిగా నయమైపోతుందనేది వాస్తవం. అయితే, ఒకసారి డిప్రెషన్ వచ్చి తగ్గిపోయాక, మళ్లీ వస్తుందా? అన్న ప్రశ్న మనసులో మెదలడం సహజం. నిజానికి, డిప్రెషన్ గురైన వారిలో 30 శాతం మందికి మొత్తం జీవితకాలంలో మళ్లీ ఎప్పుడూ రాకపోవచ్చు. మరో 30 శాతం మందికి జీవిత కాలంలో రెండు, మూడు సార్లు రావచ్చు. మరో 30 శాతం మందికి రెండేళ్లకో, మూడేళ్లకో ఒకసారి రావచ్చు. ఒక వేళ మళ్లీ వచ్చినా అందులో ఆందోళన పడాల్సిన అవసరమేమీ లేదు. ఎందువల్ల అంటే ట్రీట్‌మెంట్ ద్వారా ఈ రికరెంట్ డిప్రెషన్ పూర్తిగా నయమైపోతుంది. ఆ వ్యక్తి పూర్తిగా నార్మల్ అయిపోతారు.

# ఆనంద సముద్రం

చింతన

మనిషి ఆనందాన్నే ఎందుకు కోరుకుంటాడు? అది అతని స్వభావం కనుక. సుఖసంతోషాలకై అనుక్షణం ఎందుకు అర్రులు చాచుతుంటాడు? ఆ రెండూ శాశ్వతం కావని తెలియక. నిజానికి మానవుడి సుఖ, సంతోష, ఆనందాలు వ్యక్తిగతం మాత్రమే కావు. వ్యక్తి నుంచీ సమాజానికి, సమాజం నుంచీ సర్వ ప్రపంచానికీ సంబంధించిన విషయాలవి. ఒక వ్యక్తి సమాజం కాలేడు. ఒక ఇల్లు గ్రామం కాలేదు. ఒక వృక్షం వనం కాదు. ఒకడి ఆనందం అందరి ఆనందం కాదు. అందరి, అంతటి ఆనందం ఒకరికి ఆనందమై నిలుస్తుంది. సమగ్రత, సమన్వయం, సమత... యివన్నీ ఆనందంవైపు నడిపిస్తాయి. జాగ్రత్తగా గమనిస్తే మనిషి తన కోసమే జీవిస్తాడు. అందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటాడు. ఇది ఆదర్శం. ఆచరణలో మనిషి వెనుకబడి పోతాడు. కారణం స్వార్థం, సంకుచితత్వం. నేను నిన్ను ప్రేమిస్తున్నా అనటం వెనుక తన ఆనందమే ఉన్నది కనుక. అది ఆదర్శం కాదు.

## ఇంతకీ సుఖమంటే?

ఏదైనా ఒక వస్తువు ఒక అనుకూలాన్ని కలిగిస్తే అది సుఖం. అటువంటి సుఖం, వస్తువుతో ముడిపడి ఉంది. వస్తువు తన నుంచీ దూరమైనా, తాను వస్తువు నుంచి దూరమైనా సుఖము దూరమవుతుంది. అంటే దుఃఖం కలుగుతుంది. అంటే పోతున్న సుఖానికి, వస్తున్న దుఃఖానికి కారణం వస్తువే అవుతున్నది. కనుక సుఖదుఃఖాలు రెండూ స్థితులే. మారుతూ ఉంటాయి కనుక అశాశ్వతాలు. చలచ్చలితాలు. ఆ కారణంగా సుఖమూ ఒక ఎండమావే! దాని మూలం, దుఃఖం పోవటంతో ఉన్నది. కనుక, నిరంతరమూ మారుతుండే ఈ రెండు స్థితులు అనుభవాన్నే మిగుల్చుతాయి. ఒక వస్తువు నాకే చెందాలన్న అహంకారం, నాదే కావాలన్న మమకారం. ఆ వస్తువును పొందటంతో అహం శాంతించి , మమకారం అతిశయించినపుడు కలిగిన యింద్రియపరమైన తృప్తే సంతోషం. దీనికి శాశ్వతత్వం లేదు. సంతోషం మనోమూలకమై క్షణికమై ఉంటుంది.



## సుఖం దేహపరం, సంతోషం మనోపరం!

ఈ రెండింటినీ ఒకటే అనుకుని, అవే శాశ్వతమని భావించి, మనిషి ఎన్నోసార్లు మోసపోతుంటాడు. ఓడిపోతుంటాడు. శరీరం మనసుల మధ్య నిత్యసంఘర్షణ ప్రారంభమై భరింపరాని దుఃఖంగా మారుతుంది. నిజానికి, కష్టమే కర్మనిష్ఠ. కర్మానుస్థానం వలన జీవితం స్పష్టంగా అర్థమై, మనసు నెమ్మదించి, ఆనందం వైపు మరలుతుంది. ఆనందమంటే మార్పెరుగనది. ఉద్వేగ మెరుగనది. తాద్మ్యామెరుగనది. అదొక ఆత్మనిష్ఠ. ఈ ఆనందం పలుస్థాయిలలో అనుభవంలోకి వస్తుంది. ఒక వ్యక్తి సుఖసంతోషాల పరిధిని దాటి వస్తువుల పరిమిత ఆవరణాన్నిదాటి వుండగలిగితే అది మనుష్యానందం. తాను పొందిన ఆనందాన్ని మరొకరితో పంచుకోగలిగిన ఔదార్యం కలిగినపుడు మనుష్యానందమే మనీషానందంగా మారి ఆనందపరిధిని పెంచుతుంది.

## గంధర్వానందం

మనీషానందం ఏ కొందరికో మాత్రమేకాక, మరింత విస్తృతానుభవాన్ని సంతరించుకోవలసినపుడు, ఆ ఆనందానికి కొంత చేతనను జోడించి, పవిత్రీకరించి, మానవీయతను అద్ది, అనుభవించగలిగితే అది గంధర్వానందమౌతుంది. గాంధర్వమంటే సహజప్రజ్ఞ. ఎక్కడో ఒక ఆనందభావనగా ప్రారంభమైనది, ప్రజ్ఞను కలుపుకున్నప్పుడు స్పష్టతను సంతరించుకుంటుంది. ప్రజ్ఞలేని మానవుడు లేడు. ప్రాథమికమై, పరిమితమైన ఆవరణంతో ప్రజ్వరిల్లే ప్రజ్ఞ, గంధర్వానందంతో కలిసినపుడు అది మానవ గంధర్వానందమౌతున్నది. సంస్కారము, సంస్కృతి, నిబద్ధత వంటి ఉదాత్త భావనలతో కూడిన ప్రజ్ఞ, మానవగంధర్వానందాన్ని దేవగంధర్వానందంగా అనుభవంలోకి తెస్తుంది. ఈ ప్రజ్ఞంతా సమాజపరమైనపుడు ఆనందం ప్రజాపితానందంగా మారుతుంది. ఈ స్థితిలోనూ కర్తృత్వం ఉంటుంది. చేస్తున్నవాడు, చేయబడుతున్న పని, దానివలన కలిగే ఫలితం ఇంకా ఉండనే ఉన్నాయి. కాకపోతే సుఖ, సంతోష, ఆనందకందాయంగా ఉన్నాయి. తన ఉనికి, వ్యక్తిత్వం, ప్రజ్ఞ, కార్యనిష్ఠ వీటి వల్ల లబ్ధి పొందుతున్న ప్రపంచం వీటన్నిటికీ మూలమైన 'తాను' మరలిపోయి అసలు 'తాను' మిగిలి, ఆ అనుభమమూ నశించి, సర్వమూ బ్రహ్మమేనన్న స్థితిలో ఆనంద బిందువు, హిరణ్య గర్భానందసింధువై, అమదానందమై నిలకడ చెందుతుంది. ఈ హిరణ్యగర్భానందం సముద్రం మధ్యలో ఉన్న స్థిమితం వంటిది. ఆనందం మనస్వభావం! అందుకే దాన్ని కోరుకుంటాం. యోగంలో చరమస్థాయి యోగానందమే, భోగంలో చివరి స్థాయి భోగానందమే, సంయోగంలో ఉన్నదంతా ప్రాపంచికానందమే, విషయంలో ఉన్నదంతా పరిమితానందమే. మనిషి మనసు విశ్వాత్మతో కూడినపుడు ఆ కలయిక స్థిరమైతే కలిగే ఆనందమే అసలు ఆనందం. అదే బ్రహ్మానందం. పరమానందం. ఆత్మానందం!



వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఆంధ్రజ్యోతి
సకల
13-8-2012 సోమవారం


అనుభవం

అందరూ వెళ్లే దారిలో అయితే, ఎవరైనా సునాయాసంగా తీరం చేరవచ్చు. కాకపోతే, అలా వెళ్లిన వారి ఆనవాళ్లేవీ ఎక్కడా మిగలవు. అలా అని ఏదైనా భిన్నంగా చేయాలనుకుంటే ఎన్నెన్నో ప్రవాహాలకు ఎదురీదాల్సి వస్తుంది. ఎన్ని కష్టాలొచ్చినా, ఎత్తైన రాగాల హరివిల్లును దించకుండా, సినీ సామ్రాజ్యంలో తనదైన స్థానం నిలుపుకున్నారు, యువ సినీ సంగీత దర్శకుడు చక్రి. ప్రైవేట్ ఆల్బమ్స్ నుంచి సినిమా సంగీతం దాకా సాగిన ఆయన జీవన ప్రస్థానంలోని కొన్ని అరుదైన సంఘటనలే ఈవారం 'అనుభవం'.



# కలిసి సాగితేనే కమనీయ రాగం

పాటంటే నాలో ఉన్న అపారమైన ప్రేమ నన్ను పట్నానికి చేర్చింది. టీచర్ వృత్తినో లేదా లేదా ఏదైనా వ్యాపారాన్నో ఎంచుకోమని నాన్నగారు ఎంత చెప్పినా. నేను అవేవీ వినిపించుకోలేదు. నిజానికినా మనసులో నిండిపోయిన పాట, ఎవరి మాటా విననివ్వలేదు. కర్ణాటక గాత్ర సంగీతంతో పాటు కొంత కాలం వాయిలిన్ కూడా నేర్చుకున్నాను. సంగీతంలో విశేషంగా ఏదైనా చేయొచ్చన్న నమ్మకమేదో నాలో పెరిగిపోయింది. అంతే...! నేను మా ఊరు మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు వచ్చేశాను. కృష్ణానగర్‌లో ఒక రూమ్ తీసుకుని ఉండేవాణ్ని. నాన్నగారి మాట కాదని వచ్చేశాను కాబట్టి, మళ్లీ ఇంటినుంచి ఏమీ ఆశించకుండా బతకాలనుకున్నాను. అందుకే వచ్చిన వెంటనే ఒక జాబ్‌లో చేరాను. అయితే, ఓ ఏడాది గడిచిందో లేదో, మ్యూజిక్ వర్క్‌కే పూర్తి కాలం వెచ్చించాలని, ఆ జాబ్ మానేశాను. కొన్నాళ్లు ఒక ఆర్కెస్ట్రాను నడిపాను. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ ఓ 50 దాకా తీశాను. వాటిలో చాలా పాటలు నేను రాసినవే. ఈ ఆల్బమ్స్‌కు వర్క్ చేయడం ద్వారా కొన్ని డబ్బులైతే వచ్చేవి. కాకపోతే కొన్నిసార్లు ఆ ఆల్బమ్స్‌కు సంబంధించిన ఆఫర్స్ కూడా వచ్చేవి కాదు. డబ్బులకు చాలా కటకటగానే ఉండేది. ఇంటి అద్దె ఒక్కణ్నే కట్టడం కష్టమని ఓ మూడేళ్లు ఒకే రూమ్‌లో ముగ్గురం ఉండేవాళ్లం. రూమే కాదు, తిండివిషయంలోనూ అదే విధానం.మెస్‌లో తినేస్తే, ఒక ప్లేట్ భోజనం ఒక్కరే తినాలి. అందుకే ఆ ఒక్క మెస్ ప్యాకెట్ తెచ్చుకుని ముగ్గురం తినేసే వాళ్లం. పైగా అందులోనే కొంత మిగుల్చుకుని, సాయంత్రం ఒక సింగిల్ మీల్స్ తెచ్చుకుని, అది ఇది కలిపేసుకోని రాత్రి భోజనం అయ్యిందనిపించే వాళ్లం.

## ప్రైవేట్ ఆల్బమ్స్ కోసం...

ప్రైవేట్ ఆల్బమ్స్ చేసే ఆఫర్స్ ఏమైనా వస్తాయేమోనని ఎదురు చూసే నాకు కోటిలోని ఆడియో కంపెనీల వాళ్ల నుంచి అప్పుడో ఇప్పుడో పిలుపు వచ్చేది . కొన్నిసార్లు కంపెనీ వారే ఆల్బమ్ కాన్సెప్ట్ చెబితే, కొన్నిసార్లు నేనే చెప్పేవాణ్ని. తీరా వెళితే, ఇప్పుడే పిలుస్తాం, కాసేపు వెయిట్ చేయమని చెప్పి, చాలా సార్లు రోజంతా అలాగే కూర్చోబెట్టే వారు. జేబులో పది, ఇరవై రూపాయల కన్నా మించి ఉండేవి కాదు. పొద్దున్నే వెళ్లి, ఆడియో కంపెనీ ముందు కూర్చుంటే మధ్యాహ్నానికి ఆకలి. అతి తక్కువలో వచ్చే ఆహారం దాల్-రైస్ ఒక్కటే. ఆరు రూపాయలు ఇచ్చి ఆకలి తీర్చుకునే వాణ్ని, వాళ్లు ఇచ్చేది కొంచెమే అన్నం కాబట్టి సాయంత్రానికి మళ్లీ ఆకలి మొదలయ్యేది ఏవో రెండు బజ్జీలు తినేసి, అతి కష్టంగా ఆ పూటా గడిచిపోయేది. ఏదో ఒక ఆఫర్ వస్తే, అడ్వాన్స్‌గా కొన్ని డబ్బులు ఇస్తారు కదా! అన్న ఆశ. అయితే, తీరా ఏ 9 గంటలకో ఆడియో కంపెనీ తాలూకు వ్యక్తి వెలుపలికి వచ్చేవారు. ఏదైనా శుభవార్త చెబుతారేమోనని చూస్తే '' ప్రస్తుతం ఆడియో బిజినెస్ చాలా టైట్‌గా ఉందండి. ఈ కాన్సెప్ట్‌తో ఇప్పుడు వర్కవుట్ కాదనిపిస్తోంది. అనుకూలిస్తే, మరెప్పుడైనా పిలుస్తాం. ప్రస్తుతానికి వెళ్లిరండి '' అంటూ చావు కబురు చల్లగా చెప్పేవారు. ఇంకేముంది? చాలా సార్లు తిరిగి వెళ్లడానికి కూడా జేబులో డబ్బులు ఉండేవి కాదు. ఎవరెవరినో అడిగి కొంత దూరం లిఫ్ట్‌లో, మరికొంత దూరం కాలినడకన ఎలాగోలా ఇంటికి చేరేవాణ్ని.

## సినిమా కంపెనీల చుట్టూ...

సినిమా కంపెనీల వద్దకు వెళితే అక్కడ మరో రకం అనుభవాలు. ఎవరి వద్దకు వెళ్లినా, మనం త్వరలోనే సినిమా తీయబోతున్నాం. ఇన్ని లక్షల్లో తీస్తున్నాం, ఇన్ని కోట్లల్లో తీస్తున్నాం అంటూ చాలా గొప్పగా చెప్పేవాళ్లు. అయితే, వాళ్ల టిఫిన్‌లూ, టీలు, మధ్యాహ్నం భోజనాలు ఇలా వారి ఖర్చులన్నీ నాతోనే పెట్టించేవారు. నేనూ ఉత్సాహంగానే బిల్లులు కట్టేవాణ్ని. అయితే వారం రోజుల తరువాత చూస్తే వాళ్లు అసలు కనిపించేవాళ్లే కాదు. ఆ తరువాత మరో కంపెనీ, మరో కంపెనీ అలా వరుసగా మొత్తం ఓ 10 సినిమా కంపెనీల చుట్టూ తిరిగాను. అన్నీ మన జేబులు ఖాళీ చేసేవే. నేను సంగీతం ఇచ్చిన 'చిరునవ్వు' అనే ఒక ప్రైవేట్ ఆల్బంతో నాకు కొంత గుర్తింపు వచ్చింది. ఆ తరువాత తీసిన ' వందేమాతరం' అనే ఆల్బమ్‌తో మరింత గుర్తింపే కాకుండా, దాని ద్వారా సినీ పరిశ్రమలో కూడా కొన్ని పరిచయాలు ఏర్పడ్డాయి. 1998-99 మధ్య కాలంలో కొన్ని సినిమాలకు సంగీతం ఇచ్చే అవకాశాలు కూడా వచ్చాయి. కాకపోతే, రికార్డింగ్ దాకా వెళ్లినా ఆ సినిమా నిర్మాణం పూర్తవుతుందన్న గ్యారెంటీ ఉండేది కాదు. ఒక సినిమాకు పాటలన్నీ రికార్డయితే అయ్యాయి గానీ, షూటింగ్ జరగకుండా ఆగిపోయింది. ఆ తరువాత మరో సినిమా అవకాశమైతే వచ్చింది కానీ, అసలు ఆ ప్రాజెక్టే మొదలవ్వలేదు. ఇక 2000 లో మాత్రం నేను సంగీతం ఇచ్చిన 'లిటిల్ హార్ట్స్' సినిమా పూర్తయ్యింది. సరిగ్గా లిటిల్ హార్ట్స్‌కు పనిచేస్తున్న సమయంలోనే నాకు పూరి జగన్నాథ్ గారు పరిచయం అయ్యారు. ఆయన ద్వారానే ' బాచి' సినిమాకు సంగీతం ఇచ్చే తొలి అవకాశం నాకు దక్కింది.

## ఏకపక్షమైతే ఎంత సమస్య?

'బాచి' సినిమాకు సంగీతం ఇచ్చే సమయంలోనే నాకు నా కళ్లు తెరిపించే అనుభవం ఒకటి ఎదురయ్యింది. ఆ సినిమాకు సంబంధించిన పాటల రికార్డింగ్ జరుగుతోంది. మొదటి పాటను కులశేఖర్ రాశారు. రెండవ పాట కూడా ఆయనే రాస్తున్నారు. సినిమాలోని మొత్తం పాటల్ని కులశేఖర్ గారే రాస్తారని చెప్పాను. అప్పటికే పూరి జగన్నాథ్ గారి 'బద్రి' సినిమా రిలీజ్ అయ్యింది. ప్రతి దర్శకుడికీ తాము ఇష్టపడే గాయనీ గాయకులు, పాటల రచయితలు కొందరు ఉంటారు. 'బాచి' నాకది తొలి సినిమాయే కాబట్టి ఈ విషయాలేమీ నాకు తెలియదు. అందుకే అన్నీ నా ఇష్టప్రకారమే చేసుకుపోయే ఉద్దేశంలో ఉన్నాను. సింగర్స్ విషయంలో దర్శకుడు పూరి జగన్నాథ్ (జగన్) గారు కొన్ని పేర్లు ప్రస్థావిస్తే, నేను రిజెక్ట్ చేశాను. ఆ రిజెక్ట్ చేసిన వారిలో సీనియర్ సింగర్స్ కూడా ఉన్నారు. రికార్డింగ్ జరుగుతోంది. పాటలన్నీ బాగున్నాయి. సింగర్స్‌గా నా మనసులో ఉన్నకృష్ణన్, మనోహర్, హరిహరన్, ఉదిత్ నారాయణ్, సిక్కిందర్ సింగ్‌ల పేర్లు ఉన్నాయి. ఆ పేర్లే అందరికీ చెబుతున్నాను. ఆ క్రమంలో ముందుగా కుంచె రఘుతో ఒక పాట పాడించి రికార్డ్ చేశాను. మిగతా పాటల రికార్డింగ్ కోసం, చెన్నయ్, ముంబయ్ వెళ్లి, ఆయా గాయకులతో పాడించాలనే విషయాన్ని చెప్పాను. ముందుగా రికార్డ్ చేసిన పాటల్ని విన్న జగన్ ఈ వాయిస్‌లు బాగానే ఉన్నాయి కదా! మళ్లీ చెన్నయ్, ముంబయ్ ఎందుకు? అన్నారు. పక్కనే ఉన్న చంటి అడ్డాల కూడా నిజమే ఈ వాయిస్‌లు బాగున్నాయి. మళ్లీ వేరే వాళ్లతో పాడించాల్సిన అవసరం ఏముంది? అన్నారు.

## అప్పటికి బోధపడింది

ఎంతసేపూ నేనుకున్న వాళ్ల పేర్లే బలంగా చెబుతున్నాను. అంతేగానీ, నా యీ ధోరణి వల్ల అవతలి వారి మనసు నొచ్చుకుంటోందన్న విషయమే నాకు స్ఫురించడం లేదు. ఇంతలో ఒక మిత్రుడు నన్ను పక్కకు పిలిచి, '' చూడు మిత్రమా! జగన్ గారు, నువ్వు ఆయన మాటేదీ వినడం లేదని కాస్త ఫీల్ అవుతున్నారు. కొన్ని పాటల్ని వేరే కవులతో రాయించాలని ఆయన అనుకుంటే, నువ్వేమో అన్ని పాటల్నీ కులశేఖర్‌తోనే రాయించాలంటున్నావ్. సింగర్స్ విషయంలోనూ అన్నీ నీకు నచ్చిన పేర్లే చెబుతున్నావ్. నిజానికి, జగన్ గారి మనసులో కొన్ని వేరే పేర్లు ఉన్నాయి మరి!'' అన్నాడు. ఆ మాటలు విని నేను అవాక్కయిపోయాను. అయ్యో! నాకా విషయమే స్ఫురించలేదేమిటని, తీవ్ర మనస్తాపానికి గురయ్యాను. శబ్దాలయ రికార్డింగ్ థియేటర్‌లో ఉన్నప్పుడు జగన్ గారి వద్దకు వెళ్లి, '' సార్! మీతో ఒక నిమిషం మాట్లాడాలి ప్లీజ్!'' అంటూ పక్కకు పిలిచాను. ఆయన రాగానే, '' సారీ సర్! ఇప్పుడిప్పుడే నాకు ఓ విషయం తెలిసింది. ఇప్పటిదాకా మీరు చెప్పినదేదీ నేను వినిపించుకోలేదు. వాస్తవానికి నేను వినడం లేదనే విషయం ఇప్పటిదాకా నాకు తెలియలేదు. కచ్చితంగా ఇది నా తప్పే. నా తప్పును మీరు క్షమించండి. నన్ను సినిమా పరిశ్రమకు పరిచయం చేసింది మీరే. నేను మీ బిడ్డ లాంటి వాణ్ని, నా తప్పుల్ని మీరే క్షమించాలి. సరియైన మార్గమేదో కూడా మీరే చెప్పాలి. ఇక నుంచి మీరు ఏది చెప్పాలనుకుంటే అది సూటిగా చెప్పేయండి. నేనేమీ ఇబ్బంది పడను.'' అన్నాను. జగన్ గారు నా వేపు ఎంతో ఆర్ద్రంగా చూస్తూ, ఓకే ఓకే అంటూ నా భుజం తట్టారు. అంతటితో మా ఇద్దరి మధ్యా ఒక కంఫర్టబుల్ వాతావరణం ఏర్పడింది. అలా ఇద్దరికీ నచ్చిన వాళ్లతో పాటలు రాయించడం, పాడించడం చేశాం. 'బాచీ' సినిమా ముందు రిలీజ్ అయ్యి, అంతకు ముందే సంగీతం ఇచ్చిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ఆ తరువాత రిలీజ్ అయ్యింది. 'బాచీ' సినిమా యావరేజ్‌గానే నడిచినా, ఆ సినిమా పాటలు నాకు బాగా పేరు తెచ్చి పెట్టాయి. ఆ తరువాత ఒక్కొక్కటిగా అవకాశాలు రావడం మొదలయ్యింది.

## సామర్థ్యమే సరిపోదు

సినిమా మేకింగ్‌లో అత్యంత కీలకం అయి ఉండి కూడా డైరెక్టర్లు కొన్నిసార్లు తమ మనసులో ఉన్న విషయాల్ని నేరుగా చెప్పలేకపోవచ్చు. అందువల్ల వారికి బాగా క్లోజ్‌గా ఉంటూ, వారు పరోక్షంగా చెప్పిన మాటల్ని కూడా శ్రద్ధగా విని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని అప్పుడు నాకు అనిపించింది. సంయుక్తంగా పనిచేసే చోట మన ఇష్టాలకు మనం ఇచ్చే ప్రాధాన్యతతో. సమానంగానే ఎదుటి వారి ఇష్టాలకు కూడా అంతే ప్రాధాన్యతను ఇవ్వాలన్న సత్యం కూడా ఆ రోజు నాకు మరింత స్పష్టంగా బోధపడింది. నా ప్రొఫెషనల్ లైఫ్‌లో ఈ అనుభవం నాకు నిజంగా, ఎంతగానో తోడ్పడుతోంది. నిజానికి ఏ రంగంలో నిలదొక్కుకోవాలన్నా, కేవలం ఆ రంగానికి సంబంధించిన సామర్థ్యం ఒక్కటే సరిపోదు. ఆ రంగానికి అనుబంధంగా ఉండే వ్యక్తుల్ని కలుపుకుపోయే తత్త్వం కూడా తప్పనిసరిగా ఉండాలన్నారు చక్రి.

• బమ్మెర

# పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించిన రాత్రి.. షబెఖద్ర్

వారం - పర్వం

సంవత్సరంలో పన్నెండు మాసాల్లో అత్యంత శుభప్రదమైన, మంగళప్రదమైన, విశిష్ఠమాసం రమజాన్. ఇందులోని ప్రారంభ దశ...అంటే మొదటి రోజులు కారుణ్యభరితమైనవి. ఈ దశలో దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తుంది. రెండవదశ క్షమాపణ, మన్నింపునకు సంబంధించింది. ఈ దశలో దైవం తన దాసుల తప్పుల్ని మన్నిస్తాడు. వారి పాపాలను క్షమించి తన కారుణ్యఛాయలో చోటు కల్పిస్తాడు. ఇక మూడవది నరకాగ్ని నుంచి విముక్తి దశ. ఈ చివరి దశలో దైవం అసంఖ్యాక మందిని నరకజ్వాలల భయం నుంచి విముక్తి కల్పిస్తాడు. ఇది చాలా కీలకమైన దశ. దీని ప్రాశస్త్యం చాలా గొప్పది. సంవత్సరంలోని పన్నెండు మాసాల్లో రమజాన్‌కు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, ఈ మాసంలోని మూడు భాగాల్లో ఈ చివరి భాగానికీ అలాంటి ప్రత్యేకతే ఉంది. ఈ చివరి పది రోజుల్లోని ఒక రాత్రిలోనే 'షబెఖద్ర్' ఉంది. దీన్నే 'లైలతుల్ ఖద్ర్' అని కూడా అంటారు. ఇది వేయి మాసాల కన్నా ఎక్కువ విలువైన రాత్రి. ఈ రాత్రినే పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథం అవతరించింది. ఈ విషయాన్ని దైవం ఇలా ప్రకటించాడు. 'ఇన్నా అన్‌జల్నాహు ఫీలైల తిల్ ఖద్రి వమా అద్‌రాక మాలైలతుల్ ఖద్ర్. లైలతుల్ ఖద్రి ఖైరుమ్మిన్ అల్ఫిషహ్రా. తనజ్జలుల్ మలాయికతువ ర్రూహ్. ఫీహాబి ఇజ్ని రబ్బిహిం మిన్‌కుల్లి అమ్ర్. సలామున్ హియ హత్తమత్‌ల ఇల్‌ఫజ్ర్.' అంటే, మేము ఈ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఒక విలువైన రాత్రిలో అవతరింపజేశాము. ఆ రాత్రి ఘనత ఏమిటో మీకు తెలుసా? అది వెయ్యి మాసాల కన్నా అత్యంత విలువైన రాత్రి. దైవదూతలు మరియు ఆత్మ తమ ప్రభువు అనుమతితో, ప్రతి అనుజ్ఞతో ఆ రాత్రికి దిగి వస్తారు. ఆ రాత్రి శుభోదయం వరకు శాంతియుతమైన రాత్రి. (ఖుర్‌ఆన్. 97-1,5)

## ఇహపర సాఫల్యానికి దిక్సూచి...రమజాన్

పవిత్ర ఖుర్‌ఆన్‌లో మరో చోట ఇలా ఉంది. ''ఖుర్‌ఆన్ అవతరించిన మాసం రమజాన్. ఇది సమస్త మానవాళికీ మార్గదర్శక జ్యోతి. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరు చేసి చూపే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ''(2-185) మానవజాతికి సన్మార్గం చూపి, వారి ఇహపర సాఫల్యానికి దిక్సూచిగా నిలిచే మహత్తర మార్గదర్శిని రమజాన్ మాసంలో, ప్రత్యేకించి చివరి భాగంలోని 'లైలతుల్‌ఖద్ర్' రాత్రిలో అవతరించింది కాబట్టే ఈ రాత్రికి ఇంతటి ప్రాముఖ్యత, విశిష్ఠత ఏర్పడింది. ఈ ఒక్క రాత్రి చేసే ఆరాధన వెయ్యి మాసాల కన్నా ఎక్కువగా చేసిన ఆరాధనలతో సమానమంఏ దీని ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అందుకే రమజాన్ చివరి పది రోజుల్లో ఆరాధనలు ఎక్కువగా చేయాలని, ఇందులోనే ఈ శుభరాత్రి ఉంది కనుక దాన్ని పొందాలని ప్రవక్త మహనీయులు ఉపదేశించారు. అయితే ఇక్కడ ఆ రాత్రి 'ఫలానా రాత్రి' అని ఖచ్చితంగా నిర్ధారించబడలేదు. కాని దాన్ని ఖచ్చితంగా ఎలా పొందవచ్చో ప్రవక్త మహనీయులు స్పష్టంగా వివరించారు. చివరి పదిరోజుల్లోని బేసి రాత్రుల్లో దాన్ని అన్వేషించమని ఆయన ఉపదేశించారు. ఎవరైతే ఆత్మ సంతోషంతో, పరలోక ప్రతిఫలాపేక్ష తో ఈ రాత్రి ఆరాధనలో గడుపుతారో వారి గత పాపాలన్నీ మన్నించబడతాయి. ఎవరైతే 'షబెఖద్ర్'లో ఆరాధనలు చేయకుండా, ఆ మహా శుభరాత్రిని పోగొట్టుకుంటారో వారికి మించిన దౌర్భాగ్యులు మరెవరూ ఉండరని ప్రవక్త వారి సూక్తుల ద్వారా మనకు తెలుస్తోంది. కాబట్టి ఈ పవిత్ర మాసం చివరి భాగం ఆరాధనలు, సదాచరణలు, అధికంగా చేసి దైవ ప్రసన్నతను పొందే ప్రయత్నం చేయాలి.

**ఈ ప్రబోధనా జ్యోతి మానవులకు జీవితంలోని అన్ని రంగాల్లో మార్గ దర్శనం చేసింది. సమస్త రంగాల్లో మానవుడు ఏ విధమైన జీవన విధానాన్ని అవలంబించాలి. ఎలాంటి వైఖరిని కలిగి ఉండాలో సవివరంగా తెలియజేసింది.**



## ప్రబోధనా జ్యోతి...ఖుర్‌ఆన్

ముఖ్యంగా పవిత్ర ఖుర్‌ఆన్‌తో సంబంధాన్ని పెంచుకోవాలి. ఎందుకంటే మానవ మనుగడ కోసం ఈ ప్రపంచంలో చేసిన ఏర్పాట్లన్నీ ఒక ఎత్తు అయితే, పవిత్ర ఖుర్‌ఆన్ అవతరణ మరో ఎత్తు. ఈ ప్రబోధనా జ్యోతి మానవులకు జీవితంలోని అన్ని రంగాల్లో మార్గ దర్శనం చేసింది. సామాజిక, సాంస్కృతిక, కుటుంబీక, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ తదితర సమస్త రంగాల్లో మానవుడు ఏ విధమైన జీవన విధానాన్ని అవలంబించాలి. ఎలాంటి వైఖరిని కలిగి ఉండాలో సవివరంగా తెలియజేసింది. మానవుడు పుట్టింది మొదలు మరణించే వరకు సంభవించే వివిధ దశల్లో అతనికి మార్గం చూపింది. ఈ ప్రపంచంలో మానవుడి జీవన విధానం ఎలా ఉండాలి? కుటుం బం, బంధుమిత్రుల పట్ల ఎలా మసలుకోవాలి? సమాజంలో ఒక మనిషికి మరో మనిషిపై తారసిల్లే బాధ్యతలేమిటి? పరస్పర మానవసంబంధాలు పటిష్ఠంగా, అర్థవంతంగా, సామరస్య పూర్వకంగా మనగలగాలంటే ఏం చేయాలి? ఇత్యాది విషయాలన్నిటినీ పవిత్ర ఖుర్‌ఆన్ చర్చించింది. అందుకని ఈ పవిత్ర మాసంలో దీన్ని అధ్యయనం చేయడానికి, అర్థం చేసుకోవడానికి, దాని ప్రకారం ఆచరించడానికి శక్తివంచన లేని ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా చివరి బేసిరాత్రుల్లో 'షబెఖద్ర్' ను అన్వేషించాలి. 21,23, 25,27,29 వ రాత్రుల్లో ఏదో ఒకరాత్రి 'షబెఖద్ర్' కావచ్చు. వీలున్న వారు చివరి దశకంలో 'ఏతికాఫ్' పాటించాలి. 'ఫిత్రాలు' కూడా ఈ చివరి రోజుల్లో ఇవ్వడం శుభప్రదం. షబెఖద్ర్‌లో ప్రత్యేకంగా చేయాల్సిన దువా ప్రవక్త మహనీయులు హ. ఆయిషా (ర.అన్‌హా)కు ఉపదేశించారు. దాన్నే మనమంతా అధికంగా పఠించాలి. 'అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ ఆఫ్‌వఫు ఆఫ్ అన్ని' . అల్లాహ్ సమస్త మానవులకూ పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు అర్థం చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించుగాక.!

• యండి. ఉస్మాన్‌ఖాన్

పదిమందికి న్యాయం చేయాల్సినవాడు అన్యాయం చేస్తాడా? అంత చదువు చదివాక కూడా ఆడపిల్లను మోసం చేస్తాడా? ..ఎందుకు చేయడు... దేనిదారి దానిదే. బుద్ధికి, ఉద్యోగానికి లింకేంటి? ఖమ్మం జిల్లాలో జరిగిన ఓ యధార్థఘటనను చూస్తే ఇదే నిజమనిపిస్తుంది. ఆ వివరాలే ఈవారం 'ప్రేమలో పడితే'



# ప్రేమకు న్యాయం లేదా..?

సాయంత్రం ఏడింటికల్లా రూమ్‌కి వచ్చే లక్ష్మణ్ ఆ రోజు రాలేదు. మర్నాడు కూడా రాలేదు. ఫోన్ చేస్తే 'నెంబర్ పనిచేయట్లేదని' వస్తోంది. ఓసారి ఇంటికెళితే మనసు ప్రశాంతంగా ఉంటుందని ఊరికి బయలుదేరింది సుకన్య. ఇంటికెళ్లగానే తల్లిదండ్రీ సుకన్యని ఇంటిముందే నిలబెట్టారు. 'లక్ష్మణ్ ఎక్కడున్నాడు' అని అడిగారు. 'తెలియదమ్మా...ఫోన్ చేస్తే ఆ నెంబర్ పనిచేయడం లేదని వస్తోందమ్మా...' అని చెప్పింది. 'రేపో మాపో పెళ్లిచేసుకోబోతున్నాడుగా 'కొత్త నెంబర్..' వేసుకున్నాడేమో...' అని తండ్రి వెటకారంగా అన్నమాటలు వినగానే సుకన్య గుండెల్లో రాయిపడ్డంత పనైంది.

* * *

సుకన్య, లక్ష్మణ్ గత ఆరేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. ఇద్దరిదీ ఒకే ఊరు. ఒకటే కులం. చదువైపోగానే సుకన్యకు ఖమ్మం జిల్లాలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్సు ఉద్యోగం వచ్చింది. లక్ష్మణ్ కూడా లా చదువుకున్నాడు. ఇద్దరూ ఒకే రూములో కలిసి ఉండసాగారు. పెళ్లెప్పుడని పెద్దవాళ్లు అడిగితే నాక్కూడ ఉద్యోగం రావాలని అనేవాడు. రెండేళ్ల క్రితం అతనికి జిల్లాకోర్టులో ఉద్యోగం వచ్చింది. రోజులు గడిచే కొద్దీ లక్ష్మణ్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. రెండు మూడు రోజులకొకసారి రూమ్‌కి రాసాగాడు. సుకన్యతో అంటీముట్టనట్టు ఉండడం మొదలుపెట్టాడు. జీతం పెరిగిన విషయం కూడా సుకన్యకి చెప్పలేదు. ఆ విషయం తెలిసినప్పటి నుంచి సుకన్యకి భయం మొదలైంది. మెల్లగా మాటలు తగ్గించాడు... కొన్నాళ్లకు తన మనసులోనుంచి ఆమెను తొలగించాడు. ఊరికి వస్తే గాని సుకన్యకి విషయం పూర్తిగా అర్థం కాలేదు.

* * *

లక్ష్మణ్ ఇంటిదగ్గరున్నాడని తెలుసుకుని కబురు పంపింది సుకన్య. అప్పుడు ఫోన్ చేశాడు లక్ష్మణ్. 'చూడు సుకన్య...నాకు ఈ మధ్యనే ఓ విషయం తెలిసింది. అది తెలిసినప్పటి నుంచి నీకు దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాను. నావల్ల కావడం లేదు...అందుకే పెళ్లి చేసుకుని నీకు కనిపించకుండా వెళ్లిపోదామనుకుంటున్నాను....' ఏదో మిస్టరీ కథ చెబుతున్నట్టు చెప్పసాగాడు లక్ష్మణ్. 'ఏమైంది నీకు...ఏం తెలిసింది...' అని ఆశ్చర్యంగా అడిగింది సుకన్య. 'మొన్నీమధ్య మా బంధువొకాయన మా ఇంటికొచ్చాడు. అతను మీకు కూడా బంధువేనట. మన బంధుత్వాల గురించి చెబుతూ నీకు నేను వరసకు బాబాయినవుతానని చెప్పాడు. అప్పటి నుంచి మా ఇంట్లోవాళ్లు నిన్ను పెళ్లి చేసుకోవద్దని చెప్పారు. అందుకే నాకు సంబంధాలు చూడ్డం మొదలుపెట్టారు' అని వివరంగా చెప్పాడు లక్ష్మణ్. సుకన్యకు చెమటలు పట్టాయి. నోట మాట రావడం లేదు. ఇంతలోనే ఫోన్ పెట్టేశాడు అతను.

* * *

సుకన్య తల్లికి లక్ష్మణ్ చెప్పిన విషయమంతా చెప్పింది. 'నాలుగు రోజుల క్రితం వాడికొక సంబంధం వచ్చింది. రెండు లక్షల కట్నం ఇస్తామన్నారంట. సంబంధం వచ్చిన మర్నాడే లక్ష్మణ్ చిన్నాన్న మీ నాన్నను కలిసి పిల్లకు ఏ మాత్రం కట్నం ఇస్తావని అడిగాడు. పిల్లను కష్టపడి చదివించాను. ఉద్యోగం చేసుకుంటుంది కదా..అదే కట్నమన్నాడంట నాన్న. దాంతో వాళ్లు నిన్ను వదిలించుకుందామనుకుంటున్నారు. కావాలనే లేనిపోని వరసలు సృష్టించి వాడ్ని నీకు బాబాయిని చేశారు' అని తల్లి చెప్పిన మాటలకు సుకన్యకు పట్టరాని కోపం వచ్చింది. ఒకటీ రెండూ కాదు ఆరేళ్లు ఇద్దరూ కలిసి బతికారు. పెళ్లికాని దంపతుల్లా తిరిగారు. వృత్తి..జీతం..కోర్టులో ఉద్యోగం అన్నీ కలిసి లక్ష్మణ్ స్థాయిని పెంచాయి. సుకన్యపై ప్రేమను పోగొట్టాయి.

* * *

ఇంత జరిగాక ఊరుకునే ప్రసక్తే లేదని సుకన్య తల్లిదండ్రులు కులపెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. ముందురోజు లక్ష్మణ్‌కి కబురు పంపితే వస్తానన్నాడు. పంచాయితీ సమయానికి మాత్రం పారిపోయాడు. లాభం లేదని సుకన్య పోలీసులను ఆశ్రయించింది. లక్ష్మణ్‌కి కౌన్సిలింగ్ ఇస్తే ప్రయోజనం ఉంటుందని ఎస్ఐ హామీ ఇచ్చాడు. ఎన్నిసార్లు కబురు పంపినా లక్ష్మణ్ స్టేషన్‌కి రాలేదు. దాంతో కేసు నమోదు చేశారు. సుకన్య మీడియాని కూడా ఆశ్రయించింది. తాను చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. ఫలితం కనిపించలేదు. కేసు విషయం ఎంతవరకూ వచ్చిందని పాత్రికేయులు పోలీసులను అడిగితే 'ఇన్వెస్టిగేషన్' అవుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం లక్ష్మణ్ ఎంచక్కా ఖమ్మం జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. సుకన్య మాత్రం 'న్యాయం'కోసం ఎదురుచూస్తోంది.

● నవ్యడెస్క్



# మల్లెపువ్వంత అందంగా...

తెలుపు అందంగానే కాదు ఆహ్లాదంగా, మనసుకు హాయిగా ఉంటుంది. హుందాగా కూడా ఉంటుంది. ఎన్ని ప్రత్యేకతలున్నా...తెలుపు మనకి నప్పుతుందో లేదోననే సందేహంతో కొనేముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. పూర్తిగా తెల్లటి డ్రస్సులైతే అలాగే ఆలోచించాలి. వైట్ కాంబినేషన్ డ్రస్సుల గురించి మాత్రం ఆలోచించక్కర్లేదు. కలర్ కాంబినేషన్ మాత్రమే కాదు డ్రస్సు డిజైన్‌లో కూడా తెలుపుకి మరింత అందం తెచ్చే వెరైటీలు ఉన్నాయి. అనార్కలీ, షార్ట్ కుర్తీ, పంజాబీ మోడల్లో మీకు నచ్చిన వైట్ కాంబినేషన్ డ్రస్సుల్ని ఎంచుకోవచ్చు. పూర్తిగా వైట్ కావాలంటే నెట్టెడ్ క్లాత్‌ని ఉపయోగిస్తే చూడ్డానికి ఆకర్షణీయంగా ఉంటుంది. ముదురు ఆకుపచ్చ, నలుపు, కెంపు రంగుల కాంబినేషన్‌తో వైట్‌డ్రస్సు కుట్టించుకుంటే పార్టీవేర్ రెడీ అయిపోయినట్టే. అలాంటి కొన్ని వెరైటీ డ్రస్సులు ఈవారం 'సొగసు'లో...










# ఎండ చేసే మేలు...

బరువు పెరగడానికి కారణాలేంటని అడిగితే....నాన్‌స్టాప్‌గా నలభై కారణాలు చెప్పొచ్చు. ఆ లిస్టులో మరో కారణం కూడా చేరిపోయింది. శరీరానికి సరిపడా ఎండ తగలకపోవడం వల్ల కూడా ఊబకాయం వస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఎండకు, బరువుకి సంబంధం ఏంటంటారా...మన శరీరంపై సూర్యకిరణాలు పడడం వల్ల డి విటమన్ వస్తుంది. మన ఒంట్లో డి విటమన్ లోపం ఉంటే కాల్షియం కూడా తక్కువైపోతుంది. ఊబకాయంతో బాధపడుతున్నవారికి కాల్షియంలోపం చాలా ఎక్కువగా ఉంటుంది. మనలో కాల్షియం లోపం లేకుండా చూసుకుంటే కాని ఊబకాయం నుంచి బయటపడలేం. కాల్షియం కావాలంటే రోజూ ఎండలో అరగంటైనా ఉండాలని అంటున్నారు వైద్యనిపుణులు. కొంచెంసేపు ఎండలో ఉండాలంటే తెగ బాధపడిపోయేవాళ్లు ఈ విషయాన్ని గమనించాలని కూడా చెబుతున్నారు.



## బంగారం వెండి

13-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,450 (----) | 29,740 (29,840) | 53,850 (----) |
| విజయవాడ | 30,500 (30,300) | 28,200 (28,000) | 53,800 (53,500) |
| ప్రొద్దుటూరు | 30,500 (30,500) | 28,020 (28,020) | 53,500 (53,500) |
| రాజమండ్రి | 30,300 (30,470) | 27,775 (27,930) | 53,800 (54,100) |
| విశాఖపట్నం | 30,430 (30,490) | 27,990 (28,050) | 53,900 (53,900) |
| ముంబయి | ==== (----) | ==== (----) | ==== (----) |
| చెన్నయ్ | 39,235 (30,260) | 28,270 (28,290) | 53,985 (53,925) |

● బ్రాకెట్లలో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు





# రాగి, ఇత్తడి చేసే మేలు ఇంతింత కాదయా!

శుభకార్యాలకు కళ తెచ్చే రాగి, ఇత్తడి వస్తువులు మానవుని ఆరోగ్యానికీ సాయపడుతున్నాయి. రాగి పాత్రలో ఉంచిన నీళ్లు మూడు గంటల కాల వ్యవధిలోనే క్రిమి రహితంగా మారి, వాటిని తాగే వారికి ఆరోగ్యాన్ని ఇచ్చేంతగా పరిశుద్ధత పొందుతాయి. పాత్రలలో నీటిని నిల్వ ఉంచడం వలన ఈ-కొలి బ్యాక్టీరియాలు సైతం నశించిపోతాయి.

ఇత్తడి పాత్రలేమో జింక్, అలాయ్ మిశ్రమంతో తయారవుతాయి. జింక్ రోగ నిరోధక శక్తిని కలిగి ఉండటంతోపాటు ప్రొటీన్స్‌ను కూడా సమకూర్చేశక్తిని కలిగి ఉంటుంది. అందువలన ఇత్తడి ఆరోగ్యప్రదాయిగా గుర్తింపు పొందింది.

రాగి, ఇత్తడి వస్తువుల నుంచి వచ్చే కాంతి ఫ్రీక్వెన్సీలను నూతన సాంకేతిక పరిజ్ఞానమైన పిఐపి(పాలీకాంట్రాస్ట్ ఇంటర్ఫియరెన్స్ ఫోటోగ్రఫీ) అనే విధానం ద్వారా నిరూపించారు. పూణెలోని కాస్మిక్ స్పిరిచ్యువల్ ఎనర్జీ సెంటర్‌లో ఈ సదుపాయం ఉంది.ఇలా ఆధునిక పరిజ్ఞానమం కూడా రాగి, ఇత్తడి వలన కలిగే మేలును వివరిస్తూనే ఉన్నాయి.

ఎంత రాగైనా, ఇత్తడైనా అవీ పదార్థాలే కాబట్టి ఎప్పటికప్పుడు వాటిని శుభ్రపరుస్తుండాలి. వాతావరణంలోని తేమ మూలంగా రాగి, ఇత్తడి పాత్రలపై చేరే ఆక్సైడ్స్ పచ్చని పొర ఏర్పడటానికి కారణమవుతుంది. దీనిని ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలి. గతంలో సున్నం, చింతపండు, జున్నుపాలు, బూడిద, మన్ను వంటి వాటితో రాగి, ఇత్తడి వస్తువులను శుభ్రపరిచేవారు. ఇప్పుడు వీటి స్థానంలో మార్కెట్‌లో రాగి, ఇత్త డి వస్తువులను శుభ్రపరిచే చక్కని ఉత్పత్తులు లభ్యమవుతున్నాయి. వాటిని ఉపయోగిస్తే రాగి, ఇత్తడి వస్తువుల మన్నిక బాగుంటుంది. చింతపండు, తదితరాల్లో ఇతర పదార్థాల్లో తగినంత యాసిడ్ ఉండదు. అలాగే మన్ను, బూడిద వంటి వాటి వలన మెరిసే వస్తువులపై గీతలు ఏర్పడతాయి. అందువలన దీనికి పత్యామ్నాయంగా రాగి, ఇత్తడి వస్తువులను శుభ్రపరచడానికి మార్కెట్‌లో మంచి పౌడర్లు వస్తున్నాయి. ఇవి రాగి, ఇత్తడి వస్తువులను మెరిసేలా చేస్తున్నాయి. అప్పుడు ఇంట్లో జరిగే శుభకార్యంలో వాడే వస్తువులతో పాటు మనం కూడా ఆరోగ్యంతో కళకళలాడుతాము.

(పీతాంబరి ప్రొడెక్ట్స్ ప్రై.లి. సౌజన్యంతో)



## బంగారం వెండి

14-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,350 (----) | 29,740 (29,640) | 53,600 (----) |
| విజయవాడ | 30,400 (30,500) | 28,100 (28,200) | 53,600 (53,800) |
| ప్రొద్దుటూరు | 30,450 (30,450) | 27,940 (27,940) | 53,450 (53,450) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 30,390 (30,380) | 27,950 (27,940) | 53,900 (53,900) |
| ముంబయి | 30,095 (30,135) | 29,965 (30,000) | 54,215 (54,255) |
| చెన్నయ్ | 30,265 (30,160) | 28,300 (28,200) | 53,915 (53,580) |

• బ్రాకెట్లలో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు




స్వాతంత్ర్యసమరయోధుడు నాగులపల్లి సీతారామయ్యను చూస్తే- 98 ఏళ్లు అనిపించవు. ఆలోచనలలో తీవ్రత, గాంధీజీ పట్ల నిబద్ధత, దేశం పట్ల ప్రేమ- ఆయన మాటల్లో అణువణువునా కనిపిస్తాయి. ''ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం వస్తుంది. కాని నా మనసులో 1947నాడు జరుపుకున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలే గుర్తుండిపోయాయి. ఆ ఉత్సాహం నా మనసు నుంచి ఎప్పటికీ చెరిగిపోదు. అప్పటికి ఇప్పటికి చాలా తేడా ఉంది. ఈ పరిస్థితి మారాలంటే పార్టీయేతర ప్రజాస్వామ్యం ఒక్కటే మార్గం'' అనే సీతారామయ్య అనుభవాల సమాహారమే నేటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక కథనం..

# పల్లె మారింది!



''మాది కృష్ణా జిల్లాలో ముదునూరు గ్రామం. అతి సామాన్యమైన మా గ్రామానికి కూడా ఓ ప్రత్యేకత ఉంది. గాంధీగారు బెజవాడ నుంచి బందరు వెళ్తుంటే మేమందరం ఆయనను బలవంతంగా ఇందుపల్లి దగ్గర రైలు దింపి మా ఊరు తీసుకువచ్చాం. గాంధీ గారి షెడ్యూల్ ఎప్పుడూ చాలా టైట్‌గా ఉండేది. అయినా గాంధీగారు ప్రజల మనిషి. మేమంత పట్టుపట్టడానికి, గాంధీ గారు మా ఊరు రావటానికి అంగీకరించటానికి ఒక కారణం ఉంది. మా ఊర్లో ఒక శివాలయం ఉండేది. అందులో హరిజనులకు ప్రవేశం ఉండేది కాదు. గాంధీగారి ఆధ్వర్యంలో ఆనాడు శివాలయంలోకి హరిజనులు ప్రవేశించారు. గాంధీజీకి మా ఊర్లో అనేక మంది మహిళలు- స్వాతంత్ర్య సమరానికి తమ వంతు విరాళంగా-ఒంటి మీద ఉన్న బంగారు నగలను తీసి ఇచ్చేసారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ఆ విధంగా ఉండేది. అదే స్ఫూర్తి మా అందరిలోను బాగా పాదుకుపోయింది. ఈ స్ఫూర్తితోనే మా గ్రామంలో కూడా ఒక పాఠశాల పెట్టి దాంట్లో నేను ఉపాధ్యాయుడిగా పనిచేయటం మొదలుపెట్టా. అనేక ప్రాంతాల్లో కుల, మత ఘర్షణలు జరుగుతున్నాయని పేపర్లలో చదువుతూ ఉంటా. టీవీలలో చూస్తూ ఉంటా. కానీ స్వాతంత్రోద్యమంలో పనిచేసే మాలాంటి వారిలో అలాంటి భావనలేమి ఉండేవి కావు. మన వాళ్లు, పరవాళ్లు అనే భేదం ఉండేది కాదు. అప్పుడు స్వాతంత్ర్య ఉద్యమమే అందరి మతం. అదే అందరి కులం..

## జైలు జీవితం..

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో- స్వాతంత్ర్య ఉద్యమకారులపై బ్రిటిష్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. ఎలాంటి చిన్న అనుమానం ఉన్నా వెంటనే పోలీసులు వచ్చి అరెస్ట్ చేసేవారు. వీరికి సమాచారం అందించటానికి పెద్ద గూఢచారి నెట్‌వర్క్ కూడా పనిచేస్తూ ఉండేది. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి స్వాతంత్రోద్యమానికి సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తే పోలీసులు చాలా తీవ్రంగా పరిగణించేవారు. క్విట్ ఇండియా కార్యక్రమాలు ఎక్కడెక్కడ జరుగుతాయి? వాటిలో ఎవరెవరు పాల్గొంటారు మొదలైన విషయాలతో రెడీ అనే ఒక పత్రిక వచ్చేది. ప్రభుత్వం దీనిని నిషేధించింది కాబట్టి బహిరంగంగా ఎవరూ ఈ పత్రిక తరపున పనిచేయకూడదు. అందువల్ల ఈ పత్రికలోని సమాచారాన్ని మహారాష్ట్రలో చీమూరు అనే ప్రాంతం నుంచి కులకర్ణి అనే ఒక వ్యక్తి తీసుకొచ్చేవాడు. ఆయన పోలీసుల కంటపడకుండా గ్రామగ్రామాలు తిరుగుతూ ఉండేవాడు. ఆయన వచ్చి ఇచ్చిన సమాచారాన్ని నేను తెలుగులోకి అనువాదం చేసేవాడిని. బయట చేస్తే ఎవరికైనా తెలుస్తుంది కాబట్టి పొలాలలో సైక్లోస్టెయిల్ మిషన్ పెట్టి కాపీలు తీసేవాడిని. ఆ కాపీలను మరి కొందరు కార్యకర్తలు గ్రామగ్రామాలలో పంచేవారు. ఇలా అనేక గ్రామాలకు మేం సమాచారాన్ని చేరవేసేవాళ్లం.

ఇలా కొద్ది కాలం జరిగింది. పోలీసులకు అసలు విషయం తెలిసింది. దీంతో నన్ను , మరో అరవై మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాకు సమాచారం ఎక్కడి నుంచి వస్తోందో చెప్పమని చిత్రహింసలు పెట్టారు. కాని మేం చెప్పలేదు. దీంతో ఏం చేయలేక మమ్మల్నందరిని బందరు జైల్లో పెట్టారు. ఇది చాలా పురాతనమైన జైలు. అక్కడ పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. కొద్ది కాలానికి మమ్మల్ని విడుదల చేశారు. ఆ తర్వాత కాలంలో నన్ను నూజివీడు సబ్ జైలులో బంధించారు. అప్పట్లో అది చాలా అధునాతమైన జైలు. ఇలా ఎన్ని కష్టాలు పడ్డా- అందరిలోను స్వాతంత్ర్యమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. అందరూ తాము నమ్మిన ఆదర్శం కోసమే పనిచేసేవారు.

క్విట్ ఇండియా కార్యక్రమాలు ఎక్కడెక్కడ జరుగుతాయి? వాటిలో ఎవరెవరు పాల్గొంటారు మొదలైన విషయాలతో రెడీ అనే ఒక పత్రిక వచ్చేది. ప్రభుత్వం దీనిని నిషేధించింది కాబట్టి బహిరంగంగా ఎవరూ ఈ పత్రిక తరపున పనిచేయకూడదు. అందువల్ల ఈ పత్రికలోని సమాచారాన్ని మహారాష్ట్రలో చీమూరు అనే ప్రాంతం నుంచి కులకర్ణి అనే ఒక వ్యక్తి తీసుకొచ్చేవాడు. ఆయన పోలీసుల కంటపడకుండా గ్రామగ్రామాలు తిరుగుతూ ఉండేవాడు. ఆయన వచ్చి ఇచ్చిన సమాచారాన్ని నేను తెలుగులోకి అనువాదం చేసేవాడిని. బయట చేస్తే ఎవరికైనా తెలుస్తుంది కాబట్టి పొలాలలో సైక్లోస్టెయిల్ మిషన్ పెట్టి కాపీలు తీసేవాడిని. ఆ కాపీలను మరి కొందరు కార్యకర్తలు గ్రామగ్రామాలలో పంచేవారు. ఇలా అనేక గ్రామాలకు మేం సమాచారాన్ని చేరవేసేవాళ్లం.



## మరువలేని మనిషి 'గోరా'

దాదాపు ఇదే సమయంలో నాకు, మరి కొందరు మిత్రులకు గోపరాజు రామచంద్రరావు (గోరా) గారితో పరిచయం ఏర్పడింది. ఆయన అప్పటికే బందరులో సుప్రసిద్ధులు. మా గ్రామంలో నాస్తిక కేంద్రాన్ని పెట్టమని ఆహ్వానించాం. దీంతో ఆయన అలాగే చేశారు. బహుశా ప్రపంచంలో తొలి నాస్తిక కేంద్రం అదే కావచ్చు! ఒక వైపు స్వాత్రంత్ర్య ఉద్యమం. మరో వైపు మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం. ఆ సమయంలో ప్రజలలో అనేక రకాల మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలు ఉండేవి. అవి తొలగిపోకుండా మనకు స్వాతంత్ర్యం రావటం వల్ల ప్రయోజనం ఉండదని కొందరు నేతలు భావించేవారు. వాటి నిర్మూలనకు ప్రయత్నించేవారు. వారిలో గోరా కూడా ఒకరు. ఆయన మాలో ఒక ఉద్యమ స్ఫూర్తిని నింపారు. మేమందరం ఆయనతో కలిపి- హరిజనులతో సహపంక్తి భోజనాలు, కుల,మతాంతర వివాహాలు నిర్వహించేవాళ్లం. ఈ పెళ్లిళ్ల విషయంలో అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా ఉంది. ఆ సమయంలో మేము పది రూపాయలతో ఒక వివాహం చేసేసేవాళ్లం. ఇప్పుడు మామూలు రిజిస్ట్రర్ మ్యారేజీ చేసుకోవాలన్నా చాలా ఖర్చు అవుతుంది. నాలుగేళ్ల కార్యక్రమాలు నడిపిన తర్వాత గోరా గారు నాస్తిక కేంద్రాన్ని ముదునూరు నుంచి విజయవాడకు మార్చారు. అయినా ఆయన కుటుంబంతో నాకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయన పిల్లలు మనోరమ, విద్య నా దగ్గర చదువుకున్నవారే. లవణం కూడా నా దగ్గర కొద్ది కాలం చదువుకున్నాడు.

## ఒకరిపై మరొకరు..

నేను పుట్టింది, పెరిగింది, పనిచేసింది అంతా పల్లెలోనే. ఇప్పటికీ నేను సంవత్సరానికి ఒక సారైనా మా ఊరిలో పాఠశాలకు వెళ్తా. అయితే ప్రస్తుతం గ్రామాల పరిస్థితి చూస్తే చాలా బాధ వేస్తుంది. ఒక వైపు బీదరికం. మరో వైపు తారతమ్యాలు, ద్వేషాలు. గతంలో పరిస్థితులు మరీ ఇలా ఉండేవి కావు. ఒకప్పుడు గ్రామాలలో అందరూ కలిసి సమస్యలపై పోరాడేవారు. ఇప్పుడు చాలా గ్రామాలలో ఒకరిపై మరొకరు పోరాడుతున్నారు. అంతేకాదు. ప్రస్తుతం పిల్లలకు, యువకులకు మన దేశం గురించి పూర్తి అవగాహన లేదు. రాజకీయ నాయకులు కూడా ప్రజలను ఆకర్షించటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప వారికి ఏది మంచిదనే విషయాన్ని ఆలోచించటం లేదు. దీనికి నా దృష్టిలో విరుగుడు పార్టీయేతర ప్రజాస్వామ్యమే. గోరాగారు గాఢంగా నమ్మింది కూడా ఇదే. బహుశా అప్పుడే మనం మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలమేమో!''

• సివిఎల్ఎన్ ప్రసాద్

ఫోటోలు: రాజ్‌కుమార్









పుడమి పుత్రులు



**తరతరాలుగా వ్యవసాయం చేసుకునే వారు కూడా ఈ కాలంలో వ్యవసాయం అంటే భయపడిపోతున్నారు. యువత అయితే సాగు చేసేందుకు ససేమిరా అంటున్నది. అవసరమైతే పట్నం వెళ్లి ఆటో అయినా నడుపుకుంటాం కాని వ్యవసాయం మాత్రం చేయమని భీష్మిస్తున్నది నవతరం. కానీ ఉద్యోగం అనే బానిస బతుకు మాకొద్దు! పుడమితల్లిని నమ్ముకుంటాం... సొంతంగా సాగు చేసుకొని గౌరవప్రదంగా జీవిస్తాం...!! అంటున్నారు ఈ యువకులు. అనటమే కాదు ఆధునిక పద్ధతుల్లో సేద్యం చేసి, మంచి లాభాలు ఆర్జిస్తున్న ఆ యువకులతో మాట్లాడదాం రండి.**

# ఉద్యోగాలు వేస్ట్... సేద్యమే బెస్ట్!

మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామానికి చెందిన యువకులు స్వామి, వెంకటేష్, లక్ష్మణ్‌లు వ్యవసాయ కుటుంబాల్లో పుట్టారు. ఇంటర్ మీడియెట్ వరకు చదువుకున్నారు. తమ కుటుంబ జీవనాధారమైన వ్యవసాయం అంటే వారికి ఎంతో ఇష్టం. కాలేజీకి వెళ్లే రోజుల్లో కూడా సెలవుల్లో పొలం వెళ్లి, తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవారు. సొంత ఊళ్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వున్నప్పటికీ, బోరు వేసుకుని, తమకున్న కొద్దిపాటి పొలంలో వివిధ రకాల పంటలు పండించేవారు. ఇంటిల్లిపాదీ ఆరుగాలం కష్టపడి పనిచేసినా, ఆశించిన విధంగా దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడి చేతికందక నష్టపోవడాన్ని ఆ యువకులు బాగా గమనించారు. ఏం చేయాలా అని ఆలోచించారు. ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలనుకున్నారు. తమ గ్రామానికి సమీపంలో ఉన్న కౌడిపల్లి మండలం తునికి గ్రామంలో ఉన్న డాక్టర్ రామానాయుడు విజ్ఞాన జ్యోతి అగ్రికల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో వ్యవసాయ విద్యను అభ్యసించారు.

**పెరిగిన అవగాహన**

వ్యవసాయ క్షేత్రంలో భూసారం నుంచి సీడ్ టెక్నాలజీ, సాగునీటి నిర్వహణ పద్ధతులు, ప్లాంట్ పాథాలజీ, పంటను ఆశిస్తున్న క్రిమికీటకాలు, వివిధ రకాల పంటల సాగులో మెళకువలు, వ్యవసాయ పనిముట్ల నిర్వహణ దాకా పలు అంశాలపై వారు అధ్యయనం చేశారు. వ్యవసాయ విద్య చదువుకోవటంతో ఆ యువకులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భాగంగా వ్యవసాయానుబంధ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగాల్లో చేరారు కానీ వారి మనసు మాత్రం వ్యవసాయం మీదే వుంది. 'రైతు కుటుంబాల్లో పుట్టి, ఈ ఉద్యోగాలు చేయటం ఏమిటి?' అనుకున్నారు. వ్యవసాయం గురించి చదువుకున్నాం. పుడమితల్లిని నమ్ముకుందాం. ఆధునిక, సంప్రదాయ పద్ధతుల్ని మేళవించి, సాగుచేసి, అధికదిగుబడులు సాధిద్దాం అనుకున్నారు ఆ యువకులు. ఉద్యోగాలకు గుడ్‌బై చెప్పారు. పొలంబాట పట్టారు. వ్యవసాయాన్ని తమ భుజాలకెత్తుకున్నారు. సాగునీటి కొరత, పంటలకు చీడపీడల వంటి చిక్కులు ఎదురైనా తమకున్న పరిజ్ఞానంతో ఆ సమస్యల్ని అధిగమించారు. గ్రామంలో మిగిలిన రైతుల కంటే వారు అధిక దిగుబడి సాధించి రైతులోకానికే ఆదర్శంగా నిలిచారు. కన్నవారికి గర్వకారణమయ్యారు.

**ఆధునిక, సంప్రదాయ పద్ధతుల్ని మేళవించి, సాగు చేసి, అధికదిగుబడులు సాధిద్దాం అనుకున్నారు ఆ యువకులు. ఉద్యోగాలకు గుడ్‌బై చెప్పారు. పొలం బాట పట్టారు. వ్యవసాయాన్ని తమ భుజాలకెత్తుకున్నారు. సాగునీటి కొరత, పంటలకు చీడపీడల వంటి చిక్కులు ఎదురైనా తమకున్న పరిజ్ఞానంతో ఆ సమస్యల్ని అధిగమించారు. గ్రామంలో మిగిలిన రైతుల కంటే వారు అధిక దిగుబడి సాధించి రైతులోకానికే ఆదర్శంగా నిలిచారు.**

**తక్కువ పెట్టుబడి... అధిక దిగుబడి**

''వ్యవసాయ విద్య పూర్తయ్యాక ఏలూరులోని ఓ పత్తివిత్తనాల కంపెనీలో ఉద్యోగంలో చేరాను. చేస్తున్న ఉద్యోగం సంతృప్తినివ్వలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి సొంత ఊరు నార్సింగికి వచ్చి వ్యవసాయానికి శ్రీకారం చుట్టాను. మాకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, వరిపంటలు వేశాను. మొక్కజొన్నలో కావేరి 50:50 రకం విత్తనాలను శాస్త్రీయ విధానం ప్రకారం నాటాను. దుక్కిని లోతుగా దున్ని, సేంద్రీయ ఎరువు వేసిన తర్వాత శుద్ధి చేసిన విత్తనాలు వేశాను. సమగ్రసస్యరక్షణతో పాటు పంటల సాగులో మేలైన ఆధునిక విధానాలు అవలంభించడం ద్వారా రబీ సీజనులో ఎకరానికి 35 క్వింటాళ్ల మొక్కజొన్నలు దిగుబడి సాధించాను. ఎకరానికి కేవలం 12వేల రూపాయల పెట్టుబడితో 45 వేల రూపాయల పంట దిగుబడి సాధించాను. నా పొలంలో భూగర్భంలో తక్కువ నీరు ఉంది. అందువల్ల తక్కువ నీటితో పండే శ్రీవరిని ఎకరంలో వేశాను. నాగలితో దుక్కి దున్నటం, పురుగుల నివారణకు తక్కువ మోతాదులో పురుగు మందులతోపాటు వేపకాషాయం స్ప్రేచేయడం, పంట కోత, నూర్పిడి దాకా అన్ని పనులు స్వయంగా చేసుకున్నాం. మన పనులు మనమే చేసుకుంటే వ్యవసాయం తప్పక లాభసాటి అవుతుంది. భవిష్యత్‌లో మరో పదెకరాలు కౌలుకు తీసుకొని వివిధ పంటలను పండించాలనుకుంటున్నాను. నాకు తెలిసిన విషయాల్ని గ్రామంలోని ఇతర రైతులతో పంచుకుంటున్నాను. ''అన్నారు నార్సింగికి చెందిన సీహెచ్ స్వామి.

**డిమాండ్‌ను బట్టి పంటలు**

మార్కెట్‌లో వివిధ వ్యవసాయోత్పత్తుల ధరలను పరిశీలించి, ఏ పంట వేయాలనేది ఎంపిక చేసుకోవాలంటారు యువరైతు డి. వెంకటేష్. మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్న కొన్ని రకాల కూరగాయలను ఎంపిక చేసుకొని పండిస్తున్నానంటారాయన. నా పొలంలో క్యాబేజీ, ఆలుగడ్డ, బెండ, టమాటా, వంగ రకాల కూరగాయలు సాగు చేస్తున్నాను. ఇందులోనే బీర, కాకర, పొట్ల కాయలు కూడా వేశాను. వర్షపునీటిని ఉపయోగించుకొని తక్కువ నీటితో అధిక దిగుబడి నిచ్చే కొత్త వంగడాలను సాగు చేస్తున్నాను. దీని ద్వారా లాభాలు గడిస్తున్నానంటారు'' అగ్రికల్చర్ విద్యార్థి వెంకటేష్.

**ఏడాదికి రెండు పంటలు**

''కాలానుగుణంగా ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నాను. కావేరీ సీడ్స్‌లో ఉద్యోగాన్ని వదిలి మాకున్న మూడెకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నాను. ఒక పక్క డిగ్రీ చదువుతూ మరో వైపు వ్యవసాయం చేస్తున్నాను. ఉదయాన్నే ఆరుగంటలకే పొలం వెళ్లి 9 గంటల వరకు పనులు చేస్తుంటాను. ఆ తర్వాత కాలేజీకి వెళ్లి చదువుకొని సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి వచ్చాక ఆరుగంటల వరకు పొలం పనులు చేసుకుంటాను. అగ్రికల్చర్ వృత్తివిద్యా కోర్సుతో వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా చేయాలనేది తెలిసింది. పురుగులు, క్రిమికీటకాలను నివారించడానికి తక్కువ ఖర్చుతో పొగాకు, వేపకాషాయం స్ప్రేచేస్తుంటాను. అడ్డగోలుగా పెట్టుబడి పెంచుకోకుండా అధిక దిగుబడి సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి చూపించాలనేది నా లక్ష్యమంటారు'' లక్ష్మణ్. నవతరంలో మరింత మంది ఇలా ఆలోచిస్తే అన్నపూర్ణగా పేరొందిన మన రాష్ట్రం మరింతగా పురోగమిస్తుందనడంలో సందేహం లేదు. యువకులంతా సేద్యాన్ని వదిలేసి సిటీల బాట పడుతుంటే చేస్తున్న ఉద్యోగాల్ని వదిలేసి పల్లెసీమల్ని సస్యశ్యామలం చేసేందుకు నడంకట్టిన ఈ యువకులకు హేట్సాఫ్ చెబుదాం.

• సలీం

# వేద శాస్త్రాల పరమార్థం...

వేదాలు భూమి మీద అతి ప్రాచీనమైన, పరమ సమగ్రమైన శాస్త్రాలు. వేదాలు గ్రంథాలు కావు. వాటిలోని అంశాలు ఎవరో కనుగొన్నవీ కావు. అవి మరి ఎవరో రచించిన నీతిసూత్రాలు కావు. బాహ్యాపరంగా, అంతరంగం పరంగా కనుగొన్న అనుభవ జ్ఞానమే ఈ విజ్ఞానం. మన సంస్కృతికి చెందిన ప్రాచీన కాలజ్ఞాన భాండారమే ఈ వేదాలు. ఇందులో లేని విషయాలు లేవు. మనం ఎలా తినాలి. ఓ ఎద్దుల బండి ఎలా తయారు చేయాలి. ఘన ఇంధనాలతో ఏకంగా విమానాన్ని తయారు చేయడమెలా...మన ఇరుగు పొరుగు వాళ్లతో ఎలా మసలు కోవాలి. అంతేకాదు. పరలోక జీవులతో ఏ విధంగా మెలగాలి. చివరికి మీ యదార్థ స్థితిని ఎలా చేరుకోవాలి. ఇలా అన్ని అంశాలూ ఇందులో వివరించబడ్డాయి. వేదాలంటే ఏదో చదువుకునే పుస్తకాలు కాదు. అవి ఈ సృష్టికి సంబంధించిన పూర్తి సాంకేతిక విజ్ఞాన స్వరూపము.

**శబ్దానికి రూపం**

వేదాల్లోని అనేక అంశాలు రూపాన్ని శబ్దంగా అన్వయించడం గురించి ప్రస్థావించబడింది. శబ్దాన్ని కొలిచే సాధనమైన ఆసిలోస్కోప్‌లోకి మీరేదైనా శబ్దాన్ని లేదా ధ్వనిని పంపించినట్లయితే, ఆ శబ్దం ప్రకంపన, ఫ్రీక్వెన్సీ (పౌనః పున్యము), దాని విస్తరణ ఆధారంగా ఆసిలోస్కోప్ ఓ విధమైన రూపాన్ని ప్రదర్శిస్తుంది. ప్రతి శబ్దానికీ ఓ రూపం ఉంటుందన్న యధార్థం ఆధునిక విజ్ఞానంలో ఇప్పుడు రుజువు అయింది. ఈ విషయాన్ని మన వారు వేదాల్లో ఎప్పుడో ప్రస్థావించారు. అదేవిధంగా ప్రతి రూపమూ ఒక ధ్వని లేదా శబ్దం కలిగి ఉంటుంది. రూపానికి శబ్దానికి గల ఈ సంబంధాన్నే మనం మంత్రం అని అంటునానం. ఆ రూపాన్ని యంత్రం అని, శబ్దాన్ని మంత్రం అని అంటారు. ఈ శబ్దం, రూపం రెండింటిని కలిపి వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్నే తంత్రం అని అంటారు.ఈ సృష్టిలోని వివిధ రూపాలు, శబ్దాల మధ్యగల సంబంధాన్ని మనవారు పరిపూర్ణంగా తెలుసుకున్నారు. ఋగ్వేదంలో చాలా భాగం సామవేదం, అధర్వణ వేదం అంతా ఈ సంబంధం గురించే ఉంటుంది. అంటే, సృష్టిని శబ్దరూపంలోకి అన్వయించడం గురించే ఉంటుంది. ఫలితాన్ని కొన్ని రకాల శబ్దాలను ఉచ్చరించడం ద్వారా ఈ సృష్టి అంతా మీలోనే ప్రతిధ్వనించడాన్ని గమనించవచ్చు. ధ్వని మీద మీరు పట్టు సాధించడం ద్వారా రూపం మీద కూడా మీకు పట్టు లభిస్తుంది. ఇదే మంత్ర శాస్త్రం. దురదృష్టవశాత్తు ఇంతటి మహత్తర శాస్త్రం దారుణంగా దుర్వినియోగమైంది. వక్రీకరించబడింది.

**వేదాలను అవగతం చేసుకోవాలి**



చింతన

ఈ శాస్త్రాలన్నీ అంతర్గత మైనవి. వీటిని కాలేజీలకు వెళ్లి చదువుకోవడం సాధ్యం కాదు. ఇవి అంతఃకరణ పరమైనవి కావునే అన్ని రకాల వక్రభాష్యాలకూ గురయ్యాయి. అలాగే అనేక విధాల దుర్వినియోగమయ్యాయి. ఈ దుర్వినియోగం వక్రభాష్యాలు ఎంతవరకూ వెళ్లాయంటే...అసలు విషయం హరించుకు పోయి, మొత్తం అర్థరహితంగా మారాయి. వేదాలను అవగతం చేసుకోవాలంటే పూర్తి జీవితం దానికి వినియోగించాలి. మీ మొత్తం జీవితమంతా వాటి కోసం ధారపోయాలి. లేకుంటే అవి మీకు పట్టుబడవు. ఓ విద్యార్హతను (డిగ్రీనిఇ) సంపాదించాలనో, లేదా దానిని ఒక వృత్తిగా స్వీకరించాలనో మీరు భావిస్తే అది మీ వశం కావు. వాటి కోసం మిమ్మల్ని మీరు పూర్తిగా అర్పించుకోవాల్సిందే. అప్పుడే అవి మీకు లభిస్తాయి. ఆధునిక విద్యా శాస్త్రవేత్తలు ఏమి హెచ్చరిస్తున్నారంటే, ఓ బాలుడు కిండర్‌గార్టెన్ స్కూల్లో చేరి వరుసగా 20 సంవత్సరాల పాటు విద్యను నేర్చుకొని, చివరకు ఓ పీహెచ్‌డీ సంపాదిస్తే...ఆ రకమైన విద్యా విధానం కారణంగా అతనిలోని 70 శాతం మేధోశక్తి పూర్తిగా నాశనమైపోతుందని చెబుతున్నారు. కేవలం అతను తెలివిగల మూర్ఖుడిగా అవుతున్నాడని వారి విశ్లేషణ. అంటే, మౌలిక జీవిత జ్ఞానం వారిలో మచ్చుకు కూడా లేకుండా తుడిచి పెట్టుకుపోతుందన్నమాట. దీనికి విద్యా శాస్త్రవేత్తలు ఓ చక్కటి సూచన కూడా చేశారు.ఆడుతూ పాడుతూ, కథలుగా వింటూ విద్య నేర్వాలనేదే వారి సలహా. ఇదే ప్రాచీనులు వేలాది సంవత్సరాల కిందటే అమలు చేశారు. శాస్త్రపరిజ్ఞానానికి సంబంధించిన అత్యున్నత అంశాలను, విషయాలను వారు కథల రూపంలో ప్రకటించారు. శివపురాణం వంటి మహాద్భుతమైన విద్యాశాస్త్రం చక్కని కథల రూపంలో పొందుపర్చబడినది. అయితే దురదృష్ట వశాత్తూ క్రమేణా జనం దీన్ని సక్రమంగా ముందు తరాలకు అందించలేక పోయారు. వారు అంతర్లీనంగా ఉన్న శాస్త్రపరిజ్ఞానాన్ని వదిలివేసి కేవలం కథలనే ప్రచారం చేశారు. కథలు ఓ తరం నుంచి తరువాతి తరాలకు చేరేసరికి వాటి సహజ స్వరూపాన్ని కోల్పోవడమే కాకుండా వాటిలో ఎన్నో అతిశయోక్తులు వచ్చి చేరుతాయన్న సంగతి మనందరకూ తెలిసిందే. అది సర్వ సహజం కూడా. వేద, పురాణ, ఇతిహాసాల విషయంలో ఇప్పుడు జరిగినది కూడా అదే.

**అవగాహన పెరగాలి**

విషయ పరిజ్ఞానం పెంచడం కాకుండా అవగాహన విస్తృత పర్చడం పైనే వేద సంస్కృతి ఎప్పుడూ దృష్టి పెడుతూ వచ్చింది. అయితే ఇప్పటి మన విద్య అంతా కేవలం సమాచార సేకరణ మీదే కేంద్రీకరించి ఉంది తప్ప జ్ఞాన సముపార్జనపైన లేనే లేదు. ఈ తరహా అధ్యయనం, సమాచారాన్ని సమీకరించే ఈ ప్రయత్నం అంతా...సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ కాలంలో పూర్తిగా నిరుపయోగంగా మారిపోతుంది. ఓ మనిషి ఈ భూమి మీద ప్రభావశీలంగా, వివేకవంతంగా జీవించడానికి అత్యవసరమైనది. తన అవగాహన విస్తరించుకోవడమొక్కటే. ఇందుకు అతడు తన అవగాహన ప్రస్తుత పరిమితులను అధిగమించే విధంగా పెంపొందించుకోవాలి. అప్పుడు మాత్రమే అతడు పూర్తి భిన్నమైన రీతిలో వ్యవహరించగలుగుతాడు.

వ్యక్తి తన పంచేంద్రియాలను అధిగమించగలిగే ఎన్నో పద్ధతులను యోగం సిద్ధం చేసింది. తద్వారా అతని అవగాహన ఈ భౌతిక ప్రపంచానికి అతీతంగా విస్తృతమవుతుంది. అనుభూతి భౌతికాతీత స్థాయికి పెరిగినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక ప్రక్రియ మొదలవుతుంది. మీరు చదివినంత మాత్రాన్నో, దాని గురించిన సమాచారాన్ని పోగు చేసినంత మాత్రాన్నో ఆధ్యాత్మికత మీకు లభ్యం కాదు. మీరు సేకరించిన ఆధ్యాత్మికత అంతా కేవలం మీ బుర్రలో నిక్షిప్తం చేసుకున్నదే అయితే దాని వల్ల ప్రయోజనం శూన్యం. ఎందుకంటే ఆధ్యాత్మికత అనేది అంతర్గత ప్రక్రియ.

• సద్గురు

# రిజిస్టర్ చేసుకోగానే నా వాటా పోతుందా?

**మేము ఇద్దరం అన్నదమ్ములం. నేను పెద్దవాణ్ని. నాకు వివాహమై ఒక కుమారుడు. మా నాన్న నిరక్షరాస్యుడు. మా తల్లికి నేనంటే అసలే గిట్టదు. నా పెళ్లయిన కొన్నాళ్లకు నన్ను వేరుగా జీవించమని చెప్పి, అప్పటివరకు కుటుంబానికి ఉన్న అప్పులను రెండు భాగాలు చేసి ఒక భాగం నా మీద వేశారు. మా తమ్ముని పెళ్లి కానందున, చిన్నకొడుకు సంరక్షణలో ఉంటున్నామంటూ తలిదండ్రులూ, చిన్నకొడుకు ముగ్గురికీ కలిపి అప్పుల్లో ఆ మిగతా ఒక భాగం వారి మీదికి వచ్చేలా పెద్దమనుషుల సమక్షంలో పంచారు. ఆస్తి గురించి మా నాన్నను అడిగితే. ముందు చిన్న అబ్బాయి పెళ్లి అయిపోయి వేరుగా జీవించడం మొదలవ్వాలి. ఆ తరువాత మీరు మా ఇద్దరినీ సరిగ్గా చూసుకుంటే, అప్పుడు మీ ఇద్దరికీ ఆస్తి పంచి ఇస్తానని చెప్పాడు. ఈ విషయాలన్నీ కాగితం మీద రాయిస్తే, మేమంతా సంతకాలు చేశాం. అయితే మా తల్లిగారి ధోరణి వల్ల సొంతింట్లో ఉండలేక, నా కుటుంబాన్ని వెంట తీసుకుని నేను వేరే ఊళ్లో ఉంటున్నాను. మేము ఇంట్లో ఉండడం లేదన్న మిషతో మా నాన్నగారు తన మొత్తం ఆస్తిని, తన చిన్న కుమారుడి పేరు మీద రాయాలని చూస్తున్నాడు. ప్రస్తుతం మా నాన్నగారు తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నారు. మా తల్లిగారేమో ఆయన పోతే, మొత్తం ఆస్తి ఎలాగూ తన పేరుమీదే ఉంటుంది కాబట్టి, ఆస్తిని ఎవరికీ పంచను అంటోంది. ఒకసారి అప్పులు పంచేసిన తరువాత, ఎవరికి వారు విడిగా జీవిస్తున్నప్పుడు మళ్లీ అప్పులు వేయవచ్చా? మా నాన్నగారు నా సంతకం లేకుండానే, మొత్తం ఆస్తిని తమ్ముడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తే అది చెల్లుతుందా? ఒకవేళ అలా నాకు తెలియకుండా మా తమ్ముడి పేరు మీద ఆస్తి అంతా రిజిస్ట్రేషన్ అయిపోతే, నా వాటా మాటేమిటి? అసలు చట్టం ప్రకారం మా తల్లిగారికి ఆస్తిలో వాటా ఉంటుందా? ఈ వివరాలు తెలియచేయండి.**

**- జివికె యాదవ్**



లీగల్

మీ నాన్నగారు తన స్వార్జితమైన ఆస్తిని, వారి యిష్టాయిష్టాల మేరకు, రిజిస్టర్ దస్తావేజు ద్వారా ఎవరికైనా అన్యాక్రాంతం చేసినప్పుడు మాత్రమే, ఆ వ్యక్తులకు ఆ ఆస్తిపై, యాజమాన్యపు హక్కులు సంక్రమిస్తాయి. కానీ, మీ విషయంలో మీ నాన్నగారు, మీ కుటుంబ అవసరాలకు చేసిన అప్పులో సగభాగం మీరు చెల్లించాల్సిందిగా పెద్దమనుషుల సమక్షంలో నిర్ణయిస్తూ, తన ఆస్తిపాస్తులను విభజిస్తూ, ఒక సాదాకాగితం రాసినందువల్ల అది కూడా చట్టం దృష్టిలో చెల్లుతుంది. ఇకపోతే అంతకు ముందే రాసిన కాగితానికి విరుద్ధంగా, మీ నాన్నగారి నిరక్షరాస్యత అమాయకత్వం ఆధారంగా, మీ తల్లి ప్రేరణ మేరకు మీ తమ్ముని పేరిట ఏదైనా రిజిస్టర్డ్ దస్తావేజు చేసినట్లయితే, దానిపై మీరు ఇంతకు క్రితమే రాసినసాధారణ దస్తావేజు ఆధారంగా, సివిల్ న్యాయస్థానంలో కేసు వేయవలసి ఉంటుంది. ఇకపోతే మీరు కోరినట్లుగా, హిందూ వారసత్వ చట్టం ప్రకారం, మీ నాన్నగారు వీలునామా రాయకుండానే చనిపోయి ఉంటే, ఆ ఆస్తి మొదటి తరగతి వారసులైన మీ తల్లికి, ఆమెతో పాటు మీకు, మీ తమ్ముడికి సమానంగా చెందుతుంది. అంటే మీ ముగ్గురికి మూడింట ఒక వంతు చొప్పున ముగ్గురికీ సమానంగా వస్తుంది. ముఖ్యంగా మీ తల్లిగారికి కూడా మీతో పాటే ఒక వాటా మాత్రమే వస్తుంది తప్ప, మీ నాన్న స్వార్జితమైన మొత్తం ఆస్తికి ఆమె ఒక్కతే వారసురాలు కాలేదు. ఇకపోతే ఒకసారి ఆస్తి విషయమై పంపకాలు జరిగిన తరువాత, వేరేగా జీవిస్తున్నప్పుడు మళ్లీ అప్పులు వేస్తారా? అంటూ మీరు ప్రశ్నించారు. వారి కొడుకులుగా మీరు ఆస్తిలో హక్కు అడుగుతున్నప్పుడు, వారి అప్పులో కూడా భాగం పంచుకోవలసి ఉంటుంది. ఇందులో గతంలోనే ఒకసారి మీ వాటా అప్పు మీమీద వేసుకున్నప్పుడే, ఇక ముందు కుటుంబ అవసరాల కోసంగానీ, మరే ఇతర అవసరాల కోసం గానీ మళ్లీ అప్పులు చేస్తే, ఆ అప్పుతో మీకు సంబంధం లేదని ఏదైనా కాగితం రాసుకుని ఉండాలి. అలా అయితేనే, ఆ తరువాత చేసిన అప్పులకు మీరు బాధ్యులు కారు. పైగా మీరు మీ కుటుంబానికి కూడా దూరంగా ఉండడం వల్ల ఆ అప్పు విషయంలో మీకు ఏ రకమైన బాధ్యతా ఉండదు. ఇకపోతే మీ నాన్నగారు తన ఇష్టపూర్వకంగా, ఎవరి ఒత్తిడీ లేకుండా, తన స్వార్జితమైన ఆస్తిని, మీ తమ్ముడికి రిజిస్టర్డ్ దస్తావేజు ద్వారా దారాదత్తం చేయవచ్చు. కాకపోతేఇంతక్రితమే పెద్దల సమక్షంలో అప్పుల విభజన చేసినందువల్ల అలాగే ఆస్తులను ఏకపక్షంగా తన ఆస్తిని మీ తమ్ముడికి దారాదత్తం చేయడానికి వీలు లేదు. ఒకవేళ మీ తమ్ముడు మీకు తెలియకుండా మొత్తం ఆస్తిని తన పేరు మీద రిజిస్టర్ చేసుకున్నట్లయితే, మీరు ఇంతకు క్రితమే పెద్ద మనుషుల సమక్షంలో అప్పును పంచుతూ, రాసుకున్న కాగితాల ఆధారంగా, సివిల్ న్యాయస్థానంలో దాన్ని ప్రశ్నించే హక్కు మీకు ఉంటుంది. అందువల్ల , సాదా కాగితం మీద రాసుకున్నటువంటి ఆస్తిని అట్టి శరతులకు లోబడి సివిల్ న్యాయస్థానం ద్వారా మీరు దానిపై యాజమాన్యపు హక్కులను పొందవచ్చు. మీ తమ్ముడు తన పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నంత మాత్రాన ఆ ఆస్తిపై అతనికి సంపూర్ణ యాజమాన్యపు హక్కులు అతనికేమీ సంక్రమించవు. అందువల్ల మీరు ఈ విషయమై ఆందోళన చెందాల్సిన అవసరమేమీ లేదు. కాకపోతే, మీ ఆస్తికి సంబంధించిన యాజమాన్యపు హక్కులు పొందడానికి సివిల్ న్యాయస్థానాన్ని సంప్రదించడం తప్పనిసరి అవుతుంది.



వొడ్నాల శ్రీహరి
న్యాయవాది, హైదరాబాద్

**తూర్పు గోదావరి జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాకలో 1972 సంవత్సరంలో వెలసిన దివ్యక్షేత్రం శ్రీ విజయ దుర్గా పీఠము. దుర్గాదేవి ప్రేరణతో స్థాపించిన ఈ ఆధ్యాత్మిక కేంద్రానికి వెదురుపాక 'గాడ్'గారుగా భక్తులు పిలుచుకునే వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం పీఠాధిపతి. పంచలోహాలతో అష్టభుజ వ్యాఘ్రవాహినిగా దుర్గాదేవి కొలువై ఉందీ పీఠం. గడచిన 40 సంవత్సరాలుగా కేవలం మజ్జిగనే ఆహారం చేసుకుని అమ్మవారి సేవలో తరిస్తున్న 76 సంవత్సరాల ఈ ఆధ్యాత్మిక గురువు ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలపై వ్యక్తంచేసిన అభిప్రాయాలు...**



# గురువు ధర్మం వీడరాదు

ఏ యుగంలోనైనా ధర్మం ఒక్కటే. ధర్మానికి ఎప్పుడూ భేదం లేదు. ఆచార వ్యవహారాలన్నవి ఆయా ప్రాంతాలను బట్టి ఉంటాయి. కాని, ధర్మం అలా కాదు. పెద్దలు ఆచరించే ఆచారాలే వారి పిల్లలూ అనుసరిస్తారు. కలియుగంలో కలి పురుషుడు వస్తాడు...చెడును అంతమొందిస్తాడు అని చాలామంది విశ్వసిస్తుంటారు. నిజానికి, కలి పురుషుడు మరెవరో కాదు...సాక్షాత్తు ఆ వేంకటేశ్వరుడే. కల్కి రూపమంటే ఆయనేనని వేంకటేశ్వర సుప్రభాతంలో స్పష్టంగా పేర్కొని ఉంది కూడా. నీ తర్వాత మరెవరూ లేరని కూడా అందులో ఉంది.

**ఇదే కలియుగ ధర్మం**

ఉపకారం చేసేవాడికి అపకారం చేయడం కలియుగ ధర్మం. ఈ యుగ లక్షణం పాడుచేయడానికే కాని బాగుచేయడానికి కాదు. తల్లీ తండ్రి బ్రతికున్నంత కాలం సమిష్టి కుటుంబం. వారు కాలం చేసిన తర్వాత వేరు కుటుంబం. ఇది ఈ యుగ ధర్మం. పూర్వకాలంలో అపుత్రస్య గతం నాసి అన్నారు. కాని ఇప్పుడు సుపుత్రస్య సర్వం నాస్తి అనాలి. మనిషి కోరిక పదిమందికి ఉపయోగపడే విధంగా ఉండాలే తప్ప స్వార్థపూరితంగా ఉండరాదు. రోజూ ఆ భగవంతుడిని దర్శించుకునే అవకాశం కల్పించాలని కోరుకుంటేనే సర్వ ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్థం.

**వేదసారమే పరమార్థం**

వేదాలను మించింది లేదు. అలాగే రామాయణ, మహాభారత కావ్యాలను వాల్మీకి, వ్యాస భగవానుడు రాయగా వాటికి విరుద్ధంగా చాలా గ్రంథాలు వచ్చాయి. వీటిని ఇతిహాసాలుగానే వ్యవహరించాలి. మానవుడు ఎలా ధర్మనిరతితో జీవించాలో ఈ కావ్యాలు తెలియచేస్తాయి. మానవుడికి ఆశ అనేది సహజ లక్షణం. అయితే ఆ ఆశ ఎలా ఉండాలంటే మనం తినగా మిగిలినది ఇతరులకు పెట్టాలి అన్నట్లుగా ఉండాలే తప్ప సర్వం నాకే అన్నట్లు ఉండకూడదు. ప్రస్తుతం కలియుగ ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. అందుకే ధర్మం దారితప్పింది. మనుషుల్లో అసూయాద్వేషాలు పెచ్చు మీరుతున్నాయి. నిజానికి ఈ పరిస్థితి ఏర్పడడానికి ఎవరో కారణం కాదు. ఎవరి సంతానాన్ని వారు దారిలో పెట్టనందువల్లే ఈ అనర్థమంతా. భగవద్గీతలో ఒక శ్లోకం ఉంది. దాని ప్రకారం ఒక మహావృక్షం భూమిలో ఉండే వేర్లు పూర్వీకులని, కాండం తండ్రి అని, పలవలు ప్రస్తుత తరమని, పుష్పాలు, పండ్లు మనవలు అని అర్థం. వేర్లు బలంగా ఉంటే మిగిలిన చెట్టంతా బాగుంటుంది. మన పూర్వీకులు, తాత, తండ్రి ఏ ధర్మాన్నయితే ఆచరించారో ఆ ధర్మాన్ని మనం కూడా ఆచరించి మన పిల్లలకు నేర్పించాలి. అలాగే నిన్న, నేడు, రేపు మాత్రమే వాస్తవం. నిన్న గడచిపోయిన కాలం. నేడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్న సత్యం. రేపు ఆశ. రేపు అనేది ఉంది. అయితే మనం జీవించి ఉంటామో లేదో తెలియదు. నిన్న జరిగిపోయింది. నిన్నను మన తండ్రిగా భావించాలి. నేడు మనం. రేపు మన పిల్లలు, ఇదే విషయాన్ని మరింత వివరంగా చెప్పాలంటే వారానికి ఏడు రోజులు ఉంటాయి. అటు మూడు రోజులు, ఇటు మూడు రోజులు, మధ్యలో ఒక రోజు. అటు మూడు రోజులును మన ముత్తాత, తాత, తండ్రిగా భావించాలి. ఇటు మూడు రోజులును మన పిల్లలు, మనవలు, మునిమనవలుగా పరిగణించాలి. మధ్యలో ఉన్న నేడు మనమని తెలుసుకోవాలి. మన పూర్వీకులు పాటించిన ఆచారాలను మనం పాటించి రేపటి తరానికి అందచేయగలిగితే ఆచార వ్యవహారాలను కలకాలం ఉంటాయి.

**యువత సన్మార్గంలో నడవాలంటే...**

ప్రస్తుత సమాజంలో యువత చెడు మార్గం పట్టడానికి ప్రధాన కారణం వారి తల్లిదండ్రులదేనని చెప్పాలి. ఆర్థిక శాస్త్ర సూత్రాల ప్రకారం అవసరం, సౌఖ్యం, విలాసవంతం అని మూడు అంశాలు ఉన్నాయి. ఒక అధికారికి కారు అవసరం. అదే ఒక విద్యార్థికి విలాసవంతం. విద్యార్థికి సైకిల్ అవసరం. స్కూటర్ సౌఖ్యం, కారు విలాసవంతం. ధనం అపరిమితంగా ఉందని పిల్లలను విలాస జీవితానికి అలవాటు చేస్తే ఎటువంటి దుష్పరిణామాలు జరుగుతాయో మన కళ్ల ముందే జరుగుతున్న సంఘటనలు తెలియచేస్తున్నాయి. ఇవన్నీ అధిక డబ్బు తెచ్చే అనర్థాలే.

కార్పొరేట్ చదువులు కూడా పిల్లలు మన సంస్కృతిని మరచిపోయేలా చేస్తున్నాయి. పిల్లలకు చదువు తప్ప తల్లిదండ్రులతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఇక హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు తమ స్నేహితులే వారికి తెలిసిన ప్రపంచంగా మారిపోతోంది. అలాగే ఇంట్లో ఇంగ్లీష్ మాట్లాడటం ఒక గొప్పగా భావిస్తూ మాతృభాషను మరచిపోతున్నారు. మన భాషను, సంస్కృతిని విస్మరిస్తున్నారు. ఇప్పుడు 'అ' అంటే అన్నం, 'ఆ' అంటే ఆకలి, 'ఇ' అంటే ఇక్కట్లు, 'ఉ' అంటే ఉన్నాయని అర్థం ఏర్పడుతోంది. అంటే అన్నం కోసం, ఆకలి కోసం, ఇక్కట్లు ఉన్నాయని అర్థం. ఈ పరిస్థితులకు పోటీ చదువులే కారణం. పక్కవాడి కన్నా ఎక్కువ మార్కులు రావాలి...పిల్లలకు ఎందులో ఆసక్తి ఉందో తెలుసుకోకపోవడం కూడా పెద్దలు చేస్తున్న తప్పు. ఇంటికొస్తే ట్యూషన్లు, క్షణం తీరిక లేని చదువుల భారంతో విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగి వారిలో మానసిక చంచలత్వం ఏర్పడుతోంది.

**ఒక తండ్రి తప్పు చేస్తే కుటుంబం నాశనమవుతుంది. ఒక గ్రామపెద్ద తప్పుచేస్తే గ్రామం నాశనమవుతుంది. ఒక గురువు తప్పు చేస్తే వ్యవస్థే నాశనమవుతుంది. గురు స్థానంలో ఉన్నవారు ముందు వారు సన్మార్గంలో నడవగలిగితే యావత సమాజమే ధర్మ మార్గాన్ని అనుసరిస్తుంది.**

• టి.సుధాకర్

# కంటినిండా నిద్రపోవాలంటే...

కార్యాలయానికి వచ్చిన సుబ్బారావు పని చేస్తూనే మధ్యలో టేబుల్‌పై కాస్త కునుకు తీస్తున్నాడు. ఏమిటీ కళ్లు వాసిపోయి నీరసంగా కనిపిస్తున్నావని తోటి ఉద్యోగి వెంకట్ ప్రశ్నించాడు. ''రాత్రి వేళ నాకు నిద్ర పట్టడం లేదు. గత వారం రోజులుగా సరిగా నిద్రలేక సతమతమవుతున్నాను'' అని అన్నాడు సుబ్బారావు. ఒక్క సుబ్బారావే కాదు... ఇలా నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న వారెందరో ఉన్నారు. నిద్రలేమి సమస్యను అధిగమించేదెలా అనే అంశంపై నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.



- ఓ తల్లి తన చంటిపాపను సమయం ప్రకారం ఎలా నిద్ర పుచ్చుతుందో అలా... నిద్రపోయే వేళలతో షెడ్యూల్‌ను రూపొందించుకోవాలి. వీకెండ్స్‌లో రాత్రి ఆలస్యంగా నిద్రపోతే ఉదయాన్నే ఆలస్యంగా నిద్ర లేస్తుంటారు. అలా కాకుండా నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిద్రపోయేలా చూసుకోవాలి.
- పగటివేళ నిద్రపోకుండా నివారించుకోండి. దీనివల్ల రాత్రి నిద్రకు భంగం వాటిల్లకుండా చూసుకోవచ్చు.
- ఉదయం లేదా మధ్యాహ్నం వేళ అరగంటసేపు వ్యాయామం చేయడం వల్ల మీకు మంచి నిద్ర పడుతుంది.
- నిద్రపోయే ముందు వేడినీళ్లతో స్నానం చేయడం వల్ల మంచి నిద్ర పట్టవచ్చు.
- మీరు నిద్రకు కనీసం రెండు గంటల ముందు తినడం మంచిది. నిద్రకు ముందు కాఫీ తాగకండి.
- ఫిక్షన్ పుస్తకాలు చదవటం వల్ల నిద్రలోకి త్వరగా జారుకోవచ్చు.
- మీ పడక గదిలో వేడిగా ఉండకుండా చూసుకోండి. శీతకాలంలో వెచ్చదనాన్ని ఇచ్చే దుస్తులు ధరించడం వల్ల నిద్ర బాగా పడుతుంది.
- నిద్రపోతున్నపుడు మ్యూజిక్ గాని టీవీని గాని పెట్టుకోకుండా ఆఫ్ చేయండి. పడక గది నిశ్శబ్ధంగా ఉండేలా చూసుకోండి.
- పడుకునే ముందు మద్యం తాగకండి. రాత్రి వేళ బాగా నిద్ర పోవటం ఆరోగ్యానికి మంచిదనే వాస్తవాన్ని గుర్తించండి.




# మహిళా కార్పొరేటర్లే మంచి ఫలితాలిస్తారు!

**కాలేజీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బోధించే లెక్చరర్ అనుకోకుండా రాజకీయ రంగంలోకి కాలుపెట్టడమే విచిత్రమనుకుంటే, అరవయ్యేళ్ల వయసులో పీహెచ్‌డీ పట్టానందుకోవడం ఇంకా విచిత్రంగా అనిపిస్తుంది ఎవరికైనా. యూనివర్సిటీ గడప దిగి వచ్చేసాక తెలుగుదేశం ఎమ్మెల్యేగా, విశాఖ నగర మేయర్‌గా పనిచేసిన రాజాన రమణి మళ్లీ అదే యూనివర్సిటీ మెట్లెక్కి 'స్థానిక సంస్థల్లో మహిళా కార్పొరేటర్లు' అన్న అంశంపై పరిశోధన పూర్తిచేశారు. ఆసక్తి కలిగించే ఆ పరిశోధన వివరాలు ఆమె మాటల్లోనే...**

''అరవయ్యేళ్ల వయసులో పీహెచ్‌డీ చెయ్యడమేమిటి, ఎందుకు అని మీరడగొచ్చు. దానికి ముందు నా నేపథ్యం చెప్పాలి. 1976లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పట్టా పుచ్చుకున్నాక నేను చదివిన కాలేజీలోనే లెక్చరర్‌గా చేరాను. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు పీహెచ్‌డీకి దరఖాస్తు చేశాను. తర్వాత రోటరీ గ్రాడ్యుయేట్ స్కాలర్‌గా అవకాశం రావడంతో అమెరికాలోని జార్జియా యూనివర్సిటీలో 79-80కాలంలో మరో డిప్లమా చేశాను. ఈ చదువు వల్లే నాకు రాజకీయాలంటే ఆసక్తి ఉండేది. అలాగని జెండాలు పట్టుకొని సభల్లో ఎప్పుడూ పాల్గొనలేదు. 1985లో ఎన్టీఆర్‌గారు 'తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా' అని పిలుపునిచ్చి అప్పటిదాకా ఆ వాసనలేమీ లేని విద్యావంతులను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. ఆ సమయంలో నేను చాలా యాదృచ్ఛికంగా ఎమ్మెల్యేనయ్యాను. ఐదేళ్ల పదవీకాలం తర్వాత ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాను. 2000 సంవత్సరంలో విశాఖ నగర మేయరు స్థానం మహిళలకు రిజర్వు కావడంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచాను. ఆ సమయంలో పాలనా యంత్రాంగం తీరుతెన్నులు, ప్రజల అవసరాలు, స్థానిక ప్రజాప్రతినిధుల పనితీరు వంటివి సమగ్రంగా అర్థమయ్యాయి. అప్పుడే ఓ సమావేశానికి ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. హాల్లోకి వెళ్లే ముందు చూస్తే ఓ యువతి ఏడుస్తూ కనిపించింది. ఎవరా అని ఆరా తీస్తే, ఆమె కర్నూలు మేయరని తెలిసింది. సమావేశం జరిగే హాల్లోకి వెళ్లడానికి భయపడి ఏడుస్తోంది! 'ఏం పర్లేదు, నేనున్నా, నాతోపాటే కూర్చో' మని ఎంతో నచ్చజెప్పాక బెరుగ్గా వచ్చింది. ఆ సంఘటన నన్ను చాలా కదిలించింది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళల స్థితిగతుల గురించి లోతుగా తెలుసుకోవాలన్న ఆనాటి ఆలోచనే ఈనాటికి పీహెచ్‌డీ పరిశోధనాంశమైంది.''

## సవాళ్లెన్నో...

''92 తర్వాత 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంతో చట్టసభల్లోకి ప్రవేశించే మహిళల సంఖ్య పెరిగింది. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికయ్యే వారి కన్నా, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే మహిళల స్థితిగతులు చాలా వేరుగా ఉంటాయి. చదువు, ఆర్థిక స్థాయి, అవగాహన అన్నిటిలోనూ తేడా లుంటాయి. అందుకే మహిళా కార్పొరేటర్లను అధ్యయన అంశంగా ఎంచుకున్నాను. 2009లో మన రాష్ట్రంలోని పద్నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లలో మొత్తం 317మంది మహిళలు కార్పొరేటర్లుగా ఉన్నారు. మా గైడ్లు ప్రొఫెసర్ రత్నకుమారి, రవిల సహకారంతో సవివరమైన ప్రశ్నావళి రూపొందించుకున్నాను. అందరినీ నేను వ్యక్తిగతంగా వెళ్లి కలిసి సమాధానాలు పొందలేను గనక మరొక పరిశోధక విద్యార్థిని సాయం తీసుకున్నాను.



నా పరిశోధనలో తేలినదేమంటే, ప్రజాప్రతినిధులుగా స్త్రీలు ఎన్నికైన చోట్ల అవినీతి, లంచగొండితనాలు తక్కువ. వార్డుల్లోని మహిళలు సమస్యల్ని చెప్పుకోవడానికి ధైర్యంగా ముందుకొస్తారు. వీరూ వారికి అందుబాటులో ఉంటారు. అలాగే స్థానిక సమస్యలు ఆడవారికి బాగా అర్థమవుతాయి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తారు. అయితే ప్రజాప్రతినిధులుగా రాణించడంలో మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులు లెక్కలేనన్ని. పురుషులతో పోలిస్తే వాళ్లకెదురయ్యే ప్రతిబంధకాలు మూడింతలుంటాయి. మొదటిది ఇల్లు, పిల్లలు. నలభయ్యేళ్లలోపు ఆడవారు రాజకీయాల్లోకి రావడానికి ఇవే ముఖ్య అడ్డంకులు. రిజర్వేషన్లను అమలు చెయ్యడంలో భాగంగా పార్టీలు స్థానికంగా పట్టున్న రాజకీయ కుటుంబాల్లోని స్త్రీలకే టికెట్లిస్తాయి. దీంతో అప్పటికే రాజకీయానుభవం ఉన్న భర్త చాటు భార్యలే కార్పొరేటర్లవుతుంటారు. దీనివల్ల భర్తల జోక్యం వీరి పనిలో ఎక్కువగా ఉండి, వీరు నామమాత్రంగా మిగిలిపోతున్నారు. అయినా రెండేళ్లు గడిచేసరికి వాళ్లకి తమ పరిధి, అధికారం, హక్కులు వంటివన్నీ అవగాహనలో కొస్తున్నాయి. దాంతో ముందడుగెయ్యాలనుకున్నప్పుడు ఇంట్లో భర్తతో విభేదాలు వస్తున్నాయి. 'ఈ చిన్న పదవి కోసం కట్టుకున్నవాడితో గొడవలెందుకులే' అని మిన్నకుండిపోతున్నారు కార్పొరేటర్లు.

ఇంటిపోరును అధిగమించి పనిచేద్దామనుకున్న వారికి బైట నుంచి మరిన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి. అదెలాగంటే - మహిళా కార్పొరేటర్లు ప్రశ్నిస్తే మున్సిపల్ అధికారులు సరిగా స్పందించరు. విలువనిచ్చి మాట్లాడరు. కుల, లింగ వివక్ష అధికంగా ఉంటుంది. సాటి పురుష కార్పొరేటర్లు, కమిషనర్లు, ఇతర అధికారులు తీవ్రమైన పదజాలంతో దూషించిన ఉదంతాలూ ఉన్నాయి. ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొని మరీ పనిచేస్తున్నప్పటికీ కనీసం నలభై శాతం మంది మహిళా కార్పొరేటర్లు పాలనలో మంచి ఫలితాలనే అందించారన్నది నా పరిశోధనలో తేలింది.

## కొన్ని మెరుపులూ ఉన్నాయి...

'లాలించే చెయ్యి పాలించగలదు' అన్నదే నేను నమ్మిన సూత్రం. వచ్చే ఎన్నికల తర్వాత ప్రతిచోటా యాభై శాతం మంది కార్పొరేటర్లు స్త్రీలే ఉంటారు. వీరు ఇంకా సమర్థంగా రాణించాలంటే పార్టీలు వారికి తగిన శిక్షణనివ్వాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ వరకే చదువుకుని మధ్యతరగతి ఆర్థిక వనరులతో వచ్చే మహిళా కార్పొరేటర్లకు మన చట్టాల మీద, స్థానిక సంస్థల పనితీరు మీద పెద్ద అవగాహన ఉండదు. వారికి అది కల్పించాల్సిన బాధ్యతను పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాలి. కార్పొరేషన్ బడ్జెట్ ఎంత, తమ వార్డుకొచ్చే నిధులెన్ని, సమస్యల పరిష్కారానికి ఎలా కృషి చెయ్యాలి... వంటివాటిపై వారికి లోతైన అవగాహన కల్పించాలి. 'కెపాసిటీ బిల్డింగ్' సరిగ్గా జరిగితే మహిళా ప్రతినిధులు బాగా పనిచేస్తారన్నది నా పరిశోధన తేల్చిచెప్పింది. పనులన్నిటిలో భర్త హస్తమే ఉందని, తనదే పాత్రా లేదని బాహాటంగానే ఒప్పుకొన్న మేయర్లూ, కార్పొరేటర్ల సంఖ్యే ఎక్కువ నిజానికి. వాళ్లకు భిన్నంగా స్వతంత్రంగా రాణిస్తున్న వారూ కొందరున్నారు. విశాఖ నగరానికి చెందిన కమ్యూనిస్ట్ పార్టీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ కేవలం తన వార్డులోని సమస్యలపైనే పోరాడి ఊరుకోరు, నగరం మొత్తం బాగోగుల మీద ఆమె ఒక కన్నేసి పెడుతుంటారు. ప్రతి సమస్య మీదా ఆమెకు అవగాహన కల్పించడంలో పార్టీ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. అలాగే పెద్ద చదువేమీ లేకపోయినా, రాజకీయాలకు కొత్తయినా కూడా పెంటకోట వీరలక్ష్మి ప్రజలతో మెలిగే తీరు గొప్పగా ఉంటుంది. రాజమండ్రి మేయరుగా ఆదిరెడ్డి వీరరాఘవమ్మ బాగా రాణించారు. వీళ్లకు భిన్నంగా మరో ఉదాహరణ చెబుతాను. గుంటూరులో మంచి ప్రాక్టీసున్న డాక్టరమ్మ ఒకరు కార్పొరేటరయ్యారు. భార్య మేయరవుతుందనుకుంటే కార్పొరేటరవడం ఏమిటన్న భావనతో ఆమెను సమావేశాలకు, ప్రజలకు దూరం చేశారామె భర్త. ఆ పదవి కన్నా ఆమె నర్సింగ్ హోమ్ సంపాదనే ముఖ్యమనుకున్నారాయన. భర్తతో రోజూ గొడవెందుకు లెమ్మని ఆమె కూడా మిన్నకుండిపోయారు. బాగా చదువుకున్నవారు కూడా ముందుకురావడానికి ఇలాంటి అడ్డంకులెన్నో! అయినా నేను సానుకూలంగానే ఆలోచిస్తున్నాను. ఎన్నో ఏళ్లుగా మనది పురుషాధిక్య సమాజం. ఆ వాసనలు వదిలించుకుని పాలకులుగా స్త్రీలు రాణించడానికి వారికి మరికొంత సమయం అవసరం. రాజకీయ వర్గాలు కూడా 'ఏదో రిజర్వేషనుంది కాబట్టి తప్పనిసరై సీటు కేటాయించాం లెమ్మ'న్నట్టుగాకుండా మహిళలకు దారి సుగమం చేస్తే, వాళ్లు పాలనలో అద్భుతాలు చెయ్యగలరని నా నమ్మకం.''

**• అరుణ పప్పు, విశాఖపట్నం**
ఫోటోలు : వై. రామకృష్ణ

## బంగారం వెండి

16-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 30,380 (----) | 29,770 (29,670) | 53,850 (----) |
| విజయవాడ | 30,500 (30,400) | 28,200 (28,100) | 53,600 (53,600) |
| ప్రొద్దుటూరు | 30,420 (30,450) | 27,940 (27,940) | 53,400 (53,400) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 30,350 (30,400) | 27,920 (27,950) | 53,800 (53,800) |
| ముంబయి | ---- (----) | ---- (----) | ---- (----) |
| చెన్నయ్ | 30,165 (30,200) | 28,200 (28,240) | 53,935 (53,945) |

• బ్రాకెట్లో ఇచ్చినవి ఓపెనింగ్ ధరలు

# నేను..నీలిమ..శ్రీధర్

మనసున ఉన్నది

'ఇన్ఫోసిస్' నీలిమ కేసు చదువుతుంటే నాకు నా గతం గుర్తుకొచ్చింది. నాదీ ఆమెలాంటి కథే. కాని ఒకటే తేడా. ఆమె మరణించింది. నేను పోరాడా! ఆమె ఒత్తిడిని భరించలేకపోయింది. నేను జయించగలిగా!' అని చెప్పిన ఒక యువతి కథ ఇది.

మాది ఏలూరు. మధ్యతరగతి కుటుంబం. చదివిందంతా విజయవాడ. చదువు అయిన వెంటనే ఉద్యోగం వచ్చేసింది. అమ్మానాన్న వెతికి ఒక సంబంధం పట్టుకొచ్చారు. ఆ అబ్బాయి ఎంసీఏ చేశాడని చెప్పారు. అతని పేరు శ్రీధర్. ప్రింటింగ్ బిజినెస్ చేస్తున్నాడన్నారు. వాళ్లు కూడా మాలాగే మధ్యతరగతి మనుషులే. శ్రీధర్ చూడటానికి బానే ఉన్నాడు. చొచ్చుకుపోయే స్వభావం ఉన్నవాడిలా కనిపించాడు. పెళ్లి చూపుల సమయంలోనే నా ఉద్యోగం గురించి పూర్తిగా చెప్పా. నేను ఆన్‌సైట్ ప్రాజెక్టు కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నానని, ఈ విషయంలో అభ్యంతరాలు ఉంటే ముందే చెప్పమన్నా. తనకేం అభ్యంతరం లేదని- వాస్తవానికి ప్రింటింగ్ బిజినెస్ మానేసి తను కూడా ఉద్యోగం చూసుకుంటానని- విదేశాలకు వెళ్లి సెటిల్ అయిపోతే బానే ఉంటుందనీ అన్నాడు. పెళ్లికి 'నో' చెప్పటానికి పెద్ద కారణాలు ఏమీ నాకు కనిపించలేదు. పెళ్లి అయిపోయింది. నేను హైదరాబాద్ వచ్చేసా. ఒక అపార్ట్‌మెంట్ తీసుకున్నా. తను ప్రతి శుక్రవారం వచ్చేవాడు. ఒక మూడు నెలలు ఇలా సాగింది.




ఈ లోపులో నాకు ఆన్‌సైట్ అవకాశం వచ్చింది. ఫిన్‌లాండ్‌లో ప్రాజెక్టు. ఆరు నెలలు అక్కడే ఉండాలి. కంపెనీ పాలసీ ప్రకారం ప్రాజెక్టు మూడు నెలల కన్నా ఎక్కువ ఉంటే భర్తను, పిల్లలను ఆన్‌సైట్‌కు తీసుకువెళ్లొచ్చు. ఫిన్‌లాండ్‌కి వెళ్లిన పదిహేను రోజులకు వాళ్లింటి నుంచి ఫోన్లు మొదలయ్యాయి. ''మా వాడిని నీ వెంట తిప్పుకుంటున్నావు. దాని వల్ల వాడి వ్యాపారం ఇక్కడ దెబ్బతింటోంది. మామయ్యగారు చూడలేకపోతున్నారు. వాడు వెంటనే వచ్చేస్తే బావుంటుంది..'' అని మా అత్తయ్య సాధించటం మొదలుపెట్టింది. శ్రీధర్ మొదట వాళ్లమ్మ మాటలు పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత అతనిలో కూడా మార్పు వచ్చింది. ''నేను నీతో పాటు ఉంటే అటు వ్యాపారం లేదు. ఇటు ఇక్కడ ఉద్యోగం చేసే అవకాశం లేదు. వెనక్కి తిరిగి వెళ్లిపోదాం. నాకు ఉద్యోగం వచ్చిన తర్వాత మళ్లీ రావచ్చు''అని నా మీద ఒత్తిడి పెట్టడం మొదలుపెట్టాడు. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. మరో నెల రోజులు గడిచాయి.

మాటలు దెబ్బలాటలుగా మారాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ నేను ప్రాజెక్టు వదిలేసి ఇండియా రానని, వస్తే నా ఉద్యోగం కూడా పోతుందని శ్రీధర్‌కు కరాఖండిగా చెప్పేసా. వాళ్లమ్మతో, నాన్నతో మాట్లాడాడు. తనకు టిక్కెట్ కొంటే ఇండియా వెళ్లిపోతానని.. ఇక్కడ నా ప్రాజెక్టు అయిపోయేలోపు హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకుంటానన్నాడు. నాకు కూడా అంత కన్నా మంచి మార్గం ఏదీ తోచక శ్రీధర్ వెళ్లిపోయాడు. రోజూ మెయిల్ ఇచ్చేవాడు. ఫోన్‌లో మాట్లాడేవాడు. పరిస్థితులు చక్కబడ్డాయనుకున్నా. నేను తీసుకున్న నిర్ణయం రైటే అనిపించింది. ఆరునెలల ప్రాజెక్టు ఏడాదయ్యింది. 'తనకు ఒక మంచి కాంట్రాక్టు దొరికిందని- దానిలో పెట్టుబడి పెడితే చాలా లాభాలు వస్తాయని' శ్రీధర్ తరచూ చెప్పటం మొదలుపెట్టాడు. రెండు, మూడు సార్లు చెప్పిన తర్వాత తనకు కొన్ని డబ్బులు కావాలని నాకు అర్థమయింది. అప్పటి దాకా నేను దాచిన దాంట్లో ఒక ఐదు లక్షలు తీసి పంపాను.

ఫిన్‌లాండ్ నుంచి ఇండియాకు రాగానే నాకో షాక్ తగిలింది. ''ఐదు లక్షలు పోయాయి. ఇంకో రెండు లక్షల అప్పు మిగిలింది. దీన్ని తీరిస్తే ఇంక వ్యాపారం నుంచి బయటపడిపోవచ్చు'' అన్నాడు శ్రీధర్. నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. మరో మార్గం లేక ఆ రెండు లక్షల అప్పు కూడా తీర్చేసా. మళ్లీ హైదరాబాద్‌లో మా కాపురం ప్రారంభమయింది. ఒక రోజు బీరువా తీసి సర్దుతుంటే శ్రీధర్ సర్టిఫికేట్లు బయట పడ్డాయి. వాస్తవానికి అవి విజయవాడలో ఉండాలి. ఏదో పని కోసం తీసుకువచ్చి శ్రీధర్ వాటిని బీరువాలో పెట్టినట్లున్నాడు. సహజమైన కుతూహలంతో ఆ సర్టిఫికేట్లు చూశా. ఇంటర్ సర్టిఫికేట్లే ఉన్నాయి. ఆ తర్వాతవి లేవు. నాకెందుకో శ్రీధర్ మీద చిన్న అనుమానం కలిగింది. మా కజిన్ ఒకతను విజయవాడలో ఉంటే- అక్కడ శ్రీధర్ వ్యాపారం ఎలా ఉందో తెలుసుకోమన్నా. అప్పటి దాకా నాకు మా అమ్మానాన్నలు చెప్పిన విషయాలు తప్పితే- శ్రీధర్ కుటుంబం గురించి ఏమీ తెలియదు. వాళ్ల ఆర్థిక పరిస్థితి, వ్యాపార వ్యవహారాలు ఎప్పుడూ నాకు శ్రీధర్ చెప్పలేదు. నేను కూడా పట్టించుకోలేదు. రెండు రోజుల తరాఀత మా కజిన్ ఫోన్ చేశాడు. అతను చెప్పిన విషయాలు వింటే నా తల తిరిగిపోయింది. శ్రీధర్ చదివింది ఇంటర్ వరకే. ఆ తర్వాత చదువు ఆపేసి వాళ్ల నాన్న ప్రింటింగ్ బిజినెస్‌లో చేరాడు. అది కూడా సరిగ్గా చేయలేదు. దీంతో అప్పులపాలయ్యాడు. నేను ఇచ్చిన ఏడు లక్షలతో కొన్ని అప్పులు తీర్చాడు. మరో 30 లక్షల దాకా అప్పు ఉంటుంది. మా కజిన్ చెప్పిన దాని ప్రకారం ఆ అప్పులు కూడా నేనే తీర్చాలి.

అమ్మానాన్నలకు ఈ విషయం చెప్పా. వాళ్లు పరిష్కారం వెతకటం మానేసి నాపై ఒత్తిడి పెట్టడం మొదలుపెట్టారు. '' మంచో చెడో ఒక సారి పెళ్లి చేశాం. దానికి కట్టుబడాల్సిందే. నీది బంగారంలాంటి ఉద్యోగం. రెండు, మూడేళ్లు ఉద్యోగం చేస్తే అప్పులన్నీ తీరిపోతాయి. అప్పుడు మీ బతుకు మీరు బతకచ్చు'' అంది అమ్మ. ''నీ జీవితం. నీ ఇష్టం. తొందరపడి నిర్ణయాలు తీసుకోకు. అతని అప్పు నేను మాత్రం తీర్చలేను. నువ్వే ఏదో దారి చూడాలి'' అన్నాడు నాన్న. నాకు వాళ్లిద్దరి మీద విపరీతమైన కోపం వచ్చింది. నేరుగా విజయవాడలో శ్రీధర్ వాళ్లింటికి వెళ్లా. శ్రీధర్ అమ్మ నాన్న ముభావంగా కూర్చున్నారు. నేను అరిచినా, ఏడ్చినా మాట్లాడలేదు. శ్రీధర్ తనకేం పట్టనట్లు బయటకు వెళ్లిపోయాడు. ఆ రోజు సాయంత్రమే బయలుదేరి హైదరాబాద్ వచ్చేసా. శ్రీధర్ నన్ను మోసం చేశాడని తెలుస్తూనే ఉంది. భవిష్యత్తులో మరింత మోసం చేయడనే నమ్మకం కూడా ఏం లేదు. మరో 30 లక్షల అప్పు తీరుస్తూ తనతో ఉండాలా? జరిగిన శాస్తి చాలని మళ్లీ కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలా? ఒక వైపు శ్రీధర్ నుంచి ఫోన్లు. మరో వైపు అమ్మానాన్నల ఒత్తిడి. చివరకు శ్రీధర్ నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నా. ఇది జరిగి ఐదేళ్లు అయింది. నేను మళ్లీ పెళ్లి చేసుకోలేదు. ఇప్పటికీ మా అమ్మానాన్నలు నాతో సరిగ్గా మాట్లాడరు. చుట్టాలు సరిగ్గా ఉండరు. కొన్ని సార్లు నేను తప్పు చేశానా అనిపిస్తూ ఉంటుంది. కాని ఎక్కువ సార్లు నేను చేసింది రైటే అనిపిస్తుంది.

**సేకరణ: సివిఎల్‌ఎన్ ప్రసాద్**









ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
20-8-2012 • సోమవారం

# రూపాయి బడ్జెట్ సినిమా!

మన దేశంలో ప్రయోగాత్మక సినిమాలకు పేరెన్నికగన్న బెంగాలీలు ఒక కొత్త సినిమా ఫార్ములాకు తెర తీశారు. సినిమా తీయటానికి ప్రతిభ ఉండాలేకానీ పైసలతో పనేముందని ఈ నయా సత్యజిత్‌రాయ్ వారసులు అంటున్నారు. కలకత్తాకు చెందిన అనిమిత్రరాయ్, శ్రీపర్ణ దేవ్‌లు సినిమా తీయటానికి రూపాయి చాలంటున్నారు. అనటమే కాదు వాళ్ల ప్రాజెక్టును జనం ముందు పెట్టి సగానికి పైగా బడ్జెట్‌ను సంపాదించారు.




కలలకు అంతం ఉంటుంది. సినిమా కలలకు మాత్రం అంతం ఉండదు. అవి అనంతాలు. అనిమిత్రరాయ్, శ్రీపర్ణ దేవ్‌లు కూడా అలాంటి కలల్లోనే ఓలలాడారు. ఆ కల నెరవేర్చుకోవడానికి తమ కథను నమ్ముకుని చాలా చోట్ల తిరిగారు. ఫలితం లేకపోయింది. తమ సినిమాకు కేవలం రెండు లక్షల యాభై రూపాయలు సరిపోతాయని వారు చెప్పినా ఎవరూ నమ్మలేదు.

కొంతమందేమో కథ విని ఇంత పెద్ద కథను అంత తక్కువలో ఎలా చేస్తారని అడిగారు. మరికొంతమంది మీరు తీసేది డాక్యుమెంటరీనా అని ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నలన్నిటికీ – తెలిసిన నటులు ఉన్నారని, తక్కువ ఖర్చయ్యే సాంకేతికతను వినియోగించుకోవచ్చని కుర్రాళ్లు బదులిచ్చారు. అయినా సరే పేద కుటుంబాల్లో పుట్టి డిగ్రీలు పూర్తి చేసిన వీళ్లకి ఛాన్స్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు.

## ప్రయోగానికి శ్రీకారం...

ఎక్కువ మంది నిరాకరించడంతో వాళ్లకు నమ్మకం సడలింది. నిజమే ఇలాంటి బడ్జెట్‌తో సినిమా సాధ్యం కాకపోవచ్చేమో అనుకున్నారొక దశలో. చివరి ప్రయత్నంగా ఒక ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఇది విఫలమైతే సినిమా కల నుంచి వైదొలగడానికి నిర్ణయించుకున్నారు. దాని కోసం వారు ''రూపాయి మూవీ'' పేరిట ఒక బ్లాగ్ మొదలు పెట్టారు. అందులో తమ సినిమా వివరాలు, ప్లాన్ అంతా పొందుపరిచారు. ప్రాజెక్టుపై నమ్మకమున్న వారు రూపాయి ఇస్తే చాలని ప్రకటించారు. ఫిబ్రవరి నెలలో ఈ బ్లాగ్‌ను మొదలు పెట్టారు. దాతలిచ్చే రూపాయికి లాభం తీసుకొస్తామని కూడా మాట ఇచ్చారు. దాంతో వారి ప్రాజెక్టుకు నెమ్మదిగా స్పందన రావడం మొదలైంది.

## చిన్న చేప పెద్ద చేపను మింగితే...

వాళ్లిద్దరికీ ఆ ప్రాజుక్టుపై నమ్మకముంటే వాళ్లపై జనాలకు నమ్మకం వచ్చింది. రూపాయి బడ్జెట్ సినిమాకు కాసులు రావడం మొదలైంది. రూపాయికి రూపాయి కూడింది. ఐదు నెలలు గడిచేసరికి లక్షా యాభై వేల రూపాయలు సమకూరాయి. వారి 90 నిమిషాల సినిమా పూర్తవడానికి ఇంకో లక్ష రూపాయలు కావాల్సి ఉంది. అయితే వీరి ప్రయత్నం గురించి తెలిసిన కొంతమంది ఎక్కువమొత్తంలో ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డారట. కాని తాము రూపాయి మాత్రమే ఆశిస్తున్నామని చెప్పి ఆ ప్రతిపాదనల్ని సున్నితంగా తిరస్కరించారు. ఇప్పటికే షూటింగ్ మొదలైన ఈ రూపాయి బడ్జెట్ సినిమా ఫిబ్రవరిలో విడుదల కానుంది.



లోపలి పేజీలో...
అగ్ని పరీక్షల తరువాతే
అసలైన విజయం
గిరిబాబు 'అనుభవం'







కళ

స్వచ్ఛమయిన పల్లె మనస్సుల నుంచి ఆకృతి పొందిన చిత్రకారుడు ఎలా ఉంటాడు అని అడిగితే ఆత్మకూరు రామకృష్ణతో ఉంటాడని తడుముకోకుండా చెప్పవచ్చు. ఎందుకంటే 'చిత్ర' కళ ద్వారా అంతగా ఆయన ప్రకృతిని ఆరాధిస్తారు. ఓ సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి 'ఆర్ట్' వనంలో మొలకెత్తారు రామకృష్ణ. కుంచె తోడుగా 'చిత్ర' కళా ప్రయాణం ఆరంభించిన ఆయన తరువాతి కాలంలో చేతి వేళ్లతో వి'చిత్రాలు' సృష్టించారు. ఈ వి'చిత్ర'కారుని పరిచయమే ఈ కథనం...



# వేళ్లు తిరిగిన చిత్రకారుడు

వేదిక బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు క్యాంపస్. ఒక్కరోజులో 'వంద చిత్రాలు' పూర్తి చేసి లిమ్కా రికార్డు స్థాపించడానికి రామకృష్ణ సిద్ధపడ్డ సమయం. చిత్రాలన్నీ చేతి వేళ్లతోనే రూపుదిద్దుకోవాల్సి వుంది. తన దగ్గరున్న ఒకటిన్నర లక్షల రూపాయలతో కాన్వాస్‌లు, కలర్ల నుంచి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు రామకృష్ణ చేసుకున్నారు. ఆ ప్రకారం 100 కాన్వాసులు వేదికపై కొలువుతీరాయి. ఇప్పుడు కావాల్సింది...24 గంటల్లో... వంద చిత్రాలు. రామకృష్ణ ఏం చేస్తారో చూద్దామని వచ్చిన అతిథులు జరగబోతున్న అద్భుతం కోసం అంతే నిశ్శబ్దంగా వేచి ఉన్నారు.

లిమ్కారికార్డు నిర్వాహకులు ఓకె అనగానే ఎనిమిది గంటల పదిహేను నిమిషాలకు ఫింగర్ పెయింటింగ్ మొదలైంది..కాదు కాదు రామకృష్ణ 'ఆర్ట్ కవాతు'కు సైరన్ మోగింది. చేతి వేళ్లను రంగు ముద్దల్లో ఉంచి రామకృష్ణ ఒక రంగును మరో రంగుతో మేళవిస్తూ.. ఆవచ్చిన మిశ్రమ వర్ణాన్ని కాన్వాస్‌పై అద్దారు. అవి రామకృష్ణ చేతిలో మేఘాలను తాకే కొండలుగా, పుడమిని నమస్కరిస్తున్న వృక్షాలుగా మారిపోయాయి. ఆరంభించిన నాలుగు నిమిషాలకు రామకృష్ణ తొలి వి'చిత్రం' పూర్తయింది. ప్రేక్షకుల చప్పట్లకు స్పందనగా ఇది ఆరంభమే...అంతం కాదని చెబుతున్నట్టుగా రామకృష్ణ చిరునవ్వులు చిందించారు.

## పల్లెలో ఒక ఆరంభం...

నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట రామకృష్ణ స్వగ్రామం. ఆత్మకూరు రమణయ్య, రత్నమ్మలకు ఈయన ప్రథమ సంతానం. జెఎన్‌టియులోని లలిత కళల కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్సులో గోల్డ్ మెడల్ సాధించారు. తరువాత బెనారస్ హిందూ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్సును పూర్తి చేసి కేంద్రీయ విద్యాలయంలో ఆర్టు టీచర్‌గా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇలా ఇంట గెలచిన రామకృష్ణ రచ్చ గెలవడానికి కుంచె అందుకున్నారు. ఆయన కాన్వాస్‌కు కొద్దికాలంలోనే మంచి గుర్తింపు లభించింది. అది క్రమంగా హద్దులు చెరిపేస్తూ అంతర్జాతీయ స్థాయిలో జరిగే చిత్ర ప్రదర్శనల వరకు వెళ్లింది. అలాంటి సమయంలో చేసిన ఒక ప్రయోగం రామకృష్ణను కొత్త దారుల్లో నడిపించింది.



## ఫింగర్ వండర్స్...

ఆయనోసారి సాక్షరతా మిషన్ వారి క్యాలెండర్ కోసం నాలుగు ఫింగర్ పెయింటింగ్స్ వేశారు. చేసిన ప్రయోగం చిన్నదే అయినా వాటికి మంచి ప్రశంసలు దక్కాయి. దాంతో రామకృష్ణ ఫింగర్ పెయింటింగ్స్‌లో ప్రయోగాలు మొదలు పెట్టారు. అలా చేతివేళ్లతో వేసిన 50 చిత్రాలను ఓసారి బెంగుళూరులోని ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శించినపుడు అనూహ్యమైన స్పందన వచ్చింది. అవి చేతివేళ్లతో వేసిన చిత్రాలు తెలుసుకొన్న వీక్షకులు ''చేతితో ఎలా వేయొచ్చు?'', ''కలర్స్ మిక్సింగ్‌ఎలా చేస్తారు?'', ''చేతి వేళ్లు పాడైపోవా'' అంటూ ప్రశ్నించడం మొదలుపెట్టారు. తరువాత హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆ ఫింగర్ పెయింటింగ్స్‌ను ఏర్పాటు చేసినపుడు అక్కడ ఇంకా అద్భుతమైన స్పందన వచ్చింది. ఆర్ట్ ప్రేమికులు వాటిని అక్కున చేర్చుకున్నారు. దీంతో ఫింగర్ పెయింటింగ్స్ ద్వారా ఇప్పటి వరకు చేయని ప్రయోగం ఒకటి చేసి రికార్డు స్థాపించాలని రామకృష్ణ నిర్ణయించున్నారు.

## టిక్.. టాక్ టిక్..టాక్

నాలుగు నిమిషాలకు తొలి చిత్రాన్ని పూర్తి చేసిన రామకృష్ణ మధ్యాహ్నం భోజన విరామ సమయానికి 32 చిత్రాలను ముగించారు. ఒకే చోట కూర్చుని చేయాల్సిన పని ఇది. కడుపులో చల్ల కదలకుండా చేసే పని మంచిదనే నానుడి ఉంది కానీ, అది కూడా కష్టమైన పనేనని కాసేపటికే రామకృష్ణకు అర్థమయ్యింది. అయితే చేరుకోవాల్సిన లక్ష్యం కంటే ఇష్టమైనదేమీ ఉండదు కదా! దాన్ని ఆపే శక్తి కూడా ఏదీ ఉండదు. ఎందుకంటే అది పనిని మరింత వేగంగా చేయిస్తుంది. అందుకే సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి 74 చిత్రాలను రామకృష్ణ పూర్తి చేయగలిగారు. మరో రెండు గంటలు గడిచేసరికి ఆ సంఖ్య 87 చిత్రాలకు చేరుకుంది. అంటే 24 గంటల్లో వేయాల్సిన 100 చిత్రాల లక్ష్యానికి ఆయన చేరువయ్యారన్నమాట. వీక్ష కుల ప్రోత్సాహం నడుమ రామకృష్ణ 9 గంటల 40 నిమిషాలకు వందో చిత్రాన్ని పూర్తి చేశారు. అలా ప్రపంచ రికార్డుల పుస్తకంలో రామకృష్ణ పేరు నమోదయింది. అందరూ ఆ పనిలో రికార్డును చూస్తే రామకృష్ణ మాత్రం తను వేసిన పెయింటింగ్‌లను ప్రకృతికి కానుకగా భావించారు.





## రికార్డుల రారాజు వందనం...

కళ అనేది సమాజ హితానికేనని రామకృష్ణ నమ్ముతారు. నమ్మటమే కాదు తన కళ కూడా ప్రకృతికే అంకితమని చెబుతారు. అందుకే తన వంద చేతివేళ్ల పెయింటింగ్స్‌ను ప్రకృతికి ప్రతిబింబాలుగా తీర్చిదిద్దారు. ఆ చిత్రాల్లో మట్టి వాసనలు, చెట్ల పచ్చదనాలు, కొండ కోనల సోయగాలు కనిపిస్తాయి. ఈ ప్రకృతి ప్రేమికునికి రికార్డులు కూడా అదే స్థాయిలో పలకరించాయి. రామకృష్ణకు లిమ్కారికార్డుతో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, గ్లోబల్ వరల్డు రికార్డు, యు.ఆర్.డి.బి. అఫిషియల్ రికార్డు (యు.ఎస్.ఎ.), ఎవరెస్ట్ వరల్డ్ రికార్డు(నేపాల్) రికార్డు హోల్డర్స్ రిపబ్లిక్ రికార్డు ఇలా చాలా రికార్డులు వరించాయి. ఈ రికార్డుల గురించి ప్రస్తావించినపుడు ''రికార్డులు ఈ రోజు రావచ్చు. రేపు పోవచ్చు. కానీ నేను వేసిన ఈ చిత్రాలను చూసి ఒక్కరైనా సరే ప్రకృతి ప్రేమికునిగా మారితే అదే నాకు పెద్ద రికార్డు'' అని రామకృష్ణ అంటారు.



• ఈతకోట సుబ్బారావు
ఆన్‌లైన్, నెల్లూరు



# టెక్ బిట్స్

## సూపర్‌ఫోన్ ఎలైట్



మైక్రోమ్యాక్స్ సూపర్ ఫోన్ ఏ 84 పేరిట సరికొత్త ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఈ డివైజ్ 3జి సపోర్టుతో పనిచేస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌కు ఆండ్రాయిడ్ 2,3,6 జింజర్ బ్రెడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పాటు 1 జీహెచ్‌జడ్ ప్రాసెసర్ ఉంది. 5 మెగాఫిక్సెల్ ప్రైమరీ కెమెరాతోపాటు ఎల్‌ఈడీ ఫ్లాష్, ఫ్రంట్ కెమెరా, 0.3 ఎంపీల వీడియోకాలింగ్, ఛాటింగ్ చేసే సౌకర్యం ఈ డివైజ్ సొంతం. బ్లూటూత్ 2.1తోపాటు వైఫై టెక్నాలజీ సౌకర్యం, 2.0 యూఎస్‌బీ, మైక్రో ఎస్‌డి కార్డు స్లాట్ , 32 జీబీల ఎక్స్‌పాండ్ మెమోరితో లభ్యం అవుతుంది.

## క్యాష్‌లెస్ క్యాంపస్...ఐఐటి బాంబే

ఏదైనా కొనటానికి దుకాణానికి వెళ్లినపుడు, షాపు యజమాని అక్కడ చిల్లర లేదన్నా పరవాలేదు...క్యాంటీన్‌కు వెళ్లినపుడు మీరు పర్సు తీసుకెళ్లడం మర్చిపోయినా ఓకే...తాము రూపొందించిన యూనివర్శల్ క్రెడిట్ కార్డు ఉంటే చాలు, ఏమైనా కొనవచ్చంటున్నారు బాంబే ఐఐటీ విద్యార్థులు. ఇప్పుడిక క్యాంటీన్‌కు, స్టేషనరీ షాపునకు, రెస్టారెంట్‌కు వెళ్లాలన్నా యూనివర్శల్ డెబిట్‌కార్డు ఉంటే చాలంటున్నారు. బాంబే ఐఐటీ క్యాంపస్‌ను క్యాష్‌లెస్ క్యాంపస్‌గా ప్రకటించారు. ఒక అప్లికేషన్ ఫాంతోపాటు ఐడెంటిటీ కార్డు ఫోటో కాపీని ఇస్తే చాలు క్షణాల్లో యూనివర్శల్ డెబిట్‌కార్డు జారీ చేస్తున్నారు. ఈ కార్డు కోసం ఎలాంటి రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు లేకుండా జారీ చేస్తారు. దేశంలోనే మొట్టమొదటి క్యాష్‌లెస్ క్యాంపస్‌గా బాంబే ఐఐటీ క్యాంపస్‌ను రూపొందించారు. కెనరా బ్యాంకు సహకారంతో ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ఆటోమేటిక్ యాక్టివేషన్ ద్వారా ఆన్‌లైన్ కూపన్‌లు, రీచార్జ్ ఆప్షన్లతో మొబైల్ ఫోన్‌తో లావాదేవీలు చేపట్టనున్నారు. దీనికి ఎలాంటి యాక్టివేషన్ చార్జీలు, మెయిన్‌టెనెన్స్ చార్జీలు ఉండవు.




## అల్ట్రామొబైల్ ఎలైట్‌బుక్




హెచ్‌పీ కొత్తగా ఎలైట్‌బుక్ 2170పి పేరిట బిజినెస్ ల్యాప్‌టాప్‌ను విడుదల చేసింది. 11.6 ఇంచుల డిస్‌ప్లేతో 8 గంటలపాటు బ్యాటరీ లైఫ్‌తో ప్రొఫెషనల్స్‌కు బాగా పనికొచ్చేలా దీన్ని రూపొందించారు. ఈ ల్యాప్‌టాప్ ఎంటర్‌ప్రైజెస్ లెవెల్ కనెక్టివిటీ, మేనేజ్‌మెంట్ అండ్ సెక్యూరిటీ ఫీచర్స్‌తో డిస్‌ప్లే సేఫ్ ఫ్రేమ్‌తో ఉంది. ఆప్షనల్ బ్యాక్‌లిట్ కీబోర్డు, ఫింగర్‌ప్రింట్ స్కానర్ ఫీచర్‌లు కూడా దీనిలో ఉన్నాయి. అల్ట్రా లో వోల్టేజీ ఇంటెల్ బ్రిడ్జ్ ప్రాసెసర్ కోర్ ఐ3, ఐ5, ఐ7లలో లభ్యమవుతున్నాయి. 500 జీబీల స్టోరేజ్ కాన్ఫిగరేషన్‌తోపాటు గ్రాఫిక్ ఆప్షన్‌లు16 జీబీ ర్యామ్‌తో ఈ ల్యాప్‌టాప్‌తో అత్యంత వేగంగా పనిచేసుకోవచ్చు. ఈ ల్యాప్‌టాప్‌లో మొబైల్ బిజినెస్ ప్రొఫెషనల్స్‌కు అవసరమైన అన్ని ఫీచర్‌లు ఉన్నాయి.

## గూగుల్ సెర్చ్‌లో కాలిక్యులేటర్



ఇంటర్‌నెట్ జెయింట్‌గా పేరొందిన గూగుల్ తాజాగా తన సెర్చ్ ఇంజన్‌లో క్యాలిక్యులేటర్‌ను పెట్టింది. మొబైల్ బ్రౌజర్లకు ఆండ్రాయిడ్, ఐఫోన్ డివైజ్‌లు వాడే వారికి ఫుల్ క్యాలిక్యులేటర్‌ను అందుబాటులో ఉంచింది. గూగుల్ సెర్చ్ ఇంజన్ సాయంతో అందుబాటులో ఉన్న క్యాలిక్యులేటర్‌తో ఎంతటి కష్టమైన లెక్కలైనా క్షణాల్లో చేయవచ్చంటున్నారు నిపుణులు.

## 2013లో ఫేస్‌బుక్ ఫోన్




సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజంగా పేరొందిన ఫేస్‌బుక్ తైవాన్‌కు చెందిన స్మార్ట్‌ఫోన్‌ల తయారీదారైన హెచ్‌టీసీ కలిసి ఫేస్‌బుక్ ఫోన్‌ను తీసుకురానున్నాయి. ఫేస్‌బుక్ సెల్ఫ్ బ్రాండెడ్ ఫోన్ 2013లో అందుబాటులోకి వస్తుందని నిపుణులు చెపుతున్నారు. డెడికేటెడ్ ఫేస్‌బుక్ బటన్‌తో ఇప్పటికే హెచ్‌టీసీ మొదటి ఫోన్‌ను తయారు చేసింది. సరికొత్త ఫీచర్స్‌తో రానున్న ఫేస్‌బుక్ ఫోన్ కోసం సోషల్ నెట్‌వర్కింగ్ ప్రియులు ఎదురు చూస్తున్నారు.

## ఆండ్రాయిడ్ ఫోన్స్‌కు హ్యాకింగ్ బెడద



హ్యాకర్లు ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్స్ హ్యాకింగ్‌కు కొత్త మార్గాలను కనుగొన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌ల వినియోగం పెరిగిన నేపథ్యంలో హ్యాకర్లు వీటిపై దృష్టి సారించారు. ఈ ఫోన్‌లు హ్యాకింగ్‌కు గురికాకుండా మొబైల్ యాంటీవైరస్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.



ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ ఫార్మాట్‌లో ఉన్నా మొబైల్‌లో వీడియోస్ చూడాలి. అదీ మంచి క్వాలిటీ ఆడియో, వీడియోతో. నచ్చని దృశ్యాలు ఉంటే కట్ చేసుకోగలగాలి. మొబైల్‌లో ఉన్న వీడియోలన్నీ ఇతరుల కంటపడకుండా భద్రంగా దాచుకోగలగాలి. పవర్ కట్‌తో సంబంధం లేకుండా మొబైల్‌లో టీవీ చూడగలగాలి. ఇవన్నీ ఇప్పుడు సాధ్యమే. ఈ ఫీచర్స్‌ను అందించే అప్లికేషన్లన్నీ ఇప్పుడు ఉచితంగా లభిస్తున్నాయి. మీకు మరింత కన్నుల విందును అందించే వాటి వివరాలు తెలుసుకుందాం రండి.

# వీడియో వండర్స్

టెక్నాలజీ

స్నేహితుని ల్యాప్‌టాప్‌లో మీకు నచ్చిన సినిమా కనిపించింది. వెంటనే మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకున్నారు. కానీ ఆ వీడియో ఎంత ప్రయత్నించినా ఓపెన్ కాలేదు. కారణమేంటా అని చూస్తే ఆ ఫార్మాట్‌ను మొబైల్‌లో ఉన్న వీడియోప్లేయర్ సపోర్టు చేయడంలేదు. ఈ తరహా సమస్యలు చాలా మందికి ఎదురవుతూనే ఉంటాయి. వీడియో చూడాలని ప్రయత్నించినప్పుడల్లా కోడెక్స్ ఎర్రర్ రావడం,



కన్వర్ట్ చేయాల్సి రావడం జరుగుతూ ఉంటుంది. అయితే ఈ ఇబ్బందులన్నింటిని అధిగమించి, ఏ ఫార్మాట్‌లో ఉన్నా ఓపెన్ చేసే అప్లికేషన్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీడియో అద్భుతాలను అరచేతిలో చూసే అవకాశాన్ని అప్లికేషన్లు ఇప్పుడు ఉచితంగా అందిస్తున్నాయి.

### MoboPlayer

ఆండ్రాయిడ్ వినియోగదారులకు ఉపయోగపడే బెస్ట్ వీడియో ప్లేయర్ ఇది. ఎలాంటి కన్వర్షన్ లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా మొబైల్‌లో వీడియోస్ చూడాలంటే మోబోప్లేయర్ ఉండాల్సిందే. ఈ అప్లికేషన్ అన్ని వీడియో ఫార్మాట్స్‌ను సపోర్టు చేస్తుంది. సాఫ్ట్‌వేర్ డీకోడింగ్ మోడ్ ఎంచుకుంటే చాలు. ప్లేలిస్ట్‌లోని ఫైల్స్ కంటిన్యూస్‌గా ప్లే అయ్యేలా ఆప్షన్ ఎంచుకోవచ్చు. వీడియోస్‌ని, మీడియా లైబ్రరీస్‌ని వాటి టైప్‌ను బట్టి సార్టింగ్ చేసుకోవచ్చు. వీడియోలను థంబ్‌నెయిల్ డిస్‌ప్లే ఆప్షన్‌లో పెట్టుకోవచ్చు.

### QQPlayer

ఎక్కువ వినియోగంలో ఉన్న వీడియో ఫార్మాట్స్ అన్నింటినీ సపోర్టు చేసే వీడియో ప్లేయర్ అప్లికేషన్ ఇది. ఇందులో ఉండే స్మార్ట్ కోర్ టెక్నాలజీ వీడియో ఫార్మాట్స్‌ని అటో డిటెక్ట్ చేస్తుంది. నాణ్యతతో కూడిన వీడియోస్ చూడాలనుకునే వారు దీన్ని ఎంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ మార్కెట్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### HD Video Player

ఇది అత్యుత్తమమైన ఎమ్‌పీ 3 మ్యూజిక్‌ప్లేయర్, వీడియో ప్లేయర్. మూవీస్, టీవీ షోస్ చూడొచ్చు. ఎఫ్‌ఎల్‌వీ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫ్లాష్ వీడియో ఫైల్స్‌ను వీక్షించవచ్చు. అడోబ్ ఫ్లాష్ ప్లేయర్ ప్లగిన్స్‌ను ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేదు. ఈ అప్లికేషన్ పాపులర్ వీడియో, ఆడియో ఫార్మాట్స్ అన్నిటినీ సపోర్టు చేస్తుంది. మీ టైమ్‌ను సేవ్ చేయడంతో పాటు డిస్క్ స్పేస్‌ను సేవ్ చేస్తుంది. ఎస్‌డీ కార్డ్ పెట్టి బ్రౌజర్ యూఆర్‌ఎల్‌పై క్లిక్ చేస్తే చాలు వీడియో చూడవచ్చు.

### VLC Direct Pro

మొబైల్ ఫోన్, టాబ్లెట్‌లలో ఉపయోగించుకోవడానికి అనువైన ఆప్ ఇది. ప్లే, పాస్, స్టాప్, వాల్యూమ్, ఫుల్ స్క్రీన్, చేంజ్ వీడియో, చేంజ్ ఆడియో ట్రాక్ వంటి ఆప్షన్స్ ఉంటాయి. ఆండ్రాయిడ్ నుంచి కంప్యూటర్‌కు అనుసంధానమయి వీడియో, మ్యూజిక్, ఫోటోలు వీక్షించవచ్చు. ఇందులో ఉండే ఇంటర్నల్ వీడియోప్లేయర్ కంప్యూటర్ నుంచి ఆండ్రాయిడ్‌కు అనుసంధానమై కంటెంట్‌ను చూసే వెసులుబాటును కల్పిస్తుంది.

### Mp3 Media Converter

మీడియా ఫైల్‌ని కన్వర్ట్ చేయడానికి ఉపయోగపడే అప్లికేషన్ ఇది. కొన్ని మీడియా ఫైల్స్‌ని స్మార్ట్‌ఫోన్స్ సపోర్టు చేయవు. అలాంటప్పుడు కన్వర్ట్ చేయాల్సి వస్తుంది. అలాంటి సమయంలో ఈ అప్లికేషన్ ఉపయోగపడుతుంది.

### AndroVid Video Trimmer

మీ పాపాయి పుట్టినరోజు వేడుకకు సంబంధించిన వీడియోలో మీకు నచ్చని కొంత భాగం ట్రిమ్ చేయాలంటే ఈ అప్లికేషన్ ఉండాల్సిందే. వీడియో ఫైల్‌ని ట్రిమ్ చేయడానికి, ఇతరులతో షేర్ చేసుకోవడానికి, ఎమ్‌పీ3లోకి కన్వర్ట్ చేసుకోవడానికి ఉపయోగపడే అప్లికేషన్ ఇది. వీడియోలో మిడిల్ పార్ట్ డిలీట్ చేసుకోవచ్చు. ఒకే వీడియో ఫైల్‌ని రెండు ఫైల్స్‌గా స్ప్లిట్ చేసుకోవచ్చు. వీడియో ఫైల్స్‌ని ఎమ్‌పీ3 ఆడియో ఫైల్స్‌గా కన్వర్ట్ చేసుకోవచ్చు. మీకు నచ్చిన విధంగా వీడియో ఎఫెక్ట్స్ ఇచ్చుకోవచ్చు. వీడియో ఫ్రేమ్స్‌ని మీ మొబైల్ వాల్‌పేపర్‌గా సెట్ చేసుకోవచ్చు. వీడియోస్‌ని ఫేస్‌బుక్, యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేయవచ్చు. నేమ్, సైజ్, డ్యూరేషన్, డేట్ ఆధారంగా సార్ట్ చేసుకోవచ్చు. వీడియోఫైల్‌కి రీనేమ్, అవసరం లేదనకుంటే మొబైల్‌లో నుంచి డిలీట్ చేసుకోవచ్చు.

### VidTrim - Video Trimmer

వీడియోస్‌ని ఎడిట్ చేయడానికి ఉపకరించే ఆప్ ఇది. ఒరిజినల్ వీడియో క్లిప్‌ను ఎడిట్ చేసుకోవచ్చు. అదే ఫైల్‌పై ఓవర్‌రైట్ చేయవచ్చు లేదా కొత్త క్లిప్‌గా సేవ్ చేసుకోవచ్చు. స్నేహితులతో షేర్ చేసుకోవచ్చు.

### Video Locker - Hide videos

మీ మొబైల్‌లో చాలా వీడియో క్లిప్పింగ్స్ ఉన్నాయి. ఇతరులు చూడకూడని వీడియోస్ కూడా అందులో ఉన్నాయి. ఇతరులు మీ ఫోన్ తీసుకున్నా వాటిని చూడకుండా ఉండాలంటే ఎలా? వీడియో లాకర్ ఆప్ ఉంటే చాలు. మీ వీడియోస్ అన్నింటిని సేఫ్‌గా లాకర్‌లో పెట్టుకోవచ్చు. ఇది హిడెన్ గ్యాలరీ అప్లికేషన్. సీక్రెట్ పిన్ కోడ్ ఎంటర్ చేస్తే తప్ప మీ వీడియోస్‌ని చూడటం సాధ్యం కాదు. హిడెన్ వీడియోస్ మీ మొబైల్‌లో సీక్రెట్ లోకేషన్‌లో స్టోర్ కావడమే కాదు ఎన్‌క్రిప్టెడ్ అయిపోతాయి. అంటే మీ మెమొరీ కార్డును ఎవరైనా తస్కరించి హిడెన్ వీడియో ఫైల్స్‌ని కాపీ చేసి చూడాలని ప్రయత్నించినా లాక్‌డ్ వీడియోస్ ఓపెన్ కావు. రీసెంట్ అప్లికేషన్ లిస్ట్‌లోనూ కనిపించవు. ఒకవేళ మీరు వీడియో లాకర్‌లోనుంచి ఎగ్జిట్ కావడం మరిచిపోతే మీ మొబైల్ స్లీప్‌మోడ్‌లోకి వెళ్లిపోగానే అటోమెటిక్‌గా అప్లికేషన్ లాక్ అవుట్ అయిపోతుంది. ఒకవేళ పిన్ నంబర్ మరిచిపోతే రికవరీ చేసుకోవడానికి ఆప్షన్ ఉంది. పిన్‌నంబర్‌ను అప్లికేషన్ మీకు మెయిల్ చేస్తుంది. హైడ్ చేసిన వీడియోఫైల్స్‌ను సులువుగా అన్‌హైడ్ చేసుకోవచ్చు.

### Watch TV

మీరేమో ఆఫీసులో ఉన్నారు. టీవీ చూడటానికి వీల్లేదు. ఐతే ఏం? మొబైల్ ఉందిగా! మొబైల్ ఫోన్‌లో టీవీని చూడటానికి వాచ్ టీవీ అప్లికేషన్ ఉపయోగపడుతుంది. వాచ్ టీవీ అప్లికేషన్ మీ బ్రౌజర్‌ని ఓపెన్ చేసి టీవీ చానెల్స్‌కి కనెక్ట్ అవుతుంది. వాచ్ టీవీ ఆప్ సహాయంతో 100 ఆన్‌లైన్ టీవీ చానెల్స్‌ను యాక్సెస్ చేయవచ్చు. మూవీస్, మ్యూజిక్, కార్టూన్స్, న్యూస్, స్పోర్ట్స్ కేటగిరీలుగా విభజించుకోవచ్చు. అయితే మొబైల్‌లో టీవీ చూడాలంటే ఫ్లాష్ ప్లేయర్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్ మార్కెట్లో అడోబ్ ఫ్లాష్ ప్లేయర్ ఉచితంగా లభిస్తుంది.

### Real player

సంగీతమంటే అభిరుచి కలవారు మొబైల్‌లో ఉంచుకోవాల్సిన అప్లికేషన్. మ్యూజిక్, వీడియో, ఫోటోస్ అన్నీ ఒకే చోట చూసే వీలుంది. తొమ్మిది భాషలను సపోర్టు చేస్తుంది. హెడ్‌ఫోన్స్ సహాయంతో కంట్రోల్ చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్‌తో సెర్చ్ చేసే వీలుంది.



# ఫిషింగ్ మెయిల్స్‌ను గుర్తించేదెలా?

టెక్ కౌన్సెలింగ్

ఎన్. కిరణ్‌కుమార్
సీనియర్ టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్
హైదరాబాద్



నేను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను. నేను బ్యాంకింగ్ లావాదేవీలు ఆన్‌లైన్‌లో చేస్తుంటాను. ఇటీవల నేను ఖాతాదారుగా ఉన్న ఓ బ్యాంకు పేరిట మెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో మీ ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఖాతా సెక్యూరిటీని పెంచటంతోపాటు మీకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ సైన్ కాన్‌సెంట్ యాక్సస్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఇన్‌ఫర్‌మేషన్‌ను అప్‌డేట్ చేయాలని సూచించారు. 72 గంటల లోగా మీరు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఇన్‌ఫర్‌మేషన్‌ను అప్‌గ్రేడ్ చేయకుంటే మీ ఖాతాలో లావాదేవీలు నిలిపివేస్తామంటూ హెచ్చరికను కూడా మెయిల్‌లో చేశారు. దీనిపై బ్యాంకులో పనిచేసే ఓ స్నేహితురాలితో ఆరా తీస్తే, అవి ఫిషింగ్ మెయిల్ అని, బ్యాంకులు ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఇలాంటి వివరాలు ఇవ్వమని కోరవని చెప్పింది. బ్యాంకుల పేరిట వస్తున్న ఫిషింగ్ మెయిల్స్‌ను ఎలా గుర్తించాలి? వీటి విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సవివరంగా తెలియజేయగలరు.

– **శ్రీదేవి**, సికింద్రాబాద్

ప్రపంచవ్యాప్తంగా ఇటీవల బ్యాంకు ఖాతా వివరాలు ఆన్‌లైన్‌లో తెలియజేయాలని కోరుతూ ఫేక్ వెబ్‌సైట్‌ల నుంచి ఫిషింగ్ మెయిల్స్ రావడం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి మెయిల్స్‌ను మీరు సునిశితంగా పరిశీలిస్తే అవి సైబర్‌నేరగాళ్లు పంపిన ఫేక్ ఫిషింగ్ మెయిల్ అని సులభంగా తెలుస్తుంది. బ్యాంకు నుంచి వచ్చే ఉత్తరాలు, మెయిల్స్‌లో ఖాతాదారు పేరిట ఉంటాయి. కాని ఫిషింగ్ మెయిల్‌లో డియర్ వాల్యూడ్ కస్టమర్ అని సంబోధించారు. ఏ బ్యాంకు కూడా ఆన్‌లైన్‌లో బ్యాంకు ఖాతా వివరాలు, యూజర్ ఐడి, పాస్‌వర్డ్, డెబిట్‌కార్డు నెంబరు, పిన్ నెంబరు, మొబైల్‌నెంబరు, పుట్టినతేదీ లాంటి రహస్యంగా ఉంచాల్సిన వివరాలు అడగవని గుర్తించండి. బ్యాంకు లోగోతోపాటు మీకు వచ్చిన ఈమెయిల్‌ను పరిశీలిస్తే హెచ్‌టీటీపీ స్థానంలో హెచ్‌ఎక్స్‌ఎక్స్‌పీ పేరిట ఉంది. అందులోనూ మీ బ్యాంకు పేరు తర్వాత ఉంది. బ్యాంకు వెరిఫికేషన్, ప్రాసెస్, వ్యాలిడేషన్ ప్రాసెస్ ఆన్‌లైన్‌లో చేయవని గమనించండి. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన నెంబర్లన్నీ అత్యంత రహస్యమని గుర్తించండి. వీటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయవద్దు. బ్యాంకు లాగిన్, ట్రాన్స్‌క్షన్ పాస్‌వర్డ్, టైమ్ పాస్‌వర్డ్, యూనిక్ రిఫరెన్స్ నెంబర్లు ఈమెయిల్ ద్వారా బ్యాంకులు అడగవని గుర్తించండి. అత్యంత రహస్యమైన ఈ నెంబర్లను సీల్డ్ కవరులో మీకు అందజేస్తాయి. వాటిని మెయిల్ ద్వారా బహిర్గతం చేస్తే మీ ఖాతాలోని డబ్బు మాయం అవుతుంది. జాగ్రత్త! బ్యాంకుల పేరిట ఏవైనా మెయిల్స్ మీకు వచ్చినపుడు అధికారిక బ్యాంకు వెబ్‌సైట్‌లోకి వెళ్లి సరిచూసుకోండి. బ్యాంకుల పేరిట వచ్చే ఫిషింగ్ మెయిల్స్‌ను క్లిక్ చేయకుండా డిలిట్ చేయండి.

**ఫేస్‌బుక్ ఫోటో ట్యాగ్ నోటిఫికేషన్ పేరిట మాలవేర్ వెరస్‌దాడులు ఇటీవల పెచ్చు పెరిగాయి. నాకు మాలవేర్ మెసేజ్‌లు తరచూ వస్తున్నాయి. దీన్ని క్లిక్ చేయడం వల్ల మన కంప్యూటర్‌కు ఎలాంటి నష్టం జరుగుతుంది. దీన్ని నివారించేదెలా?**

– **వెంకటకృష్ణారావు**, విజయవాడ

ఫేస్‌బుక్ ఫోటో ట్యాగ్ నోటిఫికేషన్ పేరిట ఇటీవల మాలవేర్ వైరస్ దాడులు పెరిగిన మాట వాస్తవమే. ఫేస్‌బుక్ యూజర్లకు హెచ్చరిక. ఇలాంటి ఫ్రాడ్ ఈమెయిల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. ఫేస్‌బుక్ ఫోటో ట్యాగ్ నోటిఫికేషన్‌ను క్లిక్ చేస్తే మీ కంప్యూటర్‌లోకి వైరస్ డౌన్‌లోడ్ అవుతుంది. దాని వల్ల బ్రౌజర్ సెట్టింగ్ ఛేంజ్ అవుతుంది. మీ ఈమెయిల్‌కు వాణిజ్య ప్రకటనలు వెల్లువలా వస్తాయి. మీ సిస్టమ్‌లో వైరస్ బ్యాకింగ్ వల్ల మీ విలువైన డాటాను కూడా సైబర్‌నేరగాళ్లు తీసుకుంటారు. మీరు నెట్ బ్రౌజింగ్ చేయకుండానే ఆటోమేటిక్‌గా వైరస్ వల్ల డైరెక్టుగా నెట్‌కు కనెక్ట్ అవుతుంటుంది. అందుకే మాలవేర్ ఈమెయిల్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. అలాంటి మెసేజ్‌లు, ఈమెయిల్స్‌ను డిలిట్ చేయండి.



# అనంతరూపాల వెనుక ఉన్నది ఒక్కటే

చింతన

ఓ మృత్యుదేవా! చిన్న విత్తనంలోంచి, మహావృక్షం బయటికి వస్తుంది. శుక్లశోణితంలోని కనిపించని ఒక స్వల్పాంశ పెరిగి ఒక మహారాజుగా పెరుగుతుంది. ఒక మహర్షి అవుతుంది. అదంతా ఈశ్వరునిలోని ఒక మహత్యం. దానిని కాదనే హక్కు నీకెక్కడిది? ఆ అధికారం నీకు ఎవరిచ్చారు? ఆధ్యాత్మిక అనుభవాలనూ, విభూతాలనూ కాదనేందుకు నీవెవరివి? ఇవన్నీ సంభవాలవుతున్నప్పుడు భగవంతుడు లేడనీ, ఆత్మలేదనీ అనడానికి నీకున్న ప్రజ్ఞ ఏపాటిది? కాలపురుషా! చైతన్యరహితమైన జడప్రకృతి, ఒకనాటికి మేల్కొంటుంది. అది తనదైన భాషను సృష్టించుకుంటుంది. దానికి తనదైన ఇచ్ఛ ఒకటి ఉంది. అదేమిటో తెలుసా?అది తనను తాను తెలుసుకుని, పరమాత్మగా ఎదగడమే! అలా జీవించడమే! అలా ఎందుకు జరగాలన్నది నీ అనుమానం. అదే దైవ సంకల్పం కనుక– ఆ సంకల్పమే జడంగా మారి, అది చైతన్యంగా కదిలి, ఒక జీవిగా రూపుదాలుస్తోంది. తనకు తాను అధిగమించి ముందుకు సాగడమన్నది పరమలక్ష్యం. ఈ పరిణామం, ఈశ్వరుని వైపుగా పయనిస్తున్నది. ఈ రోజు అసమగ్రంగా, అసంపూర్ణంగా ఉన్న ఈ మార్పులు, రేపు సమగ్రంగా, సంపూర్ణంగా రూపుదాలుస్తుంది. ఈ శరీరం పెరుగుదలకూ, ఆ వికాసానికీ ఆధారం ఆ ఆవాసమే.



శ్రీఅరవిందుల సావిత్రి

**విశ్వకర్మ**

ఇదంతా విశ్వకర్మ చేసే విశ్వరచనా శిల్పరహస్యం. ఈ జరగబోయే పరిణామం బయటికి కనిపించేదేమీ కాదు. అదొక మార్మిక రహస్యం అదొక రహస్య లిపిలో ఉంది. అది కంటికి కనిపించదు. ఈ కనిపించే ప్రపంచంలోని ప్రతి అంశం, పరమేశ్వరుని ప్రజ్ఞలోని మర్మమే. కన్నులుండి చూడగలిగితే, అన్నింటిలోనూ దైవశక్తి, దైవం ఉనికీ కనిపిస్తుంది. ఈశ్వరుని మహాద్భుత శక్తికి ప్రత్యక్ష నిదర్శనం సూర్యుడు. అతని మరో ప్రజ్ఞకు తార్కాణం, ఆయనలోని ఔన్నత్యపు ప్రకటన చంద్రుడు. చూడగలిగిన నేత్రాలకు, ప్రతి చెట్టులోనూ, ప్రతిపూవులోనూ సౌందర్యం కనిపిస్తుంది. ఆ ప్రతిపూవులోనూ సృష్టిలోని మహాద్భుతమే గోచరిస్తుంది. వెరసి ఈ మహావిశ్వమే అతనికి బాహ్య రూపం. దైవంలోని ఈ మహారహస్యాలు ఎంత తరచిచూసినా మన ప్రజ్ఞకు అందవు. అదొక మహాద్భుత శక్తి విన్యాసం. మృత్యుదేవా! ఆ మహాశక్తి ముందు నీ ప్రజ్ఞాపాటవాలు ఏపాటివి? ఏదీ తెలియని అల్పజ్ఞత్వంతో ఏదో గొప్పతనం ఉందని విర్రవీగుతావు. ఇవన్నీ పిల్లచేష్టలు. కనిపించని శూన్యం నుంచి కనిపించే లోకాన్ని సృష్టించిన మహాప్రజ్ఞ దైవానిది.

**ఆ నాటకంలో భాగమే**

మనస్సు తోవతప్పి, మన స్వాధీనం తప్పినప్పుడు జీవితం నిరర్థకమవుతుంది. చేసే దుర్మార్గాలూ, దివ్యకార్యాలూ అన్నీ ఆయన ఆడించే నాటకంలోని అల్ప సన్నివేశాలే. వెరసి ఇవన్నీ ఆయన నాటకానికి అవసరం. అందరూ ఆ జగన్నాటకంలోని పాత్రదారులే. అంతటినీ, అందరినీ కలిపి తన నాటకాన్ని పరమాత్మే రక్తి కట్టిస్తాడు. చివరికి ఈ చీకటి వెలుగుల ద్వారా సైతంఅ పరమాత్మనే చేరుకుంటాం. పైకి కనిపించే ఈ పరస్పర వ్యతిరేకతలన్నీ ఆ నటరాజ స్వామి పదవిన్యాసంలోని భంగిమలే. అదొక చిదంబర రహస్యం. ఆ పరమేశ్వరుని శక్తి అంశే ఆ జగన్మాత.

**జగన్మాత**

కఠోరమైన నియమాలతో ఆ జగన్మాత ఆత్మను పరీక్షిస్తుంది. అంతరంగంలోని పరమాత్మను అందకుండా చేస్తుంది. పరమాత్మను నిద్రపుచ్చుతుంది. అలా నిద్రించే విశ్వంలోని జీవితాల్లో తాను విజృంభిస్తుంది. ఆమె చేసే అద్భుత కార్యాలన్నీ పూర్ణత్వం దిశగా నడిపిస్తాయి. ఏ ప్రయత్నమూ లేకుండా ఆమె దివ్యత్వం వేపు నడిపిస్తుంది. అలా నడుస్తున్నట్లుగా మనకు తెలియకుండా రహస్యంగా ఉంచుతుంది. తన సృష్టిని తానే హరిస్తుంది. అదే మరణం. ఆ మరణంతోనే అమరత్వం వేపుగా నడక సాగుతుంది. దాని అంతిమగమ్యంలో పరమాత్మ రూపం దర్శనమిస్తుంది. అదంతా ఒక మజిలీ మాత్రమే. ఈ లోకంలో ఈశ్వరీయతా ఆవిష్కరించబడేంతవరకూ మనం తుదికి చేరినట్లు కాదు. ప్రయాణం అయిపోయినట్లూ కాదు. మృత్యుదేవా! ఈశ్వరీయత, అజ్ఞానపు ముసుగులో రహస్యంగా ఉంది. నిజానికి పాపకర్మల ద్వారానే పుణ్యకార్యాలు అంటే ఏమిటో తెలుసుకుంటాం. ఈ రోజు చేస్తున్న తప్పుల్ని చూసి ఎప్పుడూ భయపడకూడదు. వాటి ద్వారానే నిజమేమిటో, సత్యమేమిటో తెలుస్తుంది. పశ్చాత్తాపంతోనే బ్రహ్మానందానికి బాటలు వేసుకుంటాం.

**దారులు అనేకం**

అనేక దారుల ద్వారా పరమాత్మను చేరుకునే వీలుంది. ఈ ద్వంద్వ ప్రకృతి ఆ ఏకత్వ సిద్ధికి మార్గమే. ఈ అనంతరూపాల వెనుక ఉన్నది ఆ ఏకత్వమే. అది ఇన్ని రూపాల్లో తనను తాను ఆవిష్కరించుకుంటున్నది. అదే ఆ పరమేశ్వరుని లీలా విన్యాసం. ఈ జీవన పోరాటాలన్నీ ఆ అవ్యక్తంలో ఒకనాటికి లయించిపోతాయి. అంతా, అన్నీ ఒకే దివ్యప్రేమకు తోవదీస్తాయి. తప్పటడుగులు వేయకుండా పనివాడు సరియైన నడకను నేర్చుకోలేడు. ఈ సృష్టిలో ఏదీ వ్యర్థంగా లేదు. చివరికి అన్నీ ఆ భగవంతుని చేరే మార్గంలో లయిస్తాయి. మృత్యుదేవా! ఇంకా ఈ సృష్టి రహస్యాలు చాలా ఉన్నాయి.''

• కొంగర భాస్కరరావు
శ్రీఅరవిందాశ్రమం, తెనాలి.

ఆంధ్రజ్యోతి

# సకల 3

23–8–2012 • గురువారం

## ఆధ్యాత్మికంగా ఎదగడం ఎలా?

నేను ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిని చేరుకోవాలనుకుంటాను, కాని నా కుటుంబం అడ్డుపడుతోంది, మిత్రులు సహకరించడం లేదు. ఇప్పుడు నన్ను ఏమి చేయమంటారు? ఇది దాదాపు సాధకులందరికీ ఎదురయ్యే ప్రశ్న. అయితే ఎవరి పరిస్థితిని వారు, తమకు తగిన రీతిలో సరిచేసుకోవాలి. మీరు ఎంచుకున్న ప్రతి దానికీ ఒక పర్యవసానముంటుంది. మీరు తగిన మూల్యం చెల్లించకుండా దేనిలో నుంచి బయట పడలేరు. ప్రతిదానికి ఒక మూల్యం ఉంటుంది. మీ ఆధ్యాత్మిక మార్గం అసలు ఎవరికీ, ఎంత మాత్రమూ అడ్డంకి కాదు. మీరు ఎక్కడికి వెళ్లాలో, ఏమీ చేయాలో, అక్కడ మీరు ఎంత సేపు గడపాలో అన్నది మీ ఇష్టాన్ని బట్టి ఉంటుంది.



చింతన

### జీవితం సాఫీగా...

మీరు సాయంత్రం బయటకు వెళదామనుకున్నప్పుడు, మీ ఇంట్లో ఒకరు బజారుకు వెళదామంటారు. మీరు బీచ్‌కు వెళదామనుకుంటారు. ఇది సమస్య కాదా? అంటే ఘర్షణ అనేది ఆధ్యాత్మిక మార్గం వల్ల కాదు, కేవలం మీరు ఎక్కడికి వెళదామనుకుంటున్నారు, ఎక్కడికి వెళ్లకూడదనుకుంటున్నారు అనే వాటి మధ్య పొంతన లేకపోవటం వల్లే. మీ ఆధ్యాత్మిక మార్గానికి ఎవరితోను ఘర్షణ లేదు.

### ఆధ్యాత్మిక తపన

మీ ఆధ్యాత్మిక తపన, మీరున్న పరిస్థితుల నుంచి మిమ్మలను పూర్తిగా దూరం చేస్తుంటే అప్పుడు కొంత ఘర్షణ , కలత తప్పదు. నిజానికి అది ఘర్షణ కాదు, ఎందువలన అంటే ఘర్షణ అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడుతుంది, అప్పుడు మనశ్శాంతికి కొంత భంగం ఏర్పడుతుంది. ఇక అపరాధ భావం వల్ల మరియు అసౌకర్యం వల్ల ఉదయిస్తున్న సమస్యల గురించి –''ఇతర కుటుంబ సభ్యుల కోసం నేను ఎం చేస్తున్నాను'' అనే ఆలోచనలు రావచ్చు. మీ బలహీనతలను గొప్ప చేయడం మీకైనా , ఇతరులకైనా ఎవరికీ మంచిది కాదు. మీ బలహీనతలను రూపుమాపటం చాలా బాధాకరమైనది. ఎంత బాధాకరమైనప్పటికిని వాటిని తొలగించుకోవటమే శ్రేయస్కరం. దాన్ని ఎలా చేయాలి? మీరు గనుక వీటిని మృదువుగా తొలగించుకోగలిగితే అద్భుతం. వాటిని మృదువుగా తొలగించుకోవటం అసంభవమని కాదు, కాని మిగతావారు దానిని అంత సులవుగా, మృదువుగా జరగనివ్వరు. ఎందుకంటే ఇది మృదువుగా జరిగినట్లయితే , మీరు దాన్ని చేయడంలోని అపరాధ భావన నుంచి తప్పించుకుంటారని వాళ్ల అభిప్రాయం.

### ఆధ్యాత్మిక పురోగతి కావాలి

గౌతమబుద్ధుడు అన్వేషించాలనుకున్నప్పుడు – అన్వేషించాలనుకున్న దేమిటో కూడా తెలియకుండా– తన రాజ్యాన్ని, తన భార్యని, పసిపిల్లవాడిని త్యజించి, రాత్రిపూట దొంగలాగా వెళ్లిపోయాడు. అప్పుడు ఆయన కుటుంబసభ్యులు ఆయనని బహుశా అత్యంత దుర్మార్గుడుగా భావించి ఉండవచ్చు. ఆయన అలా చేయక పోయినట్లయితే ఈ ప్రపంచం ఇంకా దైన్యంగా ఉండి ఉండేది. ఆయన చేసిన పనుల ద్వారా బాధలకు లోనైన వారి కుటుంబీకులూ ఏమంత సంతోషంగా ఉండేవారు కాదు. కొంత కాలం తర్వాత వాళ్లు బాధపడటానికి మరొకరకమైన కారణం కనుగొని దానితో బాధ పడుతుండేవారు. అంటే ఆధ్యాత్మిక పురోగతి కావాలనుకున్నప్పుడు మనం చేసే దానికి ఒక రకంగా ఏదీ అడ్డుకాదు, మరో రకంగా అన్నీ అడ్డంకులే అది మీరు చూసే రీతిలో ఉంటుంది.

• సద్గురు

---

**ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజలలో అవగాహన పెరుగుతున్నప్పటికీ నగరీకరణ ప్రభావం మనిషి జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. శారీరక శ్రమ లేని ఉద్యోగాలు మనిషిని అనారోగ్యం పాలుచేస్తున్నాయి. గంటల తరబడి కూర్చుని చేసే కొలువులు స్థూలకాయాన్ని, దానితోపాటు టైప్ 2 డయాబెటిస్, హైబిపి, హృద్రోగాలు వంటి అనారోగ్యాలను మోసుకొస్తున్నాయి. ఒబేసిటి సమస్యను పరిష్కరించే బేరియాట్రిక్ సర్జరీని మనరాష్ట్రంలో తొలిసారి నిర్వహించి, ఆరేళ్లుగా ఎందరికో నాజూకుదనాన్ని ప్రసాదిస్తున్నారు డాక్టర్ మహీధర్ వలేటి. స్థూలకాయాన్ని నివారించి, నాజూకుగా వుండేందుకు ఏం చేయాలో చెబుతున్నారాయన.**



సమ్‌థింగ్ స్పెషల్

# ఆధునిక అనర్థం ఒబేసిటి

ఒకప్పుడు ఒబేసిటి అనేది పాశ్చాత్య దేశాలకు చెందిన ఆరోగ్య సమస్యగా కనిపించేది. అయితే గడచిన పాతిక సంవత్సరాలుగా మన దేశంలో కూడా ఈ సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. దీనికి ప్రధాన కారణం సంపద సృష్టి మన దేశంలో కూడా గణనీయంగా పెరగడమే. సంపదతో పాటు అది తెచ్చే ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతూ పోతున్నాయి. అలాగే ప్రకృతి ధర్మానికి భిన్నంగా చేసే కొత్త తరహా ఉద్యోగాలు పుట్టుకురావడం మరో కారణం. బిపిఓలు, ఐటి, సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ వంటివి రావడంతో రాత్రి పూట పనిచేసి పగలు నిద్రపోయే కొత్త కొలువుల్లోకి ప్రవేశించడం జరుగుతోంది. ఇవి శారీరక శ్రమ లేని ఉద్యోగాలు. కేవలం మెదడుతో ఆలోచించి, ఒక చోట కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చుని చేసే ఉద్యోగాలు. అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాల కాలమానానికి అనుగుణంగా ఇక్కడ రాత్రి పూట పనిచేయాల్సి రావడంతో అప్పటికప్పుడు లభించే బర్గర్లు, పిజ్జాలు లాంటి హైఫ్యాటీ ఫుడ్‌ను, లేదా జంక్‌ఫుడ్‌ను తినడం వంటివి ఒబేసిటి ఏర్పడడానికి ప్రధాన కారణాలని చెప్పాలి. మౌలికంగా మనిషి జీవన చక్రం పగలు పనిచేయడం, రాత్రి నిద్రించడం. కాని ఇందుకు విరుద్ధంగా పగలు నిద్రపోతూ, రాత్రి పనిచేయడం వల్ల మనిషి తన జీవనగతినే మార్చుకోవలసి వస్తోంది. ఇది కూడా స్థూలకాయానికి దారితీస్తోంది.

### బిఎంఐని గుర్తించడం ఎలా?

ఒక వ్యక్తి అధిక బరువు ఉన్నట్లు ఎలా గుర్తించడం అన్న సందేహం చాలామందికి ఏర్పడుతుంటుంది. వ్యక్తి బరువును సూచించేదే బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ). ఇది మనిషి ఎత్తుకు తగ్గ బరువు ఎంత ఉండాలో సూచించే పట్టిక. ఎవరైనా తమ బిఎంఐ ఎంత ఉందో తెలుసుకోవడానికి చాలా సులభమైన మార్గం ఉంది. మన ఎత్తును సెంటీమీటర్లలో కొలుచుకుంటే ఒక మీటరు పైన ఎన్ని సెంటీమీటర్లు ఉన్నామో అంతే మన బరువు ఉండాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి 165 సెంటీమీటర్ల ఎత్తు ఉంటే అందులోనుంచి వంద తీసేస్తే మిగిలే ఆ 65 అతను ఉండాల్సిన బిఎంఐ. మన దేశంలో స్త్రీలు సాధారణంగా 155–165 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు. అదే పురుషులు 165–175 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు. స్త్రీల బరువు 55–65 మధ్య ఉండటమే ఐడియల్ బిఎంఐ. అదే పురుషుల విషయానికి వస్తే 65–75 మధ్య బరువు ఉండటం ఐడియల్ బిఎంఐ. ఉండాల్సిన బరువు కన్నా 30 కిలోలు అధికంగా ఉన్నవారు ఒబేసిటీ పరిధిలోకి వస్తారు. 20–25 కిలోలు అధికంగా ఉన్నవారిని స్థూలకాయులుగా పరిగణించాల్సిన అవసరం లేదు. 25–30 కిలోలు అదనంగా బరువు ఉన్నవారి పరిస్థితిని సివియర్ ఒబేసిటీగా, 40 కిలోలకు పైగా అదనంగా బరువు ఉంటే మార్బిడ్ ఒబేసిటీగా, 55 కిలోలకు పైగా అదనంగా ఉన్నవారి పరిస్థితిని సూపర్ ఒబేసిటీగా పరిగణిస్తాము.

### ఒబేసిటీ ఒక్కటే రాదు!

మనదేశంలో అత్యధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధ్యయనం ప్రకారం పట్టణ ప్రాంతాలలో 14–16 శాతం మంది టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. మన రాష్ట్ర రాజధాని నగరం ప్రపంచంలోనే డయాబెటిస్ రాజధానిగా మారుతోంది. హైదరాబాద్‌లో ప్రతి ఏడుగురిలో ఒకరు టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. టైప్ 2 డయాబెటిస్ రావడానికి ప్రధాన కారణం ఒబేసిటి.

- ఇక రెండవ సమస్య హైపర్‌టెన్షన్. బరువు పెరిగిన కొద్దీ బ్లడ్ ప్రెషర్ కూడా పెరుగుతుంది.
- ఒబేసిటీ కారణంగా వచ్చే మరో సమస్య ఆస్టియో ఆర్థరైటిస్. అధిక బరువు వల్ల మోకాలు, తుంటి జాయింట్లపై ఒత్తిడి ఏర్పడి అది ఆస్టియో ఆర్థరైటిస్‌కి దారితీస్తుంది.
- అధిక బరువుతో బాధపడేవారిలో నిద్రలేమి ఏర్పడుతుంది. కలత నిద్ర సమస్య వారిని వేధిస్తుంటుంది. స్థూలకాయులకు ఊపిరి పీల్చడంలో ఇబ్బందులు ఉండడం వల్ల వారు వెల్లకిలా కాకుండా పక్కకు తిరిగి పడుకోవడానికి ప్రయత్నిస్తారు. సాధారణంగా వీరికి గాఢ నిద్ర పట్టడంలో ఇబ్బందులు ఉంటాయి. స్థూలకాయులు అధికంగా కూర్చున్న స్థితిలోనే నిద్రపోవడానికి ప్రయత్నిస్తారు.
- స్థూలకాయంతో బాధపడే స్త్రీలలో పెద్దప్రేగు, బ్రెస్ట్, గర్భాశయ కేన్సర్లు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది. దీంతోపాటు సంతానలేమి, నెలసరి సక్రమంగా ఉండకపోవడం(సిపిఓడి) మరో ముఖ్యమైన సమస్య.
- బరువు ఎక్కువగా ఉన్నవారికి గ్యాస్ట్రో రిఫ్లక్స్ అనే సమస్య కూడా తలెత్తుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాక నోటి ద్వారా బయటకు రావడానికి ప్రయత్నించడం వంటి సమస్య ఉంటుంది.
- స్థూలకాయులలో మానసిక సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వీరిలో ఆత్మన్యూనతా భావం, ఎవరితో సరిగ్గా కలవలేకపోవడం, ఒంటరి తనాన్ని కోరుకోవడం వంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి.

### ఇలా చేస్తే మీరు స్లిమ్

ఇటీవలి కాలంలో పదేళ్లలోపు పిల్లలలో కూడా ఒబేసిటీ సమస్య తలెత్తుతుండడం చాలా ఆందోళనకరమైన పరిణామం. గడచిన రెండు మూడు దశాబ్దాలుగా ఒకే సంతానం చాలన్న పద్ధతి రావడంతో ఉన్న ఒక్క బిడ్డను గారాబంగా పెంచుతున్నామన్న భావనలో పరిమితి లేకుండా ఆహారం ఇవ్వడం కూడా స్థూలకాయానికి ఒక కారణంగా చెప్పవచ్చు. అలాగే కార్పొరేట్ విద్య కూడా పిల్లలను స్థూలకాయులుగా మారుస్తోంది. స్కూళ్లలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, చదువుపైనే శ్రద్ధ చూపడం వల్ల కూడా పిల్లలలో శారీరక శ్రమ కొరవడి వారిని స్థూలకాయుల్ని చేస్తోంది. ఈ విషయంలో తల్లిదండ్రులు చైతన్యవంతులు కావడంతోపాటు పిల్లల విషయంలో ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలి. పిజ్జాలు, బర్గర్లు, ఫెంచ్‌ఫ్రైలు వంటి హై క్యాలరీలతో కూడిన పదార్థాలను తీసుకోవడం తగ్గించాలి. నూనెలో వేయించిన ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు మానివేయాలి. రోజూ శారీరక వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి. రోజుకు 30–40 నిమిషాలు బ్రిస్క్ వాక్ లేదా ట్రెడ్‌మిల్ వాకింగ్ చేయడం అవసరం. డైటింగ్, ఎక్సర్‌సైజులతో కూడా అధిక బరువు తగ్గకపోతే సర్జరీల ద్వారా ఈ సమస్యను పరిష్కరించవలసి ఉంటుంది.




**డాక్టర్ మహీధర్ వలేటి**
సీనియర్ కన్సల్టెంట్ సర్జన్
లేపరోస్కోపిక్, జిఐ & బేరియాట్రిక్ సర్జరీ
**అపోలో హెల్త్ సిటీ**
జూబ్లీహిల్స్, హైదరాబాద్
**ఫోన్: 87900 83737**


"స్కూళ్లలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, చదువుపైనే శ్రద్ధ చూపడం వల్ల కూడా పిల్లలలో శారీరక శ్రమ కొరవడి వారిని స్థూలకాయుల్ని చేస్తోంది. ఈ విషయంలో తల్లిదండ్రులు చైతన్యవంతులు కావాలి."

---

ఆంధ్రజ్యోతి

# చిత్రజ్యోతి

## మోగనున్న 'బాజా భజంత్రీలు'

నమిత, కిరణ్ రాథోడ్, కీర్తి చావ్లా హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బాజా భజంత్రీలు'. ప్రియం క్రియేషన్స్ పతాకంపై ఎస్.ఆర్. మనోహర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగై హరిరాజన్ దర్శకుడు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో ఏక కాలంలో ఈ సినిమా తయారవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. హోం అండ్ సినిమాటోగ్రఫీ మంత్రిగా నటిస్తున్న విజయ్‌కుమార్, పోలీస్ కమీషనర్‌గా నటిస్తున్న కన్నడ నటుడు రవీంద్రనాథ్, జూనియర్ ఆర్టిస్టులపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. మంగళవారం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో దర్శకుడు హరిరాజన్ మాట్లాడుతూ ''ఇది నాకు ఏడో సినిమా. అలాగే నేను డైరెక్ట్ చేసిన మహిళ, బృందావనం, స్నేహం, అంతులేని కథ వంటి టీవీ సీరియల్స్ తెలుగు, తమిళ భాషల్లో బాగా పాపులర్ అయ్యాయి. ఇది ఐదుగురు సినీ తారల కథ. ఓ హీరోయిన్ కిడ్నాప్ చుట్టూ కథ నడుస్తుంది. సెప్టెంబర్‌లో షూటింగ్ పూర్తిచేసి, మూడు భాషల్లో నవంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు. ఇందులో హోం మంత్రిగా మంచి పాత్రను చేస్తున్నానని విజయ్‌కుమార్ చెప్పారు. ఇందులో సినీ హీరోయిన్ కీర్తి చావ్లాగా నిజ జీవిత పాత్రనే చేస్తున్నానని కీర్తి చావ్లా తెలుపగా, ఇప్పటివరకు చెయ్యని కొత్త పాత్రను చేస్తున్నానని కిరణ్‌రాథోడ్ తెలిపారు.

ఆర్తి, మేఘనా నాయుడు, సత్యప్రకాశ్, నళిని, శివాని, త్రిపుర తారాగణమైన ఈ చిత్రానికి మాటలు: ఇరముని శేఖర్, పాటలు: వెన్నెలకంటి, సంగీతం: భూపతి, ఛాయాగ్రహణం: జె.జి. కృష్ణ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మంగై హరిరాజన్.



కీర్తి చావ్లా, కిరణ్ రాథోడ్

## 'కమీషనర్ నరసింహ'గా శరత్‌కుమార్

శరత్‌కుమార్ హీరోగా నటించిన చిత్రం 'కమీషనర్ నరసింహ'. తమిళంలో సంచలన విజయం సాధించిన 'నరసింహన్ ఐపిఎస్' చిత్రానికి ఇది తెలుగు అనువాద రూపం. అన్నపూరణి మూవీస్ పతాకంపై కె. అరుణాచలం ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. తొలి కాపీ సిద్ధమైన ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ ''పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో శరత్‌కుమార్ మరోసారి విజృంభించి నటించారు. ఒక లాకప్‌డెత్ కేసుతో మొదలై అనేక మలుపులతో ఈ చిత్రం నడుస్తుంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా కథనం ఉంటుంది. ఫైట్‌మాస్టర్ పమ్మల్ రవి ఆధ్వర్యంలో తీసిన ఐదు ఫైట్లు అలరిస్తాయి. జాసీ గిఫ్ట్ సంగీత సారథ్యంలో రూపొందిన మూడు పాటలకు పొందూరి చక్కటి సాహిత్యం అందించారు. వాటిని అందమైన లొకేషన్లలో చిత్రీకరించారు. ఓ వారంలో సెన్సార్ పనులు పూర్తిచేసి సెప్టెంబర్ తొలి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు.

శరత్‌కుమార్ సరసన మేఘనారాజ్ నటించిన ఈ చిత్రంలో నెడిముడి వేణు, జగదీశ్, తలైవాసల్ విజయ్, లక్ష్మీశర్మ, విజయరాఘవన్ తారాగణం. ఈ చిత్రానికి మాటలు: ఎం. రాజశేఖర్‌రెడ్డి, ఛాయాగ్రహణం: దిలీప్ రామన్, కూర్పు: ఎల్. రామారావు, ఫైట్స్: పమ్మల్ రవి, దర్శకత్వం: చంద్రశేఖర్.



శరత్‌కుమార్, మేఘనారాజ్

## 'నా స్టైల్ నాదే' ఆడియో విడుదల

కృష్ణుడు ప్రధాన పాత్రధారిగా, రితీశ్‌పటేల్, నీలమ్‌శెట్టి జంటగా రూపొందుతున్న 'నా స్టైల్ నాదే' చిత్రం ఆడియో సీడీలు ఆదిత్యా మ్యూజిక్ ద్వారా విడుదలయ్యాయి. కళా ప్రొడక్షన్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో సురేందర్ కపూర్ నిర్మిస్తున్నారు. సునీల్ కశ్యప్ సంగీత దర్శకుడు. రామ్ పైడిశెట్టి, శ్రావణ్‌కుమార్ పాటలు రాశారు. ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఫిల్మ్‌చాంబర్ అధ్యక్షుడు తమ్మారెడ్డి భరద్వాజ్, నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ ఆడియో సీడీలను విడుదల చేశారు. సురేందర్ కపూర్ ఈ చిత్రాన్ని ఆకర్షణీయంగా తీసినట్లు కనిపిస్తున్నదనీ, తప్పకుండా పాటలూ, సినిమా విజయం సాధించాలనీ వారు ఆకాంక్షించారు. కృష్ణుడు మాట్లాడుతూ ''వైవిధ్యమైన పాత్రల కోసం చూస్తున్న నాకు ఇందులో రౌడీగా చాలా డిఫరెంట్ కేరక్టర్ లభించింది. సురేందర్ కపూర్ చిత్రాన్ని బాగా రూపొందించారు'' అని చెప్పారు. నిర్మాత, దర్శకుడు సురేందర్ కపూర్ మాట్లాడుతూ ''ఈ చిత్రంలోని అన్ని పాత్రలూ 'నా స్టైల్ నాదే' అన్నట్లు ప్రవర్తిస్తుంటాయి. వినోదం ప్రధానంగా ఈ సినిమా నడుస్తుంది'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ, హైకోర్టు అడ్వకేట్ వరప్రసాద్, డిజీక్వెస్ట్ కిశోరీ బసిరెడ్డి, దర్శకుడు ఎం. నాగార్జునరెడ్డి, హీరో హీరోయిన్లు రితీశ్‌పటేల్, నీలమ్‌శెట్టి, నటి ఢిల్లీ రాజేశ్వరి, నటుడు అర్జున్‌యాదవ్, సహ నిర్మాతలు భరత్‌వ్యాస్, మేఘరాజ్, ఛాయాగ్రహకుడు నాగేంద్రకుమార్, నిర్మాణ నిర్వాహకుడు రవికపూర్, గేయ రచయితలు రామ్ పైడిశెట్టి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణుడు

## పాటల్లో 'స్వాతి ఐ లవ్ యు'

ఎస్.ఆర్.పి. క్రియేషన్స్ నిర్మించిన చిత్రం 'స్వాతి ఐ లవ్ యు'. శివాజీ బొడ్డెన సమర్పిస్తున్నారు. సంతోష్ పార్లవార్, దిలీప్ కుమార్ హీరోలుగా, వర్షిణి హీరోయిన్‌గా నటించారు. సంతోష్ పార్లవార్ దర్శకత్వం వహించారు. శ్యామలా సంతోష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని పాటలను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ ''పాటలకు చాలా మంచి స్పందన వస్తోంది. ఘనశ్యామ్ మంచి బాణీలిచ్చారు. విన్న ప్రతి ఒక్కరూ పాటలు ట్రెండీగా ఉన్నాయని కితాబిస్తున్నారు. షూటింగ్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని వర్గాల వారినీ మెప్పించే సినిమా అవుతుంది. టైటిల్ బావుందని ప్రశంసలు వస్తున్నాయి. అన్ని పనుల్ని పూర్తి చేసి వచ్చేనెల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని అన్నారు. నాగిరెడ్డి, ఎఫ్.ఎమ్.బాబాయ్, బాంబే పద్మ, అనిల్ మొగిలి, ఆనంద్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: ఘనశ్యామ్, కూర్పు: వినయ్ రామ్, మాటలు: జంపన్న, ఫైట్స్: ప్యాంథర్ నాగరాజు, నృత్యాలు: ఆనంద్, నిర్మాత: శ్యామలా సంతోష్, కథ–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం: సంతోష్ పార్లవార్.



సంతోష్ పార్లవార్, వర్షిణి



బత్తుల రతన్‌పాండు, శ్రీహరి, మనోజ్, తాప్సీ, లక్ష్మీప్రసన్న, నవదీప్, మహంకాళి దివాకర్, కార్తికేయ గోపాలకృష్ణ

## 'వసూల్ రాజా' ఎవరు?

బి.యమ్.స్టూడియోస్ నిర్మిస్తున్న చిత్రం 'వసూల్ రాజా'. శ్రీహరి, నవదీప్, రీతూ బర్మేచా కీలక పాత్రధారులు. కార్తికేయ గోపాలకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల రతన్‌పాండు, మహంకాళి దివాకర్ నిర్మాతలు. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని అన్నపూర్ణస్టుడియోలో బుధవారం ఉదయం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి రాష్ట్ర మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి క్లాప్‌నిచ్చారు. మంచు లక్ష్మీప్రసన్న, తాప్సీ, మనోజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. క్రిష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీహరి మాట్లాడుతూ ''కార్తిక్ చెప్పిన కథ నచ్చింది. నా పాత్ర చాలా బావుంది. ఈ టీమ్, వాళ్ళు చేస్తున్న కృషి నచ్చాయి. నిర్మాతకు మంచి వసూలు రావాలని కోరుతున్నాను''అని చెప్పారు. నవదీప్ మాట్లాడుతూ ''ఈ సినిమాకు సంబంధించి పాజిటివ్ వైబ్రేషన్స్ మొదలయ్యాయి. మంచి ప్రేమకథ. వినోదం ప్రధానంగా ఉంటుంది. తొలి షెడ్యూల్ పది రోజులుంటుంది. మాస్, హై ఎనర్జటిక్ స్టోరీ. ఈ సినిమాకు శ్రీహరి పాత్ర ప్లస్ అవుతుంది. నేను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బ్రేక్ ఈ సినిమాతో వస్తుంది'' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''నా రెండో సినిమా ఇది. మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాను''అని చెప్పారు. ''కథ అన్ని వర్గాల వారికీ నచ్చేలా ఉంటుంది. టైటిల్ బావుందని పలువురు ప్రశంసిస్తున్నారు'' అని నిర్మాతలు అన్నారు. మంచి పాత్రలో నటిస్తున్నట్టు రీతు బర్మేచా, సత్యం రాజేష్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: రామస్వామి, పాటలు: చిన్నిచరణ్, సాగర్ నారాయణ, ముని, మహి, కెమెరా: జి.కృష్ణప్రసాద్, సంగీతం: చిన్నిచరణ్, నృత్యాలు: శేఖర్, నిర్మాతలు: బత్తుల రతన్‌పాండు, మహంకాళి దివాకర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కార్తికేయ గోపాలకృష్ణ.

## నవరసాల మిళితం 'సినిమాకెళ్దాం రండి'

**''సినిమా కెళ్దాం రండి అనేది నలుగురు స్నేహితులు కలిసిన ప్రతిసారీ వినిపించే మాట. ఆ మాటలో అన్నీ జోనర్ల చిత్రాలూ ఉంటాయి. అందరికి కావాల్సిన వినోదమూ ఉంటుంది. అందుకే మా సినిమాకి 'సినిమాకెళ్దాం రండి' అనేదే టైటిల్ అయింది. ఇందులో సినిమా పరిశ్రమకు సంబంధించిన ప్రస్తావన ఏమీ ఉండదు'' అని అంటున్నారు పాలడుగు ప్రభాకర్. రాజేంద్రప్రసాద్, భరత్ కీలక పాత్రధారులుగా ఆయన నిర్మిస్తున్న 'సినిమాకెళ్దాం రండి' ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాకర్ 'చిత్రజ్యోతి'తో పంచుకున్న విశేషాలు..**

''నేను గతంలో 'లక్ష్యం' సినిమాకు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేశాను. రాజేంద్రప్రసాద్, భరత్ కీలక పాత్రధారులుగా నటించిన 'సినిమాకెళ్దాం రండి' నిర్మాతగా నా తొలి చిత్రం. తన చెల్లెలికి అన్యాయం జరిగినప్పుడు, ఓ మామూలు కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఎలా తమ కోపాన్ని తీర్చుకున్నారన్నది ఇందులోని ఆసక్తికరమైన కథ. ఎక్కడా హాస్యం ఉన్నట్టు అనిపించదు. కానీ ఆద్యంతం ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు. పెళ్ళై పదేళ్ళయిన భార్యాభర్తలు ఈ సినిమాను చూస్తే తమ జీవితంలో ఏదో ఒక సందర్భంలోనైనా సరే జీవిత భాగస్వామితో 'అలా ప్రవర్తించి ఉండకూడదు కదా' అని పశ్చాత్తాపానికి గురవుతారు. అన్నచెల్లెళ్ళ విషయంలోనూ అదే భావం కలుగుతుంది. డబ్బుల కన్నా ప్రేమ, అప్యాయతలు, కుటుంబ బాంధవ్యాలు ముఖ్యమన్న విషయాన్ని అంతర్లీనంగా చర్చించాం. మేం ఏం చెప్పినా కమర్షియల్ అంశాలను జోడించే చెప్పాం.''



ప్రభాకర్

### హైలైట్స్

''పాటలు బావున్నాయని ఇప్పటికే టాక్ వచ్చింది. స్క్రీన్‌ప్లే మా సినిమాకు ఆయువు. ప్రతి 15 నిమిషాలకు ఓసారి ఉత్కంఠ కలిగించే అంశాలు మెప్పిస్తాయి. క్రైమ్ ఉంటుంది కానీ కనిపించదు. థ్రిల్లర్ విషయంలోనూ అంతే. పకడ్బందీగా నవరసాల్ని ఈ చిత్రంలో చొప్పించాం. ఈ ఫాస్ట్ ప్రపంచంలో కుటుంబంలోని బంధుత్వాలు ఎలా ఉండకూడదో చర్చించాం. అలాగని విసిగించలేదు. నవ్వించే ప్రయత్నమే చేశాం. భరత్, రాజేంద్రప్రసాద్ సమానమైన పాత్రలు చేశారు. రాజేంద్రప్రసాద్ యముడిగా, బ్రాహ్మణుడిగా వేసిన వేషాలు గొప్పగా ఆకట్టుకుంటాయి. ఆయన కెరీర్‌లో వెరైటీగా నిలుస్తుందీ సినిమా. కథను ఇంకెవరి చేతిలోనైనా పెడితే ఎలా తీస్తారోనన్న సంశయంతో మా ఎంఎంజీ రెడ్డి చేతిలో పెట్టాం. ఆయన ప్రతి ఫ్రేమునూ గొప్పగా తీశారు.''

### తదుపరి

''మా సంస్థలో తేజ, సాయిరామ్‌శంకర్ కాంబినేషన్‌లో తర్వాతి చిత్రాన్ని రూపొందిస్తాం.''

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

30-8-2012 గురువారం




**సంచలన కథనాలకు పెట్టింది పేరైన తెహెల్కా పక్షపత్రిక యువతలో నూతనోత్తేజాన్ని నింపేందుకు 'ద పవర్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 25 వారాల పాటు దేశంలోని 25 నగరాల్లోని యంగ్ తరంగాలను కలిసి నవీన భారతం గురించిన తన ఆలోచనలను పంచుకుంటున్నారు తెహెల్కా వ్యవస్థాపకుడు, ప్రముఖ పాత్రికేయుడు తరుణ్ తేజ్‌పాల్. మొదటి సభ విశాఖపట్నంలోని గీతమ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగింది. పాత్రికేయుడిగానే కాకుండా గొప్ప రచయితగానూ పేరు తెచ్చుకున్న తరుణ్ తేజ్‌పాల్‌తో నవ్య జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...**

# పది రకాల పత్రికలూ ఛానెళ్లూ ఉండటమే మంచిది

**మీరు ఆర్మీ వాతావరణంలో పెరిగారని విన్నాం. మరి జర్నలిజం వైపు ఎలా వచ్చారు?**

మా నాన్న సైనికాధికారి కావడంతో నా బాల్యమంతా ఆర్మీ కంటోన్మెంట్లలోనే గడిపాను. త్రివిధ దళాల్లో 'ప్రశ్నించడం' పెద్ద నేరం. పై అధికారి చెప్పింది చెయ్యడమే తప్ప ఎందుకు, ఏమిటి వంటి ప్రశ్నలు అడిగే తావుండదు. క్రమశిక్షణకు పెట్టింది పేరు ఆ వాతావరణం. అది నాకు ముందునుంచీ నచ్చేది కాదు. నేను కొంచెం ఇండిసిప్లిన్డ్. ప్రతిదాన్నీ పరిశోధించి తెలుసుకోవాలన్న ఉత్సాహమేదో నన్ను ముందుకు నడిపించేది. సాధారణంగా త్రివిధ దళాల్లో పనిచేసే వ్యక్తులు తమ పిల్లలు తప్పనిసరిగా అటువైపే వెళ్లేలా నూరిపోస్తారు. నేనలాగ ఇమడలేనని ముందే ఊహించి రచనా రంగం వైపు వచ్చాను. నిజానికి నేను పాత్రికేయుణ్ని కూడా అవాలనుకోలేదు. పూర్తి స్థాయి రచయితగా, సాహిత్యకారుడిగా రాణించాలనుకున్నాను. బాగా చదవడం నాకలవాటు. అయితే అప్పటికింకా రచనల మీదే ఆధార పడి జీవించే పరిస్థితి లేదు దేశంలో. అందువల్ల రాత - భాషలకు సంబంధముండే జర్నలిజంలోకి అడుగుపెట్టాను. నిజం ఇంకోటి కూడా ఉంది లెండి. అప్పటికే నేను గీతమ్ బాత్రాతో పీకల్లోతు ప్రేమలో ఉన్నాను. త్వరగా ఒక జీవనాధారం ఏర్పడకపోతే ఆమెను వేరే ఎవరికైనా ఇచ్చి పెళ్లి చేసేస్తారని భయపడి ముందు ఉద్యోగం సంపాదించుకున్నాను. (నవ్వుతూ)

**పాత్రికేయంలో మీకు స్ఫూర్తిగా నిలిచిన అంశాలేమిటి?**

పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ పట్టా పుచ్చుకుని బయటకొచ్చాక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివేందుకు మంచి స్కాలర్‌షిప్ కూడా వచ్చింది. కానీ నేను వెంటనే ఉద్యోగంలో చేరాలనుకున్నాను. దేశ వ్యవహారాల పరంగా అది చాలా క్లిష్టమైన సమయం. చాలా విషయాల్లో మన అమాయకత్వ పొరలు విడిపోతున్న కాలమది. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీతో మనం స్వాతంత్ర్యం అనుకుంటున్నదాని పరిధి ఎంతవరకూనో అర్థమైంది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి గొప్ప దార్శనికులు ఏర్పరచిన మార్గం నుంచి ఎక్కడ పక్కకు తొలిగిపోయామో అన్నది ఆలోచించుకోవాల్సిన అవసరంలో అనేకమందిని పడేసిందా కాలం. వీటన్నిటికీ జవాబులు వెతికే ప్రయత్నం చేసింది ఆనాటి జర్నలిజమే. దేశం ఎదుర్కొంటున్న రకరకాల సమస్యల గురించి విపులంగా చర్చిస్తూనే, వాటినుంచి బైటపడి ముందడుగేసే ధైర్యాన్ని జనాలకిచ్చింది నాటి పత్రికలే. అదే స్ఫూర్తితో నేనూ పనిచేయడం మొదలుపెట్టాను.

**'తెహెల్కా'ను ఎందుకు ప్రారంభించారు?**

నేనిప్పటివరకూ చెప్పినలాంటి ఉత్తేజకరమైన పరిస్థితి 90ల వరకూ ఉంది. తర్వాత దేశంలో చోటుచేసుకున్న రకరకాల మార్పుల వల్ల పాత్రికేయమూ మారిపోయింది. సీరియస్ విషయాలు వదిలేసి 'ఫలానా తార ఏ సబ్బు వాడుతుంది, ఫలానా క్రికెటర్ సెలవు రోజున ఎలా గడుపుతాడు, ఫలానా ప్రముఖుడికి ఏం తినడం ఇష్టం....' తరహా సిల్లీ విషయాలకు ప్రాధాన్యత పెరిగిపోయింది. పాఠకులకు అవే ఇష్టమంటూ నెమ్మదిగా అన్ని పత్రికలూ పేజ్ 3 సంస్కృతికి దాసోహమైపోయాయి. పత్రికలు, ప్రచురణ సంస్థల ఆర్థిక ప్రయోజనాలూ వీటితోనే ముడిపడి ఉండటంతో యాజమాన్యాలు ఇలాంటి 'ట్రివియా'ను ప్రోత్సహించాయి. మేనేజింగ్ డైరెక్టర్ - ఎడిటర్ల మధ్య ప్రతిరోజూ గొడవలు జరిగేవి. ఒక పత్రికలో అని కాదు. అన్నిచోట్లా అదే పరిస్థితి. నిజానికి దేశం అప్పుడు కూడా ఇబ్బందికర పరిస్థితుల్లోనే ఉంది. కానీ దాన్నెవరూ పట్టించుకునేవారు కాదు. మొత్తానికి 2000 కల్లా అనేక కుంభకోణాలు, సంక్షోభాల సుడిలో ఉన్నాం. వీటన్నిటికీ పరిష్కారంగా, సీరియస్ సమస్యలను ఎత్తిచూపడమే లక్ష్యంగా ఆ ఏడాది తెహెల్కా డాట్ కామ్ అనే వెబ్ పత్రికను ప్రారంభించాను. ఎడిటరూ, మేనేజింగ్ డైరెక్టరూ ఒకరే అయితే సంపాదక విలువలు నిలబడతాయన్నది కూడా నా ఉద్దేశం.




**పేరుకు తగినట్టే తెహెల్కా సంచలనాలకు పెట్టింది పేరుగా నిలబడింది. ఆ క్రమంలో మీకెదురైన ఇబ్బందులేవైనా...**

తెహెల్కా అనేది హిందీ పదం. ఆ పదానికి అర్థమే సంచలనం. 'ఫ్రీ -ఫెయిర్- ఫియర్‌లెస్' అనేది మా నినాదం. దానికి తగినట్టు మేం స్వేచ్ఛగా, నిజాయితీగా, నిర్భయంగా దూసుకెళ్లాం. క్రికెట్లో మ్యాచ్ ఫిక్సింగుల గురించి ప్రపంచానికి తెలియజెప్పింది మా పత్రికే. అలాగే భారత రక్షణ రంగంలో అవకతవకల గురించి, కొనుగోళ్లలో లాలూచీలు, కిందినుంచి పైస్థాయి వరకూ పేరుకుపోయిన అవినీతి - వీటి గురించి రహస్య కెమెరాలు, టేపులతో మేం చేసిన పరిశోధన 'ఆపరేషన్ వెస్టెండ్' దేశాన్ని ఊపేసింది. ప్రభుత్వం పడిపోయే వరకూ వెళ్లింది పరిస్థితి. ఇక మాకు బెదిరింపులు, అన్ని వైపుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఫలితం - పత్రిక మూడేళ్ల పాటు మూతపడింది. శక్తియుక్తులన్నీ కూడదీసుకుని కొత్త ఉత్సాహంతో మొదలైన తెహెల్కా కేవలం వెబ్ మ్యాగజీన్‌గానే కాదు, అచ్చులోనూ నూతన శకానికి శ్రీకారం చుట్టింది. జెస్సికాలాల్ హత్య కేసు, గోధ్రా అల్లర్లు, నక్సలైటు ఉద్యమం వంటివన్నీ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది తెహెల్కానే.

**ఇవన్నీ చేస్తున్నప్పుడు భయం వెయ్యలేదా?**

'భయం' మన సంస్కృతిలోనే పాతుకుపోయి ఉంది. కొత్తవారితో మాట్లాడాలంటే భయం, కొత్త భాష నేర్చుకోవాలంటే భయం, కొత్త ఆహారమంటే భయం, కొత్త చోటికి వెళ్లాలంటే భయం. అడుగుతీసి అడుగు వెయ్యాలంటే ఎవరేమంటారోనని భయం. ఇక ఎవరినైనా ప్రశ్నించాలంటే చెప్పలేనంత భయం. భయం అనేది మన బుర్రల్లో తిష్టవేసి కూచుంది. దాన్ని వదులుకుంటే తప్ప పురోగమించడం సాధ్యం కాదు. అందుకే నిర్భీతి అనేది తెహెల్కాకు ట్యాగ్‌లైన్ అయింది. మా సంస్థలోని ఉద్యోగులకే కాదు, యంగ్ తరంగాలకూ ఇదే చెబుతున్నాను... భయాన్ని వీడండి. నిర్భయంగా ముందుకు దూసుకుపోండి. మీరు చేసేది మంచిదైనప్పుడు ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదు, దేనికీ భయపడాల్సిన అవసరం లేదు.

**నోబెల్ పొందిన వీఎస్ నైపాల్ వంటివారి ప్రశంసలందుకున్న రచయిత మీరు. భాషకూ, సాహిత్యానికీ పాత్రికేయానికీ పొంతన ఎలా కుదురుతోంది?**

భేషుగ్గా కుదురుతుంది. భాష మీద పట్టు లేనిదే పాత్రికేయులెలా రాణిస్తారు? దానికి బాగా చదవడం అవసరమని వేరే చెప్పాలా? తెహెల్కా పత్రిక మంచి వచనం రాస్తుందని విమర్శకుల ప్రశంసలందుకుంది. నా వరకూ నాకు నిత్య స్ఫూర్తిప్రదాత సాహిత్యమే. సాహిత్యం వలన మన ఊహా ప్రపంచం విస్తరిస్తుంది. ఇతరుల కష్టసుఖాలతో సహానుభూతి చెందడానికీ సాహిత్యం దోహదం చేస్తుంది. ఆ ఊహ, సహానుభూతులే జర్నలిజానికి అత్యవసర అంశాలు. ఉదాహరణకు 'అఖండ భారతావని' అనేదొక ఊహ. మన దేశం విభిన్నమైనది. మన సమస్యలూ విభిన్నమైనవి. అసమానత అనేది అన్ని రంగాల్లోనూ, అనేక రూపాల్లోనూ కనిపిస్తుంది. మరిదాన్ని 'అఖండ'మని ఎలా అనగలం? అంటే, మన దార్శనికుల రచనల ద్వారా ఏర్పడిన అత్యద్భుతమైన ఊహే అఖండ భారతం. ఇది మాస్ ఇమేజినేషన్‌కు గొప్ప ఉదాహరణ. దానికి కట్టుబడి, ఆ కలను నిజం చెయ్యడానికే ఇప్పుడింత మంది శ్రమిస్తున్నాం. ఏదైనా చెయ్యాలన్న తపన, అనుకున్నది సాధించేవరకూ సహనం అనేవి మనకు సాహిత్యం ద్వారానే అలవడతాయి. అవే జర్నలిజానికీ మూలసూత్రాలు. అందుకే తెహెల్కాలో భాష, సాహిత్యం, సంగీతం, నాటకం వంటివాటికి సముచిత స్థానముంది. ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్‌ను గెల్చుకొన్న అరుంధతీరాయ్ నవల 'ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'ను మా సంస్థే ప్రచురించింది. ఏడాదికోసారి మేం తీసుకొచ్చే 'ఫిక్షన్' ప్రత్యేక సంచికల ద్వారా ప్రతిభావంతులైన యువ రచయితలు వెలుగులోకి వస్తున్నారు.

**మీరు చెబుతున్న పాత్రికేయ విలువలన్నీ ఉదాత్తమైనవే. కానీ వాస్తవానికి వచ్చేసరికి ఇన్నిన్ని పత్రికలు, ఛానెళ్ల మధ్య పోటీతో అవసరమైనదీ కానిదీ ప్రతిదీ సంచలనమే అయికూచుంటోంది. అప్పుడు జనాలకు నిజాలెలా తెలుస్తాయి?**

మీడియాలో పది రకాల పత్రికలూ, ఛానెళ్లూ ఉండటమే మంచిది. ఒకే విషయాన్ని పది కోణాల్లో చూసి ప్రజలకు అందిస్తాయవి. స్తబ్ధుగా ఉన్న కాలం కన్నా, గడచిన ఆరేడేళ్లలో మంచి పాత్రికేయం మళ్లీ ఊపిరిపోసుకుందనే నా అభిప్రాయం. టెలికామ్ కేటాయింపుల్లో అవినీతి, ఇటీవలి బొగ్గు కుంభకోణం వంటివన్నీ బైటికొచ్చాయంటే మీడియా పుణ్యమేగా. అయితే అచ్చులోనో, ఛానెళ్లలోనో కనిపించేదంతా మంచీ కాదు, అంతా చెడు కూడా కాదు. ప్రతిదాన్నీ నిశితంగా పరిశీలించి నిగ్గు తేల్చుకోవాల్సింది ప్రజలే. ఆంధ్రజ్యోతికి నా శుభాకాంక్షలు.

● **అరుణ పప్పు**, విశాఖపట్నం.

ఫోటో : వై. రామకృష్ణ




## బంగారం వెండి

29-08-2012

| | బంగారం (24క్యా-10గ్రా) | ఆర్నమెంట్ (10గ్రా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 31,340 (----) | 30,710 (30,610) | 58,400 (----) |
| విజయవాడ | 31,320 (31,220) | 29,100 (28,090) | 56,600 (57,200) |
| ప్రొద్దుటూరు | 31,370 (31,370) | 28,810 (28,810) | 56,600 (56,600) |
| రాజమండ్రి | ---- (----) | ---- (----) | ---- (----) |
| విశాఖపట్నం | 31,250 (31,350) | 28,760 (28,820) | 58,200 (58,200) |
| ముంబయి | 30,970 (31,040) | 30,835 (30,900) | 58,590 (58,820) |
| చెన్నయ్ | 31,195 (31,225) | 29,170 (29,200) | 59,365 (59,445) |

● బ్రాకెట్లో ఉన్నవి ముందురోజు ధరలు

## 'చిరు' ప్రమాదం

హెల్త్

* భోజనం కంటే చిరుతిళ్లు తిన్నప్పుడు తక్కువ లాలాజలం విడుదలవుతుంది. ఇది దంతాలకు అంత మంచిది కాదు. చిరుతిళ్లు దంతాల మధ్య ఇరుక్కుపోయి ఎక్కువ గంటలు ఉండిపోతాయి. దాంతో బ్యాక్టీరియా ఏర్పడి చెడువాసన, ఇతర ఇబ్బందులు వస్తాయి. అందుకే చిరుతిళ్లు తినే అలవాటు తగ్గించుకోవడం మంచిది. తక్కువ చక్కెర, పిండిపదార్థాలు ఉన్న చిరుతిళ్లనే తినాలి.
* బంగాళా దుంప చిప్స్ కూడా దంతాలకు హానికరమే అంటే నమ్ముతారా... పంటిమీద ఉండే గార పిండిపదార్థాలను ఆమ్లాలుగా మారుస్తుంది. ఆ ఆమ్లం కాస్తా పంటిమీదకి చేరిన ఇరవై నిమిషాల్లో దాడి మొదలుపెడుతుంది. అందుకే ఇటువంటివి తిన్న వెంటనే దంతాలు శుభ్రం చేసుకోవాలి.

**లోపలి పేజీలో...**

వెన్నునొప్పికి గుడ్‌బై





జుట్టురాలే సమస్యకు అధునాతన చికిత్స

నవ్య గురించి సలహాలు, సూచనలు navyaa.aj@ gmail.com కు పంపగలరు.



